
మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th Every Month
Date of Publication: 25.7.2026
Posting at BPC IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001



పుస్తకం హస్త భూషణం

# మిసిమి


చింతనాత్మక సారస్వతం




పతాక శిఖరం

మాసపత్రిక, ఆగష్టు, 2026 ₹ 60/-

ISSN 2454-4329



జననీ జన్మ భూమిశ్చ



పుస్తక చికిత్స

# మిసిమి

మాసపత్రిక

సంపుటి 37 సంచిక 8

ఆగష్టు - 2026

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

Published by

**BAPANNA ALAPATI**

**Plot # 196, Road No. 13,**
**Jubilee Hills,**
**Hyderabad - 500 033.**

Editor: V. ASWINI KUMAR
**Ph: 994 951 6567**

**చందా వివరాలు:**

₹ 720/- (సంవత్సర చందా),
₹ 1,440/- (రెండు సంవత్సరాలకు),
₹ 2,160/- (మూడు సంవత్సరాలకు),

**జి. ఉమాసుందరి**
కార్యదర్శి : **040-27645536**

**Scan QR to Pay**
**Misimi A Unit of Kalajyothi**

**LCCN 91-903060**

**PEER REVIEWED**

**ISSN 2454-4329**

**misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com**

**www.misimimonthly.com**

**Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## ఆగష్టు నెల సూచికలు...



శంకరంబాడి



**మిసిమి** డైరి : సురభి సౌరభం ... 3
నందిని సిధారెడ్డి గారితో : **మిసిమి** ... 7
కరోనా కాటులో పుట్టిన కావ్యం-**అనిమేష** : సి.ఎస్. .... 19
జీవన మకరందం : అశ్వినీకుమార్ ... 20
బంకించంద్ర-**రాజసింహ** : ప్రొ. పార్థసారథి ... 21
భర్తృహరి : ఆచార్య పి. ఆర్. హరినాథ్ ...28
సముద్రపు దొంగలు : చెన్నూరి శివరామక్రిష్ణ ప్రసాద్ ... 31
మా తెలుగు తల్లికి మల్లెపూదండ : డా. ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు ... 33
కళా విధ్వంసం-కళా చౌర్యం : టి.వి. ప్రసాద్ ... 35
కమ్మతెమ్మెర : మనోహర్ కన్నీడి ... 40
ఆచార్య పోకల లక్ష్మీనరసు : డా. ఎ.బి. సాయిప్రసాద్ ...41
జానపద కళలు-భక్తి ప్రబోధం : భమిడిపాటి గౌరీ శంకర్ ... 45
బాలసాహిత్యం : ఎన్.కె. బాబు ... 49
ఔషద పరిష్వంగం : గద్దం దేవీప్రసాద్ ... 51
షోపెన్ హావర్-కీర్తి ప్రతిష్ఠలు : ముక్తవరం పార్థసారథి ... 53
ఉన్నిపోగుల ఆర్తనాదం : ఆచార్య కోసూరి దామోదరం నాయుడు ... 61
ఢిల్లీలోని హైదరాబాద్ హవుస్ : వేలూరి కృష్ణమూర్తి ... 63
ప్రజ్ఞారత్నం-ఆచార్య మునిరత్నం : డా. డి. యువశ్రీ ... 65
కుముదవల్లి గ్రంథాలయం : చెరుకువాడ వెంకటరామయ్య ... 70
విద్య-క్రమశిక్షణ-సరళత : యన్. విజయ రాఘవ రెడ్డి ... 72
**వేదవ్యాసం** : విజయ్ ... 73
పోలీస్ సాక్షిగా... ఉద్యోగ విజయాలు : ఆర్విపయన్ ... 75
**ఉన్మత్త తాండవం** : ఎన్వీఆర్ ... 77
చదవండి : **మిసిమి** ... 79





**అట్టమీది బొమ్మలు**




పతాక శిఖరం



పుస్తక చికిత్స



జననీ జన్మ భూమిశ్చ



పుస్తకం హస్త భూషణం

# సురభి సౌరభం

ఆశ్రమంలో తరచూ ఏదో జరుగుతూనే ఉంటుంది. మొన్న ఉరుములు, మెరుపులు జోరున వాన. నిన్న గాలి, చినుకులు కొమ్మలు విరిగి పడటం. ఈ రోజు సురభి వారి శ్రీకృష్ణలీలలు నాటకం. అదే చెప్పాలి – సురభి నాటకాలు గతంలో చూసాను. విశాఖపట్నంలో మాయాబజార్, లలితకళాతోరణం వెనుక సురభి నాటకశాలలో మరేదో చూసి ఆనందించాను. ఈరోజు (13.06.2026) ప్రత్యేకంగా మా ఆశ్రమంలో సురిభి వారు నారాయణ గారి ఆహ్వానంపై వచ్చి శ్రీకృష్ణలీలలు ప్రదర్శించారు. ఇప్పుడే కొన్ని విషయాలు చెప్పాలి.



కంస మామ : మధుసూదన్ రావు

35 ఎమ్.ఎమ్, సినిమా స్కోప్, 70 ఎమ్.ఎమ్., ఐమాక్స్, 180 డిగ్రీ స్క్రీన్ అన్నీ చూశాను. డాల్‌బీ, అట్మోస్, విఎఫ్‌ఎక్స్, అవతార్, దురంధర్ ఎన్నో చూస్తున్నాం – అవన్నీ అలా ఉంచుదాం.

ఈ సాయంత్రం, చాలీ చాలని రంగస్థలంపై, జరిగీ జరగని బొమ్మల తెరలముందు ఎంతో సాధారణంగా ప్రదర్శించిన శ్రీకృష్ణలీలలు చూసాను. ఎన్నో జ్ఞాపకాలు – రాత్రంతా మేల్కొని పాండవోద్యోగ విజయాలు (1,2,3 కృష్ణలు) మగస్త్రీలు, తళుకు తారలు – ఊరంతా వినపడే పద్యాలు – రాగాలు అన్నీ చూశాం, అన్నీ తిరిగాం.

బంటుమిల్లి టూరింగ్ టాకీస్‌లో రోజులు మారాయి – బందరు బృందావనంలో మాయాబజార్ – కృష్ణకిషోర్‌లో ఇల్లరికం – బెజవాడ లీలామహల్‌లో గన్స్ ఆఫ్ నావ్రోన్, ఊర్వశి 70 ఎమ్.ఎమ్.లో క్లియోపాత్రా, మెకనస్ గోల్డ్ – ఐమాక్స్‌లో అవతార్ మరి ఎఎమ్‌బిలో దురంధర్ – ఒ.టి.టిలో కొరియన్ సీరియల్స్, అన్నీ తిరగేసాం. ఇంకా తనివి తీరలేదు – మరి ఈ శ్రీకృష్ణలీలలు చూస్తుంటే – క్లోజప్స్ లేవు – డాల్బీ – అట్మోస్ కాదు – ముందు ఘంటసాల, వెనకాల కీరవాణి లేరు – మరి నా ఒళ్ళు గగుర్పొడుస్తుందేమిటి? – రోమాలు నిక్కపొడుస్తున్నాయే! (అదేనండి గూస్‌బంప్స్ అంటారు మన ఆర్.జెలు కదా!) ఎక్కడుంది ఈ గమ్మత్తు? – ఈ మత్తు! మీరు ఎప్పుడైనా రుచి చూసారా? నవరసాలు పండించిన సురభి వారి ప్రదర్శన ఆస్వాదించారా? – కళ ఏమిటి? కళాకారులు ఎవరు?



యశోద : నీరజ, కృష్ణుడు : కౌశిక్ సాయి

ఈ ప్రదర్శనలో కంసుని హింస, మనమే మరిచిపోయిన నారదుని హాస్యం, కృష్ణుని లాలిత్యం, యశోద అమాయకత్వం మనకి కొట్టొచ్చినట్లు కనపడతాయి. తెలుగు సినిమాల్లో పౌరాణికాలు మర్చిపోయాం. అయినా నాస్తికులమని చెప్పుకునే నారాయణగారు వీరిని ఎందుకు ఆహ్వానించారు? నాటకాంతాన వారే చెప్పారు.

ఈ కళలు అంతరించిపోకూడదని, మనం ప్రోత్సహించాలనీ, సినిమా టిక్కెట్లు రూ. 600 పెట్టి ప్రజలను దోచుకుంటున్నారు సినిమా కంపెనీలు. మరి సురభి వారి నాటకాలకి టిక్కెట్టు కూడా లేదే! మనం ఆదరించలేమా?

**సురభి వారి ప్రదర్శనలో సాంకేతికంగా, రంగస్థలపరంగా, నటీనటులుగా అన్నీ వారి కుటుంబంలోని వ్యక్తులే నిర్వహిస్తారు.**

కాలంలో వెనుకబడిపోవటం ఆపలేం. కాని కొంతవరకు ఆ కళని ప్రోత్సహించి రక్షించుకోవాలి. ఇప్పటికీ లండన్‌లో మౌస్ ట్రాప్ నాటకం ఆడుతూనే ఉన్నారు. బీదలపాట్లు (లె మిజరబుల్స్) ప్రదర్శిస్తున్నారు. మనం మట్టిమనుషులంటూ చేతకాని నాటకాలతో, పరిషత్తు ప్రభావంతో నాటకాన్ని బ్రతికిస్తున్నామా? బండెక్కిస్తున్నామా? లా మకాన్‌లో ఆంగ్ల నాటకాలు చూసాను. హైటెక్ ఫ్యాషన్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్‌లో అంతర్జాతీయ నాటకాలు చూసాను, వివిధ భాషల్లో – చాట్ల శ్రీరాములు గారితో. దేని వికారాలు దానికుంటాయి. కాని కళాపోషణ చేయడానికి ప్రభువులు లేరు. ఈనాడు ప్రజలే ప్రభువులు కదా! ఆ బాధ్యత మనదే కదా!

నారాయణ గారు సి.ఆర్. ఫౌండేషన్ తరపున యాభైవేలు ఇచ్చారు – ఆ స్ఫూర్తితో మాలో పెద్దలు శ్రీ ఎమ్.వి రావు అయిదువేలు మరికొందరు వెయ్యి, అయిదువందలు ఇచ్చి ఉత్సాహపరిచారు.

– – – –

**కిన్నెరకు పాతికేండ్లు :** ఆదివారం – ఆదరంగా ఆహ్వానించిన కంఠమనేని రాజా, రావి రాంప్రసాద్ జంట కవులుగా నిర్వహించిన 'కిన్నెర మెమోరియల్ ట్రస్ట్' వారి పాతికేండ్ల ప్రస్థానం కనులవిందుగా జరిగింది. ముఖ్య అతిథులు జస్టిస్ చలమేశ్వర్, జె.డి. లక్ష్మీనారాయణ, డా. సింహాద్రి చంద్రశేఖర్, డా. దండమూడి రమణ గార్లు అసమాన్యులు. కిన్నెర వారు చేసే సేవ అనుపమానమైన – పసికందుల బ్రతుకులు చితికిపోకుండా 'తలసేమియా' 'లుకేమియా' లాంటి ప్రాణాంతకమైన, జన్మతః వచ్చిన రోగాలకు తమవంతు సహానుభూతిని అందించుతూ – ఖండాంతరాల సేవలందిస్తున్నారు. పేరు – ప్రఖ్యాతులకు ప్రాకులాడకుండా – పబ్లిసిటీకి దూరంగా వుంటూనే వేలమందికి – వారం వారం రక్తమార్పిడి – అవసరమైనపుడు 'బోన్‌మేరో ట్రాన్స్‌ప్లాంట్' నిర్వహిస్తూ ప్రాణదానం చేస్తున్నారు. వర్గ, ప్రాదేశిక భేదాలు లేకుండా – సేవచేస్తున్న కరుణామయులు – ఇలాంటి లోపాలు కుటుంబాల్లో రాకుండా జాగ్రత్తపడాల్సిన అవసరాన్ని – సమాజపరంగా తెలియజేస్తున్నారు. ఈ పాతికేండ్ల ప్రస్థానంలో వారి వారి అనుభవాలను డా. సింహాద్రి, డా. రమణగార్లు వివరించారు – లక్ష్మీనారాయణ గారు 'సహానుభూతి' ప్రత్యేకతను – తెలియజేసారు – చలమేశ్వర్ గారు ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతూ ఎన్నో విషయాలు – చిన్న చిన్న కథల రూపంలో చెప్పుకుంటూపోయారు. కొన్ని సామెతలూ చెప్పారు – 'ఎరుక–పిడికెడు ధనం రా' అన్నది మొదటసారి వింటున్నా – శాలువాలకు – పొగడ్తలకు – హంగులకు, పొంగులకు దూరంగా ఈ సమావేశం ఎంతో ఊరటనిచ్చింది.



ఎడిటర్ కుడిఎడమల డా. సింహాద్రి చంద్రశేఖర్, జస్టిస్ చలమేశ్వర్

మరిన్ని వివరాలు రాంబాబు తెలియజేస్తారు–

**- ఎ.కె.**

# కిన్నెర కిరణం

**ఒ**క్క కన్నీటి చుక్క నుంచి పుట్టిన ఆశాదీపం : కిన్నెర మెమోరియల్ ట్రస్ట్ ప్రస్థానం!

మృత్యువు ఎప్పుడు, ఏ రూపంలో వస్తుందో ఎవరూ ఊహించలేరు. అది ఎంచుకునే లక్ష్యానికి వయసుతో నిమిత్తం లేదు. కంటికి కనిపించని మహమ్మారి 'క్యాన్సర్' రూపంలో ఒక చిన్నారిని బలితీసుకున్నప్పుడు ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం. ఆ మూడేళ్ళ బుజ్జాయి పేరు 'అమ్ములు'. ముద్దులు మూటగట్టే వయసులో, అమ్మానాన్నల గారాలపట్టిగా వెలుగులు విరజిమ్మాల్సిన ఆ చిన్నారిపై క్యాన్సర్ తన పంజా విసిరింది. చివరి నిమిషం వరకు ఎంతో ధైర్యంతో ఆ మహమ్మారితో పోరాడి, కన్నీటితో ఉన్న తల్లిదండ్రులను ఓదారుస్తూ, చివరకు ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయింది.

ఎన్నో ఆశలతో అమెరికా వెళ్ళిన కంఠమనేని రాజగోపాల్, కృష్ణకుమారి దంపతులు, తమ ఆశలన్నీ అడియాసలవగా, తీరని దుఃఖంతో 1999లో తమలను వీడిన కిన్నెర (అమ్ములు) ను తలుచుకుంటూ భారత్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. కాలం గాయాలను మాన్పుతుందంటారు, కానీ వారి విషయంలో మాత్రం ఆ దుఃఖం ఒక గొప్ప సంకల్పాన్ని ఇచ్చింది. "మాకు జరిగిన ఈ వేదన మరే తల్లిదండ్రులకు కలగకూడదు" అన్న ఆలోచనే అది. విజయవాడకు చెందిన ప్రముఖ న్యాయవాది, రాజగోపాల్ గారి తండ్రి కంఠమనేని రవీందర్ రావు గారి సహకారంతో, 2001లో 'కిన్నెర మెమోరియల్ ట్రస్ట్' ఆవిర్భావానికి పునాది వేసింది.
ఆ చిన్నారి అమ్ములు రాల్చిన కన్నీటి చుక్కే, వేలాది మంది చిన్నారులకు ఆశగా మారింది.



ఎడమ నుంచి : కంఠమనేని రాజా, డా. సింహాద్రి చంద్రశేఖర్, జస్టిస్ చలమేశ్వర్, వి.వి. లక్ష్మీనారాయణ, డా. దండమూడి వెంకట రమణ

లుకేమియా, తలసేమియా వంటి ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతున్న చిన్నారులకు అండగా నిలుస్తూ,
ఈ పాతికేళ్ళ ప్రయాణంలో కిన్నెర ట్రస్ట్ ఎన్నో కుటుంబాల్లో కొత్త శ్వాసను నింపింది.

2026 నాటికి పాతికేళ్ళు పూర్తిచేసుకున్న ఈ సంస్థ, తమ ప్రయాణాన్ని ఒకసారి నెమరువేసుకుంటూ, మరింత స్ఫూర్తిని పంచే ఉద్దేశంతో జూన్ 14న హైదరాబాద్ జూబిలీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆ రోజు వాతావరణం కొంత బాధను, మరికొంత ఆనందాన్ని మిళితం చేసింది. ఎంతోమంది శ్రేయోభిలాషులు, కిన్నెర ప్రయాణంలో భాగస్వాములైన వారు ఈ వేడుకకు హాజరై, తమ అడుగుజాడలను గుర్తుచేసుకున్నారు.

ఉదయం సరిగ్గా 11 గంటలకు, ప్రముఖ జర్నలిస్ట్ రావి రాంప్రసాద్ గారు ఈ కార్యక్రమ నేపథ్యాన్ని వివరించగా, ప్రదర్శించిన రెండు లఘుచిత్రాలు అందరినీ కదిలించాయి. కిన్నెర మెమోరియల్ ట్రస్ట్ ప్రస్థానాన్ని, ఈ ప్రయాణంలో అండగా నిలిచిన మిత్రులను, అలాగే సమాజంలో తలసేమియా వ్యాధి పట్ల ఉండవలసిన అప్రమత్తతను ఆ చిత్రాలు కళ్ళకు కట్టినట్లు చూపించాయి. ఒక చిన్నారి మరణం నుంచి మొదలైన ఈ ప్రస్థానం, నేడు ఎందరో చిన్నారుల జీవితాల్లో చిరునవ్వులు పూయిస్తోంది.

మొత్తం కార్యక్రమం ఆలోచనలను రేకెత్తించే విధంగా సాగటం విశేషం.. ఈ పాతికేళ్ళ ప్రయాణం ఎలా సాగిందో భావోద్వేగాల నడుమ కిన్నెర మెమోరియల్ సంస్థ వ్యవస్థాపకులుగా, "రాజా" చెప్పినతీరకు సభికులు ముగ్ధులైపోయారు..కిన్నెర సంస్థ ద్వారా తమ అమ్ములు జ్ఞాపకాలు నిక్షేపం చేసేందుకు, తమ ఆశల దీపాన్ని వెలిగించేందుకు, ఆ వెలుగులు పంచేందుకే ఇండియా తిరిగివచ్చామన్న మాట అందరిలోనూ కొంత ఆలోచనను, కొత్త భావనలను నింపింది..



కిన్నెర శ్రేయోభిలాషులు

ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్, విశిష్ఠ అతిథిగా సి.బి.ఐ.విశ్రాంత జాయింట్ డైరక్టర్ జెడి లక్ష్మీనారాయణ, ప్రత్యేక అతిథిగా కేన్సర్ వ్యాధి శస్త్రచికిత్స నిపుణులు డా.సింహాద్రి చంద్రశేఖర్ (డా.శేఖర్ గా ఆయన సుపరిచితులు), మరో ప్రత్యేక అతిథిగా hemato onchologist డా.దండమూడి వెంకటరమణ పాల్గొన్నారు.

కిన్నెర మెమోరియల్ ట్రస్ట్ ద్వారా తమ చిన్నారులకు చికిత్స పొందిన రవికుమార్, నర్సింహులు కూడా తమ సమస్యపై పోరాడటంలో కిన్నెర సంస్థ ఇచ్చిన ప్రోత్సాహాన్ని సజలనయనాలతో గుర్తుచేసుకున్నారు..

ముఖ్యంగా చిన్నారులలో వచ్చే కేన్సర్ తలసీమియా వంటి వ్యాధుల పట్ల అవగాహనకు, చికిత్స కోసం పడుతున్న శ్రమను డాక్టర్లు వెంకట రమణ, చంద్రశేఖర్‌లు వివరిస్తుంటే సభలో ఉన్నవారందరు విస్మయంతో విన్నారు. డాక్టర్ వెంకటరమణ ఒక సూచన చేశారు. పెళ్ళిచేసుకోబోయే యువతీయువకులు ఒక జెనిటిక్ పరీక్ష చేయించుకుంటే వారికి పుట్టబోయే బిడ్డకు జన్యువుల ద్వారా వచ్చే తలసీమియా వంటి వ్యాధుల గురించి ముందే తెలుస్తాయన్నారు. అందుకే ఈ పరీక్షను ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలన్నారు..



అన్నీ తానై నడిపిన
శ్రీ రావి రాంప్రసాద్

తలసేమియా వ్యాధిగ్రస్తులకు ముఖ్యంగా పిల్లలకు సాయం చేసే హైదరాబాద్‌లోని తలసేమియా&సికెల్ సొసైటీ గురించి ఆ సంస్థ బోర్డు మెంబర్ మనోజ్ రూపానీ వివరించినప్పుడు వీళ్ళెంత కష్టపడుతున్నారు అనిపించింది..


జె.డి. లక్ష్మీనారాయణగారు (నిజానికి ఆయన పేరు వివి లక్ష్మీనారాయణ..జె.డి. అనేది సిబిఐ సంస్థలో ఆయనకున్న హోదా..) కానీ ముఖ్యఅతిథి జస్టిస్ చలమేశ్వర్ కానీ మనుషుల పట్ల ఉండాల్సిన సానుభూతి, సహానుభూతిల గురించి ఆరోజున సభలో మాట్లాడారు.. మనకు తెలియని ప్రపంచం బయటొకటుంది, దాని గురించి తెలుసుకోవాలన్నారు.. తాము పడిన బాధ మరొకరి పిల్లలు పడకూడదు అనుకోవటమే ఒక గొప్ప ఆలోచన.. ఒక నోబుల్ థాట్ అన్నారు..

కిన్నెర మెమోరియల్ ట్రస్ట్ సంస్థ చేస్తున్న కృషిని అభినందిస్తూ రాంబాబు అనే వ్యక్తి యాభైవేలరూపాయలు, సుబ్బారెడ్డి అనే వ్యక్తి లక్షరూపాయలు విరాళంగా ప్రకటించటం అబ్బురపరిచే విషయం..

రావి రాంప్రసాద్ ఎంతో సమర్థవంతంగా నిర్వహించిన కిన్నెర మెమోరియల్ ట్రస్ట్ పాతికేళ్ళ సభ సమాజం పట్ల మనకున్న బాధ్యతను మరోసారి గుర్తుచేస్తే తమబాధను తమలోనే దాచుకుని సమాజహితానికి కృషిచేస్తున్న కిన్నెర మెమోరియల్ ట్రస్ట్ వంటి సంస్థలు కాలుష్యం నిండిన సమాజంలో చైతన్యం విరిసిన కలువలై జనని భారతికి చెంగల్వపూదండ సమర్పిస్తుంటాయి..

***- సి.యస్.రాంబాబు***

# నిజాయితీయే ఆయన నైజం
# నందిని సిధారెడ్డి



నందిని సిధారెడ్డి

**– మిసిమి**

నిక్కచ్చితనమే నైజంగా ఆయన తండ్రి రజాకార్లను ఎదిరించాడు.. ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచాడు తోటివారికి సాయపడ్డాడు. తనయుడికి అవే గుణాలు అబ్బాయి. చదువుకోవాలని తండ్రి బలంగా కోరుకుంటే ఆ కోరికను తనయుడు ఇంకా బలంగా గుండెలో నింపుకున్నాడు. పాఠశాల చదివేటప్పుడు తన ఊరు బాగుకోసం రాజకీయ నాయకుడు అవ్వాలని అనుకున్నాడు. సిద్ధిపేటలోని కాలేజీ చదువు అతని చూపును విస్తారం చేసింది.. మొదట సినిమాపాట తరవాత కవిత్వం అతన్ని ఆకర్షించాయి.. నారాయణరెడ్డి గారి శిష్యరికం చేసినా తెలంగాణాకై “నాగేటిసాల్లల్లలో నా తెలంగాణ” అని పాటను ఆత్మగీతం చేసి రెపరెపలాడించాడు. మంజీరా రచయితల సంఘం స్థాపించి కొత్తకవిత్వ ప్రవాహాన్ని పారించాడు. తెలంగాణా సాహిత్య అకాడెమీ మొదటి ఛైర్మన్‌గా అరుదైన పుస్తకాలు వెలికితెచ్చాడు. ప్రపంచ తెలుగు మహాసభలతో తెలంగాణా సంస్కృతీ సాహిత్యాల సుమగంధాలను ప్రపంచ వ్యాప్తం చేశాడు. ఇప్పుడు తన “అనిమేష” కావ్యానికి సాహిత్య అకాడెమీ పురస్కారం పొందినా ఒదిగి ఉండటమే కవి లక్షణం. భావోద్వేగాలను అరమరికలు లేకుండా కవిత్వీకరించటమే కవి ప్రధానలక్షణం అంటాడు.. ఆయనే ప్రముఖ కవి నందిని సిధారెడ్డి. ఆయన జ్ఞాపకాలదారుల్లో అశ్వినీ కుమార్ గారితో కలిసి తిరిగొద్దాం రండి..”

– సం.

**మిసిమి : సిధారెడ్డి గారూ నమస్కారం.. మీరు ఎక్కడ మొదలయ్యారు.. ఎట్లా మొదలయ్యారు.. ఇక్కడదాకా ఎలా వచ్చారు.. ఇవన్నీ మీరు చెబితే విని అక్షరాలుగా మార్చి మా పాఠకులకు అందించాలని మా కోరిక.. మీరు కవి..కథకులు కూడా..తెలంగాణ ఏర్పడ్డాక ఏర్పడిన తెలంగాణ సాహిత్య అకాడెమీ తొలి అధ్యక్షులు కూడా..ఆ పదవి ద్వారా మీరు తెలంగాణా సాహిత్యానికి ఎంతో మేలు చేశారు మీరు.. అలాగే తెలంగాణా ఉద్యమానికి, పాటకూ అవినాభావ సంబంధముంది..మీ ద్వారా అవన్నీ తెలుసుకోవాలనుంది.. ముందుగా మీ ప్రయాణంతో ఇంటర్వ్యూ ప్రారంభిద్దాం..**

**సిధారెడ్డి :** నమస్కారం అశ్వినికుమార్ గారు నేనొక మామూలు వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చాను.. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే రెండు పూటలా తిండికి గడవని కుటుంబం నుంచి వచ్చాను. మామూలు వ్యవసాయ కుటుంబమని ఎందుకన్నానంటే, మాఊరిలో ఎనిమిది, పదెకరాల పొలం ఉన్నా కూడా రెండు పూటలా తిండికి కష్టమే. అందుకే వ్యవసాయమంటే మా ఊరి గురించి చెబుతాను. మాది వర్షాధారిత వ్యవసాయం..అంటే వాన పడితేనే పంటలు పండేది. ఎప్పుడు వాన పడుతుందా అని ఎదురుచూసే సంస్కృతి.. వాన వచ్చినా రాకపోయినా మొగులు దిక్కు చూడాలి.. బండ్లబాటో, పిల్లబాటో కాలు నడవాలి.. ఈ వాక్యాలు నేను రాసుకున్న కవితలోనివి. మా ఊరికి నీళ్ళు లేవు. మా ఊరి పేరు బందారం. కొండపాక మండలం.. సిద్దిపేట జిల్లాలో ఉంది. ఇవాల్టికి కూడా మా ఊరికి సరిపోయినంతగా వ్యవసాయానికి నీళ్ళు లేవు. కరెక్ట్‌గా మాట్లాడాలంటే తాగేటందుకు కూడా లేవు. వర్షమొస్తేనే చెరువు నిండుతుంది.. చెరువు నిండుతేనే

వ్యవసాయం.. పంటలు.. చెరువు నిండితేనే వరి.. లేకుంటే లేదు.. కేవలం జొన్న, ఆముదం పంటలు వేసేవారు.. రెండు పూటలు తిండికి ఎల్లినా ఎల్లకపోయినా నేను చదువుకున్నానంటే ఆముదం పంట కారణం.. ఆముదం పంటంటే అప్పటికి అది చిన్నపాటి కమర్షియల్ పంట. నేను చదువుకునే రోజుల్లో మూడునెలలకొకసారి కట్టే టెర్మ్ ఫీజు డెబ్బై ఐదుపైసలు..ఆముదం పంట కలొచ్చినంక దానిమీదొచ్చే పైసలతో మా బాపు (నాయన) ఫీజు కట్టేటోడు. మా నాయనకు కోపమెక్కువ..ఒక్కరోజు ముందు చెప్పినా కోపమే.. వారం ముందు చెప్పినా కోపమే..పైసలు చెట్లకు కాస్తున్నయ్యా అంటడు. అది ఆయన తప్పు కాదు. ఆయన ఆర్థిక పరిస్థితి వెనకున్న ఒక నిస్సహాయత. పజ్జొన్న (పచ్చజొన్న) మాకు ప్రధానమైన పంట. మా ఆహారం కూడా జొన్న గట్క.. (జొన్న దంచి, ఇసరగా వచ్చిన పిండితో తయారుచేస్తారు). ఒకసారి స్కూల్‌లో తోటి పిలగాడు నన్ను గట్క తిన్నడు, గట్క తిన్నడని ఎగతాళి చేశాడు. (వరి భోజనం ఇంటి యజమానికే ఉండేది.). నేను గట్క తిననని గొడవ చేస్తే మా అవ్వ (అమ్మని మేం అవ్వ అంటాం) తరుణోపాయంగా జొన్న రొట్టె చేసి ఇవ్వటం మొదలుపెట్టింది.

"జరమొస్తే బువ్వ..జేజె పెడితే బువ్వ" జ్వరం వస్తేనో, దేవుడికి ప్రసాదంగానో మాత్రమే బువ్వ పెడతారు. అప్పుడు మాత్రమే అన్నం తినే అవకాశం. అందుకే జ్వరం రావాలని కోరుకునేవాళ్ళం. ఒక ఐదారు కుటుంబాల వారే వరన్నం తినేవారు. వారికి లోతైన బావి ఉండటం వలన నీటి వసతి ఉండేది.. మా ఊరిలో సామరస్యత బాగా ఉండేది. అందరు కలిసి మెలిసి ఉండేవారు. పశుసంపద కూడా మంచిగా ఉండేది. మా ఊరిలో ఎక్కువ భూములున్నది కరణం బ్రాహ్మలకే. రెండువేల ఎకరాలుండే వారు రాన్రాను అమ్ముకుంటూ పోవటంతో ఆరొందల ఎకరాలు మిగిలింది (నేను పెద్దయేనాటికి)..మా ఊళ్ళో అన్ని కులాల వారూ ఉండేవారు.. అందరికీ వరసలు కూడా ఉండేవి.



మిసిమి సత్కారం

**మిసిమి : మీ ఊరిలో ఐదారు కుటుంబాలవారే వరి పండించేవారు అన్నారు.. వారి దగ్గర ఎవరు ఉండేవారు.. అంటే సాగుచేసేందుకు జీతగాళ్ళనుకుందాం.**

**సిధారెడ్డి :** ఎక్కువగా ముదిరాజ్ కమ్యూనిటికీ చెందినవారుండేవారు. లేదా గొల్లవారు ఉండేవారు.. వీళ్ళకు ఇళ్ళలో ప్రవేశముండేది. వ్యవసాయానికి సంబంధించిన కాయకష్టం పనులన్నీ మాదిగలు చేసేవారు. మాదిగలు నూట ఏభై కుటుంబాలుంటే, మాలలు నలభై యాభై కుటుంబాలుండేవి. తెలంగాణలో మాలలు ఎక్కువగా పోలీసు, పటేలు, పెద్దపటేలు వంటి గ్రామాధికారుల వద్ద పనిచేసేవారు. పెద్దపటేలుకు ఇరవై మంది జీతగాళ్ళుంటే ..ఈ ఇరవైమందిని మాలకులానికి చెందినతను మేనేజ్ చేసేవాడు..ఈయనను షేరేదార్ అనేవారు. ఎప్పుడ ఏ పంట పెట్టాలి అనేది ఈ షేరేదారన్నతను చూస్తాడు. పెద్దపటేలు చూడడు.

**మిసిమి : ఊరిలో అందరిమధ్య సఖ్యత ఎలా ఉండేది?**

**సిధారెడ్డి :** సఖ్యతకేమీ లోటులేదు.ఎక్కువగా వరసలు పెట్టి పిలుచుకునేవాళ్ళు. గొడవలు గందరగోళాలు ఉన్నట్టు వినలేదు.

**మిసిమి : మీ నాన్నగారు కమ్యూనిస్టు ఏవిధంగా అయ్యారు?**

**సిధారెడ్డి :** కమ్యూనిజం ఊళ్ళోకి రావటానికి ప్రధానకారణం రజాకార్లు. వాళ్ళు ప్రధానంగా ఊళ్ళోకి వచ్చి దోపిడి చేసే పరిస్థితి ఉండేది. మా ఊరికి ప్రత్యేకమైన స్థితి ఏమిటంటే బ్రాహ్మణదొరలు. వాళ్ళు పీడకులు కాదు. అంటే పీడించేంత ధైర్యమో, అకృత్యం చేసేంత ఆలోచన ఉన్నవాళ్ళు కాదు. వాళ్ళకు కష్టమొస్తే రెండెకరాలు అమ్ముకు తింటారు కానీ, మంది దగ్గరనుంచి గుంజుకు తినే రకం కాదు. కాబట్టి మా ఊరు ప్రత్యేకం అని చెప్పటానికి ఆ బ్రాహ్మణ దొరలున్నారు. రెడ్లలో ఓ నాలుగైదు ఉన్న కుటుంబాలుండేవి. వీళ్ళు కూడా పనిచేయించుకునే వారు కానీ పీడించేవారు కాదు. ఎప్పుడు సమస్య వచ్చిందంటే ఊళ్ళోకి రజాకార్లు వచ్చినప్పుడు కమ్యూనిస్టులు కూడా వచ్చారు. నిజాం పన్ను వసూలు కోసం తన ఫౌజ్ పంపేవాడు. వారికి గ్రామాధికారులు అంటే పటేలు, పట్వారీలు పన్నులు వసూలు చేసి ఇవ్వాలి. పటేలు, పట్వారీ వ్యవస్థలో పట్వారీ భూమికి సంబంధించిన లెక్కలు, పన్నులు చూస్తాడు. ఆయన వసూలు చేసి వీళ్ళకు ఇవ్వాలి. పంట పండినా పండకపోయినా ఎకరాకింతని పన్ను కట్టాలి. కౌలు చేసుకున్నాసరే ఇటు రాజుకింతని పంట కొలిచి ఇవ్వాలి. అటు యజమానికింతని కొలిచి ఇవ్వాలి. అంటే రైతు తను పండించిన పంటలో సగానికిపైగా కోల్పోయే దుస్థితి ఉండేది. అప్పటికీ అంటే ఈ రజాకారు గొడవలున్న కాలానికి నేను పుట్టలేదు. నేను పుట్టేనాటికి అంతా అయిపోయింది. ఈ పన్ను కట్టడంలో ఒక్కోసారి ఈ పటేల్ పట్వారీలు ఊరోళ్ళే కనక చూసీచూడనట్టు పోయేవారు. రెండు పుట్లు పండినయి. అంటే నమ్మేవారు. ఏమనకపోయేది. ఊళ్ళో షావుకారు విత్తనాలిస్తాడు కనక ఆయనకు నాగులు కట్టాలి. అంటే ఏంటంటే, ఆయన మీకు బుడ్డెడు లేదా కుండెడు విత్తనాలిస్తే తిరిగి ఆయనకు మీరు ఐదు కానీ ఎనిమిది కానీ పదిరెట్లు కానీ, మీరు మాట్లాడుకున్న తీరును బట్టి ఇవ్వాల్సి ఉంటుంది. దీన్ని నాగ్ అంటారు. ఆ కొలవటమనే కట్టుబాటుకి రైతు బద్ధుడై ఉండేవాడు. మీరు గనక నేనెందుకంత ఇవ్వాలి అన్నారనుకోండి, వచ్చేసంవత్సరం మీకాయన విత్తనాలు కొలవడు. ఇది రైతు కుటుంబాల పరిస్థితి.. రైతు కూలీలకు ఏం చేసేవారంటే సాయంత్రానికి గింజలు కొలిచిచ్చేవారు. వాండ్లు ఇంటికిపోయి గింజలు దంచుకుని వండుకోవలసిన పరిస్థితి. ఇది నేను చూశాను. వడ్లయితే దంచుకుని తినాలి. జొన్నలయితే ఇసురుకుని గట్క చేసుకుని తినాలి.

**మిసిమి : కూరగాయలు పండించేవారా?**

**సిధారెడ్డి :** తక్కువ సర్. ఎందుకంటే వర్షాకాలం రెండు, మూడు నెలలే కూరగాయలు పండించేవారు. ఇళ్ళలో పెరళ్ళుండేది రైతులకే కాబట్టి వారే పండించేవారు.మాదిగలకు అవకాశం ఉండేది కాదు. ఎక్కువగా పచ్చిపులుసు, పచ్చళ్ళతోటి తినేవారు. కూరగాయల వాడకం తక్కువ. ఇక మాంసాహారం కేవలం పండగలప్పుడే ఉండేది. ఇళ్ళలో కోళ్ళు పెంచేవారు.. వాటి గుడ్లను కూడా అమ్మేవారు కానీ, సొంతానికి తిన్న రోజులు తక్కువ. వేరే ఊరునుంచి వ్యాపారస్తుడు సైకిలు మీదొచ్చి గుడ్లను కొనుక్కుపోయేటోడు. ఒక గుడ్డు అమ్మితే ఐదుపైసలొచ్చేది. బర్రెలున్నా పాలు అమ్మేవారు కాదు. కొనుక్కునేవారు కాదు. మా ఇంటివెనక వడ్ల కమ్మరి కుటుంబం వారు ఎప్పుడన్నా ఛాయ్ తాగాలనిపిస్తే నయాపైసా ఇచ్చి పాలు కొనుక్కునేవాళ్ళు. రెండు పైసలిస్తే గ్లాసెడు పాలు పోసేవాళ్ళు. ఒక్కపైసకు పాలు పోయాలనంటే మా అమ్మ విసుక్కునేది. కానీ ఆ ఒక్క పైస తీసుకోకుండానే పాలు పోసేది మా అమ్మ.. అంటే బర్రెను పెంచుకోవడం కూడా ఆరోజుల్లో అందరికీ వీలయ్యేది కాదు.. ఇలాంటి ఒక దారుణమైన పరిస్థితి ఉండేది ఆరోజుల్లో..

**మిసిమి : ఇందాక మీరు షావుకారు దుకాణం అన్నారు. అందులో ఏమమ్మేవారు. పప్పుదినుసుల్లాంటివా?**

**సిధారెడ్డి :** పప్పుదినుసులు ఎవరూ కొనేవారుకాదు. నాకు తెలిసి ఛాయ్ పత్తా అమ్మేవారు. ఉప్పు అమ్మేవారు. బీడీలమ్మేవారు. ముఖ్యంగా కూలీ చేసేవారందరూ ఆ బీడీకే ప్రాణం పెట్టేవారు. పొగాకు అమ్మేవారు. బెల్లం వాడేవారు. చక్కెర ఖరీదెక్కువ. బెల్లంతోటే ఛాయ్ తాగేవారు. అప్పటికింకా కరెంట్ లేదు. గ్యాస్


నూనె (కిరసనాయిలు) కొంటారు. గ్యాసునూనె కొనలేని వాళ్ళు ఆముదంతో దీపాలు పెట్టేవారు. నిజానికి చాలా తక్కువమంది ఇళ్ళలో కిరసనాయిలు దీపాలుండేవి. ఎక్కువ బుడ్డిదీపాలుండేవి. ఎక్కడో కాస్త ధనవంతుల ఇళ్ళలో కందిల్లు (లాంతర్లు) ఉండేవి. విద్యుత్ అనేది ఊహించలేని కాలమది.

**మిసిమి : సిధారెడ్డిగారూ..ఆ రోజుల్లో వర్షాలెలా ఉండేవి!?**

**సిధారెడ్డి :** వర్షాలు కొన్ని సంవత్సరాలు బానే కురిసేవి. వర్షాలు కురిసినప్పుడు పండగలు చేసేవారం. అప్పో సొప్పో చేసి మరీ పండగలు చేసేవారం. వర్షాకాలం నుంచి పండగలు మొదలు. ఆషాఢంలో వచ్చే తొలేకాదశి మొదటి పండగ. తర్వాత శ్రావణంలో వచ్చే బోనాలు.. ఆ బోనాలప్పుడు బెల్లం అన్నం వండేవారు. వినాయక చవితి చేసేవారం. కానీ బయటనుంచి విగ్రహాలు కొనేంత స్తోమతు లేదు. ఒకటో రెండు ఔసులోల్ల (స్వర్ణకారులు) కుటుంబాలు ఉండేవి. వాళ్ళే చెరువు నుంచి మట్టి తెచ్చి విగ్రహాలు చేసేవారు. ఊరిలో వేయి కుటుంబాలుంటే ఒక నలభై యాభై కుటుంబాల వారే కొనగలిగేవారు. వారికే ఆయన చేసిచ్చేవాడు. డబ్బులు బదులు ధాన్యం కొలిచిచ్చేవారు. ఆరోజుల్లో పనివృత్తుల వారందరికీ (కమ్మరోల్ల నుంచి మాదిగల వరకు) పంటలో భాగమిచ్చేవారు. వినాయకచవితి పండుగకు కుడుములు, పాశం (పాయసం) చేసి విగ్రహాలు కొనే స్తోమతు లేనివారికి ఇచ్చేవారు. ఇదీ మా గ్రామచిత్రం. దసరా మాకు పెద్ద పండుగ.

**మిసిమి : సిధారెడ్డి గారు, మీరు మీ ఊళ్ళో ఎంతకాలమున్నారు?**

**సిధారెడ్డి :** నేను పుట్టింది యాభై నాలుగులో..ఎమ్మేలో చేరేవరకూ ఉన్నాను. అంటే 75-76 వరకూ అనుకోవచ్చు. మా ఊరు బందారంలో ఐదు వరకే స్కూలుండేది. ఆ తర్వాత చదువుకు మా ఊరుకు ఐదు కిలోమీటర్ల దూరంలో దుద్దెడ అనే ఊరుంది. అదొక ఆప్షన్. రెండోది వెల్కటూరు అనే ఊరు ఆరుకిలోమీటర్ల దూరంలో ఉండేది. కేవలం కాలిబాట ఉండేది. అప్పటికి మా ఊరికి బస్సు సౌకర్యం లేదు. మా బాపు (నాయన) చదువుకోలేదు. రజాకార్ల సమయంలో సిపిఐ పార్టీలో చేరి కొంత నేర్చుకున్నాడు. అందువలన ఆయనకు చదువంటే ఇష్టం. దాంతోటి ఊళ్ళో అందరికీ చదువుకోమని చెప్పేవాడు. ఆయనకో వింత నమ్మకముండేది. రోడ్డు, హోటలు ఉన్న ఊరికి పోరగాండ్లను చదువుకోనీక పంపితే పోరగాండ్లు చెడిపోతారన్నది ఆయన నమ్మకం. కాబట్టి ఆయన నన్ను రోడ్డు సౌకర్యం లేని ఊరులో ఉ



సిధారెడ్డి గారితో రాంబాబు

న్న బడికి పంపించేవాడు. రోడ్డు ఉన్న బడికి ఐదారుగురు వెళితే, రోడ్డులేని ఊరు వెళ్ళిన మేమొక ఇరవైఎనిమిది మంది ఉంటాము. ఇటు వెళ్ళిన వాళ్ళం, అంతోఇంతో చదువుకున్నం కానీ, అటు వెళ్ళినవారికి చదువబ్బలేదు. ఆనాడు రోడ్డు, హోటల్లే డైవర్షన్ లయితే ఈనాడు సెల్ఫోన్, సినిమాలు, టీవీలు ఎన్నున్నాయో కదా అనిపిస్తుంది.. మా ఊరికి కరెంట్ ఎప్పుడొచ్చిందనుకున్నారు..75-76సంవత్సరాలలో వచ్చింది.. నా పెళ్ళి 79లో అయింది. అంతకుముందు వచ్చిందని గుర్తుంది. మళ్ళీ నా బడి రోజులకు వస్తే, ఇలా నడుచుకుంటూ వెళ్ళిరావటం వలన నాకు ప్రకృతితో అనుబంధం పెరిగింది. అట్లనే వ్యవసాయపనులు

చేసుకుంటూ పాటలు పాడేవారిని గమనిస్తుండేవాడిని. పశువుల కాడ ఉండే ఒకాయన ఒకరకమైన పాటపాడేవాడు..చెరువు గట్టెక్కిపోతుంటే, చెరువు పారకంతో పొలంపనులు చేసేవారొకరకంగా పాడేవారు. మోట కొట్టేటువంటి జీతగాళ్ళు పాడేపాటలు వేరేగా ఉండేయి. అలా చుట్టూ ఒక పాటల ప్రపంచం ఉండేది, మరోపక్క పక్షులు, చెట్లు, ఇవన్నీ ఓ ఆనందాన్ని కలిగిస్తుండేవి. మా బాపు కమ్యూనిస్ట్ పార్టీలో ఉండటం వలన ఆయన పాటలు పాడేవాడు. ఆయన పాడే పాటలు వేరు. నాకు పరిచయమైన మొదటి పాటేమిటో తెలుస్తే మీరు ఆశ్చర్యపోతారు. "చెయ్యెత్తి జైకొట్టి తెలుగోడా" పాట వేములపల్లి శ్రీకృష్ణ రాసిన పాట. నాకు ఆరేదేళ్ళు వయసులో విన్న పాట. ఇంకో పాట.." వందనాలు కామందుల వారు.. ఏమి చూసి ఓటిమ్మంటారు" అనే పాట. అలాంటిదే ఇంకోపాట "ఓ పోలీసు పటేలా..ఓ మాలీసు పటేలా.. ఏమంటావు చెప్పు" అనే పాట. వేములపల్లి శ్రీకృష్ణ కూడా ఆనాడు మద్రాసు రాష్ట్రంనుంచి విడిపోవటానికి సాగిన ఆంధ్రోద్యమం కోసం రాసిన పాట. మా బాపుదగ్గిర పుంగి ఉండేది. పుంగి అంటే లౌడ్ స్పీకర్ లాంటిది. మావూరి కమ్మరాయన ఆయనకు చేసిచ్చాడు. ఆ పుంగి అనేది మా ఒక్కరింట్లోనే ఉండేది. మా నాయన వ్యవసాయ పనులు చూసుకుని కల్లు తాగివచ్చేవాడు. అలా తాగాడంటే పాటలు బాగా పాడేవాడు..

**మిసిమి : మీ ఇంటి వాతావరణం ఎలా ఉండేది?**

**సిధారెడ్డి :** మా అమ్మ వైపుకానీ, మా బాపు వైపుకానీ పెద్దవాళ్ళెవరు లేరు. మా నాయనదో విషాద వృత్తాంతం. అదే నేను "నాగేటి తరం" పేరుతో నవలగా రాశాను. మా బాపు యొక్క అమ్మా, నాయనలు ఆయన రెండేళ్ళ వయసు లోపలే చనిపోయారు. ఆయనను మా బాపమ్మ (బామ్మ) పెంచింది. ఐదేండ్లకు ఆమె చనిపోయింది. మా నాయనకు నాలుగెకరాల పొలం ఉన్నా, పెద్ద దిక్కు లేకపోవటం వలన, తన పెదనాన్న కొడుకు దగ్గర (ఈయనకు అన్న అవుతాడు) జీతగాడుగా చేరాడు. మా నాయన పొలం ఆ పెదనాన్న కొడుకు సాగుచేసుకునేవాడు. ఈయనకేమీ ఇచ్చేవాడు కాదు. మా నాయన పొలంలో కష్టం చేసి ఇంటికొస్తే వదిన పాచిపోయిన గట్క పెట్టేది. మగనికేమో వేడివేడి అన్నం పెట్టేది. మా నాయనకు రోషమెక్కువ. నిలదీసి అడిగేవాడు. ఏం లాభం! మా నాయనను భార్యా భర్తలు తిట్టిపోసేవారు, నీకు ఇదే ఎక్కువంటూ.. ఈయన బాధపడి బాయికాడికి పోయి కూర్చునేవాడు కానీ ఆ గట్క తినేవాడు కాదు. ఏ పంట వేస్తే ఆ పంట కాయలు తినేవాడు. తోటి మాదిగ జీతగాళ్ళతో కలిసి ఉండిపోయేవాడు. వారి గుడిసెలోనే నిద్రించేవాడు. మాదిగ వాళ్ళకు ఈయనంటే చాలా జాలి ఉండేది. ఈయన పొలం ఆ అన్న గుజుకున్నాడు అన్న బాధ వారికి ఉండేది.. "ఇంటికి నువ్వెందుకొత్తలేవు" అని వాళ్ళ అన్నా వదినలు అడగకపోయేది. ఇలాంటి సమయంలో ఊళ్ళో రజాకారులొచ్చారు. దాడిచేశారు.. ఈయన వయసెంతప్పుడు.. పదారేండ్లుంటాయి. ఈయన వయసు వారందరూ కూడి అసలు ఎవరు ఈ రజాకార్లు, ఎందుకొచ్చారు అనేది తెలుసుకున్నారు. నిజాం రాజు పంపించాడని తెలుసుకున్నారు. ఒకరోజు రజాకార్లపై మా నాయన నాయకత్వంలో తిరగబడి, వాళ్ళను వెళ్ళగొట్టారు. ఇది కమ్యూనిస్ట్ పార్టీకి తెలిసి వీళ్ళెవరో తెలుసుకుని వీళ్ళదగ్గరకొచ్చి నచ్చచెప్పారు. మీరు పార్టీలో చేరండి, లేకుంటే రేపు మళ్ళీ వాళ్ళు మీమీద దాడికి వస్తారు.. మీరు జాగ్రత్తగా ఉండాలి.. అంటే మీకు రక్షణ కోసం తుపాకులిస్తామన్నారు. ఒక గుర్రం కూడా ఇచ్చి, ఈయనను పది ఊళ్ళను కాపాడే గ్రామరక్షక దళం ఇన్‌ఛార్జ్ బాధ్యత ఇచ్చారు.. ఇటు వ్యవసాయం చేస్తూ రాత్రి కావలి కాసేవాడు మా బాపు.. మోరీల్ నరసింహులు అనే ఆయన పోలీసు శాఖలో ఏ.యస్.ఐ.గా పనిచేసి రిటైర్ అయ్యాడు. ఆయన మా బాపుని గమనించి పిలగాడికి చక్కని తెలివి ఉన్నదని గమనించి, నువ్వు చదువుకోవాలి బిడ్డా అని చదువు నేర్పాడు. అలాగే మా బాపు తన భూమిలాక్కున్న అన్నతో పోరాటం చేసి భూమిని తీసుకున్నాడు. ఆయన కజిన్ ఆ భూమిని షావుకారుకు కుదువపెట్టాడు. అయితే మా బాపు ఆ భూమిలో యాభై నాగళ్ళతో దున్నించటానికి సిద్ధంగా ఉన్న ఎడ్లను విప్పేశాడు. అక్కడున్న మాదిగ జీతగాళ్ళందరూ మా బాపుకే మద్దతు ప్రకటించారు. "నాగేటి తరం" అంటే ఇదే.. మా బాపు వివాహం కూడా ఎలా చేశారంటే..

ఈయనకు ఏవిధంగా తల్లిదండ్రులు లేరో, అలా తల్లిదండ్రులు లేని అమ్మాయితోనే ఈయనకు వివాహం చేశారు. మా తల్లిదండ్రులకు మేం నలుగురం సంతానం.. 2011లో మా బాపు వెళ్ళిపోయాడు. ఇంత గొప్పగా ఉండే మా బాపులో ఒక దుర్లక్షణం ఏమిటంటే ఆయన మా అమ్మను కొట్టేవాడు. ఆ పురుషాధిక్య లక్షణముండేది. అది బాధ కలిగించే విషయం. ఎందుకు ఇలా చేసేవాడంటే ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు, పిల్లలను చదివించలేకపోయాడు. ఇవన్నీ ఆయనలో నైరాశ్యంతో పాటు కోపాన్ని కూడా నింపేవి. అదంతా ఆయన మా అమ్మ మీద చూపేవాడు. నిజానికి మా నాన్న జీవితంలో విషాదానికి ఆవిడ బాధ్యురాలు కాదు. ఆవిడే ఒక విషాదకర జీవితంలోంచి వచ్చింది. ఆయన ఈ విషయం అర్థం చేసుకుంటే వేరేలా ఉండేవాడు. ఆయన మిగిలిన వారందరితోను బావుండేవాడు. సహాయం చేసేవాడు. ఎవరైనా బాగా చదువుకునే పిలగాడు చదువుకు ఇబ్బంది పడుతుంటే ఆ పిలగాడిలో మానసిక ధైర్యాన్ని నింపేవాడు. మీకు ఇంకో ఆశ్చర్యకరమైన విషయం చెబుతాను. అప్పుడు నేను తొమ్మిదో తరగతిలో ఉన్నాను. మా బాపుకు పెదషావుకారు దగ్గర ఖాతా ఉంది ఈయనకు కావలసిన బియ్యమో, జొన్నలో ఇచ్చేవాడు. పండిన పంటలో మళ్ళీ ఈయన తిరిగిచ్చే సంప్రదాయముండేది. అలాంటి సమయంలో ఈయనకు నా ఫీజు డెబ్బై ఐదు పైసలు కాక టర్మ్ ఫీజు రెండు రూపాయలు కట్టాల్సి వచ్చింది. ఈయన పోయి ఆ షావుకారినడిగాడు. ఇట్లా పోరనికి ఫీజు కట్టాలిఅంటూ.. దానికి షావుకారు పిలగాడిని చదువు బంద్ చేయించేయ్, ఇంకేంది చదివించేది.. మా పిలగాడిని మాన్పించినా అన్నాడు. మా బాపు అప్పుడాయనకు చెప్పాడు కదా.. నీ కొడుకు నీ వ్యాపారం చూసుకు బతకగలడు.. నువు సంపాయించిన ఆస్తి ఉన్నది. నా కొడుకు చదివి ఉద్యోగం చేస్తేనే బతకగలడు అన్నాడు. దానికా షావుకారు ఓ బూతుమాట మాట్లాడాడు. అది మా నాయనకు చాలా కోపం తెప్పించింది అప్పటినుండి షావుకారు ఖాతా బందు చేసేశాడు. ఎద్దునమ్మేసి బాకీ తీర్చేశాడు. గొల్లోళ్ళ దగ్గర, తెనుగోళ్ళ దగ్గర రూపాయో, అర్థో తీసుకుని ఫీజు కట్టేవాడు.

**మిసిమి : రజాకార్లతో పోరులో మీ నాన్నగారే నాయకుడా?**

**సిధారెడ్డి :** ఖచ్చితంగా చెప్పలేను కానీ పరిస్థితులు విశ్లేషిస్తే అదే వాస్తవమని చెబుతాయి. వీరయ్య అనే కమ్మరాయన, ఒక ఎస్.సి.ఆయన, ఇంకో ఇద్దరు ముగ్గురు ఆయన స్నేహితులుండేవారు.. పార్టీ చెప్పిందని వీరయ్య ఆయనకు నాటు తుపాకి తయారు చేసిచ్చాడు.. మీ నాయనే లీడ్ చేశాడని నాకు వీరయ్య చెప్పాడు. రజాకార్లను పార్టీలో చేరకముందే తరిమికొట్టిన వ్యూహం మా బాపుదే. బందారంలో పోరగాళ్ళంతా రజాకార్లను తరిమి కొట్టారన్న వార్త వ్యాపించాక పార్టీ పిక్చర్‌లోకి వచ్చింది. అది మా నాయనే లీడ్ చేశాడని చాలామంది చెప్పారు.

**మిసిమి : మీ స్కూల్ చదువు ఎలా సాగిందో చెప్పండి?**

**సిధారెడ్డి :** నేను మూడు, నాలుగు తరగతుల్లో ఉన్నప్పుడు లెక్కలు బాగా చేసేవాడిని. బాగా ఇష్టం కూడా. అదే టైములో తెలుగు కూడా బాగా ఆకర్షిస్తుండేది. నాలుగో తరగతిలో ఉన్నప్పుడు శిబి చక్రవర్తి పాఠం బాగా ఇష్టంగా ఉండేది. అలాగే అల్లూరి సీతారామరాజు పాఠం కూడా.. ఒక పాట "కలికి కామాక్షి" అని ఉండేది.. "మా అన్నలొచ్చారు.. నన్నంపుతారా"..అని మొదలయ్యేది. ఆ పాట మన కుటుంబ వ్యవస్థ ఎలా ఉండేదో చెప్పేది. కోడలు పుట్టింటికి వెళ్ళాలంటే మొత్తం కుటుంబం అనుమతివ్వాలి.. అదీ ఆ పాట సారాంశం.. ఇలా తెలుగు ఆకర్షించగా ఏడవ తరగతిలో కంకంటి పాపరాజు రచించిన "ఉత్తర రామాయణం" బాగా ఇష్టంగా ఉండేది. అందులోని పద్యాలు ఇప్పటికీ గుర్తే.. ఒక పద్యం ఇలా ఉంటుంది. "*పిడుగు కంటెను బెట్టిదమైన మాట యీ పటుతర దుఃఖవార్త*" అని సాగుతుంది. ఎనిమిదో తరగతిలోకి వచ్చేసరికి కరుణశ్రీ రాసిన "బీదపూజ" పద్యాలు బాగా గుర్తు. పద్యాలు, పాటలు నచ్చితే చదువుకోవటం తప్ప కవిత్వం గురించి తెలియదు. ఈ పద్యాలు మాత్రం నన్ను ఆకట్టుకున్నాయి.. "వాడిన గుడ్డిపూలు గొనివచ్చెను.. వీడని జాలిమాలి నోనాడకుము ఓ దయామయా" అంటూ సాగే పద్యం చాలా ఆర్ద్రంగా ఉంటుంది. కరుణశ్రీ పలికించిన భావనలు నన్ను కదిలించాయి. పేదరికం కూడా భక్తిలో

చెప్పొచ్చని తెలిసింది. అప్పటికింకా నాకు భక్తి అంటే విముఖత లేదు. అప్పటికి నేను నలభైరోజులు స్నానం చేస్తే ఆంజనేయస్వామికి మొక్కితే ఆయన కనిపిస్తాడు అన్న నమ్మకంలో ఉండి రోజూ స్నానం చేస్తుంటిని. రోజూ చేయవా అంటే రోజూ స్నానం చేసే లగ్జరీ మాకులేదు. మాకు సొంత బావిలేదు. వాడకట్టుకు ఉన్న బావినీళ్ళనే జాగర్తగా వాడుకోవాలి మేము. వడ్లోల్లకు, కమ్మరోల్లకు కలిపితే ఇరవై కుటుంబాలకు ఒకటే బావి. మా బాపు ఒక్కడే తానం జేసేది. మిగితావాళ్ళకు అవకాశం లేదు. పన్నెండు కుండలు తెస్తే బర్రెకు, ఆవుకు కుడితి కోసం వాడేవాళ్ళం. వాటికి మొదటి ప్రాధాన్యత. తాగటానికి మంచినీళ్ళ బావి వేరే ఉండేది. అందులోంచి తెచ్చేవాళ్ళం. అది ఊరి బయట ఉంటుంది. అందరూ అక్కడినుండే తెచ్చుకోవాలి. ఆ బావి చెరువు కింద ఉండటం వలన నీళ్ళు కొంచెం స్వీటుగా ఉంటాయి. నీటి కరువు వలన రోజూ స్నానం నిషిద్ధం. మరెప్పుడు చేసేదంటే, వారానికి ఒకరోజున. మా బట్టలు కూడా ఉతికేతెచ్చేందుకు చాకలాయన ఉండేవాడు. ఇవాళ తొడిగిన బట్టలు మళ్ళీ మర్రోజు ఉతికిన బట్టలు వేసుకునేవరకూ అవే బట్టలు. నీళ్ళతో మొహం కడుక్కునే వాళ్ళం.. అంతే.. స్కూల్‌కు పోయేటప్పుడు ఒక గిన్నెలో పెరుగన్నం, ఆవకాయ తొక్కు వేసిచ్చేది మా అమ్మ. ఆ గిన్నెకో బట్ట కడితే అదే బాక్సయ్యేది.. ఇరవైఎనిమిది మంది కలిసి వెళతామని చెప్పాకదా. అందరం కలిసి ఒక బావి చూసుకుని దాని పక్కనే తినేవాళ్ళం. అలా తినగలగటం.. అదీ ఒకరకమైన ఆనందమే.. మళ్ళీ వెనక్కి వస్తాను.. ఎనిమిదవ తరగతిలో పద్యం వైపు వచ్చాను కదా.. కానీ ఎలా రాయాలో తెలియదు. పద్యంలో ఇరవై ఒకటో, రెండో అక్షరాలుండేవి.. గణాలింకా తెలియదు అప్పటికి. ఒక తెలుగు సార్ నడిగితే ఆయన చెప్పలేకపోయాడు.. 1969లో నేను తొమ్మిదవ తరగతి చదువుతున్నాను. ఆ సంవత్సరం నాకు టర్నింగ్ పాయింట్. అప్పుడు వచ్చిన తెలుగు సార్ పేరు అష్టకాల నరసింహరామశర్మ. ఆయన స్వయంగా కవి. పద్యాలు రాస్తాడు. తర్వాత కాలంలో అవధానాలు కూడా చేశాడు. ఆ సారు వచ్చుడు వచ్చుడే "శిథిల విపంచి" అనే పుస్తకం ప్రింట్ చేసుకుని వచ్చాడు. అదో చిన్న ఖండ కావ్యం. పదిహేను పదహారు శీర్షికలతో ఉన్న చిన్న ఖండ కావ్యం. దాని ఖరీదు పావలా (అప్పటికది ఎక్కువే) మేమంతా దాన్ని కొనాలన్నారు హెడ్ మాస్టర్ గారు. మొత్తానికి మా అమ్మని బతిమాలి కిందామీదా పడి పావలా సంపాదించి ఆ పుస్తకం కొన్నాను.. తొమ్మిదవ తరగతిలో మాకు ఛందస్సు ఉండటంతో ఆ పుస్తకం పనికొచ్చిందనే చెప్పాలి.. ఆ పద్యాలు చదువుతుంటే ఒక మాధుర్యం అనుభవించగలిగాను. మేమంతా ఉత్పమాల, చంపకమాల పద్యాలు నేర్చుకోగలిగాము. పద్యాలు రాసి చూపిస్తే ఆయన సరిదిద్దుతుండేవాడు. నాకు అప్పటికే శతకం రాయలన్న కోరిక ఉండేది. అయితే అనేకమంది దేవుళ్ళ మీద శతకాలొచ్చేశాయి. అలా ఎవరూ శతకం రచించని దేవుడి మీద శతకం రాయాలని నా ఉద్దేశ్యం. అలా శోధిస్తే నాకు కొమరవెల్లి మల్లన్న మీద శతకం రాలేదని తెలిసింది. ఆ స్వామి మీద నూట ఎనిమిది సీసపద్యాలతో శతకం రాశాను. వచన కవిత్వాన్ని ప్రేమించటం మొదలుపెట్టాక పద్యం మీద ఆసక్తి పోయింది. అయినా కూడా కంకంటి పాపరాజు పద్యాలు, కరుణశ్రీ పద్యాలు, మా అష్టకాల సారు పద్యాలు ఈనాటికీ నోటికి వచ్చు. ఆయనే ఒకరోజు నన్నడిగాడు. నీకు వచన కవిత్వం గురించి తెలుసా అని.. తెలియదు సర్ అని చెప్పాను. ఆ సార్ కవిసమ్మేళనాలకు వెళు తుండేవాడు. ముందురోజు క్లాసులో రేపు కవిసమ్మేళనం ఉంది, ఇవాళ పాఠం లేదు అంటూ పద్యాలు రాసుకోవటంలో మునిగిపోయేవాడు. కవిసమ్మేళనం అన్న మాట నాకు ఆశ్చర్యం కలిగించింది. ఆ తరవాతి రోజున ఆయన నాకు వచన కవిత్వంలో కూడా రాయటానికి ప్రయత్నించు అని నాకు ఒక పుస్తకమిచ్చాడు. ఆ పుస్తకం పేరు "ఋతచేతన". సిద్ధిపేటకు చెందిన నలుగురు కవులు వేసిన పుస్తకమది. ఆ నలుగురు ఎవరంటే ఉమాపతి పద్మనాభశర్మ, జాలపల్లి చంద్రారెడ్డి, విఠాల శ్రీకాంతశర్మ, రుక్మాభట్ల కృష్ణమూర్తి. 1969లో గాంధీ శతజయంతి సంవత్సరం జరిగింది. అందుకని ఎక్కువ కవితలు గాంధీమీద ఉన్నాయి. అలా వచన కవిత్వాన్ని పరిచయం చేసిందా పుస్తకం.. మా అష్టకాల సారు వ్యాసరచన పోటీపెట్టాడు. అంశమేమిటంటే "మీ జీవితాశయం ఏమిటి!".. నేను ఎమ్మెల్యే కావటం అని రాశాను. దానికి కారణం

వల్లూరి బసవరాజు అనే ఆయన మా సిద్ధిపేట ఎమ్మెల్యేగా చేశాడు. ఆయన ఒకసారి మా స్కూలుకు వచ్చాడు. ఇప్పటిలాగా కాన్వాయ్ లేదప్పుడు. అందుకని అరవై జతల ఎడ్లబళ్ళతో ఊరి పొలిమేరలనుంచి తీసుకొచ్చారు. ఆయన రెవెన్యూ మినిస్టర్‌గా చేశాడు. ఎందుకు ఎమ్మెల్యే అవుతావు అంటే ఎమ్మెల్యే అయితే ఊరికి కరెంట్ వస్తుంది, స్కూల్ వస్తుంది.. ఇలా ఒక నాలుగైదు కారణాలు రాశాను. మొత్తానికి నాకు మొదటి ప్రైజు ఇచ్చాడు. దానికి నాకు ఇచ్చిన పుస్తకమేమిటో తెలుసా! "మేనకా విశ్వామిత్రము".. ఆ పుస్తక రచయిత మడిపలిక బలరామాచారి. అది మాత్రాఛందస్సులో ఉన్న గేయకవిత్వం. ఎన్నోసార్లు ఆ పుస్తకాన్ని చదివాను. ఇంతకీ నాకిష్టమైనది రాజకీయమా! కవిత్వమా! అన్న సంధిగ్ధంలో పడ్డాను. మరోపక్క నేను లెక్కలు బాగా చేస్తుండేవాడినని చెప్పాను కదా. లెక్కల సారేమో భుజం తట్టి వీడు మేథమేటిక్సు ప్రొఫెసర్ అవుతడు అనేవాడు. ఈ స్కూల్‌లో రాజిరెడ్డి, సిధారెడ్డి ఇద్దరూ గణితంలో రాణిస్తారు అని దీవించాడు. 1969లో జరిగిన ఇంకో పెద్ద పరిణామం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం. స్కూళ్ళు మొత్తం బందయినయి. పరీక్షలు బాయికాట్ చేశారు. ఉద్యమం సంగతులు తెలుసుకోవడానికి మాకు ప్రాంతీయవార్తలే ఆధారం. మా ఊళ్ళో రెండే రేడియోలుండేవి. ఒకటి ఔసుల రామాచారి ఇంట్లో. ఇంకోటి పోలీసు పటేలు వెంకటరెడ్డి ఇంట్లో ఉండేది. నేను ప్రాంతీయ వార్తలు వినేటందుకు రామాచారి ఇంటికి పోతుండేవాడిని. మా బాపు నేనెటుపోతున్నా, ఏం సంగతి అని వాకబు చేసి తెలుసుకున్నాడు. ఆయన భయమేమిటంటే, నేనేమైనా చెడు తిరుగుళ్ళు తిరుగుతున్నానా అని. ఎప్పుడైతే రేడియో వినటం కోసం వెళుతున్నాడు అని తెలియగానే, రెండు రోజుల తర్వాత రేడియో కొనుక్కొచ్చాడు. దానికోసం ఒక ఎద్దును అమ్మేశాడు. దాంతో డెభ్భై ఐదురూపాయలు వచ్చాయి. ఇంకొంచెం అప్పుచేసి, కొంచెం గడ్డమ్మి మొత్తానికి నూట ఇరవైరూపాయలు పెట్టి కొనుక్కొచ్చాడు. ఆయన గొప్పదనమేమిటంటే ఆయనొక్కడే పోకుండా నన్ను కూడా సిద్ధిపేట తీసికెళ్ళి రేడియో కొనుక్కొచ్చాడు. మరుసటిరోజు నుంచి ఓ ఇరవైమంది సాయంత్రం అవగానే మా అరుగుమీద కూచోటం మొదలుపెట్టారు.. అగో రేడియో వచ్చింది వీళ్ళింట్ల అని అంటుండేవారు. మా బాపు రేడియో కొన్న రెండవరోజే కవి మఖ్దూం మొహియిద్దీన్ చనిపోయాడు. ఆయనకు రేడియోలో శ్రద్ధాంజలి కార్యక్రమం వచ్చింది. అందులో డా.సి.నారాయణరెడ్డి ఒక కవిత చదివాడు. **"మూడు శరత్తులు దోరవెన్నెల కురియవలసిన జాబిలి/ నూరు వసంతాలు నోరార పాడవలసిన బుల్ బులీ/ ప్యారే మఖ్దుం.. మేరే హందమ్.. ఎటు వెళ్ళిపోయావు నేస్తం/"** అంటూ ఉన్నదా కవిత. అటు పద్యం, ఇటు కవిత్వం, ఇటు నారాయణరెడ్డి చదివిన గేయం నన్నావహించాయి. అలా నారాయణరెడ్డి గ్రిప్‌లోకి వచ్చేశాను. మాది దూరంగా ఉండే ఊరు కావటంతో మొదట్లో తెలంగాణా ఉద్యమం తీవ్రత మావరకూ రాలేదు. ఒకరోజున మా స్కూల్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి పేరున ఒక కవరొచ్చింది. అందులో పసుపుకుంకుమ, గాజులు ఒక జాకెట్ గుడ్డ ఉన్నాయి. ఎవరు పంపించారు ఇది అంటే సిద్ధిపేట నుంచే ఎవరో పంపించి ఉండాలి.. వెల్కటూరు అనే ఊరుందని వేరేవాళ్ళకు తెలియదు కదా.. ఎవరిమీదో ఒకరి మీద నింద వేయాలంటే కె.వి.రమణాచారి పంపించి ఉంటాడు అనుకోవాలి. ఆయన అప్పుడు డిగ్రీ చదువుతున్నాడు. ఆయనో తీవ్రమైన ఉద్యమకారుడు. సిద్ధిపేటలో కమానుండేది. ఆ కమాను ఎక్కి ఈయన ఉపన్యాసాలిస్తుండేవాడు. అలా మేము కూడా ఉద్యమంలో పాల్గొన్నాం. మేము మాకు రోడ్డులేదు కాబట్టి దుద్దెడ వెళ్ళి రాస్తారోకో చేశాం.. సిఆర్పీఎఫ్ పోలీసులొచ్చేశారు. అలా 1969 తెలంగాణా ఆగం ఆగం అయింది. ఆ ఉద్యమం ఏప్రిల్‌లో మొదలై జూన్ చివరి వరకూ నడిచింది.

**మిసిమి : ఇట్లాంటి ఉద్యమాల్లో నారాయణరెడ్డి గారి పాత్ర ఏమిటి?**

**సిధారెడ్డి** : ఆయన తెలంగాణకు అనుకూలంగా రాయలేదు సర్.. మలిదశ ఉద్యమంలో కూడా నేనెప్పుడూ ఆయనను ఒత్తిడి చేయలేదు. కారణం ఆయన స్వభావం నాకు తెలుసు గనక. గౌరీశంకర్ లాంటివాడు ఆయన్ని ఒత్తిడి చేశాడు. ఒక సభలో అయితే మీరు జైతెలంగాణ అని ఒక్కసారన్నా అనండి సర్ అని మైక్ చేతికిచ్చాడు. "నేనెందుకు అనటం.. నేను మీవెంటే ఉన్నా కదయ్యా" అని ఆయన అంటాడు.. "సరే మీరు జైతెలంగాణ

అంటే నేను సై తెలంగాణ" అంటానని ప్రకటించాడు. అలా ఏది చెప్పినా ఆయన ముద్ర ఉంటుంది. జైతెలంగాణ అన్నట్టు కాదు. అననట్టు కాదు. అంత తప్పించుకునేవాడు. అట్లని ఆయన సమైక్యవాది కాదు. ఆయనది లౌక్యం అంతే. మాతో విడిగా ఏమనేవాడంటే "ఏమయ్యా మీరేనా తెలంగాణ కోసం కొట్లాడేది, నాలో తెలంగాణ రక్తం లేదా" అనేవాడు. నేను ఆయన స్టూడెంట్‌ని. నాకు ఎమ్.ఫిల్.లో ఆయనే గైడ్.. పిహెచ్.డిలో కూడా ఆయనే గైడ్. పత్తిపాక మోహన్ పెళ్ళి సిద్ధిపేటలో అయింది. ఆ పెళ్ళికి ఆయనొచ్చాడు. ఆయనొచ్చాడు కదా అని "నారాయణరెడ్డితో ఓ సాయంత్రం" అని కార్యక్రమం పెట్టాం. ఆర్&బి. గెస్ట్ హౌస్‌లో లంచ్ ఏర్పాటు చేశాం.. స్థానికంగా ఉన్న ప్రెస్ మిత్రులొచ్చారు. ఇంటర్వ్యూ ఇస్తానని ఉబలాటపడ్డడు. నేను వద్దన్నాను. తెలంగాణ ఉద్యమం తీవ్రంగా నడుస్తోందప్పుడు. నా గురువు కదా.. తెలంగాణ మీద అడుగుతారు.. ఈయన సంధిగ్ధంలో పడతడు అని నా అభిప్రాయం. వాళ్ళు అడగనే అడిగారు. "తెలంగాణ ఉద్యమాన్ని మీరు బలపరుస్తారా" అంటే "బలపరుస్తాను" అన్నాడు. "సర్ ఆలోచించుకోండి. మీరు సిద్ధిపేట వచ్చి ఇబ్బంది పడకూడదు" అన్నాను నేను. ఎందుకంటే ఇది స్టేట్ వార్త అవుతుంది అన్నాను. ఏం ఫరవాలేదు అన్నాడాయన. అనుకున్నట్టే అది "తెలంగాణ అవసరమే అన్న సినారె" అన్నట్టుగా మరుసటి రోజు ఆంధ్రజ్యోతిలో హెడ్ లైన్ వార్తగా వచ్చింది. ఈసారి స్టేట్ కరస్పాండెంట్ వెళ్ళాడు. సర్ నిన్నటి వార్త గురించి మరికొన్ని ప్రశ్నలనగానే ఆయన కొంచెం మార్చి ఏమన్నాడంటే "నేను అలా అనలేదు.. అంబేద్కర్ చెప్పినట్టు చిన్నరాష్ట్రాలే మిన్న" అన్నాడు. అలా ఆయన అంత జాగర్తపరుడు.

**మిసిమి : మిమ్మల్ని ప్రభావితం చేసినవారి గురించి చెప్పారు..ఆ దిశగానే మీ కెరీర్ సాగిందా!?**

**సిధారెడ్డి :** నేను సిద్ధిపేటలో ఇంటర్మీడియెట్ (70-72), డిగ్రీ (72-75) పూర్తిచేశాను. ఇక్కడ నాకు సినిమాలు చూడటం పెద్ద అలవాటుగా మారింది. ఏదోరకంగా సినిమా చూడాలి. రెండు టాకీసులుండేవి. ఒకటి విఠల్, ఇంకోటి బాలాజీ. ఎంత పిచ్చంటే ఇరవై పైసలు పెట్టి ఇంట్రవెల్‌లో ఎవరైనా వెళ్ళిపోతుంటే ఆ టికెట్ కొనేవాడు ఆగంరెడ్డి అనేమిత్రుడు.. ఇద్దరికీ ఒకటే పిచ్చి. మేము రూంలో ఉండి చదువుకునేవాళ్ళం. తినడానికి వండుకోకపోయినా సినిమా చూడాలి. అంత పిచ్చి. ఈ పిచ్చిలో నారాయణరెడ్డి లాగా పాటలు రాయాలన్న కోరిక మొదలైంది.. పద్యం పోయింది. కవిత్వం పోయింది. పాట వచ్చి నెత్తిన కూర్చుంది. డిగ్రీ మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడు రోజుకో పాట చొప్పున రెండువందల పాటలు రాశాను. ఐదారు సినిమా కథలు రాశాను. వీటిని ఫెయిర్ చేసి కొన్ని కొన్నింటిని నాకు నచ్చిన డైరక్టర్లకు పోస్ట్ చేశాను. ఒక్కరి నుంచి కూడా కనీసం ముట్టినట్టు సమాధానం రాలేదు.

ఈ దశ నుంచి 1974లో నాకో టర్నింగ్ పాయింట్ వచ్చింది. అదేమిటంటే సిద్ధిపేటలోని శాఖా గ్రంథాలయం. అప్పటివరకు లైబ్రరీలోకి వెళ్ళి చదువుకోవచ్చని నాకు ఎవరు చెప్పలేదు. నాకు తట్టలేదు. చొరవ లేకపోవటం కారణమేమో.. ఎవరైనా చెప్పారా, నాకే అనిపించిందా గుర్తులేదు. అక్కడ రిజిస్టర్‌లో సంతకం పెట్టి లోపలికి పోయి చదువుకోవచ్చని తెలిసింది. శ్రీశ్రీ, తిలక్, ఆరుద్ర, కొడవటిగంటి కుటుంబరావు ఇలా అందరినీ చదివాను. మేం నలుగురం మిత్రులం కలిసి రూంలో ఉండి, వండుకుని చదువుకునేవాళ్ళం. ముగ్గురు తిని కాలేజీకి వెళితే నా కేరాఫ్ అడ్రస్ లైబ్రరీ. ఇలాచేస్తే నేను పాసవగలనా అన్న స్పృహ కూడాలేదు. ఇలాంటి సమయంలో అదే లైబ్రరీలో నాకు భగవంత్ రెడ్డి, మహబూబ్ పాషా అనే ఇద్దరు మిత్రులు పరిచయమయ్యారు. ప్రతి సంవత్సరం నెహ్రూ జయంతికి గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయి. ఆ సంవత్సరం కూడా జరిగాయి. అందులో భాగంగా కవిసమ్మేళనం కూడా జరిగింది. ఈ మాత్రం కవిత్వం నేనుకూడా రాయగలననిపించి, రాయటం సాధన చేశాను. మహబూబ్ పాషా కవిత్వం రాస్తాడు. దాంతో అతనితో స్నేహం పెరిగింది. అతను "నాకన్నా బాగా తెలిసినవాడు భగవంత్ రెడ్డని ఉన్నాడు" అని నాకు ఆయనను పరిచయం చేశాడు. ఆయన దగ్గర లైబ్రరిలో లేని పుస్తకాలు ఉన్నాయి. అందులో దిగంబర కవిత్వం, విప్లవకవిత్వం ముఖ్యమైనవి. అప్పటి సంచలనాలు అవి. వాటితోపాటు జీవనాడి, సృజన పత్రికలు పరిచయమయ్యాయి.

మాకాలేజీలో నవసాహితి అనే సంస్థ ఉంది. ఆ సంస్థ1974మార్చిలో కవిసమ్మేళనం నిర్వహిస్తే అందులో నేను పాల్గొన్నాను. ఆ సంస్థ కన్వీనర్ 74లో డిగ్రీ అయిపోయి వెళ్ళిపోతే ఆ సంవత్సరం జూలైలో ఆ సంస్థ బాధ్యతలు నాకప్పగించారు. నేను కన్వీనర్ నయ్యాను. ఆరోజుల్లో కలం స్నేహం పాపులర్‌గా ఉండేది. దాన్నే పెన్ ఫ్రెండ్షిప్ అనేవారు కదా. నాకు నిజామాబాద్ నుంచి బిరుదు రాజేశ్వర్ అనే ఆయన కలం స్నేహితుడయ్యాడు. ఆయన కూడా విప్లవ కవిత్వం గురించి చెప్పేవాడు. రాసేవాడు. విరసం గురించి చెప్పేవాడు. ఒక్కోసారి విమర్శలు, ఆరోపణలు కూడా చేస్తూ రాసేవాడు. నాకు అదంతా నచ్చటానికి, మాఇంట్లో కమ్యూనిస్ట్ పార్టీ నేపథ్యం ఉండటం కూడా ఒక కారణం.

అదే సమయంలో మినీకవిత్వం ఉద్యమంగా ఆంధ్రజ్యోతిలో వేస్తుండేవారు. నేను ఇంకో ఇద్దరు మిత్రులు కందుకూరి శ్రీరాములు, కర్నాల బాలరాజుతో కలిసి “దివిటీ” అనే పుస్తకం వేద్దామనుకున్నాం. అలావేస్తే మాది తొలి పుస్తకం అవుతుందని ఉత్సాహపడ్డాం. దానికయ్యే ఖర్చు వందో, నూటయాభయ్యో బాలరాజు పెట్టుకున్నాడు. హైదరాబాద్ వచ్చి ఆ పుస్తకాన్ని మురళీ పవర్ ప్రెస్‌లో అచ్చు వేయించాం. పైసలు సరిపోకపోతే మళ్ళీ ఇస్తామని ఒప్పించాం ప్రెస్ ఆయన్ని.. ఎవరు ఆ పుస్తకాన్ని ఆవిష్కరించాలనుకున్నప్పుడు బిరుదు రాజేశ్వర్ సలహా ఇచ్చాడు. కవి శివారెడ్డి గారితోటి ఆవిష్కరించండి.. బావుంటుందని! కవి శివారెడ్డిగారిని ఆంధ్రజ్యోతిలో కవితల ద్వారా చదివుంటిని కానీ పరిచయం లేదు. ఎట్ల కలవాలంటే రాజేశ్వరే చెప్పాడు, జాంబాగ్‌లో వివేకవర్ధని కాలేజీలో కలవొచ్చు.. ఆయన అక్కడ పనిచేస్తున్నడు అని చెప్పాడు. ఆయన్ని కలవటానికి హైదరాబాద్ వచ్చాను. ఎక్కడుండాలి.. రెడ్డి హాస్టల్ వరండాలో పడుకుంటే వాళ్ళు వెళ్ళగొడితే, అక్కడే ఉన్న రావిచెట్టు చుట్టూ ఉన్న గద్దె (చప్టా లాంటిది) నాకు ఆసరా అయింది. అప్పటికి రెండురోజులనుంచి ఏమీతినలేదు.. ఒట్టి ఛాయ్‌తో మాత్రమే కడుపు నింపటం.. పంపు నీళ్ళతో మొహం కడుక్కోవటం చేస్తున్నాను. స్నానం ఎలాగో అప్పుడప్పుడే కదా చేసేది. మొత్తానికి శివారెడ్డి సార్‌ని కలిసి విషయం చెప్పకముందే ఆయన నన్ను బాగా రిసీవ్ చేసుకున్నాడు. ఆయన అడిగిన మొదటి ప్రశ్న..“ఏమన్నా తిన్నావా” అని.. ఈయనకు ఎలా తెలుసు ఏమీతినలేదని అనుకుంటుండగానే ఆయనే అన్నాడు. “పీక్కుపోయిన నీ మొహం చూస్తేనే అర్థమవుతోంది, నువ్వేమీ తినలేదని” అని చెప్పి నన్నో హోటల్‌కు తీసికెళ్ళి కడుపునిండా తిండి పెట్టించాడు. ఛాయ్ తాగించాడు. “ఇప్పుడు చెప్పు ఎందుకొచ్చావో” అన్నాడు. నిజానికి అప్పుడు కలిగిన సంతోషాన్ని మాటల్లో చెప్పలేను. ఒక కవి మనం కలవటానికి వెళితే ఇంత ఆదరంగా చూస్తదా అని అనుకున్నాను. నేనే కాదు, దేవిప్రియ అని ఇంకో కవి ఉన్నాడు, ఆయన గూడా వస్తాడు..ఆయన సభకు అధ్యక్షత వహిస్తాడు, నేను ఆవిష్కరిస్తాను. ఇంకెవరినయినా మీరు లోకల్‌గా పిలుచుకోండి అని ఆయన చెప్పటం..అన్నట్టుగానే ఆయన, దేవిప్రియ కలిసి సిద్దిపేటలో సభకు రావటం గొప్ప జ్ఞాపకాలు నాకు ఈరోజున. నా జీవితంలో ఇంకో మలుపు.. నేను డిగ్రీ పరీక్షలు రాయలేదు. అప్పట్లో పార్ట్‌వన్ లాంగ్వేజెస్ ఉండేవి. అదయిపోయింది. సెకండ్ పార్ట్ సబ్జెక్టులు అంటే ఆప్షనల్స్.. మూడేళ్ళు లైబ్రరీలో గడిపేసినవాడు ఎగ్జాం ఏం రాస్తాడు, రాయకూడదని నిర్ణయించుకున్నాను.. అప్పుడో విచిత్రం జరిగింది. నేను డిగ్రీ ఎగ్జామ్స్ రాయనని కూచుంటే చుక్క రామయ్యగారు విషయం తెలిసి నన్ను పిలిపించారు. నామీద శ్రద్ధ చూపటానికి కారణం ఆయన నా “దివిటీ” కవిత్వం పుస్తక సభలో వక్తగా ప్రసంగించటం. (ఆయన మా సిద్ధిపేట కాలేజీలో మేథమేటిక్స్ లెక్చరర్‌గా ఉండేవారు.) ఏమిటి పరీక్షలు రాయటం లేదా అని అడిగారు. పైసలు లేవా..చెప్పు..నేను ఫీజు కడతానన్నారు. అదికాదు సర్ , నేనేమీ చదవలేదు అన్నాను. అలాకాదు..ముందు నువ్వయితే ఫీజుకట్టు. ఇద్దరు క్లవర్ స్టూడెంట్సుకు నిన్నప్పగిస్తా. వాళ్ళు నిన్ను ట్రెయిన్ చేస్తారని చెప్పేశారు. రెండేళ్ళలో చదవంది, రెండు నెలల్లో అయితదా అనుకున్నాను. రాశాను కానీ ఏమీ ప్రయోజనం లేదు. అన్నింటిలో ఫెయిల్ అయ్యాను. నన్ను ఇద్దరు క్లవర్ స్టూడెంట్సుకి అటాచ్ చేశాడని చెప్పా కదా. అందులో నాగభూషణమనేటాయన నాకో దారి చూపించాడు. ఆయన నన్ను

తెలుగు ఆప్షనల్ గా బి.ఏ.ఎక్స్టర్నల్ రాయటమొకటే మార్గమన్నాడు. తర్వాత ఎమ్మేలో చేరితే సి.నారాయణరెడ్డి గారి స్టూడెంట్‌వి అవ్వొచ్చు అన్నాడు. నాకు ఆ సమయంలో అది గొప్ప రిలీఫ్. తెలుగు, ఎకనమిక్స్, పొలిటికల్ సైన్స్ ఆప్షనల్స్‌గా మూడు సంవత్సరాల పరీక్షలు ఒకేసారి రాశాను. నిజానికి నాకది జీవన్మరణ సమస్య కాబట్టి కష్టపడ్డాను. హైయర్ సెకండ్ క్లాసులో పాసయ్యాను. జీవితంలో ఏదో జయించినంత ఆనందమేసింది. పోస్టు గ్రాడ్యుయేషన్ చేయాలంటే మళ్ళీ ఎంట్రెన్స్ పరీక్ష రాయాల్సిందే. నేను ఎమ్మే తెలుగు చేద్దామనుకున్నా కాబట్టి ఎంట్రెన్స్ దానికి రాశాను. దానికోసం పదిహేనురోజులపాటు దివాకర్ల వెంకటావధాని గారి "ఆంధ్ర వాఙ్మయ చరిత్ర", ఖండవల్లి లక్ష్మీనిరంజనం గారి "ఆంధ్రసంగ్రహచరిత్ర".. ఈ రెండూ పిండి పిండి చేసి చదివితే నాకు మూడవ ర్యాంకు వచ్చింది. నారాయణరెడ్డి గారి దగ్గర చదవబోతున్నాను, ఆర్ట్స్ కాలేజీలో సీటొచ్చిందన్న సంతోషం నాలోని చీకట్లను తీసేసి వెలుగు నింపిందనిపించింది. హైస్కూల్‌లో నా కోరిక రాజకీయనాయకుడు కావటం అన్నదని చెప్పాను కదా. మొన్నటిదాకా మా తెలుగుసారు అడిగేవాడు, నువ్వేమనుకున్నావు..ఏమయినవు అని.(ఈమధ్యనే ఆయన పోయారు).. కవినవ్వాలని అనిపించిన దగ్గరనుంచి రాజకీయాలు మనతోటి కాదనిపించింది. కవిత్వం విలువ తెలిసినకొద్దీ, రాజకీయాలపట్ల ఆసక్తి తగ్గిపోయింది. ఎమ్మేలో చేరిన తర్వాత మధ్యాహ్నం దాకా క్లాసులు వినటం.. సాయంత్రం కాగానే కవులను కలవటం. ఇదే నా దినచర్య అయిపోయింది.. వి.వి. (వివేక వర్ధిని) కాలేజ్‌కు పోతే శివారెడ్డి ఉంటారు..అసెంబ్లీకి పోతే నగ్నమునితో మాట్లాడవచ్చు.. ఆఖరికి శేషేంద్రశర్మను కూడా వదల్లేదు. జ్ఞానబాగ్ పోతే ఆయన కలిసేవాడు. మరొచోట అరిపిరాల విశ్వం కలిసేవాడు. ఒక కవి కవిత్వం బాగా రాస్తాడు అనుకుంటే ఆ కవిని ఖచ్చితంగా కలిసేవాడిని. ఒక్క దాశరథి గారినే తక్కువ కలిసేవాడిని. ఎందుకు తక్కువగా అంటే, నారాయణరెడ్డి గారికి కోపమొస్తుందేమోనన్న భయం. ఇది నా జీవితంలో రెండవ టర్నింగ్ పాయింట్.. ఇక్కడకొచ్చినంక (ఉస్మానియా యూనివర్సిటీ) అన్ని దారులు నాకోసమే తెరుచుకున్నాయా అన్నంతగా అనిపించేది. చెప్పాను కదా.. నాకు రాజకీయమో ఆకర్షణ. అందులోంచి బయటపడ్డాను. విప్లవకవిత్వం ఒక ఆకర్షణ. అందులోంచి బయటపడ్డాను. ఛందస్సుతో రాసే పద్యంలోంచి బయటపడ్డాను. సినిమా పాటలోంచి కూడా బయటపడ్డాను. వీటన్నిటిలోంచి బయటపడి కవిత్వంలో స్థిరపడ్డాను. కొంత కథలు కూడా అనుకోవచ్చు అలా సాహిత్యం నన్ను దగ్గరతీసింది.. నన్నో స్థాయికి చేర్చేది కూడా ఈ కవిత్వమే..ఈ సాహిత్యమే అని అర్థమయింది.

**మిసిమి :** **మీ పరిశోధన గురించి చెప్పండి?**

**సిధారెడ్డి :** తెలుగు కవిత్వంలో సూర్యుడు అనే అంశంపై ఎమ్.ఫిల్ చేశాను. ఇక్కడ కవిత్వమంటే పద్యము, శ్లోకము, వచనము దేంట్లో అయినా ఫరవాలేదు అని నా ఉద్దేశ్యం... సూర్యునికి సంబంధించిన ఆరాధన.. జర్మన్లు, ఇరానీయులు వీళ్ళంతా సూర్యుడిని ఎలా ఆరాధించారో.. అంటే ప్రధానంగా అతిప్రాచీన సంస్కృతుల్లో సూర్యారాధన ఎలాఉండేదో పరిశీలించాను. మనదగ్గర వేదకాలంలో సూర్యుడిని ఎలా ఆరాధించారో కూడా గమనించాను.. నారాయణరెడ్డిగారి దగ్గరకు ఒక ఐదు శీర్షికలతో వెళితే దీనిని (ఈ శీర్షికను) ఆయన ఓకే చేశారు.. అప్పటికి సూర్యుడిపై రెండు మూడు వ్యాసాలు రాసి ఉన్నాను. "ఆదికాలంలో సూర్యుడు దేవత–ఆధునిక కాలంలో సూర్యుడు విప్లవవాది" వంటి శీర్షికలతో రాశాను. ఇద్దరు కవితా సూర్యుళ్ళు.. ఒకరు శేషేంద్రశర్మ మండే సూర్యుడు ఇంకొకరు శివారెడ్డి రక్తపు సూర్యుడు.. ఈ రెండు పుస్తకాలను పోల్చుతూ ఒక వ్యాసం భారతికి రాసి పంపాను. ఆ వ్యాసం భారతిలో "ఇద్దరు కవితా సూర్యుళ్ళు" అనే పేరుతో అచ్చయింది. అదే పి.హెచ్ డి వచ్చేసరికి "ఆధునిక తెలుగు కవిత్వం–వాస్తవికత అధివాస్తవికత" అనే అంశం ఎంచుకున్నాను. నిజానికి నేనెంచుకున్న అంశానికి అధివాస్తకత మా గురువు నారాయణరెడ్డి గారు చేర్చారు ప్రాసకోసం. .ప్రాసకోసం చేర్చినా కేవలం వాస్తవికత అన్నది చిన్న టాపిక్ అవుతుందని ఆయన భావించి అధివాస్తవికతను చేర్చారు.. నా థీసిస్‌లో నేను అధివాస్తవికతను

కవిత్వం చేసుకుని రాసిన శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు, అజంతా, వేగుంట మోహన్ ప్రసాద్‌ల కవిత్వాన్ని పరిశీలించాను.. "ఆటవెలది ద్విపదకు అత్తగారు" అని శ్రీశ్రీ రాసినా అది consciousగా రాసిందే కానీ unconsciousగా రాసింది కాదు. అది సర్రియలిస్ట్ ధోరణిలో రాసింది కాదని పేర్కొన్నాను. శ్రీశ్రీ కంటే కొంచెం మేలైన పద్ధతిలో సర్రియలిస్టిక్ కవిత్వం రాసింది నారాయణబాబు. కానీ నిజమైన సర్రియలిస్టిక్ కవి మోహనప్రసాద్. అజంతాలో కూడా సర్రియలిస్టిక్ ధోరణి ఉంది కానీ చాలా సందర్భాలలో conscious poems రాశాడని చెప్పాను. నేను కవులు వాస్తవికత, అధివాస్తవికత అంశాలపై కవిత్వాన్ని విడివిడిగా రాశారనే చెప్పాను. రెంటి మధ్య సంబంధం ఉందని చెప్పలేదు.

**మిసిమి : మీరు ఉద్యోగంలో ఎప్పుడు చేరారు?**

**సిధారెడ్డి :** నేను ఉద్యోగం వచ్చేదాకా పి.హెచ్.డి. పూర్తిచేయకూడదని నిశ్చయించుకున్నాను. కారణమేమీలేదు.. నా హాస్టల్ రూం ఖాళీ చేయాల్సి వస్తుంది. రూం ఉంటేనే కదా, నిత్యం సాహిత్యకారులను కలవగలిగేది. నేను 1984లో సర్వీస్ కమీషన్ పరీక్ష రాస్తే, అప్పుడు ఎన్టీరామారావు పుణ్యాన.. రూపాయి ఖర్చుపెట్టకుండా ఎలాంటి లంచాలు ఇవ్వకుండా లెక్చరర్ ఉద్యోగం సంపాదించుకోగలిగాను. ఎందుకంటే ఆయన అప్పుడే అధికారంలోకి వచ్చాడు. ఎక్కడా అవినీతి లేదన్నాడు. దానికి కట్టుబడి ఉన్నాడు. ఆ అవినీతిలేని రోజుల్లో 1984వ సంవత్సరం ఫిబ్రవరి ఇరవై ఎనిమిదవ తేదీన నేను మెదక్‌లో డిగ్రీ కాలేజీలో చేరాను. ఉద్యోగంలో చేరకముందు నేను ఎనిమిది సంవత్సరాలు హైదరాబాద్‌లో ఉన్నాను.. అది ఎలా అంటే 1976లో నేను ఎమ్మేలో చేరాను. అక్కడినుండి ఎనిమిదేళ్ళు హాస్టల్లో ఉన్నాను. తిండిలేకపోయినా ఫర్వాలేదు. హాస్టల్ సీటులేకపోతే కష్టం. నా పరిశోధనకు ఫెలోషిప్ మొదట్లో లేదు. రచయిత్రి సి.మృణాళిని నా క్లాస్మేట్. ఆవిడకి ఒక్కదానికే ఫెలో షిప్ వచ్చింది. ఆవిడకే ఎందుకొచ్చిందంటే ఆరోజుల్లో ఒకటే ఫెలోషిప్ ఉండేది. దానికి టెస్ట్ రాయాలి. నాకు ఆ టెస్ట్ ఉందని కూడా తెలీదు. ఆవిడ ఆ టెస్ట్ రాసి తెచ్చుకుంది. మరి నేను నా పరిశోధనా కాలాన్ని ఎలా మేనేజ్ చేశానని మీరు అడగొచ్చు. ఒక సంవత్సరం కథలు రాస్తే డబ్బులొచ్చాయి. అదెలాగో చెబుతాను.. ఒకసారి ఆంధ్రసచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీ నిర్వహించింది. మొదట న్యాయనిర్ణేతలు ఎంపికచేసిన ఆరుకథలు పబ్లిష్ చేశారు (కథ మీద రచయిత పేరుండదు).. ఆ తర్వాత బ్యాలెట్ ద్వారా పాఠకుల చేత ఏ కథ బావుందో నిర్ణయించారు. అలా నా కథ ఆ సంవత్సరం మూడో స్థానంలో నిలిచింది. రచయిత పేరు చెప్పకుండా బ్యాలెట్ నిర్వహించేవారు. అదే సంక్రాంతికి బ్యాలెట్ కథల పోటీ పెట్టారు. అంటే పాఠకులే కథల ఎంపిక నిర్ణయిస్తారు. మొదట ఆ ఆరు కథలకు ప్రైజ్ మనీగా ఒక్కో కథకు ఆరువందలిచ్చారు. మళ్ళీ బ్యాలెట్ ఆధారంగా జరిగిన ఎంపికకు అదనంగా ప్రైజ్ మనీ ఇచ్చారు. అప్పుడు నా మెస్ బిల్లు నూట పాతిక రూపాయలు. నాకు కథల ద్వారా వచ్చిన డబ్బు సరిపోయేది. అలా ఓ ఆర్నెల్లు నా మెస్ బిల్లు కట్టేవాడిని. ఇదేకాకుండా నా పరిస్థితి గమనించి నారాయణరెడ్డి గారు నాకు నెలకు రెండువందల రూపాయల ఉపకార వేతనం (స్కాలర్షిప్) ఇప్పించారు.. అది నా మిగిలిన పరిశోధనా కాలానికి సరిపోయింది. నాకు 1979లో వివాహమయింది. మా మామగారు పెళ్ళి కాకముందు సంవత్సరం పాటు ఆయన పోషించారు. ఉద్యోగం వచ్చేవరకు చూసుకుంటానన్నాడు కానీ మాట నిలుపుకోలేదు.. ఇక నా పి.హెచ్.డి.విషయానికి వస్తే, నేను ఉద్యోగంలో చేరేనాటికి నా పి.హెచ్.డి. పూర్తికాలేదు.. అన్నీ సిద్ధంగా ఉంచుకున్నాను. నోట్సు దగ్గరనుంచి మెటీరియల్ వరకూ అన్నీ సమకూరాయి. ఒక ఆర్నెల్లు స్తిమితంగా కూచుని రాయటమే మిగిలింది..


*(మిగిలిన భాగం వచ్చే సంచికలో)*

**సంభాషణ : అశ్వినీకుమార్**

ధ్వని ముద్రణకు రాత ప్రతి : ***సి.ఎస్. రాంబాబు (అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)***

## కరోనా ఉపద్రవంలోంచి పుట్టిన కావ్యం-అనిమేష

**2020**వ సంవత్సరం ఎవరమూ మర్చిపోలేని సంవత్సరంగా మిగిలిపోయింది. కలలను కూల్చేసింది. కనపడని యుద్ధం మానవసమాజాన్ని ఆందోళన అంచుపై నిలబెట్టింది. మనిషి స్వార్థాన్ని, భయాన్ని నిస్సిగ్గుగా బయటపెట్టింది. అంతరాల అరలను దాచుకున్న మనిషి రంగు బయటపడింది. అభివృద్ధి, టెక్నాలజీ జమిలిగా మనిషికో ఊతాన్నిచ్చాయి. తనను మించినవాడు లేడని తలెగరేసే మనిషికో లక్ష్మణరేఖను గీసింది ప్రకృతి. గాయం చేసే మనిషికి గాయం రుచిని చూపింది. అదేమిటో అందరికీ తెలిసిందే. కరోనా వైరస్ మనిషిని, ప్రపంచాన్ని కుదిపేసింది. కట్టడిచేసింది. విలవిలలాడుతూ మనిషి ధైర్యం కోల్పోయాడు. అలాటి సందర్భాన్ని మనముందుంచారు కవి సిధారెడ్డి. దృశ్యాలను దుఃఖాన్ని మూటగట్టి మనకందించారు. నిద్రించిన మానవత్వాన్ని నిద్రలేపారు. అదే వారి **అనిమేష**-ఉపద్రవగాథ కావ్యంగా మనకందించారు.. నిజం చెప్పాలంటే కోరలు చాచిన కొరోనా కబళిస్తుంటే సాంత్వన కల్పించినవారు కవులు. **అనిమేష** ప్రత్యేకత ఏమిటంటే మనిషి అంతరంగాన్ని జల్లెడపడుతుంది. కాలానికి మనిషికి, ప్రకృతికి మనిషికి ఉన్న బతుకు-బతుకించు సూత్రాన్ని మరోమారు గుర్తుచేస్తుంది. గతి తప్పిన మనిషికి, గమ్యంలేని మనిషికి ప్రాకృతిక బంధాన్ని గుర్తుచేస్తుంది. రెప్పవాల్చని కాలం ఉపేక్షించదు మిత్రమా అని దృష్టాంతాలను బోధిస్తూనే మనిషిలోని డొల్లతనాన్ని, దోపిడితనాన్ని పట్టుకుంటుంది. కవి బాధ్యతను ప్రకటిస్తుంది.





"ఊహించని అనుభవం.. చిత్రమైన అనుభవం. ప్రపంచమంతా తల్లడిల్లడం. మహామహా సామ్రాజ్యాలు, కలల ప్రపంచాలు, నిర్మాణాలు, విధానాలు విశ్వాసాలు సడలిపోవటం ఆశ్చర్యం కాదా...ఎనిమిది నెలలు గడిచినా తేరుకోని ఆశ్చర్యం.. ఎన్ని దుఃఖాలో, ఎన్నెన్ని భయాలో అనుమానాలో, ఆలోచనలో కదుపుతుంటే వాక్యాల్లోకి వొంపుదామనిపించింది" అంటారు సిధారెడ్డి తన ముందుమాటలో. అలా 2020 ఏప్రిల్ 5-మే 4వ తేదీల మధ్య ఈకవి తనలోంచి పెళ్ళగించిన భావవేశపు గురుతులు. దీనిని కావ్యం అన్నారు కవి, ఎందుకని అని పరిశీలిస్తే అనేక కోణాలు కవి పొందుపరచటం గమనిస్తాం. వైరస్ మనిషిని ఎలా ఉపద్రవమై చుట్టుముట్టింది.. మనిషిని మానసికంగా, శారీరకంగా ఏ విధంగా కుంగదీసింది అన్న అంశాలే కాదు.. మానవ మనస్తత్వాన్ని కవి కాచివడపోసిన తీరూ ఆశ్చర్యపరుస్తుంది. కాలం, మనిషి, ప్రకృతిల మధ్య సమన్వయం కొరవడటం ఇటువంటి విపరీత పరిణామాలకు దారి తీస్తుందన్న అభివ్యక్తి కనబరుస్తారు కవి. లయాత్మకంగా సాగే శైలితో, భావం స్పష్టంగా పఠితను చేరుతుంది. తాత్విక పరిమళం, గాఢత, లోతైన దృష్టితో **అనిమేష** ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. ఆధునికత సంతరించుకుంటున్న కొద్దీ మానవ జీవితం సంక్షోభంలో కూరుకుపోతోందని వాపోతాం. అటువంటి సంక్షుభిత సమయాలను విశ్లేషించటంలోనే కవి మార్గం ప్రకటితమవుతుంది. ఈ కావ్యంలోని పందొమ్మిది అధ్యాయాలు పరిశీలిస్తే అపరిచితగాథతో మొదలైన కవి ప్రయాణం చివరకు సఫలగాథతో ముగుస్తుంది. ప్రకృతి, మనిషిల మధ్య ఏర్పడిన సంవాదం సంవేదనలకు దారితీయటం అవాంఛనీయ పరిణామమే కానీ మనిషి తన బాధ్యతను మరచి నియంతగా మారుతున్న కొద్దీ సంఘజీవిగా నియంత్రణ కోల్పోతున్నాడని గుర్తిస్తున్నాడా. ఇది కవి సిధారెడ్డి మనకు వేసిన ప్రశ్న. ఇప్పుడంతా కొత్త భాష, కొత్త బాధ, కొత్త సంకెళ్ళకాలం. ఒంటరిగా మనిషి గోడలు కట్టడం నేర్చుకుంటూ ఒంటరి యుద్ధం చేస్తున్నాడు. క్వారంటైన్ పాటించి తనను తాను కాపాడుకుంటూ సమాజానికి ఊరటనిస్తున్న అరుదైన సమయంలో ఉన్నాడు. మనిషి ప్రయత్నమంతా గొలుసు తెంపటమే కదా. గాలి వైరస్‌ను త్యజించింది/ వైరస్‌కు గాలి ఊపిరి పొయ్యలేదు  అని కవి గుర్తుచేస్తున్నాడు. గాలికి మొక్కుదామంటాడు.. కొరోనా వైరస్ వ్యాప్తిపై రకరకాల ప్రచారాలు సాగాయి. కవి ఇలాంటి ధోరణిని నిర్ద్వంద్వంగా ఖండిస్తాడు. ఏ ఒంట్లో వైరస్ దాగివచ్చిందో ఎయిర్ పోర్ట్ గుర్తించలేకపోయిందని వ్యంగ్యంగా వ్యక్తీకరిస్తాడు. లాక్డౌన్ వైరస్ విస్తరణకు బ్రేక్ వేసినా అది సృష్టించిన సమస్య వలసకూలీల యాతన. ఉపాధిలేక సొంతూరికి నడకబాట పట్టిన కూలీల గోస అందరినీ కదిలించింది. మైలురాళ్ళు కన్నీటితో కరిగిపోయాయి. గమ్యం చేరని ఎన్నో బతుకులు చితిమంటలయ్యాయి. వలసగాథ అధ్యాయంలో కవి ఆవేదన అర్థం చేసుకోదగ్గదే.

మనిషికి పోరాటాలు కొత్తవి కావు. వైరస్‌తో వైరం కొత్తది కాదు. గాయం చేసిన కాలమే ఆ గాయానికి మందు పూతపూస్తుందన్న ఆశను ఆవిష్కరిస్తుంది **అనిమేష** .. ఆశను వీడక అలసట వీడక నడక సాగించాల్సిందే. వైరస్‌పై పోరును కొనసాగించాల్సిందే అన్న ఆలోచనతో పాటు తనను తాను తెలుసుకునే ప్రయత్నమే అంతిమంగా మనిషికి అండగా నిలుస్తుందన్న కవి సిధారెడ్డి గారి **అనిమేష** మనిషికి ఓదార్పు.. అలసిన హృదయపు బాధలనార్పు..

**- సి.ఎస్.**

# జీవన మకరందం



## వయసును జయించటానికి..

- నీలోని బాలుణ్ణి సజీవంగా ఉంచు.. అతడే నిన్ను నవనవోన్మేషంగా ఉంచగలడు.
- నిత్యమూ నేర్చుకోవటం మానకు. ప్రపంచంలో మనకు తెలిసింది చాలా తక్కువ. తెలుసుకోవలసింది ఎంతో ఉంది..
- వర్తమానంలో జీవించు. గతాన్ని తవ్వుకుంటూ ఆ గోతిలో ఉండిపోకు. రాబోయే విపత్తులను ఊహిస్తూ నిరాశ చెందకు. ఈరోజు – ఈ గంట – ఈ క్షణం ఇదే జీవితం.
- నిత్య ధ్యానంలో ఉండటం తేలికే.. పరధ్యానం నిన్ను ప్రమాదంలో పడవేస్తుంది.
- హాస్య చతురతలో చైతన్యం ఉంటుంది. నవ్వటం తప్పు కాదు.. నవ్వించటం పుణ్యం కూడా..
- కొత్త ప్రదేశాలు దర్శించు.. అవి నిన్ను ఆశ్చర్యంలో ఉంచుతాయి..
- ఉరుకులు పరుగులు – ఆయాసం తప్ప ఏమీ సాధించలేవు



- నీకిష్టమైన పని చేస్తుండు. అది కుదరకపోతే, చేస్తున్న పనిని ఇష్టంగా చెయ్యి. జీవితం పండుగే.
- నీ వయస్సు నీ భావావేశంతో ముడిపడి ఉంటుంది.. ఆ ప్రవాహంలో కొట్టుకు పోకు. ప్రేమించటం, అభిమానించటం తప్పుకాదు. అందులో మునిగిపోవటం నిన్ను నువ్వు పోగొట్టుకోవటమే.
- జీవితంలో ఎన్నో వస్తుంటాయి – అవసరమైనవే స్వీకరించు. వదిలేయటం అలవాటు చేసుకో... బరువు శరీరాన్ని క్రుంగతీస్తుంది.
- మరొకరితో పోల్చుకోవద్దు. మరొకరిలా జీవించాలని కోరుకోవద్దు. నీవు నీలాగా, నీ జీవితాన్ని సాగించు... కొంచెం కష్టమైనా.. అప్పుడే నీ వయసు, నీ మనసు కూడా ఒకే తరంగంలో ఉంటాయి.
- సంగీతం వింటూ ఉండు. నీకిష్టమైనదే. దుర్వార్తలకు దూరంగా ఉండు. నెగిటివిటీ, మృత్యువార్తలు నీ వయసును హరిస్తాయి.
- నీకు స్నేహితులు ఉంటారు కదా! మంచివాళ్ళతోనే స్నేహం చెయ్యి. వాళ్ళు నిన్ను నిత్య యౌవనునిగా నిలబెడతారు – నవ్వుతూ తుళ్ళుతూ..
- అప్పుడప్పుడు మధువు సేవిస్తూ ఉండు.. మిత్రులతోనే... అది ఒకరకంగా స్పిరుట్యువల్ లెవెలే (ఆధ్యాత్మిక పరిధి!)
- ఒకటి గుర్తుంచుకో.. నీవు కావాలని ఇక్కడకు రాలేదు. అలాగే కావాలన్నా ఇక్కడ ఉండిపోలేవు.. నీవు ఒక యాత్రికుడివి. అనుభవాలను పోగుచేసుకుని ఆనందంగా గడపటం ఒక కళ. ఏ కళ సాధన అయినా నిన్ను నిత్య నూతనంగా ఉంచుతుంది.

## ఖడ్గ ఝుంకారాలలో పరిమళించిన ప్రేమ సౌరభం

# రాజసింహ

– ఆచార్య వై. పార్థసారథి

**ఓ వీర శిరోమణీ**
**యుద్ధంలో కన్యలను గెలుచుకుని వరించడం**
**వీరులకు సముచిత ధర్మమే**
**సభా సమక్షంలో భీష్ముడు తన పరాక్రమంతో**
**రాజకుమార్తెలను తీసుకుపోలేదా!**
**రుక్మిణీదేవి వివాహకథ మీకు స్మరణలో లేదా!**
**వీరత్వమే మీ కిరీటం**
**ధర్మమే మీ ఖడ్గం**

అంటూ రాజకుమారి చంచల పంపిన ప్రేమ పత్రం రణరంగంలో గర్జించిన రాజసింహుని ధీరత్వం – చంచల కుమారి సౌందర్యం ముందు మృదువైన వీణగా మారింది.

ఆమె కన్నులలో మెరిసిన లజ్జ,
మాటలలో తొణికిసలాడిన ప్రేమ

హృదయంలో దాగిన ధైర్యం – ఇవన్నీ అతని మనసును బంధించాయి. ఖడ్గాల ఝుంకారంలో మొదలై, యుద్ధపు దూళిలో పుట్టిన ఆ గాథ రెండు హృదయాల కలయికగా మాత్రమే గాక, దేశానికి మార్గనిర్దేశనం చేసింది.

రాజసింహ నవల బంకించంద్ర రచనలలో ఒక ప్రత్యేక ప్రాధాన్యత కల రాజకీయ, చారిత్రక నవలగా మాత్రమే గాక భారతీయ జాతీయవాదానికి, బెంగాలి సాహిత్య అభివృద్ధికి తోడ్పడిన సాహిత్య కృతి. చారిత్రక నేపథ్యంలో కొనసాగే ఈ పుస్తక కథా ప్రవాహం, ఆద్యంతం ఏమాత్రం ఆసక్తిని తగ్గించకుండా చదువరులను కట్టిపడవేసే అమర కావ్యం.

* * * *

రాజసింహ నవల చారిత్రక సంఘటనలకు కొన్ని కల్పిత పాత్రలతో మేళవించి, ఆకర్షణీయమైన కథనంగా నిర్మించి – బంకించంద్ర దేశభక్తి, ధైర్యం, మతపర నిబద్ధత, అణచివేతకు వ్యతిరేకత వంటి అంశాలను మనోరంజకంగా చిత్రించారు. నవల పాఠకులను నిజంగా యుద్ధభూమిలో తిరుగాడినట్లు చేసే యుద్ధవర్ణన ఉత్కంఠ భరితం.

బంకించంద్ర కథనంలో ఒక మనోహరత్వాన్ని చిత్రించాడు. చంచల ఒక యువతి. ఆమెను కోరుకున్నవాడు ఔరంగజేబు. ఆమె కోరుకున్నవాడు రాజసింహుడు. ఒక స్త్రీ – ఇద్దరు పురుషులు. ముబారక్ ఒక పురుషుడు. ముబారక్‌ను కోరుకున్న స్త్రీ దరియా బీబీ. ముబారక్ కోరుకున్న స్త్రీ జేబున్నీసా. ఇక్కడ ఒక పురుషుడు – ఇద్దరు స్త్రీలు. ఇలా రెండు పార్శ్వాల్లో కథను నిపుణంగా నడిపించడం బంకించంద్రలోని సృజనాత్మకతకు అద్దం పడుతుంది.


ఔరంగజేబు కేవలం ద్వేషించదగిన మొఘల్ చక్రవర్తిగా మాత్రమే గాక, ప్రేమకోసం తపించే మానవుడిగా కూడా కనిపిస్తాడు. బంకిం తన ఊహాశక్తితో ఒక చారిత్రక వ్యక్తికి జీవం నింపుతాడు. ఔరంగజేబు, ఆయన కుమార్తె జేబున్నీసా ఇద్దరూ రాగద్వేషాలు కలిగిన మానవమూర్తులుగా కనిపిస్తారు. కాముకత, అహంకారం మూర్తీభవించిన జేబున్నీసా, రాజసింహుని చేతిలో ఓడిపోయాడని, తన ప్రియుడు ముబారక్‌ను పాములతో కరిపించి, చంపించి, తిరిగి తాను హంతకినని భావించి దుఃఖిస్తుంది.

* * * *

ఈ నవల పదిహేడవ శతాబ్దంలో చోటుచేసుకున్న చారిత్రక ఘటనల ఆధారం. ఆ కాలం అంతా రాజకీయ అస్థిరతలు, మొఘల్ సామ్రాజ్య విస్తరణ, ప్రాంతీయ ఘర్షణలతో నిండి ఉంది. రాజపుత్రులలో కొందరు మొఘల్ సామ్రాజ్యానికి సామంతులు కాగా, మరికొందరు

గెరిల్లా యుద్ధతంత్రంతో మొఘలులను చీకాకు పెట్టేవారు. అలాంటి వారిలో మేవాడ్ పాలకుడు మహారాణా రాజ్‌సింగ్ (నవలలో రాజసింహగా పిలువబడ్డాడు). ఔరంగజేబు విధానాలను, మొఘల్ ఆధిపత్యాన్ని ప్రతిఘటించి, రాజపుత్రుల స్వయం ప్రతిపత్తి కోసం పోరాడిన శక్తివంతుడు. అందువల్ల బంకించంద్ర ఊహాశక్తికి ఆదర్శవంతమైన వ్యక్తిగా నిలచాడు.

బంకిం కాలంలో బ్రిటీష్ వలనవాదానికి వ్యతిరేకంగా, భారతీయ మేధావులు జాతీయ గౌరవం, ప్రతిఘటనలకు తోడ్పడే స్థానిక వీరత్వ చిహ్నాల కోసం అన్వేషిస్తున్నారు. స్థానిక పాలకులు సామ్రాజ్యవాదాన్ని సవాలు చేసిన కాలాన్ని, కథలను పునర్నిర్మించుకోవడం ద్వారా, బంకిం సమకాలీన పాఠకులకు ప్రేరణ ఇవ్వాలని ప్రయత్నించాడు. గత చరిత్రను పునర్నిర్మించడం, ఆనాటి చరిత్రకారుల రచనల్లో జాతీయవాదాన్ని ఉత్తేజపరచే లక్ష్యంగా మారింది. నవల కథాకాలం, పాత్రలు, కథనం అంతా మొఘల్ కాలంలో జరిగినప్పటికీ, అనేకమంది పండితులు, విమర్శకులు ఇందులోని సామ్రాజ్యవాద వ్యతిరేక భావాలను – బ్రిటీష్ వలసపాలనపై పరోక్ష విమర్శగా గుర్తించడంతో, ఈ నవల చారిత్రక నేపథ్యంతో, సాహిత్య పరంగా, రాజకీయంగా విస్తృత ప్రజాదరణకు నోచుకుంది.



స్కాటిష్ చరిత్రను వర్ణించిన వాల్టర్ స్కాట్‌లాగా, బంకించంద్ర కూడా పాఠకులలో దేశభక్తిని రగిలించడానికి మరచిపోయిన గతాన్ని పరిచయం చేశాడు. స్కాట్ సిద్ధాంతాలకు భిన్నంగా బంకిం, తన నవలలో చిన్న చిన్న పాత్రలకు కూడా అత్యంత ప్రాధాన్యం కల్పించాడు.

చరిత్ర ఘటనలు సాధారణ ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తాయని చెప్పిన జార్జ్ లూకాస్ భావనలకు కూడా బంకిం రచన దగ్గరగా వుంటుంది. చరిత్రకారుడి పరిమితులను దాటి, బంకించంద్ర వాస్తవాలకు కాల్పనిక పాత్రలను మిళితం చేసి ఒక సమగ్ర సాహిత్యాన్ని సృష్టించాడు.

రాజసింహ మేవాఢ్ రాజ్యానికి 1652లో రాజ్యాధికారం తన తండ్రి నుండి చేపట్టి, 1680లో మరణించేంత వరకు పాలించాడు. ఔరంగజేబును ఓడించిన రాజపుత్రుడిగా చరిత్రలో నిలచిన వీరుడు. ఔరంగజేబు రాజసింహాతో సంధి చేసుకుని, రాజపుత్ర ప్రాంతాలలో జిజియాపన్ను ఉపసంహరించుకుంటాడు.

జదునాథ్ సర్కార్ రచనల ప్రకారం, బంకించంద్ర ప్రధానంగా జేమ్స్‌టాడ్ రచించిన – అన్నాల్స్ అండ్ ఆంటిక్విటైస్ ఆఫ్ రాజస్థాన్, బెర్నియర్ రచనలను చారిత్రక సమాచార మూలాలుగా ఉపయోగించుకున్నాడు. చరిత్రకారులు తదనంతర కాలంలో కొన్ని చారిత్రక బేధాలను గుర్తించినప్పటికి, ప్రధాన పాత్రల చిత్రణలో బంకిం వాస్తవాలకు అతి దగ్గరగానే ఈ రచన చేశాడని అంగీకరించారు.

బంకిం చారిత్రిక గతాన్ని సౌందర్యంతో మేళవించి, అద్భుత ప్రేమకథగా రూపిందించాడని సుకుమార్ సేన్ ప్రశంసించగా, సాంస్కృతిక పునరుజ్జీవనానికి, దేశభక్తి చైతన్యానికి సాధనంగా తీర్చిదిద్దాడని అమియ పి. సేన్ కొనియాడాడు. యూరోపియన్ తర్కం, జాతీయుతా భావనలను స్వీకరించి, ఆ నేపథ్యంలో ఉద్భవించిన అనుసృత జాతీయవాద (డైరివేటివ్ నేషనలిజమ్) నవలగా పార్థ ఛటర్జీ వ్యాఖ్యానించాడు.

* * * *

బంకించంద్ర అస్తమయానికి ముందు 1892లో ఈ నవల ప్రచురింపబడింది. అంతిమకాలం సమీపించినప్పటికి, ఆయనలోని కళాత్మక దృష్టి, భావుకత ఏమాత్రం తగ్గలేదనడానికి ఈ నవల నిదర్శనం. 1877లో వంగదర్శన్‌లో మొదట ఒక కథగా ప్రచురింపబడి, దానిని మరింతగా విపులీకరించి ఒక నవలగా రూపాంతరం చేశారు. దుర్గేశ్ నందిని, సీతారాం, మృణాళినిలతో పోలిస్తే, రాజసింహలో చారిత్రకత కంటే బలపరాక్రమాలు, శక్తి సామర్థ్యాలు, రాజకీయ కుట్రలు, ఎత్తుగడలు కలగలసిన

కథానాయకుడి కోసం బంకిం చేసిన అన్వేషణే రాజసింహ నవల.

పెద్ద పెద్ద ఉద్యమాలు, ప్రబల శత్రుత్వాలు ఒకోసారి అతిచిన్న కారణాల వలన తలెత్తుతాయనడానికి నిదర్శనం రాజసింహ కథ. రూప్‌నగరంలోని రాజాంతఃపురంలో జరిగిన చిన్న ఆకతాయి సంఘటన నవల పురోగతికి ప్రేరణగా మొదలవుతుంది. ప్రజలలో రగులుతున్న అసంతృప్తి జ్వాలలు బయటపడడానికి ఏదో ఒక చిన్న సంఘటన అయినా దావానలంలా ఎగసి పడుతుందనే విషయాన్ని సౌందర్యభరితంగా, కళాత్మకంగా ఈ నవల తెలుపుతుంది.

బంకించంద్ర నవల కథనంలో కొన్ని గంభీర వ్యాఖ్యలు చేస్తాడు.

ప్రేమ అనేది ఇద్దరు మనుష్యుల మధ్య కలుగుతుంది. కాని ఒక చిత్రాన్ని చూసి ప్రేమపుట్టగలదా! బహుశా ఆ చిత్రం వెనుక ఉన్న వ్యక్తిత్వాన్ని మనసు ఊహించి వుండవచ్చు. కలలలో ఆ రూపానికి ప్రాణం పోసి వుండవచ్చు. నాయికకు అదే జరిగి వుంటుందేమో! పద్దెనిమిదేళ్ళ యువతి మనసులో కలిగే ఈ సున్నిత భావాన్ని అర్థం చేసుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. ఈ రగిలిన ప్రేమాగ్ని భవిష్యత్తులో ఎన్నో ప్రమాదాలకు, సంఘర్షణలకు దారితీస్తుందా! ఆ ప్రమాదాల కథ ఇప్పుడు ప్రారంభమైంది.

**రాజసింహ**

**చిత్రం తెచ్చిన ముప్పు**

రాజస్థాన్ పర్వత ప్రాంతాలలో రూప్‌నగర్ అనే చిన్న రాజ్యం ఉండేది. ఆ రాజ్య అంతఃపురంలో ఉన్న గదిలో పదిహేనుమంది యువతులు కూర్చుని నవ్వులు, సరదాలతో కాలక్షేపం చేస్తున్నారు. ఆ సమయంలో ఒక వృద్ధురాలు ఏనుగు దంతంతో చెక్కిన అందమైన చిత్ర పటాలను అమ్మడానికి వచ్చింది. ఆమె తెచ్చిన చిత్రపటాలను చూసిన యువతులు ఒక్కోచిత్రంలోని వ్యక్తుల గురించి అడుగుతూ ఆమెను ఆటపట్టిస్తున్నారు. అప్పుడే అక్కడకు ప్రవేశించిన రాజకుమారి చంచల కుమారి సౌందర్యానికి ముగ్ధురాలై తాను తెచ్చిన మరిన్ని చిత్రాలైన, అక్బర్, జహంగీర్, షాజహాన్, నూర్జహాన్, నూర్‌మహల్ చిత్రాలన్నింటిని చూపించింది. రాజకుమారి కోరికమేరకు, రాజపుత్రులైన మాన్‌సింగ్, బీర్బల్, జయసింహ వంటి చిత్రాలను చూపిస్తే – వీరంతా మొగలుల బానిసలు అంటూ రాజకుమారి అయిష్టత వ్యక్తం చేసింది. రాణాప్రతాప్, అమర్‌సింగ్, కర్ణసింగ్ వంటి మొగలులపై పోరాటం చేసిన యోధుల చిత్రపటాలను రాజకుమారి కొనుగోలు చేసింది.

చూపించకుండా లోపల దాచిపెడుతున్న మరో చిత్రాన్ని చూసిన రాజకుమారి, ముసలామెను గద్దించి, బలవంతంగా తీసుకుంది. అది రాజా రాజసింహుడి చిత్రం. దానిని తదేకంగా చాలాసేపు చూసిన రాకుమారి – వీరపురుషులెవరూ స్త్రీలకు శత్రువులు కాదు అంటూ, ఆ చిత్రాన్ని అధికమొత్తం చెల్లించి తీసుకుంది. ఇది మరో వీరయోధుడి చిత్రం అంటూ ముసలి విక్రేత – ఈ చిత్రం ప్రపంచవీరుడు పాదుషా ఆలంగీర్ (ఔరంగజేబు)ది అని చూపించింది. దీనిని తప్పక కొంటాను అని మూల్యం చెల్లించి రాకుమారి ఆ చిత్రాన్ని తీసుకుని, తన చెలికత్తెలతో తమాషా ఆట ఆడుకుందాం రండి అంటూ పిలచి – దీనిని నేలమీద పడేస్తాను – ఎవరి ఎడమకాలి తన్నుతో అతడి ముక్కు పగులుతుందో చూద్దాం అని సవాలు విసిరింది.

చెలికత్తెలంతా భయంతో బిగుసుకుపోయారు. అలా చేయడం మంచిది కాదు రాకుమారీ! మీరు అన్నమాటలు ఎవరైనా వింటే ఇది రాజ్యానికి క్షేమం కాదు. రూప్‌నగర్ కోట ఛిన్నాభిన్నం అవుతుంది అని ఆమెను ఆపడానికి ప్రయత్నించారు. రాజకుమారి చంచల తన అలంకారాలతో శోభిస్తున్న ఎడం కాలిని అలంగీర్ చిత్రపటంపై పెట్టి గట్టిగా నొక్కడంతో పాదుషా అలంగీర్ చిత్రపటం రాజకుమారి పాదాల క్రిందపడి ముక్కలు ముక్కలైంది. రాకుమారి చిరునవ్వు నవ్వి, పిల్లలు బొమ్మలతో ఆడినట్లు నేను మొగల్ పాదుషా ముఖంమీద తన్ని నా కోర్కెను తీర్చుకున్నాను. ఎప్పటికైనా ఇలా చేయాలనేదే నా కోరిక – అని ఇంకా అనబోతుండగా – నిర్మల అనే సహచరి ఆమె నోరు మూసింది.

ఇదంతా చూసిన ముసలి విక్రేత భయంతో కంపించిపోయింది. నిర్మల ముసలిదానికి ఒక వరహా ఇచ్చి, రాజకుమారి చిన్న పిల్ల – ఇది ఇక్కడితో మరచిపో అని పంపించి వేసింది.

రాజాంతఃపురంలో అన్ని చిత్రాలను తదేకంగా చూసి, చంచల అదేపనిగా రాజసింహుడి చిత్రాన్ని చూస్తున్న విషయాన్ని పసిగట్టిన నిర్మల – రాజసింహుడు చిన్నవాడేమీ కాదు – పెళ్ళీడుకొచ్చిన ఇద్దరు కొడుకులున్నారని చెప్పింది. అప్పుడు చంచల హృదయంలోని భావాలు మొదటిసారిగా మాటల రూపంలో బయటపడ్డాయి.

**భస్మధారియైన శివుడిని గౌరి ప్రేమించింది**
**నీలవర్ణుడినైన కృష్ణుడిని రాధ ప్రేమించింది**
**గర్జించే గంగ శంభుని జటాజూటంలో కలిసింది**
**గాలి అగ్నికి స్నేహితుడు**
**అలాగే వీరుణ్ణి వీరబాలే గుర్తిస్తుంది**

అంటూ చంచల నిర్మల మాటలను పట్టించుకోలేదు. ఆమె మనసులో బయలుదేరిన తపన, చేసిన పని, రాజుకుంటున్న ప్రేమాగ్ని రాబోయే విపత్తుకు నాంది అని ఆమెకు తెలియదు.

**జేబున్నీసా**

తండ్రి షాజహానుకు ప్రధాన సహాయకురాలు జహనార. రెండవ కూతురు రోషనార, తండ్రిని ద్వేషిస్తూనే, రాజ్యపాలనలో రెండవ పాదుషా వలె వ్యవహరిస్తుండేది. షాజహాను వారసుడు ఔరంగజేబుకు ముగ్గురు కూతుర్లు కాగా, చివరి ఇద్దరికి వివాహం అయినా, పెద్దకూతురు జేబున్నీసా వివాహం చేసుకోకుండా, మేనత్తలాగా విచ్చలవిడిగా వ్యవహరిస్తూ, మధువు, హుక్కాలు సేవిస్తూ, రాజ్యభారాన్ని తండ్రితో సమానంగా నిర్వహిస్తూ ఉండేది. మేనత్తను ఎలాగైనా అంతం చేయాలని తీర్మానించుకుని, తండ్రి ద్వారా జహనార నిర్మూలించింది. రోషనారా ఉన్నట్టుండి చరిత్ర నుండి అదృశ్యమైపోయింది. జేబున్నీసా కీర్తి ప్రతిష్టలు పెరిగిపోయి, తిరుగులేని అధికారాన్ని చేపట్టింది. ఔరంగజేబుకు ఆమె అత్యంత ప్రియమైన కూతురే గాక, రాజ్యసలహాదారు కూడా ఉండేది.

ఢిల్లీ నగరమంతా ప్రత్యేకించి, చాందిని చౌక్ ప్రాంతమంతా హిందూ జ్యోతిష్కులు, గూఢచారులతో నిండి ఉంటుంది. వీరిలో కొంతమందికి అంతఃపురంలోకి ప్రవేశించడానికి అవసరమైన పత్రాలు వుంటాయి. రంగమహల్‌గా పిలువబడే జేబున్నిసా నివాసభవనం అంతా కుబేరుడు, కామదేవుడు చెట్టాపట్టాలేసుకుని కనిపిస్తారు. మూడువందలమంది తాతార్ యువతులు, కొజ్జాలు అనుక్షణం కాపలాకాస్తుంటారు. సరుకులు, ముత్యాలు, అత్తరు తెచ్చే పేరిట గూఢచారులంతా రంగమహల్‌లోకి ప్రవేశిస్తారు.

ముసలి విక్రేత రూప్‌నగర్‌లో జరిగినదంతా దరియా బీబీ అనే అత్తరు అమ్మే పిల్లకు చెప్పడంతో, ఆ విషయాన్ని జేబున్నిసాకు దరియా చేరవేసింది. దరియా భర్త ముబారక్ ఖాన్ సాహెబ్ సైన్యాధికారి – జేబున్నిసాకు అత్యంత ప్రియమైన ఆప్తుడు. దరియాను ఎప్పుడో వదిలేశాడు. అయినా అతడు తన భర్త అని చెప్పడానికి జేబున్నిసాతో చెప్పాలని ఎంత ప్రయత్నించినా దరియాకు వీలుకాదు. రహస్య వార్తల చేరవేత పేరుతో జేబున్నిసా దగ్గరకు దరియా అత్తరు తీసుకుని వెళుతూ వుండేది.

మొగలాయి సంప్రదాయం ప్రకారం రాజు ప్రథమ వివాహం చేసుకున్న స్త్రీని మహారాణిగా గుర్తిస్తారు. ఔరంగజేబు ప్రధాన పట్టమహిషి జోథ్‌పూర్ రాణి అయినా ఆమెకు అంత ప్రాధాన్యం లేదు. చాలామంది రాజపుత్ర రాణులు మొగలులను వివాహం చేసుకున్నప్పటికీ, ఇస్లాంలో చేరకుండా తమ మతాన్నే అవలంబించేవారు. అక్బర్ కాలంనుండి ఇది కొనసాగింది. వారి దాసీలు, వంటవాళ్ళు అందరూ రాణి ఇష్టప్రకారం వారి ప్రాంతం నుండే వచ్చి, రహస్య సమాచారాలు సేకరించి రాణికి చేరవేస్తూ ఉంటారు.

ఔరంగజేబు రెండవ భార్య ఉదయ్‌పూర్ బేగం అని పిలచే రష్యాకు చెందిన జార్జియా యువతి. ఈమె ఔరంగజేబు అన్న దారాషికో భార్య. దారాషికోను చంపిన తరువాత ఔరంగజేబు ఈమె అందానికి దాసుడయ్యాడు. ఈ ఉదయ్‌పూర్ బేగం క్రిస్టియన్ కాగా, అతిగా మద్యపానం చేస్తూ నిత్యం మత్తులో మునిగి వుంటుంది. జేబున్నిసా కొన్నిసార్లు ఈ ఉదయ్‌పూర్ బేగం ద్వారా ఔరంగజేబును రెచ్చగొట్టే పనులు చేయిస్తూ వుంటుంది. రూప్‌నగర్ రాజకుమారి చేసిన పనిని జేబున్నిసా ఉదయ్‌పూర్ బేగంకు చెప్పి, ఆమెను పట్టుకొచ్చి, హుక్కాలో పొగాకు నింపే చెలికత్తెగా ఉంచుకోమని చెప్పి రెచ్చగొట్టింది. విషయమంతా తెలిసిన ఔరంగజేబు రూప్‌నగర్ రాకుమారిని వివాహం చేసుకోవాలని

కోరుతున్నారని, రూప్‌నగర్ రాజు విక్రమసింహుడికి వర్తమానం పంపి, ఇందుకు గాను సైన్యాన్ని పంపుతున్నట్లు, ఆ సైన్యంతో రాకుమారిని పంపమని ఆజ్ఞాపత్రం పంపించాడు.

ఈ వార్త రూప్‌నగరం చేరి రాజ్యమంతా అల్లకల్లోలం అయింది. రాజ్యమంతటా ఆనందం వెల్లివిరిసింది. జోథ్‌పూర్, జయపూర్, అంబర్ వంటి రాజపుత్ర రాజులు మొగలులతో వియ్యమందడం అదృష్టంగా భావించేవారు. పాదుషాలకు పాదుషా అయిన ఔరంగజేబు అల్లుడు కాబోతున్నందుకు రూప్‌నగర్ మహారాజు ఆనందభరితుడయ్యాడు. మహారాణి సంతోషంతో పూజలు చేసింది. రాజకుమారి చంచలకు ఇది శరాఘాతమైంది. మొగలులంటే రాకుమారికి ఉన్న ద్వేషం గురించి తెలిసిన పరిచారికలు, ప్రత్యేకించి నిర్మల మాన్పడిపోయారు.

ఔరంగజేబు పట్టమహిషి జోథ్‌పూర్ బేగంకు ఇది తెలిసి, తాను అనుభవిస్తున్న దుఃఖం అంతా మరొక రాజపుత్ర కన్యకు రానివ్వకూడదని భావించి, తన నమ్మకమైన దాసి ద్వారా చంచలకు వర్తమానాన్ని పంపింది. చిత్రపటాన్ని తొక్కి ముక్కలు చేసినందుకు శిక్షగా ఆమెను ఢిల్లీ తెస్తున్నారని, అంతఃపురంలో హుక్కా నింపే చెలికత్తెగా నియమించబోతున్నారని, మేవాఢ్ రాజు రాజసింహుడి ద్వారా తప్పించుకో వచ్చని, మొగలు సామ్రాజ్యం అంతా తిరుగుబాట్లు ఎదుర్కొంటున్నదని – దక్కన్ – మరాఠాలు స్వతంత్రంగా ఉంటున్నారు కాబట్టి రాజసింహుడు విజయం సాధించవచ్చని ఉత్తరంలో సలహా ఇచ్చింది.

### హృదయ సందేశం

రాజకుమారి చంచల, చెలికత్తె నిర్మల చర్చించుకుని రెండు మార్గాలున్నాయని తీర్మానించుకున్నారు. మొదటిది రాజ్యాన్ని రక్షించాలి కాబట్టి మొగల్ సైన్యంతో వెళుతూ మార్గమధ్యంలో విషం తీసుకుని ఆత్మహత్య చేసుకోవడం, రెండవది తనను రక్షించమని రాజసింహుణ్ణి వేడుకుంటూ ఉత్తరం వ్రాయడం. ఈ రెండవ పద్ధతికి ప్రయత్నిద్దామని నిర్ణయించుకుని, రాజపురోహితుడు అనంత్‌మిశ్రా ద్వారా రహస్యంగా ఉత్తరాన్ని రాజసింహుడికి పంపిస్తారు. మార్గమధ్యంలో పురోహితుడు దొంగల బారిన పడ్డప్పటికి, చివరకు ఉత్తరాలు రాజసింహుడికి చేరతాయి.

మరోవైపు రెండువేలమంది మొగల్ సైన్యం ముబారక్ ఖాన్ నాయకత్వంలో రూప్‌నగర్ కోటముందు గుడారాలు వేసుకుని ఎదురుచూస్తున్నారు. మొగల్ సైన్యంలో ఉన్న రాజపుత్ర సైనికులతో రాజసింహుడి వేగులవాళ్ళు మొగల్ సిపాయిలలాగా కలసిపోయారు. చంచల పల్లకి ఢిల్లీ బయలుదేరిన మార్గంలో, కఠినమైన వంపులతో కూడిన పర్వతమార్గాలు, లోయలు వున్నాయి. ఒక ప్రదేశంలో ఉన్నట్టుండి రాళ్ళుపడి సైన్యం ముందుకు, వెనుకకు వెళ్ళలేక చాలామంది సైనికులు తొక్కిసలాటలో చనిపోయారు, గాయపడ్డారు. రాజసింహుడి వేగులవాళ్ళు పల్లకీని దారి తప్పించిన వెంటనే ఆ దారి కూడా రాళ్ళతో మూసుకు పోయింది. సైనికాధికారులు తప్ప ఎవ్వరూ మిగలలేదు. రాజసింహుడి అనుచరుడు, మొగల్ సైన్యాధికారి వేషంలో రూప్‌నగర్ వెళ్ళి రాజుతో, మొగల్ సైన్యం దొంగలబారిన పడి నాశనమైందని, వారిని రక్షించడానికి సైన్యం పంపమని కోరతాడు. దూరం నుండి రాజపుత్ర సైన్యాన్ని చూసిన మొగల్ సైన్యం, వారంతా యుద్ధానికి వస్తున్నారని భావించి, మిగిలిన వారంతా పారిపోతారు.

రాజసింహుడిని కలసిన చంచల రాజపుత్ర స్త్రీగా నా ధర్మాన్ని నిర్వర్తించాను. ఇప్పుడు నేను మీ దాసిని. మీరు అనుమతిస్తే మీ రాణినవుతాను లేదంటే నా తండ్రి మొగలులను వ్యతిరేకించడు కాబట్టి, మళ్ళీ ఢిల్లీ పంపుతాడు. అపుడు నాకు చావే శరణ్యం అని చెబుతుంది.

తాను పిల్లల తండ్రినని, ఓడిపోయిన మొగల్ సైన్యం తిరిగి పెద్ద ఎత్తున దాడికి వస్తుందని, ఆ యుద్ధంలో తాను మరణించినా మరణించవచ్చని, అందుకు ఆమె తండ్రి దగ్గరకే వెళ్లామని రాజసింహుడు ఒప్పించే ప్రయత్నం చేస్తాడు. రాజపుత్రుల వీరమరణం రాజపుత్ర స్త్రీలకు సహజమే అని చంచల చెబుతుంది. రాజసింహుడు ఆమె అభిప్రాయాలను అంగీకరించి, ఆమె తండ్రి ఆమోదం లేకుండా ఆమెను వివాహం చేసుకోలేనని చెప్పి, తన రాజ్యానికి పంపి ప్రత్యేక రక్షణలో వుంచుతాడు. విషయమంతా చంచల తండ్రికి ఉత్తరం ద్వారా తెలియపరుస్తాడు.

దీనిని ఏమాత్రం అంగీకరించని రూప్‌నగర్ రాజు రాజసింహుడిని శాపనార్థాలు పెడతాడు. తన కుమార్తె

వితంతువు కావాలని కోరుకుటున్నానని, సహగమనానికి కూడా నోచుకోకుండా జీవితాంతం ఏడవాలని, మేవాఢ్ రాజధాని కుక్కల, నక్కల నివాసం కావాలని శపిస్తూ, చివరలో మాత్రం - మీరు అల్లుడు కాదగిన వారని భావించడం జరిగితే, నా అంతట నేనే కన్యాదానం చేస్తానని ప్రత్యుత్తరం ఇస్తాడు.

మొగల్‌సైన్యం ఓటమి, పారిపోవడం అంతా చుట్టు ప్రక్కల రాజపుత్ర రాజ్యాలలో ఆశ్చర్యం కలిగించినప్పటికి, జయపూర్, జోథ్‌పూర్ రాజ్యాలలో స్త్రీలు అధికారంలో ఉండడం, అప్పటికే మొగల్ సైన్యం వారందరిని తన నియంత్రణలో వుంచుకోవడంతో వారంతా రాజసింహుడి వైపు రావడానికి ధైర్యం చేయలేకపోతారు.

**ప్రతీకార చర్య**

రూప్‌నగరం నుండి వట్టి చేతులతో తిరిగి వచ్చినందుకు ఔరంగజేబు చాలామంది సైనికాధికారుల్ని తీవ్రంగా శిక్షించాడు. జేబున్నీసా కూడా పరాభవంతో రగిలిపోయింది. రాజసింహుడి రాజ్యాన్ని ధ్వంసం చేయాలని ఔరంగజేబు ఇతర ప్రాంతాలలో వున్న సైన్యాన్ని పిలిపించాడు. దక్షిణం నుండి పెద్దకుమారుడు షా ఆలమ్, వంగదేశం నుండి రెండవ కుమారుడు షా ఆజం, పశ్చిమం నుండి మూడవ కుమారుడు అక్బర్, మరోవైపు ఉత్తరం నుండి ఢిల్లీ పాదుషా స్వయంగా సైన్యాలను నడిపించుకుని మేవాఢ్‌పై యుద్ధానికి తరలివచ్చారు.

ఈ అనంతసేనావాహినిని ముందుగానే పసిగట్టిన రాజసింహుడు పథకాలు సిద్ధం చేశాడు. పర్వత శిఖరాల మీద సైన్యాలను సిద్ధంగా ఉంచి, మొత్తం సైన్యాన్ని మూడు భాగాలు చేసి తన ఇద్దరు కుమారులతో, తాను స్వయంగా సిద్ధంగా ఉన్నాడు. ఔరంగజేబు సైన్యంతో వచ్చినపుడు అంతఃపుర పరివారమంతా కదలి వస్తుంది. విస్తృతంగా గుడారాలు వేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. వారందరి రక్షణ కూడా అత్యంత ప్రధానం. నాట్యకత్తెలు, మందు, హుక్కా, విందుభోజనాలు అన్ని రాజధానిలో జరిగినట్లే జరుగుతాయి.

మేవాఢ్ పర్వతమార్గాలు అంతుచిక్కని గుహలతో, లోయలతో జటిలంగా వుంటాయి. ఔరంగజేబు మొదటి కుమారుడు షా ఆలమ్ రెండు కొండ మార్గాల మధ్య ప్రవేశించడంతో రాజపుత్రులు రెండు వేపులా మార్గాలు మూసివేయడంతో తిండి తిప్పలు లేక ఇరుకు మార్గంలో ఉండిపోయారు. మూడవ కుమారుడు అక్బర్ సైన్యంపై రాజపుత్రులు రాత్రిపూట విరుచుకుపడి మంటలు అంటించడంతో గుడారాలన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. మొగల్‌సైన్యంలో ఒక్కరూ మిగలకపోవడంతో అక్బర్ ప్రాణాలు దక్కించుకుని గుజరాత్ పారిపోయాడు.

ఇక ఉదయ్‌సాగర్ తీరాన ఔరంగజేబు ఢిల్లీ నగరాన్ని పోలిన నగరాన్ని సృష్టించాడు. పాదుషాలతోపాటు జోథ్‌పూర్ బేగం, ఉదయ్‌పూర్ బేగం, జేబున్నీసా అందరూ తరలి వచ్చారు. వారందరికీ వేర్వేరు శిబిరాలు నిర్మించారు. అక్బర్, షా అలమ్ ఓటమి వార్తలు విని ఔరంగజేబు ఆశ్చర్యపోయాడు. ఆ ప్రాంతాలలో వున్న వ్యాపారస్తులను పిలిచి ఉదయ్‌పూర్‌కు దారులు చూపమని ఆదేశించి, పాదుషా సైన్యం ఆ మార్గాన బయలుదేరింది. ఎగుడు దిగుడుగా ఉన్న ప్రాంతాలలో రాజపుత్రులు ఊహించని దాడి చేయడంతో ఔరంగజేబు సైన్యం గుహల్లోకి ప్రవేశించగా, రాణివాసమంతా వేరుపడి ముందుకు వెళ్ళి రాజసింహుడి సైన్యాలకు చిక్కింది. వారందరినీ ఉదయ్‌పూర్‌కు బందీలుగా పంపారు.

గుహలో రెండోవైపుకు వెళ్ళేలోపు చీకటి పడింది. వెలుతురు కల్పించే సాధనాలున్న సామాగ్రి ఉన్న పటాలం అంతా క్రింద చీకట్లో తొక్కిసలాటకు గురైంది. ఏనుగులు, గుర్రాలు కాళ్ళక్రింద పడి ఆర్తనాదాలు చేసుకుంటూ చాలామంది మరణించారు. గుడారాలకు స్థలం లేదు. ఆహారం సంగతి అలా వుంచి, నీళ్ళు కూడా దొరికే పరిస్థితి లేదు. మొగలు సైన్యం ఆలంగీర్ నాయకత్వంలో చరిత్రలో లేని విపత్తుకు చిక్కుకుంది.

పాములా బుసలు కొడుతున్న ఔరంగజేబు ఏది ఏమైనా రాజసింహుడిని అధఃపాతాళానికి తొక్కాలని నిర్ణయించాడు. కాని గుహలోని మరో ద్వారం వద్ద పెద్ద పెద్ద బండరాళ్ళు పడి ఉన్నాయి. సైనికులతో రాళ్ళు కదిలించాలని చూస్తే పైనుండి మరిన్ని రాళ్ళు పడుతున్నాయి. సైనికులు ఒకవేపు ఆకలి దప్పులతో, మరోవైపు చావు భయంతో ముందుకు వెళ్ళలేకపోయారు. రాజపుత్ర సైన్యం ఫిరంగిదళంతో ఒకవైపు, రాళ్ళ దాడితో మరోవైపు దాడిచేయడంతో ఢిల్లీ పాదుషా స్థితి రాజపుత్రుల చేతులలో బోనులో చిక్కిన ఎలుక మాదిరిగా అయింది.

### మొగలుల పతనం

ఉదయ్‌పూర్ బేగంను, జేబున్నీసాను రాకుమారి చంచల ముందు ప్రవేశపెట్టారు. వారిద్దరి పట్ల చంచల గౌరవాన్ని ప్రదర్శించింది. జేబున్నీసాకు ప్రత్యేక వసతి కల్పించింది. రాత్రిపూట తన గదిలో ఎవరో తిరిగినట్లు భయపడిన జేబున్నీసా తెల్లవార్లు నిద్రలేకుండా గడిపింది. రెండవ రోజు రాత్రి కూడా భయపడి, తన ఎదురుగా వున్న ముబారక్ ఖాన్‌ను చూసి కేకలు పెట్టి స్పృహ తప్పి పడిపోయింది.

ముబారక్ ఖాన్ ఆమెకు అత్యంత ఆప్తుడు, ప్రియుడు. జేబున్నిసా కోసం తన భార్య దరియా బీబీని వదిలివేశాడు. చంచలను తీసుకురావడంలో విఫలం చెందాడని, తాగిన మత్తులో అతనిని విష పర్పాలతో చంపించి, అతడి భార్యకు కూడా దేశద్రోహం విధించి దేశం నుండి పంపించింది. పాము కాటు నుండి ఒక రాజపుత్ర సైనికుడు రక్షించడంతో, ముబారక్ రాజసింహుడికి నమ్మకస్తుడిగా మారి వ్యాపారి వేషంలో ఔరంగజేబు సైన్యాలను దారి తప్పిస్తాడు.

జేబున్నిసా భయాన్ని చూసిన చంచల – ఏమిటీ నీపట్ల ఏమైనా అత్యాచారం జరిగిందా అంటూ నవ్వుతూ ప్రశ్నిస్తే, ఆమెకు ఏమీ అర్థం కాలేదు. ముబారక్‌ను చంచల దగ్గర చూసిన జేబున్నిసా ఏడుస్తూ, అతనిని వివాహం చేసుకుంటానని, ఢిల్లీ తీసుకువెళ్ళమని ప్రాధేయపడింది. జేబున్నిసా పట్ల ప్రేమ తగ్గని ముబారక్ ఆమెను వివాహం చేసుకోవడానికి అంగీకరించి, చంచల సహాయంతో నగరంలో ఉన్న మసీదులో వివాహం చేసుకుంటాడు.

ఔరంగజేబు రాజసింహుడితో సంధికి అంగీకరించి, రాజపుత్ర ప్రాంతాలలో జిజియాపన్ను ఎత్తివేయడానికి, దేవాలయాలను కూలగొట్టకుండా ఉండడానికి అంగీకరించాడు. తనకు ద్రోహం చేసి, తన ప్రియమైన కూతురుని వివాహం చేసుకోవడాన్ని జీర్ణించుకోలేక పోయినా, అంతఃపుర పరివారం విడుదల కోసం అంగీకరిస్తాడు. రాజసింహుడు మొగలు సైన్యాలను, పరివారాన్ని వదలివేస్తాడు. బేగంలను కూతురుని తీసుకుని ఢిల్లీ బయలుదేరిన ఔరంగజేబు మార్గమధ్యంలో ముబారక్ ఖాన్‌ను చంపించి వేయడంతో హతాశురాలైన జేబున్నిసా చిత్త చాంచల్యానికి గురవుతుంది.

ముందు జాగ్రత్తగా రెండవ కుమారుడు షా ఆజం సైన్యాలను దూరంలోనే ఆపివేసిన ఔరంగజేబు, రక్షణ ప్రాంతాలకు చేరుకోగానే, విపత్తులో చిక్కుకోవడం వల్ల సంధికి ఒప్పుకోవడం జరిగింది తప్ప, తిరిగి యుద్ధం చేయాలని సైన్యాన్ని ఆదేశిస్తాడు. రూప్‌నగర్ రాజకుమారిని తన దగ్గరకు పంపకపోతే రూప్‌నగర్ కోటను, రాజ్యాన్ని నాశనం చేస్తానని వర్తమానం పంపిస్తాడు.

మొగలుల ఓటమిని చూసిన రాజపుత్ర రాజులు, రూప్‌నగర్ రాజుతో సహా రాజసింహుడి సైన్యంలో తమ సైన్యాన్ని కలిపివేస్తారు. రూప్‌నగర్ రాజు తన ఖడ్గాన్ని, కుమార్తెను రాజసింహుడికి అప్పగించడంతో – రాజసింహుడు చంచల వివాహం రాజులందరి సమక్షంలో వైభవంగా జరిగింది.

తరువాత కాలంలో ఔరంగజేబు మూడుసార్లు మేవాడ్‌పై దాడి చేస్తాడు. చిన్న చిన్న రాజ్యాలవారంతా రాజసింహుడితో కలసిపోవడంతో నాలుగు సంవత్సరాల పాటు యుద్ధం జరుగుతుంది. మరాఠాల తిరుగుబాట్లు, దక్కన్‌లో అలజడులు పెరగడంతో ఔరంగజేబు రాజసింహుడితో సంధి చేసుకుని, రాజసింహుడి షరతులకు ఒప్పుకుని, రాజపుత్ర రాజ్యాలపై యుద్ధాలు మానుకుని దక్కన్‌వైపు వెళ్ళి, అక్కడ ఓటములు ఎదుర్కొని, తిరిగి వస్తూ ఔరంగాబాద్‌లో మరణిస్తాడు. జేబున్నిసా తన తన నగలు, అలంకారాలు అన్నీ తీసివేసి, రంగమహల్‌లో కనిపించే ప్రతి ఒక్కరూ ముబారక్ అనే అనుకుంటూ ఉంటుంది.

ఔరంగజేబును ఓడించి, ముప్పుతిప్పలు పెట్టిన రాజసింహుడు రాజపుత్ర రాజ్యాలకు స్వతంత్రతను, ఆత్మగౌరవాన్ని కల్పిస్తాడు. ఆలంగీర్ చిత్రాన్ని ముక్కలు చేసిన చంచల మొగల్ సామ్రాజ్య పతనాన్ని కూడా చూస్తుంది.

* * * *

***భయం, మోసం, దురంహంకారం, కుట్ర, విజయాలను సాధించినా, ఆ అధికారానికి కాలం సాక్షిగా నిలబడదు. నైతిక బలం, ధర్మం, ప్రజల విశ్వాసం లేకుండా ఏ సామ్రాజ్యమూ శాశ్వతంగా చరిత్రలో నిలచిన దాఖలాలు లేవు.***

మి

**ఆచార్య వై. పార్థసారథి**
ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగం (రిటైర్డ్),
ఉస్మానియా యూనివర్శిటీ, ఫోన్ : 900 043 8090

# వెంటాడే నీడ

– ఆచార్య పి. ఆర్. హరినాథ్

వెలుగు ఉన్నప్పుడు నీడ ఉంటుంది. అది సహజం. మరి చీకటి ఉన్నప్పుడు ఉంటుందా? ఉంటుంది? అది వెంటాడే నీడ. వెలుగులోనూ, చీకటిలోనూ, నిద్రలోనూ, మెలకువలోనూ, సంపదలోనూ, లేమిలోనూ, సంతోషం లోనూ, దుఃఖంలోనూ–మనిషి ఎక్కడున్నా, ఎవరైనా, ఎలా ఉన్నా వెంటాడే నీడ ఒకటి ఉంది. అది 'కర్మ'. తేలిక మాటల్లో చెబితే పని. దాన్నే 'క్రియ' అన్నాం. "చేసిన కర్మము చెడని పదార్థము" అని వేదాంతులు చెప్పినా,"నీవు చేసిందే నీకు చెందుతుంది" అని సాంఖ్యులు చెప్పినా, "కాయకవే కైలాస" అని కర్ణాటక తపస్వి బసవన చెప్పినా –అంతర్గతంగా కనిపించేది పని గురించే. అది దేవతలకైనా గుర్తింపునిచ్చేది. వరాలనిచ్చే దేవతలనే కదా ఎవరైనా పూజించేది? సత్కర్మ, సత్క్రియ–ఇలాంటి మాటలతో సాహిత్యం దీనిని ప్రోత్సహించింది.

**యా సాధూంశ్చ ఖలాన్ కరోతి విదుషో మూర్ఖాన్ హితాన్ ద్వేషిణః**
**ప్రత్యక్షం కురుతే పరోక్ష మమృతం హాలాహలం తత్క్షణాత్**
**తా మారాధయ సత్క్రియాం భగవతీం భోక్తుం ఫలం వాంఛితం**
**హే సాధో వ్యసనైర్గుణేషు విపులే ష్వాస్థాం వృథా మా కృథాః**

ఒక మహాశక్తి ఉంది. అది దుర్జనులను సాధువులుగా మార్చగలదు. మూర్ఖులను పండితులుగా చేయగలదు. దాని ప్రభావంతో ద్వేషించేవాళ్ళు ప్రేమించేవాళ్ళు అవుతారు. కనిపించనిది కనిపిస్తుంది. విషం అమృత మవుతుంది. అదే 'సత్క్రియ'. మంచి పని. ఓ సాధూ, దానిని అనుసరించు అని కవి అంటాడు 'సాధుస్సమర్థో నిపుణోవా' అన్నారు. సాధు అనే మాటకు 'సాధన చేత నిపుణుడైనవాడు', 'సమర్థుడైనవాడు'–అనిఅర్థం. ఒక పనిని దీక్షగా చేసి ఫలితాన్ని అందుకోవడానికి కృషి చేసేవాళ్ళు అని అంతరార్థం. ఇలాగ చీకటిని వెలుగుగా మార్చే మహాశక్తి గురించి చెబుతూ–'ఆ సత్క్రియను ఆరాధించు. తక్కిన వాటి కోసం వ్యర్థంగా ప్రయత్నించకు' అని అంటాడు, కవి.

**ఖలునిన్ సజ్జను గాగ మూర్ఖ జను సమ్యావంతునిన్ గాగ దా**
**యల సన్మిత్రులగా నగోచరము ప్రత్యక్షంబుగా ప్రాణ హృ**
**త్తులనం బైనమహావిషం బమృతముంగా జేయు సత్కర్మ ము**
**జ్జ్వల నిష్ఠానిధివై భజింపుము వయస్యా వాంఛితార్థాప్తికిన్**

అయితే ఒక మంచి పనిచేయడానికి ఎన్నో వనరులు అవసరమవుతాయి. వాటిని గుర్తించి, ఉపయోగించు కోవాలని కవి చాలా అందమైన ఉపమానాలతో చెబుతాడు. ఆ మాట మనలో చాలా ఆలోచనలను రేకెత్తిస్తుంది. ప్రపంచంలో అతి విషాదకరమైన విషయం–సంపదను పోగొట్టుకోవడం కాదు; చేతిలో ఏ సంపద ఉందో గుర్తించ లేకపోవడం. దాని విలువను గమనించకపోవడం. అది వివేకంతో, విజ్ఞతతో కూడిన విషయం.

**స్థాల్యాం వైదూర్యమయ్యాం పచతి తిలఖలీ మింధనైశ్చందనాద్యైః**
**సౌవర్ణై ర్లాంగలాగ్రై ర్విలిఖతి వసుధా మర్క మూలస్య హేతోః**
**ఛిత్వా కర్పూర ఖండాన్ వృతిమిహ కురుతే కో ద్రవాణాం సమంతాత్**
**ప్రాప్యేమాం కర్మ భూమిం న భజతి మనుజో యంతతో మంద భాగ్యః**

ఒక మంచి వనరు నుంచి అత్యుత్తమమైన పనిని సాధించడం ఒక ప్రజ్ఞ. అలా అవకాశం దొరికినా కూడా ఎవరు ఆ అవకాశాన్ని అర్థం చేసుకుని సక్రమంగా వినియోగించరో అలాంటి వాళ్ళకంటే దురదృష్టవంతులు ఎవరు ఉంటారు? తళతళ మెరిసిపోయే వైదూర్య మణులతో అలంకరించబడిన ఒక మనోహర వంట పాత్రను ఇచ్చారు. అపురూపమైన వంటను చేసుకోవడానికి వంట చెరకుగా చందనపు చెక్కను ఇచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా అందులో తెలికపిండిని వండుకుంటే ఏమనగలం? పొలాన్ని దున్నడానికి ఒక నాగలి ఉంది. ఆ నాగలిని బంగారంతో అలంకరించారు. అందమైన బంగారపు మొనలు ఉన్నాయి. దానితో పంటలను పండించమని చెప్పారు. అంత విలువైన నాగలిని చేతికి ఇచ్చినప్పుడు ఎలాంటి పంటలను పండించగలం? దానితో సాగు చేసి జిల్లేడు మొక్కలను పెంచాం. అందులో విచక్షణ ఎంత ఉంది? విజ్ఞత ఏముంది?

**చెలువౌ రత్న ఘటంబునందతడు సుశ్రీఖండఖండంబులం**
**దిలపిణ్యాకము వండె నాగరుల కర్థిన్ సప్త పర్ణావృతుల్**
**నిలిపెన్ జిల్లెడు దూదికై పుడమి దున్నెన్ పైడి నాగేళ్ళ ని**
**మ్ముల కర్మ క్షితి బుత్తి యెవ్వడు దపంబుల్ సేయడప్రాజ్ఞతన్**


డబ్బు, ఇల్లు, సంపద మాత్రమే కాదు. మనిషికి సమయం, ఆరోగ్యం, తనలో ఉన్న నైపుణ్యాలు, తాను సంపాదించిన అనుభవం, తనకున్న మానవ సంబంధాలు, తనకు తెలిసిన సాంకేతిక పరిజ్ఞానం, తన చుట్టూ తన కోసం నిలిచేవాళ్ళు ఇవన్నీ కూడా వనరుల కిందే లెక్క. భర్తృహరి చెప్పిన ఈ శ్లోకం ఆధునిక జీవితాన్ని గురించి ఎన్నో ఆలోచనలకు ప్రేరణ కలిగిస్తుంది. సాధారణంగా మానవ జీవితాల్లో వినిపించే మాట– 'నా దగ్గర తగినంత సమయం లేదు','నాకు అవకాశం లేదు',– ఇలాగ ఫిర్యాదు చేయడంలో నిజం ఎంత అన్నది ఎవరికి వాళ్ళు నిజాయితీగా ఆలోచించుకోవాల్సిన అంశం. అలాగే మానవ శక్తి ఉంటే చాలదు. తగిన సామర్థ్యం, ప్రతిభ ఉన్న వ్యక్తి చేతిలో ఆ నిర్వహణ ఉండాలి. అలా కాకుండా ఒక అపురూపమైన ప్రతిభ ఉన్న వ్యక్తిని ఆ వనరుల నిర్వహణకు ఉంచకుండా దానికి సంబంధం లేని మరే అంశంలోనూ ఉంచి ఆ వ్యక్తి నుంచి మరింత ఆశించడంలో విజ్ఞత లేదు. సరైన వ్యక్తి సరైన పనిలో ఉండాలి అది కీలక సూత్రం. ఈ రోజుల్లో ప్రతి క్షణానికి సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతూ ఉంది . ఈ మలుపులో నిలబడితే *ఈ సాంకేతికత మనిషికి వరమా? శాపమా?* దానికి సమాధానం ఒకటే. దానిని ఎలా నిర్వహిస్తాం–అన్న దాని మీద ఆధారపడి ఉంటుంది. వ్యక్తిగతమైన విషయాలకు వస్తే ఆరోగ్యం–బలం–కుటుంబం–స్నేహితులు–మనస్సు ప్రశాంతంగా ఉండడం–ఇవన్నీ వనరులే. వీటిని కాపాడుకోవడం, సక్రమంగా ఉపయోగించుకోవడం ముఖ్యం. వీటన్నిటిని వదిలిపెట్టి అందని ఎండమావుల వెంట పరిగెడితే–పొందడం కన్నా కోల్పోవడమే ఎక్కువ ఉంటుంది. *'నా దగ్గర ఏమీ లేదు 'అనడం కాదు' నా దగ్గర ఉన్న వాటిలో విలువైనది ఏది'* అని గుర్తించడం, దాన్ని ఉపయోగిస్తున్నానా లేదా అన్నది ఆలోచించడం మంచిది. కొంతమంది చేతిలో సమయం ఉంటుంది కొంతమందికి జ్ఞానం ఉంటుంది. కొంతమందికి ప్రతిభ ఉంటుంది. కొంతమందికి మంచి గురువులు లభిస్తారు. కొంత కొంతమందికి మంచి అవకాశాలు లభిస్తాయి. వాటి ఆధారంగా ఏదైనా గ్రహించడం ముందుకు వెళ్లడం అన్నది నిర్వహణలో కీలకమైన విషయం. మనుషులందరికీ ఇరవై నాలుగుగంటలే ఉన్నా ఒక్కొక్కరు ఆ సమయాన్ని తెలివిగా, తమ అనుభవంతో, నైపుణ్యంతో ముడివేస్తారు. దాన్నిబట్టి ఫలితాలు మారిపోతూ ఉంటాయి. ఇవన్నిటిని ఆలోచింపజేసే లక్షణం ఈ ఒక్క శ్లోకంలో కనిపిస్తుంది. ఆధునిక మానవ జీవితానికి సంబంధించిన ఎన్నో అంశాలు ఈ భర్తృహరి మాటల్లో కనిపిస్తాయి. వాటివైపు ఆలోచించేటట్టుగా ప్రేరణ కలిగిస్తాయి. దీనికి ఒక దృష్టాంతం చూద్దాం.

చాలా కాలం క్రితం ఒక రాజ్యం ఉండేది. దాన్ని ఒక తెలివైన రాజు పరిపాలించేవాడు. తన ప్రజల్లో నిజంగా విచక్షణాజ్ఞానం ఉన్నవాళ్ళు ఎంతమందో కనుక్కోవడం కోసం రాజు రకరకాల పరీక్షలు చేస్తూ సమీక్షించుకుంటూ ఉండేవాడు. ఒకసారి అలా ఒక ప్రయోగం చేశాడు. సమీపంలో ఒక పల్లెలో ఉండే గ్రామ పెద్దను పిలిపించాడు. అతనికి ఒక పాత్రను ఇచ్చాడు. ఆ పాత్ర ఏమిటి అనేది అతనికి చెప్పలేదు. అది అచ్చమైన బంగారంతో తయారు చేసిన పాత్ర. స్వర్ణకారులు కష్టపడి దాన్ని తయారు చేశారు. దానిచుట్టూ అందమైన అలంకరణలు కూడా చేశారు. దాని విలువతో మొత్తం ఆ చుట్టుపక్కల ఒక ఐదు, ఆరు పల్లెలను కొనుక్కోవచ్చు. అంతటి విలువైన పాత్ర అది. అయితే రాజు దాన్ని నేరుగా చేతిలో పెట్టకుండా ఒక ఉపాయం చేశాడు. దానికి మన్ను పూసి, రంగులు పూసి చూడగానే అదేదో మట్టితో తయారు చేసిన పాత్ర అనిపించేలాగా, అలా కనిపించేలాగా తయారు చేశాడు. సమీప గ్రామ పెద్దను పిలిపించి "ఈ పాత్ర నీకు ఇస్తున్నాను. ఓ ఏడాది గడిచాక నీ దగ్గరికి వస్తా. అప్పటివరకు నీ దగ్గర ఉంచుకొని దీన్ని వాడుకుంటూ ఉండు" అన్నాడు. అది చేతిలోకి తీసుకున్న గ్రామ పెద్ద అటు ఇటు తిప్పి 'ఈ పాత్ర నా చేతిలో ఎందుకు పెట్టాడా' అని మనసులో అనుకొని రాజాజ్ఞ కాబట్టి మారు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. ఆ తర్వాత రోజుల్లో ఆ గ్రామానికి వానలు రావడం, నేలంతా బురదమయం కావడం, పొలాల్లో నీళ్లు నిల్వ ఉండడం, కాలువలు చేయాల్సి రావడం వంటివి వచ్చిపడ్డాయి. కుండ పెంకులతో ఇలాంటి పనులను చేస్తుంటే పెంకులు విరిగిపోతూ ఉండేవి. 'ఈ రాజు ఇచ్చిన పాత్ర ఏదో బాగానే ఉంది కదా. దీంతో నీళ్లు తోడొచ్చు కదా' అని ఆ గ్రామ పెద్దకు అనిపించింది. పైగా బలంగా తట్టుకుంటుంది. తన ఇంటి ఎదురుగా బాటలో ఉండే బురదను ఎత్తేయడానికి, బురద నీళ్లను పక్కన చల్లేయడానికి, పొలంలో నిలబడిన చెత్తా చెదారాన్ని తీసేయడానికి, మురికి నీళ్లను తోడేయడానికి, ఏదైనా కాలువ

మూసుకుపోతే ఆ కాలువను సరిచేయడానికి ఆ పాత్ర పనికి వచ్చింది. ఏడాది గడిచిపోయింది. రాజు ఒక్కొక్క గ్రామానికి వస్తూ ఈ గ్రామానికి కూడా వచ్చాడు. "ఏమయ్యా నేను ఇచ్చిన పాత్ర ఏం చేశావు?" అన్నాడు. "భలే మంచి పాత్ర మహారాజా! నా దగ్గర ఉన్న కుండలన్నీ పగిలిపోతూ ఉండేవి. ఇది గట్టిగా నిలబడింది. మురికి నీళ్లు తోడుకోవడానికి ఎంత బాగా పనికి వచ్చిందో!" అని గ్రామ పెద్ద అన్నాడు. రాజు తన పక్కన ఉన్న స్వర్ణకారుడిని పిలిచి ఆ "పాత్రను శుభ్రం చేయి" అన్నాడు. ఆ స్వర్ణకారుడు తన దగ్గర ఉన్న పరికరాలతో ఆ పాత్రను ఒక మూల గట్టిగా రుద్ది చూపించాడు. పచ్చని పసిమి కాంతితో తళతళ మెరిసిపోయింది. మొత్తం మట్టిని అంతా తీసేసరికి పాత్ర అంతా స్వర్ణమయమైన కాంతులతో కళ్ళు జిగేల్ మనిపించింది. గ్రామ పెద్ద చేతులు వణికిపోయాయి. "మహారాజా ఇది బంగారమా?" అని విస్మయపడ్డాడు. "అయ్యో దీనిని బురద నీళ్లు తోడడానికి, మురికి నీళ్లు తోడడానికి వాడుకున్నానే" అన్నాడు. అప్పుడు మహారాజు అన్నాడు "రాజ్యంలో కొద్దిమందికి చాలా తెలివితేటలు ఉంటాయి. ఆ తెలివితేటలు వాళ్ళు మంచి పనులకు ఉపయోగించరు. వితండవాదనలకు ఉపయోగిస్తారు. కాలక్షేపాలకు ఉపయోగిస్తారు. కొద్దిమంది మహా పురుషులు, గురువులు వచ్చి మాట్లాడుతారు. ఆ మాటల్లోని సారాన్ని గ్రహించరు. ఆ గురువులను తప్పుబడతారు. సారాన్ని గ్రహించకుండా వాళ్ళను హేళన చేసి వదిలేస్తారు. అలాగే కొంతమంది ఇంట్లో గొప్ప గ్రంథాలు ఉంటాయి. వాటి విలువను వాళ్ళు గుర్తించరు. అవి కేవలం అలంకార ప్రాయంగా గూళ్ళలో పెట్టుకొని ఉంటారు. ఎవరైనా వస్తే చూపించుకోవడానికి పనికి వస్తాయి. అంతే. కొద్దిమందికి తమ చుట్టూ ఎంతగానో ప్రేమించే మనుషులు ఉంటారు. వాళ్ళను పట్టించుకోరు. వాళ్ళను పోగొట్టుకున్నాకే వాళ్ళ విలువ తెలుస్తుంది" రాజు అన్నాడు "నీవు బంగారు పాత్రను మురికి నీళ్లకు ఉపయోగించడం గురించి నేను చెప్పడం లేదు. కానీ నీ దగ్గర ఉన్నది బంగారం అని నువ్వు గుర్తించలేకపోయావే అది తప్పు అంటున్నాను". బంగారుపాత్ర చేతికి దొరికితే ఆ విలువను గుర్తించక మురికి నీటి కోసం వాడిన ఈ గ్రామ పెద్దలాగా చాలా మంది జీవితంలో అత్యంత విలువైన సంపద దొరికినప్పుడు సక్రమంగా వినియోగించుకోకుండా దానిని వ్యర్థం చేస్తూ ఉంటారు. ఈ మాటల వెనుక వినిపించేది, కనిపించేది అదే. మనిషిలోని శక్తిని గుర్తించాలి. యుద్ధ విద్యలో విశారదుడైన వ్యక్తిని యుద్ధంలో ఉపయోగిస్తే ప్రయోజనం కానీ ఏ గుర్రాలశాలలోనో పడేసి గుర్రాలకు గడ్డి వేసేవాడిలాగా నియమిస్తే అపురూపమైన ఆ శక్తిని సక్రమంగా నియోగించుకోకపోవడం అవుతుంది. అది బంగారు పాత్రతో మురికి తోడడం లాంటిది. ఇది ఈ శ్లోకం ద్వారా భర్తృహరి మన మనస్సుల్లో రేపే అలజడి.

**ఆచార్య పి. ఆర్. హరినాథ్,**
**తెలుగు ఆచార్యులు, రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్,**
**మైసూర్, ఫోన్ : 948 044 3108**

## కమ్మతెమ్మెర




తేనె కన్నులు – ఎదురు తెన్నులు చిత్రాలు నా మనసును పట్టుకున్నాయి. అద్భుతం సుమా! నిజంగా తెరచిన పుస్తకం శ్రీ ఇనాక్ గారి జీవితం; సామాన్యంగా నేలనుండి నింగిదాకా – హిమవత్పర్వత శిఖరం చేరుకున్నా – ఆయనలోని వినయ సంపద – సాహిత్య కృషి – అంతకు మించి వారిలోని మానవీయ దృక్పథం మహోన్నత వ్యక్తిత్వానికి దారి తీసింది. అయితే ! దేశం గుర్తించిందా! ఆ మహనీయునికి నమస్కరిస్తున్నాను. **మిసిమి**లో యింటర్వ్యూలు అద్భుతంగా వుంటున్నవి. వెనుకటి కాలంలో – భారతి పత్రికలో మీగడ తరగలు శీర్షికలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు చాలా బాగా వ్రాసేవారు (శాస్త్రి పేరుతో). ఆ వ్యక్తుల ప్రతిభ గురించి చదువుతూండగానే ఆ వ్యక్తులు దర్శనమిచ్చేంత గొప్పగా వ్రాసేవారు.

**మిసిమి**లో ఆయా ప్రతిభావంతుల గురించి యింటర్వ్యూ పేరుతో వివరంగా పలుకరిస్తూ పాఠకునికి అందిస్తున్నారు. నాగరికత – సమాజ పరిణామాలు నాటి నుండి నేటి వరకు సింహావలోకనం చేసారు. ఒక పరిశోధనా పత్రం మీ రచన.

***- చెరుకువాడ వెంకటరామయ్య, విస్సాకోడేరు, ఫోన్ : 9542118184***

# పైరసీ - సముద్రపు దొంగలు

– చెన్నూరి శివరామక్రిష్ణ ప్రసాద్

*(అయిదవ భాగం)*

**గినీ అఖాతం :** సోమాలియాలో పైరసీ తగ్గుముఖం పడుతున్న సమయంలో పశ్చిమ ఆఫ్రికా గినీ అఖాతంలో పైరసీ వూపందుకోసాగింది. ఈ పైరసీ ప్రభావం పశ్చిమ ఆఫ్రికా తీరంలోని పలు దేశాల మీద వుండేది. 2011 నాటికి ఈ పైరసీ ప్రభావం పలు ప్రపంచ దేశాల మీద పడసాగింది. పశ్చిమ ఆఫ్రికాలోని నైజీరియా, ఘానా, అంగోలా, మరి కొన్ని ఇతర దేశాలు ముడి చమురు, చమురు వుత్పాదకాలు ఎగుమతి చేస్తాయి. అలాగే కొన్ని చమురు వుత్పాదకాలు దిగుమతి కూడా చేసుకుంటాయి. చమురు వుత్పాదకాలైన పెట్రోల్, డీజల్ దొంగిలించడం లక్ష్యంగా అక్రమ వ్యాపారం, దొంగ సరుకు రవాణా చేసే నేరస్థుల ముఠాలు పైరసీకి పాల్పడ్డాయి. సోమాలియా పైరేట్లు సాధారణంగా బందీలకు హాని చేసేవారు కాదు. కానీ గినీ అఖాతంలో పరిస్థితి భిన్నంగా వుండేది.

21వ శతాబ్దపు మొదటి దశకంలో గినీ అఖాతంలో పైరసీ మొదలై ఒక పెద్ద వ్యాపారంగా అభివృద్ధి చెందింది. మొదట్లో నైజీరియా తీరంలో చమురు వుత్పాదన చేస్తున్న సంస్థలకు మనుషులను, సరుకులను రవాణా చేసే చిన్న నౌకల మీద దాడి చేసి సరుకులను అపహరించేవారు. క్రమక్రమంగా వీరు వనరులను సమకూర్చుకొని చాలా ఆక్రమణాత్మకంగా మారారు. ఈ పైరేట్ల ముఠాలు నడి సముద్రంలో కన్నా ఎక్కువగా గినీ అఖాతంలోని రేవుల బయట లంగరులో వున్న నౌకల పైన, రేవులలోని నౌకల పైనా, ఉత్పాదక సంస్థల చమురు నిల్వ వసతుల పైనా దాడి చేసి దోపిడీ చేసేవారు. ఈ దాడులు గినీ అఖాతంలోని దేశాల ప్రాంతీయ జలాలో జరుగుతుండం వల్ల అంతర్జాతీయ సంస్థలు/భద్రతా దళాలు జోక్యం చేసుకోవడానికి ఆస్కారం




గినీ అఖాతం

లేకపోయింది. గినీ అఖాతంలో పైరసీ బాగా వ్యవస్థీకరించబడిన, నిధులు బాగా అందుబాటులో వున్న నేరస్థుల సంస్థగా అవతరించింది. లంచగొండి ప్రభుత్వాలకు ఈ వ్యవస్థను కట్టడి చెయ్యడం అసాధ్యం అనవచ్చు. గినీ అఖాతంలోని పైరేట్లు నౌకల సిబ్బందిని బందీలుగా పట్టుకోవడం కానీ, చమురు కాక వేరే సరుకులు రవాణా చేసే నౌకల మీద దాడులు కానీ అరుదే. వీరి ధ్యేయం శుద్ధి చేసిన చమురును దొంగిలించడం. తరుచు వీరి దాడులు హింసాత్మకంగా మారేవి. బహుశా ఇది తమ లక్ష్యాలను సాధించడానికి కావాలని అవలంబించిన మార్గాలు కావచ్చు. ప్రస్తుతం గినీ అఖాతంలో పైరసీ సంఘటనలు తగ్గుముఖం పట్టినప్పటికీ సమస్య పూర్తిగా సమసిపోలేదు. 2019 నుండి పైరేట్ ముఠాలు నౌకల యాజమాన్యం నుండి, చమురు ఉత్పాదక సంస్థల నుండి డబ్బు రాబట్టడానికి సిబ్బందిని అపహరించడం, వారిని క్రూరంగా హింసించడం మొదలు పెట్టారు.

**కరీబియన్ మరియు ఇతర ప్రాంతాలు :** కరీబియన్ ప్రాంతంలో పైరసీ పూర్తిగా అంతమొందింది అనవచ్చు. వెనెజ్యులాలో ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక సంక్షోభం వల్ల, నిరుద్యోగం వల్ల సరుకుల/మాదకద్రవ్యాల దొంగ రవాణా, చిల్లర మల్లర దాడులు జరుగుతూ వుంటాయి. సాంకేతికంగా ఇవి పైరసీ చర్యలు అయినప్పటికీ పైరసీ అని ఖచ్చితంగా చెప్పలేము. ఇవి స్మగ్లర్ల ముఠాల మధ్య ఘర్షణలు కూడా అవవచ్చు. పైగా ఈ సంఘటనలు ఎక్కువగా వెనెజ్యులా ప్రాంతీయ జలాలలోనే జరుగుతున్నాయి. సోమాలియాలో వలెనే ఇక్కడ కూడా చేపల అక్రమ వేట ఈ సంఘటనలకు ఒక కారణం.

అమెరికా, మెక్సికో సరిహద్దుగా వున్న ఫాల్కన్ చెరువులో మాదక ద్రవ్యాల దొంగ రవాణా జరుగుతుంది. అమెరికా దీనిని పైరసీగా నిర్వచిస్తే, మెక్సికో సరుకుల దొంగ రవాణా అనవచ్చు. మలక్కా, సింగపూర్ జలసంధులలో పైరసీ సంఘటనలు జరుగుతూనే వుంటాయి. ఈ పైరేట్లు ఎక్కువగా ఇండొనీషియాకు చెందిన వారు. వీరి ధ్యేయం సిబ్బంది నుండి, నౌక లాకరు నుండి డబ్బు దొంగిలించడం. చిన్న సైజు తుపాకులు, కత్తులు వీరి ఆయుధాలు. దక్షిణ చైనా సముద్రంలోను, ఫిలిప్పీన్స్ తీరంలోను ఇటువంటి పైరసీ సంఘటనలే జరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు చేపట్టిన చర్యల వల్ల పైరసీ బాగా తగ్గింది. పూర్తిగా అంతరించలేదు, అంతరించదు కూడా.

పైరసీ విషయంలో నాకు వ్యక్తిగతంగా కొన్ని అనుభవాలు వున్నాయి. ఏడెన్ అఖాతం, ఎఱ్ఱ సముద్రాలను కలిపే బాబ్–ఎల్–మండెబ్ జలసంధి ద్వారా అనేక సార్లు ప్రయాణం చేసాను. పైరసీ విస్తరిస్తున్న మొదట్లో ఆ ప్రాంతాలలో వున్నప్పుడు మేము, యాజమాన్యం, అంతర్జాతీయ మారిటైం సంస్థల సూచనల మేరకు భద్రతా చర్యలు చేపట్టే వాళ్ళం. ఈ భద్రతా చర్యలు తూ.చా తప్పకుండా పాటించినప్పటికీ ప్రమాదం పొంచి వుంది అన్న భయం తొంగిచూస్తూనే వుండేది. ఈ చర్యలు పైరేట్లను కొద్దిగా ఎక్కువ సమయం నిరోధించగలిగేవే కానీ, పూర్తిగా ఆపగలిగేవి కావు. తరువాత ఈ భద్రతా చర్యలకు అదనంగా, ఎక్కువ సంఖ్యలో నౌకలు కలిసి ప్రయాణించేవి. ఈ నౌకలకు రక్షణగా కొన్ని నౌకాదళ యుద్ధనౌకలు వెంబడి వచ్చేవి. ఈ ఏర్పాటు ఏడెన్ అఖాతం నుండి యెర్ర సముద్రంలో ప్రవేశించే వరకే. పైరేట్లు నౌకల మీద ఏడెన్ అఖాతానికి ముందు లేక యెర్ర సముద్రంలో ప్రవేశించిన తరువాత దాడులు చేయసాగారు. అందువల్ల నౌకల యాజమాన్యాలు అరేబియా సముద్రం, ఎఱ్ఱ సముద్రాల మీద పయనించే తమ నౌకల మీద రక్షణకై కమాండోలను పంపసాగారు. ఒకసారి మా నౌక మీద వున్న రష్యా కమాండోలు పైరేట్ల నావ మీద కాల్పులు జరిపారు కూడా. బీమా సంస్థలు పట్టుబట్టి వుండకపోతే యాజమాన్యాలు కమాండోలను పంపేవారు కాదేమో.

ఇక్కడ 2012 ఫిబ్రవరిలో కేరళ తీరంలో జరిగిన ఒక సంఘటన గురుంచి మాట్లాడుకోవాలి. ఇటలీకి చెందిన ఒక నౌక ఎఱ్ఱ సముద్రం నుండి సింగపూర్ వైపు వెడుతున్నది. సూయజ్ రేవులో బహుశా కమాండోలు ఆ నౌకకు వచ్చి వుంటారు. బహుశా శ్రీలంకలో వెళ్లి పోయేవారేమో. ఈ నౌక కేరళ తీరంలో వున్నప్పుడు కేరళకు చెందిన కొంతమంది జాలరులు తమ నావలలో ఈ నౌక వైపు వెళ్లారు. భారత తీరంలో పైరసీ లేదు అని ఆ నౌక సిబ్బందికి తెలిసే వుండాలి. అయినా ఆ నౌక మీద వున్న కమాండోలు ఆ జాలర్ల మీద కాల్పులు జరిపారు. ఈ కాల్పులు వారిని బెదిరించడానికి వారి నావ మీద చేయాలి గానీ, సాధ్యమైనంత వరుకు మనుషుల మీద చేయకూడదు. ఈ కాల్పులలో ఇద్దరు జాలరులు మరణించారు. భారత తీర రక్షణదళం ఇటలీ నౌక ఎన్రికా లెక్సిని బంధించి కొచ్చి రేవుకు తీసుకు వచ్చింది. ఆ నౌక మీది ఇద్దరు కమాండోలను కేరళ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనవల్ల భారత, ఇటలీ దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అంతర్జాతీయంగా ఈ సంఘటన మారిటైంలా, జాలరులు భద్రతా, న్యాయస్థానాల పరిధి మొదలగు అంశాలపై చాలా ప్రశ్నలు లేవనెత్తింది. 2021లో భారత్ ఉచ్చన్యాయస్థానము ఈ కేసును మూసి వేసింది. ఇటలీ ప్రభుత్వం నుండి చనిపోయిన జాలరులు ఇద్దరికీ చెరో 4 కోట్ల రూపాయల పరిహారం లభించింది. మునిగిపోయిన వారి నావ యజమానికి 2 కోట్ల పరిహారం లభించింది.

గినీ అఖాతంలో వున్న రేవులు సందర్శిచేటప్పుడు లంగరులో, రేవులో ఎల్లప్పుడూ నౌక మీద సాయుధులైన కావలి వాళ్ళు వుండేవారు. కానీ వీరికి పైరేట్ల ముఠాను ఎదుర్కొనే సామర్థ్యం వుండేది కాదు. అందువల్ల మా నౌకల వంతు వచ్చేవరకు గినీ అఖాతంలోని దేశాల ప్రాంతీయ జలాల బయట నిరీక్షించే వాళ్ళము. రేవులో వున్నప్పుడు కావలి వుండేది కాబట్టి కొంత భద్రత వుండేది. గినీ అఖాతం ద్వారా ప్రయాణించవలసి వస్తే, తీరానికి 300 మైళ్ళ కన్నా ఎక్కువ దూరంలో ప్రయాణం చేసేవాళ్ళం. అంతర్జాతీయంగా చేపట్టిన అనేక చర్యల వల్ల, ఆధునిక ప్రచార సాధనాల వల్ల ప్రస్తుతం పైరేట్ల బెడద తగ్గిందనవచ్చు. పూర్తిగా తప్పిపోయింది మాత్రం అనుకోను.

**చెన్నూరి శివరామకృష్ణ ప్రసాద్**
రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, మర్చెంట్ నావీ,
రచయిత, పరిశోధకులు, ఫోన్ : 991 225 5220

# మా తెలుగు తల్లికి మల్లెపూదండ



శంకరంబాడి సుందరాచారి

డా. ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు

**"మా తెలుగు తల్లికి మల్లెపూదండ**
**మా కన్న తల్లికి మంగళారతులు....**" అనే గేయాన్ని తెలుగువారికీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాష్ట్ర గీతంగా అందించి... తెలుగు ప్రజల హృదయాల్లో స్థిరమైన స్థానాన్ని పొందిన ప్రసన్న కవి- "శంకరంబాడి సుందరాచారి!".

సుందరాచారి 1914వ సంవత్సరం ఆగస్ట్ నెల 10వ తేదిన తిరుపతి పట్టణంలో రాజగోపాలయ్య, కమలమ్మ దంపతులకు జన్మించారు. సుందరాచారి గారి తాత శంకరం బాడి కృష్ణమాచార్యులు తెలుగు పండితులు. ఆయన మనదేశ రెండవ రాష్ట్రపతి అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ గారికి ఉపాధ్యాయులు. తాత ప్రభావం చిన్నతనం నుంచే సుందరాచారిపై వుంది. వారి ప్రభావం వల్లనే తెలుగు భాషపై సుందరాచారికి చిన్నతనం నుంచే మక్కువ పెరిగింది. సుందరాచారి తిరుపతిలోని దేవస్థానం ఉన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాల విద్యను, మదనపల్లి బీసెంట్ థియోసాఫికల్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యను పూర్తి చేశారు. తర్వాత మద్రాస్ చేరి ఉద్యగ యత్నంచేసి, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు నడుపుతూవున్న "ఆంధ్ర పత్రిక" లో ప్రూఫ్ రీడర్‌గా ఉద్యోగంలో చేరాడు. తర్వాత అందులోనే కొంతకాలం ఉపసంపాదకులుగా పని చేశారు.

తర్వాత బెంగళూరుకు చేరిన సుందరాచారి హిస్ మాస్టర్స్ వాయిస్ (హెచ్.ఎం.వి.) గ్రామఫోను కంపెనీలో కొంతకాలం పని చేశారు. అక్కడ వున్న సమయంలో వారు పదకొండు నాటకాలను రచించారు. వీటిని చిత్తూరు నాగయ్య గారి కంపెనీ వారిద్వారా హెచ్.ఎం.వి. వారు రికార్డు చేశారు. అంతేకాకుండా ఈ సమయంలోనే వారు బి.ఎ. పట్టాను కూడా పొందారు. చిత్తూరు జిల్లా బోర్డు ఉన్నత పాఠశాలలో కొంతకాలం ఉపాధ్యాయులుగా, చిత్తూరు, కడప జిల్లాలో పాఠశాలల తనిఖీ అధికారిగా పనిచేశారు. ఈ సమయంలో వారికి సినిమారంగం మీద మక్కువ కలిగి సినీరంగంలో అడుగుపెట్టారు. 1940-45 మధ్య కాలంలో మహాత్మాగాంధీ, బిల్హణీయం, దీనబంధు వంటి సినిమాలకు పాటలు రాశారు. దీనబంధు సినిమాలో నటించారు.

**మాతెలుగుతల్లికి ...**

సినిమా రంగంలో వున్నప్పుడు 1942లో నిర్మించిన *దేశబంధు* సినిమా కోసం ఒక పడవ ప్రయాణపు సన్నివేశానికి పాటరాయమని దర్శక నిర్మాతలు కోరడంతో సుందరాచారి **-మా తెలుగుతల్లికి మల్లె పూదండ** పాటను రాసి యిచ్చాడు. దీనిని చూసిన దర్శకులు- "ఇంతమంచిపాట ఒక పడవ ప్రయాణపు పాటగా వాడడం తప్పు చేయడమే అవుతుంది" అని చెప్పి ఈ పాటను వాడలేదు.

మరోపాటను రాయించి వాడుకున్నారు. ఆ పాట సుందరాచారి వద్ద అలాగే వుండి పోయింది. అయితే ఒకసారి ప్రముఖ గాయని టంగుటూరి సూర్యకుమారి గారు సుందరాచారి వద్దకువెళ్ళి పాటను చూసి అడిగి తీసుకువెళ్ళి గ్రామఫోను రికార్డులలో గానం చేశారు. బాగా ఆదరణ పొందసాగింది. ఆ తర్వాత మొదటి ప్రపంచ తెలుగు మహా సభలలో సూర్యకుమారి ఈ పాటను గానం చేయడంతో అందరినీ ఆకట్టుకుంది. ఈ గీతాన్ని **రాష్ట్ర గీతంగా** అంగీకరించారు. ప్రకటించారు.

శంకరంబాడి సుందరాచారి గొప్ప కవి. పద్య కవిత్వం పట్ల మక్కువ చూపిన ఆయనకు "తేటగీతి "ఇష్టమైన పద్యప్రక్రియ. జాతిపిత మహాత్ముడు

మరణించినప్పుడు "బలిదానం" అనే కావ్యం రచించారు. "సుందర రామాయణం', 'సుందర భారతం' పేర్లతో రామాయణ, భారతాలను రచించారు. బుద్ధగీత, ఏకలవ్య, అపవాదు, శ్రీనివాస శతకం, జపమాల అనే కావ్యాలను రచించారు. రవీంద్ర నాథ టాగోర్ రచించిన గీతాంజలిని అనువదించారు. ఒకసారి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూను కలసి బుద్ధచరిత్రలోని పద్యాన్ని అనువదించి వినిపించి సుందరాచారి ప్రశంసలందుకున్నారు. అలాగే రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ వీరి పదాలను విని సంతోషించి చర్చలు జరిపారు. రాష్ట్ర గీతంలో తెలుగునేల పూర్వవైభవాన్ని, గొప్పదనాన్ని వర్ణించిన సుందరాచారి గారిని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విశ్వనాథ సత్యనారాయణ, రాయప్రోలు సుబ్బారావు, గడియారం వేంకటశాస్త్రి మొదలైన వారి సమక్షంలో "ప్రసన్నకవి" అనే బిరుదుతో సత్కరించారు. అలాగే చిత్తూరు, కడప, తిరుపతిలలో అనేక సంఘాల వారిచే సన్మానాలను, గౌరవాలను అందుకున్న సుందరాచారి గారిని 1975 ప్రపంచ తెలుగు మహాసభల్లో ఘనంగా సత్కరించారు.

రాష్ట్ర గీతం అందించిన శంకరంబాడి సుందరాచారి గారు 1977వ సంవత్సరం ఏప్రిల్ నెల 8వ తేదిన తిరుపతిలో మరణించారు. 2004వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం తిరుపతిలోని తిరుచానూరు రోడ్డులో కాంస్య విగ్రహాన్ని నెలకొల్పగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు అక్కడ నిత్యం మా తెలుగుతల్లికి పాట వినిపించే పరికరాలను ఏర్పాటు చేశారు.

రాష్ట్ర గీతం ద్వారా తెలుగు నేలలో.. తెలుగువారి నాలుకలపై శంకరంబాడి సుందరాచారి చిరంజీవిగా వెలుగొందుతూ వున్నారు.

**డా. ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు**
చరిత్ర అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల
పెండ్లిమర్రి, కడప జిల్లా

## కమ్మతెమ్మెర

**ఆ**దరణీయులైన ఇనాక్ గారికి, మీ ఇంటర్వ్యూను ఆద్యంతం చదివిన తరువాత నా మనసు అనేక భావోద్వేగాలతో నిండిపోయింది. మీ గురించి ఎంతోకాలంగా తెలుసునని భావించిన నాకు, ఈ సంభాషణ ద్వారా మీ వ్యక్తిత్వంలోని మరెన్నో విశిష్ట కోణాలు దర్శనమిచ్చాయి. నిజం చెప్పాలంటే, మీ జీవితగాథను చదువుతున్నంతసేపు నేను ఒక మహోన్నత సాహితీవేత్తను మాత్రమే కాదు, అసాధారణమైన మానవతావాదిని, అపూర్వమైన పోరాటయోధుడిని, విద్యపై అచంచలమైన విశ్వాసం కలిగిన మహనీయుణ్ణి దర్శించిన అనుభూతి పొందాను. చిన్ననాటి అవమానాలు, సామాజిక వివక్ష, పేదరికం, ఆకలి, అనాథత్వపు వేదన ఇవన్నీ ఒక సాధారణ మనిషిని కలచివేసే శక్తులు. కానీ అవే ప్రతికూల పరిస్థితులు మీలో అసాధారణమైన సంకల్పాన్ని మేల్కొలిపి, మిమ్మల్ని ఒక మహావృక్షంగా తీర్చిదిద్దడం అద్భుతం. రైల్వే టికెట్ కొనుగోలు చేయలేని పరిస్థితి నుంచి విశ్వవిద్యాలయ ఉపకులపతిగా ఎదిగిన మీ ప్రయాణం కేవలం వ్యక్తిగత విజయం కాదు; అది మానవ సంకల్పశక్తికి నిలువెత్తు సాక్ష్యం.


కొలకలూరి ఇనాక్

మీ ఇంటర్వ్యూలో నన్ను అత్యంతంగా కదిలించిన అంశం మీ హృదయ విశాలత. జీవితంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నప్పటికీ, ఎక్కడా ద్వేషం లేదు; కసి లేదు; ప్రతీకార భావన లేదు. బదులుగా ప్రేమ, కృతజ్ఞత, కరుణ, మానవత్వం మాత్రమే కనిపించాయి. బాధను సాహిత్యంగా, కన్నీటిని సృజనగా, పోరాటాన్ని ప్రేరణగా మార్చగలిగిన మీ వంటి మహనీయులు అరుదు. మీరు చెప్పిన ప్రతి సంఘటన ఒక పాఠం. ప్రతి జ్ఞాపకం ఒక సందేశం. ప్రతి అనుభవం ఒక విలువైన జీవన దర్శనం. మీ జీవితం చదువుతుంటే, "మనిషి పరిస్థితుల చేత కాదు, తన సంకల్పం చేత ఎదుగుతాడు" అనే సత్యం మరింత బలంగా ప్రతిధ్వనిస్తుంది. సాహితీవేత్తగా మీ కీర్తి ఎంత గొప్పదో ప్రపంచానికి తెలుసు. కానీ ఈ ఇంటర్వ్యూ ద్వారా వెలుగులోకి వచ్చిన మీ అంతరంగ సౌందర్యం, మీ నిరాడంబరత, మీ మానవీయత ఇవే మిమ్మల్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చాయి. వందకు పైగా గ్రంథాలు రచించిన రచయితలు చాలామంది ఉండవచ్చు; కానీ వేలాది జీవితాలను వెలిగించిన వ్యక్తులు మాత్రం చాలా అరుదు. ఆ అరుదైన మహనీయులలో మీరు అగ్రగణ్యులు. గురువు గారూ, మీ జీవితం ఒక పుస్తకం కాదు ఒక విశ్వవిద్యాలయం. మీ అనుభవాలు కేవలం జ్ఞాపకాలు కావు తరతరాలకు మార్గదర్శకాలు. మీ వ్యక్తిత్వం ఒక వ్యక్తిగత గౌరవం కాదు తెలుగు జాతికి, భారతీయ సాహిత్య ప్రపంచానికి ఒక గర్వకారణం. మీ జీవితాన్ని చదివిన తరువాత నా హృదయం నుంచి వెలువడిన ఒక్క మాట...."మీరు రచించిన గ్రంథాల కంటే, మీరు జీవించిన జీవితం మరింత గొప్ప సాహిత్యకావ్యం." మీకు నా హృదయపూర్వక వందనాలు, గాఢమైన అభినందనలు.

***- కిషోర్ కుమార్ బండ్రెడ్డి***

# కళా విధ్వంసం - కళా చౌర్యం

– టి.వి. ప్రసాద్

**కళా విధ్వంసం** : బహిరంగ ప్రదేశాలు, మ్యూజియాలు, ఆర్ట్‌గాలరీలు, దేవాలయాలు, యితర ప్రార్థనా స్థలాలు, రాజభవనాలు, కోట గోడలు మొదలైన ప్రదేశాల్లోని శిల్ప సంపదను ఉద్దేశ పూర్వకంగా ధ్వంసం చేయడం, దానికి నష్టం కలిగించడం, ముక్కులు, ముఖాలు, కాళ్ళు చేతులు విరగ్గొట్టి విరూపం చేయడం లాంటి చర్యలు కళావిధ్వంసం కిందికి వస్తాయి. కళావిధ్వంసం అనాగరిక, ఆటవిక చర్యగా పరిగణించబడుతుంది.

కళా విధ్వంసాన్ని ఆంగ్లంలో ఆర్ట్ వాండలిజమ్ అంటారు. ఈ మాటను సృష్టించింది హెన్రీ గ్రీగ్వా బ్లోయిన్ బిషప్ ఫ్రెంచి విప్లవంలో నాశనమైన కళాసంపదను, కీర్తి కట్టడాలను దృష్టిలో పెట్టుకుని ఈ పదబంధాన్ని 1794లో సృష్టించాడు. జర్మనీ ఆదివాసీ తెగలను వాండల్స్ అంటారు. కళావినాశనంలో, విగ్రహవినాశనంలో (Iconoclasm) కళాకృతులు పూర్తిగా ధ్వంసం ఐతే వాండలిజంలో వాటికి నష్టం జరగుతుంది. కళాకృతుల్ని, ప్రాచీన శిల్ప సంపదను, పురావస్తు సంపదను పాడుచేసే సాంప్రదాయం కళా చరిత్రలో అంతర్భాగంగా కన్పిస్తుంది. ఆందోళనకారులు తమ ఆందోళనను తెలియజేయడానికి, రాజకీయ, సాంఘిక వ్యతిరేకతను వెలిబుచ్చడానికి, ప్రభుత్వ, ప్రజల దృష్టిని సమస్యల పైకి మళ్ళించడానికి కళావిధ్వంసాన్ని ఆయుధంగా వాడుకుంటారు.

విధ్వంసం బారిన పడిన కళాఖండాలను మరమ్మతులు చేయడం, పునర్నిర్మించడం చాలా శ్రమ, ఖర్చుతో కూడుకున్న పని. కొన్ని సందర్భాల్లో వాటి పునరుద్ధరణగానీ, పునర్నిర్మాణం గానీ అసాధ్యమవుతుంది. ఆందోళన కారులకు సులభంగా అందుబాటులో వుండేవి బహిరంగ కళాకృతులు. అందుకే అవి తరచుగా ధ్వసం చేయబడతాయి. కళావిధ్వంసం ప్రాచీనకాలంనుండి జరుగుతుండడం చారిత్రక వాస్తవం. సాధారణ శకం (CE) తొలి శతాబ్దాల నాటి బైజాంటైన్ మహాద్భుత నిర్మాణంగా ఖ్యాతి గడించిన ఆయాసోఫియా (HAGIA SOPHIA) చర్చి 6 వశతాబ్దపు ఓటోమన్ల దాడిలో వారి వశమై, క్రైస్తవ కళా వైభవాన్ని పోగొట్టుకుని అనేక మార్పులు, చేర్పులకు లోనై చివరకు మజీద్‌గా మారిపోయింది.

గుజరాత్ (భారతదేశ) సోమనాథ్ దేవాలయ బిలియన్ల విలువ చేసే సంపద అనేకసార్లు ఘజనీ మహ్మద్, ఆ తర్వాత టర్కీ రాజుల చేత దోచుకోబడింది. దేవాలయ కళాత్మక నిర్మాణం నాశనం చేయబడింది. స్థానికుల, బయటి వారి దాడి, దోపిడీలో ఈజిప్ట్ పిరమిడ్లు, బంగారు వెండి ఆభరణాలను, వస్తువులను, కళాసంపదను కోల్పోయాయి. ఫ్రెంచ్, రష్యా తిరుగుబాట్లు, జర్మన్ నాజీల దాడులు, ప్రపంచ యుద్ధాల సమయాన, ఆ తర్వాత జరిగిన కళా విధ్వంసానికి అంతేలేదు. ఇటీవల జరిగిన కాబూల్ బామియన్ లోయలోని ఆరవ శతాబ్దపు భారీ బుద్ధ విగ్రహాలను తాలిబన్లు ధ్వంసం చేయడాన్ని ప్రపంచ దేశాలు, యు.ఎన్.వోలు ఆపలేక పోయాయి. దక్షిణ భారత దేశంలో ముస్లింల దాడిలో ధ్వంసమైన దేవాలయాలకు, వాటిలోని అపూర్వ శిల్పసంపదకు జరిగిన నష్టం మత మౌఢ్యానికి ప్రత్యక్ష సాక్ష్యం. వలస పాలకుల కళా దోపిడికి అంతే వుండదు. పురావస్తు తవ్వకాల్లో బయట పడిన సాంస్కృతిక చిహ్నాలను, కళాసంపదను తమదేశాలకు తరలించడం, మ్యుజియాలలో ప్రదర్శించడం, వ్యక్తిగత జ్ఞాపికలుగా దాచు కోవడం తరచుగా జరిగే పని. ఇలా కళా విధ్వంసం జరగడానికి కారణాలను పరిశీలిస్తే తెలిసే విషయాలు.

**మత మౌఢ్యం, పరమత సహన రాహిత్యం :** ఇది అన్నిటికన్నా ప్రమాదకరం, భయంకరం. క్రైస్తవ, ఇస్లాం మత ఘర్షణల్లో నాశనమైన కళా సంపద అపారం. ఉదా॥ ఆయాసోఫియా, తాలిబన్ల అకృత్యాలు.

**జాతి వైరం :** ఆర్య ఆర్యేతర విభేదాలు, హిట్లర్ పాలనలో యూదు సంస్కృతిని కళను దోచుకోవడం అనంతర కాలంలో బౌద్ధ జైన మతాల విగ్రహాల విధ్వంసం.

**రాజకీయ కారణాలు :** ప్రభుత్వ అనుచిత నిర్ణయాలకు వ్యతిరేకంగా, అసమర్థ నిర్ణయాలకు నిరసనగా కళావిధ్వంసం

జరుగుతుంది. ప్రభుత్వాలు మారినప్పుడు అంతకు ముందటి ప్రభుత్వ నాయకుల విగ్రహాలు స్థానభ్రంశం చెందుతాయి. ఈ విగ్రహ ప్రతిష్ఠల, విధ్వంసాల సంస్కృతి మన దేశంలో ముఖ్యంగా దక్షిణ రాష్ట్రాల్లో ఎక్కువ.

**వ్యక్తిగత వైరం, ద్వేషం :** తనకు దక్కని వస్తువు, అందం ఇతరులకు కూడా దక్కకూడదన్న విపరీత మనస్తత్వం. అందమైన భవనాలు, ఉద్యాన వనాలను పాడుచేయడం, అద్దాలు పగల గొట్టడం, అందమైన ముఖంపై ఏసిడ్ చల్లడం మొదలైన చర్యలు

**మానసిక పరిస్థితి :** అందం ఏ రూపంలో ఉన్నా భరించలేని మానసిక పరిస్థితి. అందాన్ని నాశనం చేసేదాకా ప్రశాంతంగా ఉండలేకపోవడం.

**అకారణం :** మొక్కల నుండి పువ్వులని పెరికి వేయడం, అందమైన సీతాకోక చిలుకల రెక్కలని విరచడం, బస్, ట్రైన్‌లో సీట్లను చించడం, అద్దాలు పగల గొట్టడం, గోడలమీద పిచ్చిగీతలు గీయడం మొదలైన చర్యలు.

**కళా విధ్వంసం – రాజకీయ నిరసనలు :** వాండలిజం రాజకీయ నిరసనలకోసం తరచుగా జరిగే చర్య. ప్రముఖ కళా ఖండాలను ధ్వంసం చేయడం లేదా విరూపం చేయడం సమస్యను ఎత్తి చూపడానికి అనువైన మార్గం, వాతావరణ కాలుష్యం, సామాజిక అవమానతలు, అధికార మార్పిడి మొదలైన సమస్యలు వాండలిజానికి కొన్ని కారణాలు.

**కళా విధ్వంసంలో అతిసాధారణ పద్ధతి :** పెయింటింగ్ మీద సూప్, సూప్‌లాంటి ఆహార పదార్థాలు, పెయింటింగ్, వార్నిష్ చల్లడం, రక్షణగా వున్న ఫ్రేమ్‌లను, వాటి అద్దాలను పగలగొట్టడం, బ్లేడు, చాకులాంటి పదునైన వస్తువులతో పెయింటింగులను కోయడం, శిల్పాలైతే వాటి ముక్కులు, చెవులు, కాళ్ళు చేతులు విరగొట్టడం. ప్రైవేట్ వ్యక్తుల యిండ్ల కాంపౌండ్ గోడల మీద, ప్రభుత్వ భవనాలమీద నినాదాలు రాయడం, స్ప్రేతో బొమ్మలు వేయడం (గ్రాఫిటీ, మ్యూరల్సు) పెయింట్ చేయడం బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేకుండా రాయడం, చిత్రాలు వేయడం శిక్షార్హమైన నేరం కనుక ప్రపంచ వీధి చిత్రకారులు ఏ అర్ధరాత్రి సమయంలోనో రహస్యంగా తమ పని పూర్తి చేసుకొని మాయమవుతారు. పైగా వీరికి పేర్లు ఉండవు. మారు పేర్లతో చెలామణి అవుతారు. ఇంగ్లండ్ ప్రపంచ ప్రఖ్యాత వీధి చిత్రకారుడు బాంక్సీ అసలు పేరు కాదు. గత మూడు దశాబ్దాలుగా అజ్ఞాతంగా చిత్రాలు వేస్తూ వీధిచిత్రకళకు సాంప్రదాయ కళాస్థాయిని కల్పించాడు. వీధి చిత్రకళ నేరమైనా మ్యూరల్స్, గ్రాఫిటి వ్యాపారం మిలియన్లలో ఉంటుంది.

**కళావిధ్వంసం – చారిత్రక సంఘటనలు :** మహిళల ఓటుహక్కు కోసం ఆందోళణ, ఉద్యమాలు జరుగుతున్న దశలో కళా విధ్వంసం చోటుచేసుకుంది. ఇటీవలి సంఘటనలకు ముఖ్య కారణం రాజకీయాలు. ఆ తర్వాత వ్యక్తిగత ద్వేషాలు, మానసిక సమస్యలు. వీటిన్నిటి వెనకవున్న ఒకే ఒక కారణం కళా కృతులమీద దాడి చేసి, సమస్యను ప్రజాదృష్టికి తేవడం. చరిత్రలో నిలిచిపోయే సంఘటన బైజాంటైన్ కాలపు (726–87, 814–42) విగ్రహ విధ్వంసం (ఐకనో క్లాజ్మ్) ఫలితంగా అనేక మొజాయిక్‌లకు, శిల్పాలకు, కళాకృతులకు తీరని నష్టం జరిగింది. తర్వాత ఐరోపాలో జరిగిన దాడులు, ప్రపంచ యుద్ధాల కాలంలో జరిగిన కళా వినాశనం, ప్రాచ్య దేశాల్లో ముఖ్యంగా మన దేశంలో జరిగిన కళా విధ్వసం అపారం.

ఆధునిక కాలంలో గుర్తుండిపోయే సంఘటనల్లో 1914లో వెలాస్కజ్ పెయింటింగ్ రాక్‌బీవీనస్‌పై మేరీ రిచర్డ్ సన్ అనే మహిళా స్త్రీహక్కుల కార్యకర్త చాకుతో చేసిన దాడి ప్రముఖమైనది. లండన్ నేషనల్ గాలరీలో ప్రదర్శించబడుతున్న చిత్రాన్ని లక్ష్యంగా చేసుకోవడానికి కారణం బ్రిటిష్ స్త్రీకి ఓటు హక్కు లేనందుకు నిరసనగా తానాపని చేసినట్లు చెప్పుకుంది. చిత్రానికి రెండచోట్ల కోతలు పడటం, రిచర్డ్‌సన్‌ను ఆరు నెలలు జైలు శిక్షపడడం, గాలరీ రెండు వారాలు మూతపడడం దాడి ఫలితాలు.

పునరుజ్జీవన కాలపు కళాఖండం. వాటికన్ మ్యూజియంలోని మైఖలేంజిలో పాలరాతి శిల్పం పీటా (pieta) 1972లో వర్జిన్ మేరీ ముక్కు సుత్తి దెబ్బలతో విరగ్గొట్టబడింది. దాన్ని యధారూపానికి తేవడానికే పది నెలల కృషి అవసరమైంది. సుత్తి దెబ్బలు వేరే కోణంలో తగిలి వుంటే విగ్రహం తల విరిగిపోయి వుండేది అని నిపుణులు ఊరట చెందారు. అప్పటినుండి పీటా శిల్పాన్ని బులెట్ ప్రూఫ్ అద్దాల షోకేస్‌లో ప్రదర్శిస్తున్నారు. దాడి చేసిన టోత్ (Toth) బయట వుంటే ప్రమాదమని రోమన్ కోర్టు అతడ్ని మెంటల్ హాస్పటల్‌లో నిర్బంధించి రెండేళ్ళ తర్వాత ఇటలీ నుండి వెళ్ళగొట్టింది.

మోనాలీసా సంచార ప్రదర్శనలో ఉన్నపుడు (1974) ఒక ఉద్యమ కార్యకర్త జపాన్‌లో దివ్యాంగుల సందర్శకులకు సరియైన వసతి సౌకర్యం కల్పించలేదన్న నెపంతో చిత్రంపై స్ప్రే పెయింటింగ్ దాడికి విఫల

ప్రయత్నం చేసి పట్టుబడి 3లక్షల యెన్‌ల జరిమానాతో బయటపడింది. గత 110 సంవత్సరాలలో మోనాలిసాపై జరిగినన్ని దాడులు, ఒకసారి దొంగిలించబడడం ఇంకే పెయింటింగ్ పైనా జరగలేదు. ప్రపంచ ప్రఖ్యాత గెర్నికా, పికాసో చిత్ర రాజం న్యూయార్క్ మోడర్న్ ఆర్ట్ మ్యూజియంలో ప్రదర్శించబడుతున్నప్పుడు టోనీషప్రాజి అనే కళావ్యాపారి గెర్నికా KILL LIES ALL అంతా అబద్ధం అనే అర్థం వచ్చేలాగా స్ప్రే పెయింట్ చేశాడు.

రెంబ్రాంట్ పెయింటింగ్ నైట్‌వాచ్‌పై పెద్ద చాకుతో దాడిచేసి అడుగు పొడుగు కోత పెట్టి, కాన్వాస్‌కు నష్టం కలిగించారు (1974), దాన్ని బాగుచేయడానికి నాలుగు సంవత్సరాలు పట్టింది. 1990లో ఇదే పెయింటింగ్‌పై మరొకసారి దాడి జరిగింది. రెంబ్రాంట్‌దే మరో పెయింటింగ్ రష్యా హెరిటేజ్ మ్యూజియపు ముఖ్య ఆకర్షణ దేనీ (Dannie) అనే నగ్న చిత్రంపై ఏసిడ్ చల్లి పాడు చేశారు. పన్నెండు సంవత్సరాల కృషి ఫలితం పనికి రాదనుకున్న పెయింటింగ్ తిరిగి ప్రాణం పోసుకుని ప్రదర్శించబడుతోంది. డుషాంప్ యూరినల్ ఫౌంటేన్ (1993), హేన్‌వంశ గాజు పాత్రను పగుల గొట్టడం (1995) వీట్ మేండరిన్-కాంపోజిషన్ (1996), తాలిబన్లు విధ్వంసం చేసిన బామియాన్ భారీ బుద్ధ ప్రతిమలు (2001) పికాసో చిత్రం-వుమన్ ఇన్ రెడ్ ఆమ్ ఛైర్ (2012), మార్క్ రోథ్‌కో-బ్లాక్ ఆన్ మెరూన్ (2012), అనిష్ కపూర్ పబ్లిక్ ఆర్ట్ ద క్లౌడ్, ద డర్టీ కార్నర్ (2015) పికాసో పెర్‌ఫామెన్స్ (2019), విన్సెంట్ వాంగో-సన్ ఫ్లవర్ (2022), మోనాలీసాపై కేక్‌తో దాడి (2022), వెలాస్కజ్ - రాక్‌బీ వీనస్ (2023) మొదలైనవన్నీ ఇటీవల కాలంలో దాడి బారినబడిన చిత్రాలు. (బ్రాకెట్లలో ఉన్నవి అవి దాడికి గురైన సంవత్సరాలు) వాతావరణ పరిరక్షణ ఆందోళన కారులు జస్ట్ స్టాప్ ఆయిల్, అల్టిమా జెనరేషియో వంటి బృందాలుగా ఏర్పడి సంక్షోభంపై దృష్టిని ఆకర్షించడానికి మ్యూజియాలను లక్ష్యంగా చేసుకుంటారు. శిలాజ ఇంధన ప్రాజెక్టులను ఆపవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పడమే వారి లక్ష్యం. ఇలాంటి చర్యలు తరచుగా ప్రసిద్ధ, రక్షిత పెయింటింగులు, శిల్పాలను లక్ష్యంగా చేసుకుని చేసేదాడులు వివాదానికి దారి తీస్తాయి.

**కళా చౌర్యం :** పారిస్‌లో సీన్ నది వైపు చూస్తున్న లూవర్ భవనానికి మరమ్మతులు జరుగుతుండగా భవన నిర్మాణ కార్మికుల వేషాల్లో దుండగులు పట్ట పగలు గాలరీ కిటికీని పగులగొట్టి, లోపలి అద్దాల బీరువాలను ముక్కలు చేసి వాటిలో భద్రపరిచిన నెపోలియన్ రాజసంపదను దోచుకున్నారు. మొత్తం 23 ఆభరణాల నుండి తొమ్మిదింటిని కొన్ని బిలియన్ డాలర్ల విలువచేసే వాటిని దోచుకుని నిముషాల్లో మాయమయ్యారు. క్వీన్ యూజీన్, నెపోలియన్ IIIవ చక్రవర్తి భార్య కిరీటాన్ని-1354 వజ్రాలు, 56 ఎమెరాల్డ్ (పచ్చలు) పొదిగిన దాన్ని మ్యూజియం వెలుపల గోడ దగ్గర వదిలి వెళ్ళారు. (20 అక్టోబర్ 2025, వార్త). లూవర్ మ్యూజియంలోనే అంతకు ముందు జరిగిన దోపిడీలు, కళావిధ్వంసాలు అనేకం. 1990లో రెన్వా 'కూర్చొని వున్న మహిళ' పెయింటింగును ఫ్రేమ్ కట్ చేసి దొంగిలించారు. 1983 పునరుజ్జీవన కాలపు (రినైజాన్స్) రెండు కవచాలు దోచుకోబడి 2011లో తిరిగి మ్యూజియం చేరుకున్నాయి. అంతకన్నా ముందు 1976లో ఫ్రాన్స్ చక్రవర్తిది వజ్రాలు పొదిగిన ఖడ్గం దోచుకోబడింది.

1911లో దోచుకోబడిన ప్రపంచ ప్రఖ్యాత పెయింటింగ్ మోనాలీసాను దోచుకున్నది లూవర్ మాజీ ఉద్యోగి. తర్వాత రెండు సంవత్సరాలకు అది ఫ్లోరెన్స్ నుండి లూవర్ చేరుకుంది. ఆ సందర్భంగా కవి అపోలినైన్‌ను, ప్రఖ్యాత పెయింటర్ పికాసోను అనుమానించారు. దేశ ప్రతిష్ట కోసం 'మోనాలీసా'ను ఇటలీ చేర్చాడు. దాని సృష్టికర్త లియోనార్డో డావిన్సీ ఇటలీ దేశస్తుడు. అంత వరకూ అంతగా పేరు ప్రఖ్యాతలు లేని మోనాలీసా పెయింటింగుకు, దాని సృజనకర్త డావిన్సీకి ఈ సంఘటన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా గొప్ప ప్రచారమూ, గుర్తింపూ దక్కాయి. ఇలాంటి సంఘటనలు కళాచరిత్రలో కోకొల్లలు. ఎక్కువగా వ్యక్తిగత ప్రయోజనం కోసం గానీ, వ్యవస్థీకృత నేర ప్రపంచం తరఫునగానీ కళాచౌర్యం జరుగుతుంది. ఇది బిలియన్లలో జరిగే చీకటి వ్యాపారం. మాదక ద్రవ్యాల, ఆయుధాల చేరవేత (దొంగవ్యాపారం) తర్వాత మూడవ స్థానం కళాచౌర్యానిదే. కళాచౌర్యం అంటే చట్ట వ్యతిరేకంగా ఒక దేశ సంస్కృతీ సంపదను వేరొక దేశానికి చేరవేయడం. చాలా పెద్ద మొత్తంలో జరిగే ఆర్థిక, అనైతిక వ్యాపారం. మ్యూజియాలు, ఆర్ట్ గాలరీలు, పురాతన వస్తు సముదాయం చౌర్యానికి లక్ష్యాలు. దొంగిలించబడిన కళాసంపదలో చాలాభాగం 90% పైగానే ఎక్కడ ఉన్నదీ తెలియదు. తిరిగి సాధించడం అసాధ్యం. చాలా కొద్ది శాతం మాత్రమే దొంగిలించబడిన కళాకృతులు దొరుకుతాయి. కళాచౌర్యం చాలా లాభసాటి

వ్యాపారం – కళాకృతులు చీకటి బజారు వ్యాపారస్తులకు కరెన్సీ లాగా పనిచేస్తాయి; కొన్నిసార్లు డ్రగ్స్‌తో వస్తు మార్పిడీ జరుగుతుంది.

**కళాచౌర్యానికి కారణాలు:** చాలావరకు ఆర్థిక ప్రయోజనం, అత్యాశ, అరుదుగా వ్యక్తిగత సేకరణలో భాగంగా జరుగుతుంది. ప్రాచీన కాల వారసత్వ సంపద వివాదాల నుండి నేటి డిజిటల్ నేరాల వరకు కళాచౌర్యం వ్యాపించి వుంది. అనైతికంగా, చట్ట విరుద్ధంగా వస్తువుల్ని వాటి యజమాని నుండి శాశ్వతంగా దూరం చేయడం దీని లక్షణం.

**చౌర్యానికి గురయ్యే కళ :** పేరుగాంచిన కళాఖండాలు (artefacts) ఎక్కువగా దొంగిలించబడతాయి. ఇవి యుద్ధసమయంలో, వలస వాద సమయంలో తమ ఆధిపత్యానికి, అధికారానికి గుర్తుగా నిలిచిపోతాయి. జర్మనీ నాజీల కళా దోపిడీ కార్యాచరణలో యూదుల సంస్కృతీ సంపదను, ప్రతీకలను విచక్షణారహితంగా దోచుకోవడం ఒక భాగం మాత్రమే. (వివరాలకు 'ద ట్రెయిన్' **మిసిమి**, ఏప్రిల్ 25 సంచిక చూడగలరు)

మ్యూజియాలు, ఆర్ట్ గాలరీలు, ప్రైవేట్ వ్యక్తుల కళాసేకరణల లక్ష్యంగా కళాచౌర్యం జరుగుతుంది. అంతర్జాతీయంగా జరిగే కళాచౌర్యాన్ని అరికట్టడం అసాధ్యం ఐనా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (FBI), ఇంటర్‌పోల్ డిటెక్టివ్ సంస్థల సహకారంతో దొంగిలించబడిన కళాఖండాల ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం జరుగుతుంది.

ఆర్ట్ లాస్ రిజిస్టర్ (పోయిన కళాఖండాల వివరాలను తెలిపే రిజిస్టర్) ఇది పెద్ద డాటా బేస్ (వివర సేకరణ) వ్యవస్థ అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ వల్ల దొంగిలించబడిన వస్తువులను తిరిగి అమ్మకోవడం కష్టమవుతుంది. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత దోపిడి బారిన పడిన కళాసంపదను ఆయా దేశాలకు చేర్చే ప్రయత్నాలు జరిగినా ఫలితం అంతంత మాత్రమే. కొలంబియా జర్నల్ ఆఫ్ ఆర్ట్, ఎన్‌సైక్లో పీడియా బ్రిటానికా, ఆర్ట్ న్యూస్ మొదలైన వివిధ వెబ్‌సైట్లు కళాచౌర్య వివరాలను తెలుసుకోవడానికి ఉపకరిస్తాయి.

**కళాచౌర్య చరిత్రలో నిలిచిపోయే కొన్ని సంఘటనలు :** మోనాలిసా చౌర్యం (1911) కళా చరిత్రలో సంచలనం కలిగించిన గొప్ప సంఘటన. ఆగస్ట్ 21, 1911న విన్సెంజో పెరూ జియా లూవర్ మాజీ ఉద్యోగి, పెయింటింగును కోటు లోపల దాచుకొని బయట పడ్డాడు దీన్ని దొంగిలించడానికి కారణం దేశభక్తి. ఇటలీకి చెందిన ఇతడు, లియోనార్డో డావించి కళాఖండం మోనాలీసాను తమ దేశానికి చేర్చిన ఘనత కోసం ఈ పని చేశాడు. రెండు సంవత్సరాల ఉత్కంఠ తర్వాత దాన్ని కళా వ్యాపారికి అమ్ముతూ పట్టుబడతాడు. అంతవరకూ కళా చరిత్ర కారులకు, కొద్దిమంది కళా ప్రియులకు మాత్రమే మోనాలిసాను గురించి తెలుసు. ఈ దొంగతనంతో చిత్రానికి, దాని రూపకర్త లియోనార్డో డావించీకి అంతులేని ప్రచారం లభించింది. 1931లో 'మోనాలిసా చౌర్యం' అనే సినిమా వచ్చింది.

**ఇసబెల్లా స్టివార్డ్ గార్డెన్ చౌర్యం:** 18 మార్చి, 1990న ఇద్దరు దొంగలు పోలీస్ వేషంలో పట్టపగలు ఆర్ట్ గాలరీలోని 13 కళాకృతులను దోచుకుని మాయమయ్యారు. వాటి విలువ ఐదు వందల మిలియన్ డాలర్లు ఉంటుంది. చరిత్రలో అతిపెద్ద చౌర్యంగా మిగిలిపోయింది. వాటి ఆచూకీ ఇంతవరకూ తెలియలేదు. 2006లో ఎక్కువ సార్లు దొంగిలించబడిన పెయింటింగ్ రెంబ్రాంట్ చిత్రించిన జాకబ్ డి గెయిన్ III గినిస్ ప్రపంచ రికార్డుల కెక్కింది. కారణం అది మొదటిసారిగా 1966లో ఆ తర్వాత 1973, 1981, 1983లో మొత్తంపై నాలుగుసార్లు దొంగిలించబడింది.

**విట్‌వర్త్ గాలరీ, మాంచెస్టర్ దొంగతనం :** చాలా కళా ఖండాలు డబ్బు కోసం దొంగిలించబడతాయి. 2003లో ఈ గాలరీలో జరిగిన దొంగతనం గాలరీలో భద్రతాచర్యల లోపాన్ని ఎత్తిచూపడానికి జరిగింది. దొంగిలించబడిన విన్సెంట్ వాంగో, పికాసో గుగేన్‌ల నీటి రంగు చిత్రాలు పార్క్ బాత్ రూంలో దాచిన సమాచారంతో వాటిని గాలరీకి చేర్చారు. 1994లో ఎడ్వర్డ్ ముంక్ చిత్రం ద స్క్రీమ్, 1977లో వాంగో 'పాపీపూలు, పెయింటింగ్, నాజీ లూటింగ్‌లో మాయమైన పెయింటింగులు అనేకం.

**ఫోర్జరీ :** వెర్మీర్ కళాఖండాలను ఫోర్జరీ చేసి హేన్‌వాన్ మా జెరన్ అనే కళాకారుడు అప్రతిష్ట పాలయ్యాడు. 1930ల్లో తన సాంకేతిక ప్రజ్ఞతో వెర్మీర్ చిత్రాలను తనవిగా చెలామణి చేశాడు, కళా పండితులను మోసం చేశాడు.

**సౌ యువాన్ ఫోర్జరీలు :** ఇతను గ్వాంగ్ జౌ ఫైన్ ఆర్ట్ అకాడమీలో లైబ్రేరియన్. లైబ్రరీలోని 143 పెయింటిగులను దొంగిలించి వాటి స్థానంలో నకిలీ

చిత్రాలను పెట్టాడు. 2015లో చిత్రాలు దొంగిలించిన నేరానికి పట్టుబడి, అంతకుముందు కూడా చాలా పెయింటింగులు తనకన్నా ముందు వాళ్ళ చేత ఫోర్జరీ చేయబడ్డాయని అంటాడు.

కళా చౌర్య చరిత్ర ను కథలు కథలుగా చెప్పుకోవచ్చు. కళాచౌర్యం మీద వచ్చిన పుస్తకాలు, డాక్యుమెంటరీలు, ఫిల్ములు, టి.వి షోలు అనేకం. మైకేల్ ఫిన్కెల్-దఆర్ట్ థీఫ్, దగార్డియన్ హెయిస్ట్ ఉల్రిక్ బోసర్, స్టీలింగ్ మోనాలిసా - కార్ నన్‌ల పుస్తకాలు; ద థామస్ క్రౌన్ అఫైర్ (1968/ 1999), దిస్ ఈజ్ ఏ రాబరీ-నెట్‌ఫిక్స్ ఫిల్మ్, ద మోన్యుమెంట్స్ మెన్ (2014) ఫిల్ములు ప్రముఖమైనవి.

**కళాదోపిడీ, చౌర్యం - పికాసో వ్యాఖ్యానం :** ప్రతి కళాకారుడూ ఇతర ఆర్టిస్టుల భావాలను దొంగిలిస్తాడు. కళాకారుల ప్రభావం నుండి పుట్టేది కళ పట్టుబడే వరకు నీవు దాచుకున్న కళంతా నీ సొంతమే.

**తంగెడ విశ్వేశ్వర ప్రసాద్**
(టి.వి.ప్రసాద్), రిటైర్డ్ ప్రిన్సిపాల్.
హైదరాబాద్, ఫోన్ నెం. 798 139 8250

## వేయి ప్రశ్నలుండు

ప్రశ్నించే తత్వం లేనిదే జ్ఞానం సంపాదించగడం కష్టం అని చెప్పే పద్య నార్లవారి "వేయిప్రశ్నలుండు విజ్ఞానవేత్తకు". హేతువాదమూ, మానవతా... రెండు కళ్లుగా నార్ల వెంకటేశ్వరరావు రచించిన 727 పద్యాల్లో ఈ రెండు ఆలోచింపచేస్తాయి.

**వేయి ప్రశ్నలుండు విజ్ఞానవేత్తకు / ప్రశ్నలుండబోవు పామరునకు / విజ్ఞుడౌను నరుడు జిజ్ఞాస చేతనే / నవయుగాల బాట నార్లమాట**

ఎందుకు, ఏమిటి, ఎలా అంటూ ప్రతిదాన్నీ ప్రశ్నించే తత్వం ఉంటేనే విజ్ఞానం పెరుగుతుంది. ఆ తెలివిలేని వాడికి అసలు ప్రశ్నలే ఉండవు. దేన్నైనా తెలుసుకోవాలనే ఆసక్తి, కుతూహలం ఉంటేనే మనిషి విజ్ఞుడవుతాడు. లేనివాడు పామరుడిగానే మిగిలిపోతాడని ఈపద్య భావం.

**ప్రశ్ననుండి పుట్టు పరిణత జ్ఞానమ్ము / ప్రశ్నతోడ పెరుగు ప్రాభవమ్ము / ప్రశ్నలేక ప్రగతి ప్రశ్నార్థకమురా నవయుగాల బాట నార్లమాట** అనే పద్యం ఇంకొకటి

అసలు జ్ఞానం ఎలాపుడుతుంది? ప్రశ్నించడం నుంచే పుడుతుంది. ప్రశ్నిస్తేనే వైభవం పెరుగుతుంది. నిజానికి ప్రశ్న లేకపోతే అభివృద్ధి ఉంటుందా? అన్నదీ అనుమానమే.

*- దేవినేని మదుసూధనరావు, తెన్నేరు, ఫోన్ : 9989051200*

## కమ్మతెమ్మెర

**జూ**న్ నెల **మిసిమి**లో ప్రొఫెసర్ ఇనాక్ గారితో మీరు జరిపిన ముఖాముఖి చదివాను. వారు మొహమాటం లేని మనిషి అని గ్రహించాను. దాపరికం లేకుండా తన జీవిత చరిత్ర వినిపించిన తీరు ఆకట్టుకున్నది. తనకు దొరికిన ప్రతి అవకాశం వదలలేదు ఇనాక్ గారు. వారి జీవితం బడుగు బలహీన వర్గాల వారికి దారి దీపం. నోబెల్ ప్రైజ్‌కు దగ్గర్లో ఉన్నారని చదివి మహదానందం పొందాను. గుర్రం జాషువా గుర్తొచ్చారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహా పురుషులవుతారు...అన్న సినీ పాటల రచయిత మదిలో మెదిలారు.



బంకిం నవల **ఇందిర** ఆ నాటి పరిస్థితులకు అద్దం పడుతుంది...అంటే ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ఆనాటి పరిస్థితులలో అటువంటి నవల రాయడం సాహసమే. బంకించంద్ర ధైర్యం చేసి అప్పటి సామాజిక పరిస్థితులను ప్రశ్నించాడు. ఈ "తిరుగుబాటు" నవలను ఆ నాటి సమాజం ఎలా తీసుకున్నది తెలిపితే రచనకు నిండుదనం వచ్చేది... అనేది నా సొంత అభిప్రాయం. ఇక నేటి పరిస్థితికి వస్తే.... మక్కికి మక్కికి ఆ పరిస్థితి నేడు కూడా ఉంది అనేది నిజం. ఏ కాలంలో నైనా...మనుషుల ఆలోచనా విధానం ఒకే విధంగా వుంటుందా?కాలంతో పాటు మనుషులు మారరా? మారకూడదా? (పార్థసారథి సొగసైన భాష ఆపకుండా చదివించింది.)

*ప్రొఫెసర్ నరసయ్య పంజాల, హైద్రాబాద్.*

## కమ్మతెమ్మెర

ఇదివరకటి సంచికల్లో...సత్యాన్వేషి సత్య పసాద్, తోటకూర ప్రసాద్, పాపినేని వంటి పెద్దలు చెప్పిన విషయాలు, వాళ్ల అభిప్రాయాలూ.. వారి ముచ్చట్ల వల్ల అనేక విషయాలు తెలుసుకోగలిగాను.

ముఖ్యంగా పాపినేనితో చేసిన సంభాషణ భూమి నుంచి పైకి లేచినంత గొప్పగా, ఉదాత్తంగా అనిపించింది. ఏప్రిల్ సంచికలో పాపినేనితో జరిపిన సుదీర్ఘ సంభాషణ ఈ కాలపు సాహిత్య చైతన్యపు మరో అంచున నిలబెట్టింది. అవిచ్ఛిన్నత, నిసర్గత, పరాయితనం వంటి అంశాలపై పాపినేని చేసిన ప్రతిపాదనలు కోశాంబిని గుర్తుచేశాయి. "భిన్నత్వమే భారతీయ సంస్కృతి యొక్క ప్రత్యేకత అని చాలామంది భావిస్తారు కానీ, నిజమైన ప్రత్యేకత భిన్నత్వం కాదు అవిచ్ఛిన్నత. గతం యొక్క భౌతిక అవశేషాలే (పురావస్తు) కాకుండా సామాజిక, సాంస్కృతిక అవశేషాలు సమాజం పొరలలో భద్రంగా ఉండటం, అవి నేటికీ ఏదో ఒక రూపంలో కొనసాగడం" అనే కోశాంబి భావనని సాహిత్యానికి అనువర్తించి ఆధునిక సాహిత్య విమర్శకి సరికొత్త వెలుతురు అందించిన పాపినేని ధన్యులు.


చిలవేరు

ఇక, ఈ మాసపు **మిసిమి** ఆత్మీయ అతిథి కొలకలూరితో చేసిన సంభాషణ హృద్యంగా అనిపించింది. ఒక పక్క నవ్వు, మరొపక్క దుఃఖం, మరికాసేపు నవ్వుముఖం! వారి జీవితమంతట విస్తరించిన తరాలనాటి చీకటి వారి సంకల్పశక్తి ముందు మబ్బులాగ ఎలా విడిపోయిందో, ఆనాటి అవమానకర గ్రామీణ భారతంలో ఒకొక్క సమస్యనూ అధిగమిస్తూ వైస్ ఛాన్సలర్ స్థాయికి ఎదిగిన తీరు కళ్లముందు కదలి, ఎడతెగని దిగులేదో మనసు అడుగున మడుగుకట్టింది.

*నాగరికత-పరిణామశీలత*పై రచయిత అశ్వినీ కుమార్ ముచ్చటించిన తీరుని చూశాక..ఈ నాగరికత ప్రవాహ వేగానికి కాస్త ఎడంగా నిలబడి కొన్ని కొన్ని విషయాలు నిర్ధారణ చేసుకోవాలనిపించింది. మనమెటుపోతున్నాం!

ఈ ప్రచండ వేగంలో ఏమేమి కొల్పోతున్నాం.. ఏమేమి పొందుతున్నాం! కాల ప్రవాహాన్ని, కాలం తెచ్చే మార్పుల్ని, వింత ధోరణుల్ని, వైపరీత్యాలను ఎరుకతో చాలా స్పష్టంగా చూపించారు. ధన్యవాదాలు మాస్టారూ! కాలం గురించి కూడా ఇంతగా పట్టించుకునేవాళ్లు ఈ కాలంలో ఎవరైనా ఉన్నారూ అనంటే అది మీరే!

వై.పార్థసారథి గారి బెంగాలీ నవలా పరిచయాలు.. బంకించంద్రుని సారస్వతంలో ఉదాత్త భావాల స్త్రీ మనోవాంఛితాలమీద.. విశ్లేషణాత్మక కథనాలు ముచ్చటగొల్పుతున్నాయి. గుర్రాన్ని చర్చనీయాంశంగా పెట్టుకుని ఎంత విజ్ఞానవంతమైన, తీక్షణమైన పరిశీలన చేయవచ్చో జొన్నలగడ్డ మార్కండేయుల అశ్వశబ్దంపై చేసిన రచన అద్భుతమనిపించింది. ఒకానొక కాలపు అశ్వశిక్షణ, సంరక్షణ, చికిత్స విధానాలను తెలిపే పద్ధతులు జ్ఞప్తికొచ్చాయి. ఈ కాలపు చరిత్ర, సాహిత్య పరిశోధకులకు అక్కొరకొచ్చే మంచి వ్యాసమిది. సంచిక ఆఖర్లో ఈసారేంటో చాలా విలువైన సమీక్షా వ్యాసాలొచ్చాయి. ఉపనిషత్ ఉద్యానవనమ్‌పై విజయవాఘువరెడ్డి చేసిన పుస్తక పరామర్శ చాలా సారభూతమైంది. డాన్ కిహోటీ, చార్లీ చాప్లిన్ వంటి మహోన్నతుల జీవనరేఖలు.. ఆ కథనాలు ఎప్పుటికీ స్మరణీయాలే! ఈసారి పత్రిక పఠనం... అరటాకు పరచుకొని పప్పు, కొత్తావకాయతో ఒక రెండు ముద్దలు ఎక్కువ తిన్నట్టు తృప్తిగా అనిపించింది.

**- మనోహర్ కన్నీడి**

# ఆచార్య పోకల లక్ష్మీనరసు

*– డా. ఎ.బి. సాయిప్రసాద్*

**ఆ**ధునిక రచయిత శ్రీదేవదత్త పట్నాయక్ ప్రకారం "మతం జ్ఞాని అయిన ఒక వ్యక్తి ద్వారా ప్రారంభం అవుతుంది. అతని నిర్యాణం తరువాత వ్యక్తి స్థానాన్ని ఒక సంస్థ భర్తీ చేస్తుంది. (T.O.I 22-04-2025) క్షీణదశలో ఉన్న బౌద్ధమతాన్ని దక్షిణ భారతదేశంతో పాటు ఆసియా, ఆఫ్రికాఖండాలలో 16వ శతాబ్దపు బుద్ధగుప్తనాథుడు పునరుద్ధరించాడు. కొనఊపిరితో ఉన్న బౌద్ధాన్ని 19వ శతాబ్దంలో జన్మించి (1861) 20వ శతాబ్దపు మూడవ దశకం తొలిభాగం (1934)లో తనువు చాలించిన ఆచార్య పోకల లక్ష్మీనరసు మనదేశంలో ముఖ్యంగా మద్రాసు ప్రెసిడెన్సీలో పునరుజ్జీవింపజేసాడు. మనదేశపు రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్.అంబేద్కర్ మహాశయుడు ఆచార్య పోకల లక్ష్మీనరసును 19వ శతాబ్దపు ప్రాడిజీగా అభివర్ణించాడు. అగ్రవర్ణాలవారి అణచివేతకు గురైన డా॥ బి.ఆర్. అంబేద్కర్ హిందూమతానికి ప్రత్యామ్నాయ మతం అన్వేషణలో ఉన్నాడు. అప్పుడు ఆచార్య పోకల లక్ష్మీనరసు రచించిన 'ది ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం' (The Essence of Buddhism) అనే గ్రంథాన్ని చదివాడు. ఇది డా॥ బి. ఆర్. అంబేద్కర్‌ను ప్రభావితం చేసింది. ఆ పుస్తకం రచయిత ఒక తెలుగువాడైన కారణంగా అతనిని గురించి తెలుసుకొనేందుకు కాంగ్రెసు నాయకుడైన పట్టాభి సీతారామయ్యను సంప్రదించాడు. వివరాలు తెలుసుకున్న డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఆ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివి తనలో జీర్ణించుకున్నాడు. 1907లో తొలిసారిగా ముద్రింపబడిన ఆపుస్తకం ప్రతులు దొరకకపోవడంవల్ల, 1948లో ఆ పుస్తకం మూడవ కూర్పును ప్రచురించి దానికి ముందుమాట రాస్తూ..."భారతదేశపు పలు ప్రాంతాల నుండీ, ఇటీవల చాలామంది బౌద్ధానికి సంబంధించిన మంచి పుస్తకాన్ని గురించి తెలియజేయండని నన్ను అడుగుతున్నారు. వారి కోరిక ప్రకారం నేను ఆచార్య పోకల లక్ష్మీనరసు ద్వారా రచించబడిన "ది ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం"ను ఏ మాత్రం సంకోచం లేకుండా సూచిస్తున్నాను. బౌద్ధంపైన ఇంత వరకు ప్రచురింపబడిన పుస్తకాలలో ఇది అతి ఉత్తమమైన పుస్తకమని నేను భావిస్తున్నాను." అని అభిప్రాయపడ్డారు.



ఆచార్య పోకల లక్ష్మీనరసు

ఆచార్య పోకలలక్ష్మీనరసు తండ్రిపేరు పోకలచెల్లం నారాయణగురు. ఇతడు ఒక న్యాయవాది. వీరి స్వస్థలం గుంటూరు. అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని హైకోర్టులో ప్రాక్టీసు కోసం పోకలచెల్లం నారాయణగురు తమ మకామును మద్రాసు (చెన్నై)కు మార్చారు. వీరిది సంపన్న కాపుకుటుంబం. లక్ష్మీనరసు తల్లి వైష్ణవ సంప్రదాయానికి చెందినవారు. ఈ దంపతులకు లక్ష్మీనరసు 1861వ సంవత్సరంలో జన్మించాడు. పోకల లక్ష్మీనరసుకు ముగ్గురు సోదరులు ఒక సోదరి. సోదరి పేరు ఆండాల్ అమ్మాళ్. తల్లి సంప్రదాయక వైష్ణవానికి చెందిన వ్యక్తి కావడంవల్ల కావచ్చు పిల్లలందరికి అసలు సిసలైన వైష్ణవ పేర్లను పెట్టడం జరిగింది. పోకలలక్ష్మీనరసుకు ముగ్గురు సోదరులు. వారిపేర్లు: కృష్ణస్వామి, రామానుజం, భాష్యం. నరసు అన్నది నరసింహానికి పొట్టిపేరుగా భావించాలి. లక్ష్మీనరసుకు ఇద్దరు సోదరులైన రామానుజం, భాష్యం ఒక రైలు దుర్ఘటనలో మరణించారు. లక్ష్మీనరసు రుక్మిణి అమ్మాళ్‌ను పెండ్లిచేసుకొన్నాడు. వీరికి కలిగిన పదిమంది సంతానంలో ఇద్దరు మాత్రమే మిగిలారు. కూతురు పేరు వీరలక్ష్మి. కొడుకు వెంకట్ పారిస్‌లో విద్యనభ్యసిస్తున్నప్పుడు చనిపోయాడు. పుత్ర శోకాన్ని తట్టుకోలేక ఆ తరువాత రుక్మిణీ అమ్మాళ్ కూడా చనిపోయింది. రుక్మిణీ అమ్మాళ్ కూడా ఒక సంఘసేవకురాలుగా రాణించింది. కూతురు వీరలక్ష్మికి సంబంధించిన విషయాలు ప్రస్తుతం తెలిసి రావడంలేదు. భవిష్యత్తులో పరిశోధకులు తెలుసుకోగలరని ఆశిద్దాం. 1925వ సంవత్సరంలో చెన్నై పెరంబూర్‌లోని

బౌద్ధ ఆరామమంలో రామరత్నం అమ్మాళ్‌ను నరసు పెండ్లి చేసుకున్నాడు. ఆచార్య పోకలలక్ష్మీనరసు పేరు చివర నాయుడు అన్న మాట ఉండేది. కుల వ్యవస్థకు వ్యతిరేకి కావడంవల్ల తన పేరు నుండి 'నాయుడు'ను తొలగించుకున్నాడు. మద్రాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న మద్రాసు క్రిస్టియన్ కళాశాల నుండి భౌతికశాస్త్రంలో బి. ఎ. పట్టాను పొందాడు. అప్పుడు ఆయన వయసు 20 సంవత్సరాలు. తన బి. ఎ. పట్టాతో మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితుడయ్యాడు. భౌతికశాస్త్రంతోపాటు రసాయన శాస్త్రాన్ని కూడా బోధించేవాడు. ఇంత పిన్నవయసులో బి.ఎ. పట్టాను పొందడం అన్నది అప్పట్లో కనివిని ఎరుగని విషయం. తన హేతువాద భావజాలం కారణంగా మతపరమైన మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో కొనసాగలేక పోయాడు. ఆ తరువాత కొంత కాలంపాటు తిరుచిరాపల్లి బిషప్ హేబర్ కళాశాలలో పనిచేసాడు. అది కూడా సరిపోక సామాన్య హిందువుల కోసం అప్పటికే ఏర్పడిన పచ్చియప్ప కళాశాలలోని భౌతికశాస్త్ర శాఖలో పనిచేసాడు. 16 సంవత్సరాల సుదీర్ఘ సేవ తరువాత 1925లో పదవీ విరమణ చేసాడు.

పోకలలక్ష్మీనరసు 1892-94వ సంవత్సరపు జాగీర్‌దార్ ఆఫ్ ఆరణి బంగారు పతకాన్ని సంయుక్తంగా పొందాడు. ఖచ్చితమైన శాస్త్రాలను (Exact Sciences) ఇతడు ఎక్కువగా ఇష్టపడేవాడు. భౌతికశాస్త్రానికి సంబంధించిన ఇతడి పరిశోధక వ్యాసాలు ప్రపంచంలోని అన్ని సైన్స్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యేవి. యూరోప్, బ్రిటన్‌కు చెందిన అనేక విద్వాంసులను శాస్త్రపరమైన చర్చలలో ఇతడు సులభంగా ఓడించాడు. రసాయనశాస్త్రంపై ఇతడు రచించిన పాఠ్యపుస్తకం ప్రాథమిక విజ్ఞానం (Elementary Science)ను గురించి ప్రముఖ మానవ హక్కుల సక్రియ కార్యకర్త శ్రీ మంగేష్ దహీవాలా ఇలా ప్రశంసిస్తున్నారు. "ఇటీవల నేను ఆచార్య పోకలలక్ష్మీనరసు ద్వారా రాయబడ్డ పాఠ్యపుస్తకం 'ప్రాథమికశాస్త్రం'ను కనుగొన్నాను. ఇదొక అద్భుతమైన పాఠ్యపుస్తకం. రసాయన శాస్త్రాన్ని దానికి తగ్గ ప్రయోగాలతో అరటిపండు వొలిచినంత సులభంగా విశ్లేషించారు. విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులు తప్పక చదవవలసిన పాఠ్యపుస్తకం." తన హేతువాద భావజాలం కారణంగా, అప్పట్లో ప్రారంభ దశలో ఉన్న వైరులు లేని టెలిగ్రాఫీ (Wireless Telegraphy)ను గురించి తెలుసుకోవాలన్న తపన కారణంగా గతిశాస్త్రం (Dynamics)లో అతనికున్న పరిజ్ఞానం కారణంగా అతడు ఆకాలంలో ఉన్న మేధావులలో ఒకడుగా గుర్తింపబడ్డాడు. విజ్ఞానశాస్త్రంతో పాటు సమాజము, కళలు, చరిత్ర, సంస్కృతి, మతము, తత్త్వశాస్త్రం ఇత్యాదులలో అతడికి అభిరుచి మెండుగా ఉండేది. ఆంగ్లము, ఫ్రెంచ్, తమిళం, తెలుగు, సంస్కృతం, జపానీసు, పాలీ భాషలపై అతడికి మంచి పట్టు ఉండేది. అతడి సుప్రసిద్ధ రచన 'దిఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం' బౌద్ధం పట్ల అతనికున్న అభినివేశానికి అద్దం పడుతుంది. శ్రీయుతులు వి.పి.యస్. మోనియర్, పెరుంబాయి మానిక్కమ్‌లతో కలసి తమిళంలో పుస్తకాలు రాసాడని నిధిశోభన మహాశయుడు తెలియజేస్తున్నాడు.

'ది ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం' పుస్తకానికి ముందుమాట రాస్తూ, శ్రీ అనగారిక హెచ్. ధర్మపాల పోకలలక్ష్మీనరసు ప్రతిభను ఇలా పొగిడారు "ఈ పుస్తకం రచయిత ఒక విజ్ఞానశాస్త్ర వేత్త అయినందుకు మన దృష్టిని ఆకర్షిస్తాడు. ఆచార్య లక్ష్మీనరసు పాశ్చాత్య సంస్కృతిపరమైన ఉత్పత్తి (a product of western culture). ఇతడు ప్రాచీన ద్రవిడ పరివారానికి చెందిన వారసుడు (SCION). యూరోపియన్ గురువుల పర్యవేక్షణలో పాశ్చాత్య విద్యను అభ్యసించిన వ్యక్తి. ప్రస్తుతం మద్రాసు మహానగరంలోని మొదటి శ్రేణిదైన పచ్చియప్ప కళాశాలలో ఆచార్యుడుగా పనిచేస్తున్నాడు. శాస్త్రీయ పరమైన సత్యాలతో మతంలోని మూఢ నమ్మకాలను చక్కటి తర్కంతో ఖండించిన వ్యక్తి (Mahabodhi H.D. Isipatana, Saranath, Benaras, Apri128, 1907)మన రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఆచార్య పోకలలక్ష్మీనరసు గుణగణాలను పొగడుతూ... "ఆచార్య పోకలలక్ష్మీనరసు యూరోపియన్ల అహంకారాన్ని తనదేశభక్తి భావాలతో తూలనాడాడు. సనాతన హిందుత్వ భావాలను వీరోచితంగా ఎదిరించాడు. జాతీయ దృక్పథంతో కపట పూరితమైన బ్రాహ్మణ తత్త్వాన్ని, బుద్ధికుశలతతో దూకుడుతనంతో కూడిన క్రైస్తవమతాన్ని తీవ్రంగా విమర్శించాడు. బుద్ధుడి బోధనలతో ప్రేరణ పొంది కష్టసాధ్యమైన పనులను

చేసాడు. (ఆచార్య లక్ష్మీనరసు రచించిన 'ది ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం' మూడవ ముద్రణకు, 1948లో రాసిన ముందుమాట) ఈ పుస్తకం జపానులో మంచి ప్రజాదరణను పొందింది. చెకోస్లోవియా విదేశాంగమంత్రి జీన్ మాసరిక్ 1916లో ఈ పుస్తకాన్ని అనువదించి ఆ దేశపు దారిదీపంగా దాన్ని పేర్కొన్నాడు. 1907 మొదలు 2019 వరకు ఈ పుస్తకం 53 ముద్రణలను పొందిందంటే అది ఎంతటి గొప్ప రచనో మనకు తెలుస్తుంది.

ఆచార్య పోకలలక్ష్మీనరసు ఆకాలం నాటి విశ్వవిద్యాలయ ఆచార్యులలాగా సమాజానికి, తన చుట్టూ ఉన్న ఆర్థిక సామాజిక పరిస్థితులకు దూరంగా ఉంటూ 'ఏకాంత వాసాన్ని ఎప్పుడూ కోరుకోలేదని రౌండ్ టేబుల్ కామ్‌కు చెందిన నిధిన్ శోభన తెలియజేస్తున్నాడు. 20వ శతాబ్దపు తొలి చరణంలో ఉధృతంగా సాగిన జాతి, కుల వ్యతిరేక పోరాటంలో ఆచార్య పోకలలక్ష్మీనరసు చురుకుగా పాల్గొన్నాడు. బౌద్ధమతం ప్రచారం కోసం నడుము కట్టుకొన్నాడు. చెన్నైలోని పెరంబూర్‌లో ఉన్న దక్షిణ భారతదేశపు బౌద్ధ సంస్థ స్థాపనకు, దాని పురోభివృద్ధికి పాటుబడ్డాడు. దక్షిణ భారతదేశానికి చెందిన అనేక సంస్థలతో – సోషియల్ రిఫార్మ్ అసోసియేషన్, మద్రాసు మహాజనసభ, నేషనల్ ఫండ్ అండ్ ఇండస్ట్రియల్ అసోసియేషన్‌లతో ఆచార్య పోకలలక్ష్మీనరసుకు ప్రత్యక్ష సంబంధం ఉండేది. బౌద్ధం ఆనాటి బ్రాహ్మణత్వాన్ని ఎదిరించి విజయం సాధించిన మతం అని ఆచార్య పోకల లక్ష్మీనరసు త్రికరణ శుద్ధిగా నమ్మాడు. ఇదే అవగాహన డా॥ బి. ఆర్. అంబేద్కర్‌కు కూడా ఉండేదని నిధిన్ శోభన భావిస్తున్నాడు. మిత్రులు టి. సింగారవేలు, అయోథిదాసర్‌లతో కలిసి దక్షిణ భారతదేశపు బౌద్ధ అసోసియేషన్‌ను స్థాపించి దాని ప్రారంభోత్సవానికి సారనాథ్‌కు చెందిన అనగారిక ధర్మపాల గారిని ఆహ్వానించాడు.

ఆచార్య పోకల లక్ష్మీనరసు బౌద్ధుల జనగణనను చేపట్టాడు. అతని జనగణన ద్వారా అప్పుడు మద్రాసులో సుమారుగా 18000 మంది బౌద్ధులు నివసించేవారని తేల్చాడు. అతడు తన జీవితకాలంలో బౌద్ధుల నాలుగు మహాసభలను నిర్వహించాడు. మొదటి మహాసభ 1917లో మద్రాసులోని మూరే పెవలియన్, పీపుల్స్ పార్క్‌లో జరిగింది. రెండవ మహాసభను 1920లో బెంగళూరులో నిర్వహించాడు. 1928లో మూడవ సభను మద్రాసులో ఏర్పాటు చేశాడు. నాల్గవ మహాసభ కోలారు గోల్డ్‌ఫీల్డ్ లోని తిరుపత్తూరు (Tirupathur)లో జరిపాడు. ఇతడు శ్రీలంకను సందర్శించాడు. అక్కడే బహిరంగంగా బౌద్ధాన్ని స్వీకరించాడు. 1934వ సంవత్సరపు జూలై నెల 14వ తేదీన గుండె సంబంధమైన సమస్య కారణంగా తుదిశ్వాసను మద్రాసులో తీసుకున్నాడు. మద్రాసు మైలాపూర్‌లోని స్మశాన వాటికలో బౌద్ధ సంప్రదాయం ప్రకారం అగ్ని సంస్కారం జరిగింది.

ఆచార్య పోకల లక్ష్మీనరసు పి.యల్.యన్‌గా పిలవబడేవాడు. బౌద్ధానికి సంబంధించిన నాలుగు పుస్తకాలను ఇతడు రచించాడు. బహుళ ప్రచారం పొందిన 'దిఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం' పుస్తకం 1907లో ప్రచురింపబడింది. 'వాట్ ఈజ్ బుద్ధిజం' 1916లో అచ్చయ్యింది. రాజకీయంగా, విద్యారంగంలో లబ్ధప్రతిష్టితులుగా వెలుగుతున్న తరుణంలో 'దిస్టడీ ఆఫ్ కాస్ట్' ముద్రించబడింది. చనిపోవడానికి 12 ఏండ్ల ముందు అతడి ఈ పుస్తకం వెలుగుచూసింది. అప్పుడు ఆచార్య పోకల వయసు 61 సంవత్సరాలు. ఆ పుస్తకానికి రాసిన ముందుమాటలో This book is based on articles originally contributed to social reform. Caste organization crushes the individual under its dead weight and hinders progress by killing all consciousness of liberty.367 mint street-PLN Narasu. 2nd January 1922 అని ఉంది. (Printed at the Vavilla Press, Madras, 1922) నరసు లేవనెత్తిన అంశాల ఋజువును మనం ఈ.ఏ.హెచ్ బ్లంట్ (EAH Blunt) పుస్తకం The caste System of North Indiaలో చూడవచ్చును. ఈ పుస్తకం మొదటిసారిగా 1931లో ప్రచురితమైంది. తన పుస్తకంలో ఆచార్య పోకల ఈక్రింది విషయాలను చర్చించాడు. ''బ్రాహ్మణులు అన్ని వృత్తులలోనూ పాల్గొన్నారు. వారికి ఏ వృత్తి నిషేధం కాదు. వేద పారాయణంతో పాటు వారు రాజులుగా పట్టాభిషిక్తులయ్యారు. వారిలో వ్యాపారస్తులు, సైనికులు, వ్యవసాయదారులు కూడా ఉన్నారు. ఇరాన్ వారి అవేస్టా, వేదాల భాషలో సామ్యం ఉంది. మనకున్న వర్ణ వ్యవస్థ ఇరాన్‌లో కూడా ఉంది. వారిని అధర్వాలు (పురోహితులు)

యుద్ధవీరులు, వ్యవసాయదారులు (Husbandmen) చేతి పనివారలు (Artisan)గా విభజించారు. యజ్ఞోపవీతం వారికి, వారి ఆచారాలలో అతి ముఖ్యమైనది. "ఆచార్య పోకల వారి ఈ పుస్తకం కూడా 12 కు పైగా ముద్రణలకు నోచుకుంది. ఇది భారతదేశపు ఆధునిక బౌద్ధపు అతి విలువైన (Apriceless Product of the Modern Buddhism in India) పుస్తకంగా గుర్తింపు పొందింది. ఆచార్య పోకల నాల్గవ పుస్తకం పేరు 'ది రిలిజన్ ఆఫ్ మాడర్న్ బుద్ధిస్ట్' (The Religion of Modern Buddhist. ఈ పుస్తకం వ్రాతప్రతి (manuscript) డా॥ బి.ఆర్. అంబేద్కర్ దగ్గరుండేది. దక్షిణ భారతదేశపు బౌద్ధానికి చెందిన ఆధునిక ప్రచారకుడైన జి. అలైసియస్ ఈ వ్రాత ప్రతిని సంపాదించాడు. ఈ వ్రాత ప్రతి నకలు వసంత్ మూన్ (Vasanth Moon) వారి వద్ద ఉండేది. జి. అలైసియస్ ఈ పుస్తకానికి సంపాదకత్వం వహించి 2002లో దీన్ని ప్రచురించారు. వర్డ్స్‌స్మిత్ వారు దీన్ని ప్రచురించారు. (ISBN 978818742052) ఇందులో 318 పేజీలున్నాయి.

"ఇటీవల కాలంలో నేను ఆచార్య పోకలలక్ష్మీనరసు ద్వారా రాయబడిన రెండు ముఖ్య వ్యాసాలను చూడడం జరిగింది. ఈ వ్యాసాలు ఆచార్య పోకల చనిపోవడానికి ఒక సంవత్సరం ముందు రాసాడు. ఈ వ్యాసాలు తంద్రై రామస్వామి నాయకర్ పెరియార్ ద్వారా, బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమంతో సంబంధం ఉన్న ఆంగ్లవారపత్రిక రేషనలిస్ట్ పత్రికలో ప్రచురితమయ్యాయి. మొదటి వ్యాసం ఇండివిద్యులిజమ్ (Individualism) అక్టోబర్ 21, 1933వ సంచికలో ప్రచురితమైంది. రెండవ వ్యాసం అదే పత్రిక అక్టోబర్ 28, 1935 సంచికలో అచ్చైయింది. ఈ వ్యాసం శీర్షిక ఫ్రీ ఎన్‌క్వయిరీ (Free Enquiry) ఈ పత్రిక సంపాదకుడి పేరు యస్. రామనాథన్. ఈ పత్రిక ప్రతి శనివారం వెలువడేది. అప్పట్లో దాని ధర ఒక అణా (డా॥ బి. ఆర్. అంబేదర్కర్ కారవాన్ పోస్ట్, 30 డిసెంబర్, 2012). "ఆచార్య పోకల లక్ష్మీనరసు దక్షిణ భారతదేశపు అనుభవజ్ఞుడైన హేతువాది. ఉత్తమమైన విద్యావేత్త. స్వతంత్ర ఆలోచనలను ప్రోత్సహించిన వ్యక్తి. ఏమాత్రం రాజీపడకుండా మతాన్ని వ్యతిరేకించిన సమరయోధుడు." అని ది రాషనలిస్ట్ వారపత్రిక (అక్టోబరు 21, 1933 సంపాదకుడు. యస్. రామనాథన్ అభివర్ణించాడు. ఆచార్య పోకల లక్ష్మీనరసు మన తెలుగుతేజం. తెలుగువారు గర్వించవలసిన జ్ఞాని. ఇతని ప్రతిభను గుర్తించి ప్రభుత్వం తప్పక గౌరవించాలి.

**"ది ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం" పుస్తకంలోని "ఏరిన ముత్యాలు"**

- బౌద్ధాన్ని ఒక మతంగా కాకుండా తత్త్వశాస్త్రపు పద్ధతిగా, ఆచరణీయమైన నీతిశాస్త్రంగా పరిగణించాలి.
- బౌద్ధంలో జ్ఞానజన్యంకాని నమ్మకాలు లేవు.
- నిన్నునీవు విశ్వసించకు, నీవుపూర్తిగా నాపైనే ఆధారపడి ఉండాలని బుద్ధుడు ఉపదేశించలేదు.
- దుఃఖము, బాధనుండీ విముక్తి పొందాలన్నదే బౌద్ధమతపు లక్ష్యం.
- తీక్షణమైన మద్యపానము నుండి జనులు దూరం జరగాలని ఆదేశించిన తొలి మతము బౌద్ధం.
- మైత్రి విశ్వప్రేమలే బౌద్ధపు ప్రాథమిక భావనలు.
- మనిషి స్వభావ సిద్ధంగా దుష్కర్ముడని బౌద్ధం బోధించదు.
- బంగారం, భస్మంల మధ్య స్పష్టమైన తేడా ఉంది. ఈ విధమైన తేడా బ్రాహ్మణుడు, చండాలుడి మధ్యలేదు.
- బౌద్ధులలో జాతి భేదం లేదు.
- కులం లేదా జాతి శ్రేష్టత్వం అన్నది కేవలం కల్పన మాత్రమే.
- కులం అనే అడ్డుగోడను కూలద్రోసి మానవత్వ సమానతను బౌద్ధం బోధించింది.
- బౌద్ధం వైయక్తిక స్వాతంత్ర్యాన్ని ప్రోత్సహించే మతం.
- ఏ విధమైన నైరాశ్య భావనకు బౌద్ధంలో చోటులేదు.
- మనిషిని హేయనీయమైన వ్యక్తిగా కాకుండా తనదైన స్వతంత్ర వ్యక్తిత్వమున్న మనిషిగా తీర్చిదిద్దేది అసలు సిసలైన మతం. అదే బౌద్ధమతం.
- బౌద్ధులకు జీవితం అటు ఆకర్షణీయమైన రోజా కాదు. ఇటు మురికి నారబట్ట కాదు.

('ది ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం' పుస్తకంలోని ఇంగ్లీషు వాక్యాలకు తెలుగు అనువాదం).

**డా. ఎ.బి. సాయిప్రసాద్**
విశ్రాంత హిందీ ఆచార్యులు
బెంగళూరు, ఫోన్ : 998 056 7541

# జానపద కళలు - భక్తి ప్రభోదం

*- భమిడిపాటి గౌరీ శంకర్*

**ఉ**పోద్ఘాతం : మానవ సమాజంలో 'కళల' ఆవిర్భావం ఎలా జరిగిందనే ప్రశ్నకు ప్రస్తుతం స్వతంత్ర ప్రతిపత్తితో అభివృద్ధి చెందిన వివిధ కళారూపాలను, మనకు లభిస్తున్న జానపద కళాసంపదను, ఆధునిక వర్గ సమాజాన్ని ఆధారం చేసుకొని ఖచ్చితమయిన సమాధానం చెప్పటం కష్టం. మనిషి సృష్టి పరిణామం, ఉత్పత్తి ఎలా జరుగుతుందో ప్రకృతిని పరిశీలించటం ద్వారా మొదలు పెట్టాడు. స్వయంగా ఆహారోత్పత్తిని కనుగొనటం కన్నా ముందే 'కళా'రూపానికి నాంది పలికాడనేది చరిత్రకారుల అభిప్రాయం. ఒకే కారణం ఒకే కారణమైన ఫలితాన్ని ఇస్తుందని తెలుసుకున్నాడు. ఆక్రమాన్నే అభివృద్ధి చేసుకున్నాడు. ఇందుకుదాహరణగా పాట, కార్యకారణ సంబంధాల మధ్యనున్న 'బంధం'ను తెలిపే పాటగా "పాదులేని పాదు.... ఎల్లమ్మాతల్లి... ఎల్లమ్మా...'/ పాదెట్ల పెడితివే... ఎల్లమ్మా తల్లి... ఎల్లమ్మా / పాదూలుకానిది... ఎల్లమ్మా తల్లి... ఎల్లమ్మా..." ఇది గ్రామీణ అమ్మవారిని తెలిపేపాట ఆదిమదశలో మనిషి ప్రకృతి శక్తులను ఆరాధించడం తెలుసు. ప్రకృతిని స్త్రీమూర్తిగా భక్తితో పూజించుకోవటం, గౌరవించుకోవటం (మాతృస్వామ్య వ్యవస్థగా) చరిత్ర చెప్పిన సత్యం. ఆదిమదశలో కళలలో శుద్ధ సంగీతం, కవిత్వం, నాట్యం, వాద్య సమ్మేళనం అంటూ లేదు, అన్నీ కలసి ఉండేవి. సంగీతానికి కవిత్వానికి అవినాభావ సంబంధం ఉండేది. రానురాను జానపదకళలలో సమితం సంగీతంలో వాద్య సమ్మేళనం వేయింది. లయాత్మకమయిన కవితాభాష, సర్వసాధారణ వ్యవహారభాష స్థానమాక్రమించుకున్నాయి. క్రమేణ సమాజం వర్గాలుగా విభజన చెందటంతోపాటు భిన్న సామాజిక దశలలో భిన్న కళాస్వరూపాలు స్వతంత్ర ప్రతిపత్తికల ప్రత్యేక కళలుగా స్థిరపడ్డాయి.

**జానపద కళలు - వికాసం :** క్రమంగా మనిషి ఆహార సేకరణ, భద్రత, ఇళ్ళు కట్టుకోవడం, అనుబంధాలు, స్నేహాలు వంటివాటిని అలవాటు చేసుకున్నాడు. ఈ నేపథ్యంలోనించే కొత్తభయాలు తదనుగుణమైన దేవతలు పుట్టుకొచ్చారు. ఏ కారణంచేతనైనా ప్రకృతి శారీరక కష్టనష్టాలు సంభవిస్తే దానికి 'అమ్మవారి ఆగ్రహమే' కారణమని చెప్పుకున్నాడు. వారికి శాంతి చేయటం, స్తోత్రపాఠాలు చెప్పటం ఇతరులకు వాటిని గురించి, నివారణల వివరణలు ప్రబోధించటం నేర్చుకున్నాడు. అయితే ఆయా దేవతలకనుగుణంగా పాటలు, ఆటలు నేర్చుకొన్నా 'గుడి' లేదు. (తరువాత కాలాల్లో 'దేవాలయాలు' నిర్మించడం జరిగింది). తొలిసారిగా 'అమ్మవారి'కి బలినిచ్చే క్రమంలో ఊరివాందరూ కర్రలు, కత్తులతో చిందులు వేస్తూ 'పాలి! పొలి!' కేకలు పెట్టి సందర్భంలో తప్పెటలు, కొమ్ముబూరాలు మొదలైన వాయిద్యాలతో ఊరేగేవారు. 'ఇదే మన మొదటి తెలుగు ప్రజల ఆరాధనా నృత్యం' అంటారు ఆరుద్ర. వీరికి సంబంధించిన (గ్రామ దేవతలు) పురాణాలు, చరిత్రలుగా పాటలు పాడే వారికి ప్రత్యేక స్థానాన్ని, కులాలన్ని గ్రామీణ వ్యవస్థలో ఏర్పరిచారు. వీరి పని అయా భక్తిపూర్వక గాథలను పాడటమే. మరేవృత్తి చేయరు. కనుక వీరిని గ్రామమే పెంచి పోషించేది. ఈ కారణంగానే కొన్ని భక్తి పూర్వక ప్రభోదాత్మక జానపద కళారూపాలు నేటికి సజీవంగా ఉన్నాయి. వీరిలో అసాది, ఉగ్గగొల్లలు, ఎర్రగొల్లలు, బద్దేవారు, కొమ్ములవారు, గంగిరెద్దులవారు, గరుడస్తంభం, దాసరి, గద్దెచెప్పువారు, గొందులవారు, గొల్లలు, బిందుమాదిగలు, జంగంలు, జక్కులవారు, జోగువారు, దాసరులు, దొమ్మరులు, పంబలవారు, పగటి వేషాలు, పాండవులవారు, పిచ్చుకుంట్లు, బొమ్మలాటలు, భాగవతులు, శారదకాండ్రు, సుద్దులగొల్లలు, హరిదాసులు మొదలయినవారు ఆరు ప్రదర్శనలతో, ఆయా సందర్భంలో గ్రామదేవతలకు ప్రార్థనలు చేస్తారు. నేటికి ఆంధ్ర, తెలంగాణా సరిహద్దు ప్రాంతాలలో వీరు కనిపిస్తారు. సంక్రాంతి సమయాల్లో వీరి నుంచి వీరగాథలు, భక్తి ప్రభోద గీతాలు వినవచ్చు.

**భక్తి పూరితం :** ఆలయాలలో గర్భగుడి ముందు నాట్యమండలంలోనూ, నర్తకి పుష్పాంజలి, కవ్రతం, కైవారం, నవసంధి వంటి నృత్య కళలను ప్రదర్శించడం ఉంది. మిగిలిన జానపద కళారూపాలు ప్రజల నృత్యంగా ఆలయం చెంత చేసేవిగా పరివర్తనం చెందాయి. వీటిలో కొన్నింటిని మాత్రమే ఇక్కడ ప్రస్తావించుకుందాం. గరగలు (కరగలు), కరువ నృత్యం, కోలాటం, చిరతల భజన, చెక్కభజన, జంగం పాటలు, జముకులు, డప్పు కోలాటం, తప్పెటగుండ్లు, వీరనాట్యం. ఇవన్నీ ఆయా దేవాలయాల బయట అమ్మవారి ముందు జరిగే ఆదిమ ఆరాధనలకు సంప్రదాయ చిహ్నాలుగా ఒకనాడు ఉండేవి. కళారూపాల ఆవిర్భావానికి నృత్యగానాలకు కావ్యసృష్టికి, మానవ నాగరికతకు మూలం జానపదమే. ఈ కాలంలో కళారూపాలు సాహిత్యమంతా జానపద కళల ద్వారానే గుర్తించడం అనివార్యమయింది, జానపద కళారూపాలు విస్తృతమై, వైవిధ్య భరితంగా గుర్తించబడ్డాయి. ఈ నేపథ్యంలో పైన పేర్కొన్న కళారూపాలు ప్రదర్శనలో జానపద వృత్తి పురాణాలకు ప్రాధాన్యం ఏర్పడింది. జానపద కళారూపాల్లో ప్రదర్శితమవుతున్న ఈ పురాణాలకు వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉంది. వృత్తి పురాణాలలో భారత, రామయణాది కథలెన్నో ఉన్నాయి. జానపద పురాణమైన 'కర్ణుని పెళ్ళి', ఈ కథలో ధర్మరాజు అన్నదమ్ముల ధర్మాన్ని నిలుపుకోవటం కనిపిస్తుంది. భారతీయ సంస్కృతి సంప్రదాయాలలో అన్నదమ్ముల ఐక్యతను (వారు దాయాదులైనా సరే) చాటి చెప్పే భక్తి ప్రభోదాత్మక కథలు అనేకం ఉన్నాయి. ఇవి భారత, భాగవత, రామాయణాలలో ఎక్కువ, ఇవన్నీ జానపద కళారూపాలలో నిక్షిప్తం చేసి వాటిని ప్రదర్శించడం విశేషం, 'కోయపురాణం'లో 'జగన్మాత' యొక్క ప్రాధాన్యత 'వినిపిస్తుంది. జగత్సృష్టికి కారణం 'జగన్మాత'యని ఈ పురాణ ప్రబోధం, మరో ముఖ్యమయిన అంశం ఏమిటంటే 'శివుడు' తమ అల్లుడని చెప్పటం, ఇందుకు భద్రాచలం దగ్గరలోని 'మోతెగడ్డ' సజీవ సాక్ష్యమంటారు. మరో జానపద (గిరిజన తెగ) కళారూపం 'యానాది భాగోతం'. ఇందులో 'చెంచులక్ష్మి' కథాంశం ప్రధానం, 'దేవాదిదేవుని' విశ్వరూపంతో 'బాగోతం' ముగుస్తుంది, భారతీయ సంస్కృతికి పట్టుకొమ్మలు జానపద కళారూపాలు, జాతికి




కురుమ ఒగ్గు కథ

జీవనాడులు, అతిప్రాచీనకాలం నుంచి భక్తి, పురాణ కథలను వివరిస్తూ, ప్రశ్నిస్తూ మానవ, నైతిక విలువలను 'తమదైన' ప్రాంతీయ, మాండలికాలలో వివరించడం ఓ సజీవ కళయొక్క అద్భుతంగా చెప్పుకోవాలి. వీటిలో 'ఎరుకల రామాయణం' (ఎరుకల శివపురాణం) ప్రత్యేకమయినది. ఇందులో విశేషాంశం ఏమిటంటే 'రామాయణా'నికి చెందిన ఇతివృత్తం ప్రదర్శనలో ఉండదు. కాని... తమ సంస్కృతి సంప్రదాయాలు ఏ పురాణాలలో ప్రతిబింబిస్తుందో ఆ కథలను ప్రదర్శించడం. నారద పాత్ర ప్రధానంగా, గంగా పరిణయాన్ని ఓ సృజనాత్మక రూపంగా దృశ్యకళగా మలచటం. ప్రశంసనీయం. వృత్తి పురాణ జానపద కళారూపాలలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. 'జాంబపురాణం', అసలుసిసలైన పురాగాథకి చెందిన కళారూపమిది. అష్టాదశ పురాణాలకు సమాంతరమైన భావజాలాన్ని నింపి శ్రామిక జనాలకు ప్రత్యమ్నాయాన్ని చూపించడం దీని విశిష్టత. భక్తి ప్రబోధం వెనుక శ్రమైక జీవుల గొప్పతనంను అంతర్లీవంగా చెప్పే గొప్ప కథ ఇది. ఇది కళారూపాన్ని ప్రదర్శించే చక్కటి కళాకారుల కల్పనా చాతుర్యం.

జానపదులు కళలో సైతం దైవాన్ని చూస్తారు. గ్రామదేవతల కొలువుల్లో, రాత్రి వేళ వినోదం కోసం ప్రదర్శించే కళల్లో దైవసంబంధ గాథలే ఎక్కువ. కళలు ఎక్కువగా దైవ కాళారాధనలు, నాగార్జున కొండ, పెదబొంకూరు, కోటిలింగాల ప్రాంతాలలో త్రవ్వకాలలో లభించిన వస్తువులు, మట్టిపాత్రలు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణలు. భక్తి ప్రబోధాలలో కొన్ని జానపద కళారూపాలను ఇక్కడ ప్రస్తావించుకోవాలి.

**ఒగ్గుకథ :** జానపద కళల్లో ఒగ్గుకథను మించిన కళ మరొకటి లేదని చెప్పవచ్చు. ఈనాడు ఈ కథ తెలంగాణ ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నది. ప్రజాదరణ పొందుతున్నది. హైదరాబాద్, వరంగల్, నల్గొండ, కరీంనగర్ జిల్లాలో ఈ కళకు మంచి ప్రసిద్ధి ప్రచారం ఉన్నాయి, ఒగ్గుకథను కురుమ, గొల్ల కులాలకు ఎందిన వారు చెబుతారు. శివుని వాద్యమయిన 'ఢమరుకం'ను ఒగ్గుగా పిలుస్తారు. గతంలో ఒగ్గు దీక్ష స్వీకరించేవారే కథను చెప్పేవారు. ఒకప్పుడు మల్లన్న, బీరప్ప కథలను మాత్రమే చెప్పేవారు. కాలక్రమేణా ఎల్లమ్మ, నల్ల పోచమ్మ, బాలనాగమ్మ, మైరావణ, మాంధాత, హరిశ్చంద్రుని కథ, వాసదేవుని కథ, శివకుమారుని కథ అంతేకాకుండా రామాయణ, భారత కొన్ని ఘట్టాలను ఒగ్గుకథా శైలిలో చెబుతున్నారు.

**యక్షగానాలు :** ఇది మన దేశీయ సంస్కృతి పట్టుగొమ్మగా నిలిచిన కళ, వికాసం చెంది సమాహార కళగా అయింది. 12వ శతాబ్దం నుండి యక్షగాన ప్రస్థావన కనిపిస్తుంది. పాల్కురికి సోమనాథుడు తన పండితారాధ్య చరిత్రలో పర్వత ప్రకరణలో దీనిని ప్రస్తావించాడు. 15వ శతాబ్దం నుండి బాగా అభివృద్ధి చెందింది. 17వ శతాబ్దం నాయిక రాజుల కాలంలో ఉచ్ఛాస్థితికి చేరింది. 'యక్షగానం' అనే సమస్త పదాన్ని ప్రయోగించిన మొదటి కవి శ్రీనాథుడు, తన భీమేశ్వర పురాణంలో వీనిని గురించి ప్రస్తావించాడు. తెలంగాణా ప్రాంతంలో 16వ శతాబ్దంలో వెలువడిన మొట్టమొదటి యక్షగానం కందుకూరి రుద్రకవి రచించిన 'సుగ్రీవ విజయం' అని ప్రచారంలో ఉంది. ఇది పౌరాణిక నాటక పద్ధతిలో ఉంటుంది. ప్రజల్లో నైతిక విలువలు, దేశభక్తి ప్రబోధాలను 'భక్తి' కథల ద్వారా వివరించి ఆనందింపజేయటం ముఖ్యోద్దేశ్యం, సీతా కళ్యాణం, ఉషాపరిణయం, రామాయణ, మహాభారత ఘట్టాలను, సీతారాములు, కృష్ణార్జునులు తమ పాత్రల ద్వారా ప్రజల్లో దేవతల గురించి చెప్పి భక్తిభావాల వ్యాప్తికి 'యక్షగానాలు' ఉపకరించాయి.



బతుకమ్మ

**బతుకమ్మ :** తెలంగాణాలో ప్రత్యేకంగా కనిపించే సంప్రదాయ పండుగ, ప్రకృతి పట్ల ప్రజల్లో భక్తి, ఆరాధన భావాలను ప్రభోదించి, ప్రకృతిలోని నిస్వార్థ, త్యాగ గుణాలను వివరించడమే ప్రధానం. దసరాకు ముందు తొమ్మిదిరోజులు బతుకమ్మ పండుగ, దానికి ముందు తొమ్మిది రోజులు బొడ్డెమ్మల పండుగ జరుపుతారు, 'బతుకమ్మ' స్త్రీలకు ఎంతో ఇష్టమయిన పండుగ. స్త్రీలు ఈ పండుగ సమయంలో పుట్టిళ్ళకు వచ్చి తమవారితో ఆనందంగా జరుపుకుంటారు, చివరి రోజున, 'పోయిరా గౌరమ్మ పోయి రావమ్మా' అంటూ పాడుతారు. బతుకమ్మను తమ పాటలలో గౌరీ, లక్ష్మీ దేవతలుగా ఆరాధిస్తారు. స్త్రీల మధ్యన, గ్రామీణ సమాజాలలో బ్రతుకమ్మ పాటలలోని భక్తి ప్రభోదం ఐక్యతను పెంచుతుంది. అన్నా చెల్లంఢ్ర మధ్య ఐక్యతకు, ఆత్మీయతకు చిహ్నం– బ్రతుకమ్మ.

**పాండవుల కథ :** ఈ కళాకారులు మహాభారతంలో పాండవుల కథను ఎంతో భక్తితో, తాధ్యాత్మికతతో ప్రదర్శిస్తారు. గోండులతో వీరికి సంబంధ బాంధవ్యాలున్నాయి. వీరు 'నాగోబా' గిరిజన దేవుణ్ణి ఆరాధిస్తారు. పోచమ్మ, ఎల్లమ్మ వంటి గ్రామదేవతలను పూజిస్తారు. తమ ప్రదర్శనల్లో అవసరమయిన మేర వీటిని ప్రబోధిస్తారు. పల్లెలో పంటలకాలంలో దేవతల కథలు ద్వారా భక్తి పాటలను ఆలపిస్తూ ధాన్యం తీసుకుంటారు, అదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాలో వీరెక్కువ, సంక్రాంతి వీరికి నిజమయిన పండుగ. వీరు తమ ప్రదర్శన ద్వారా 'పాండవుల కథ'లోని భక్తిని సమాజ నీతిని చక్కని సమ్మేళనాలతో వివరిస్తారు.

భామాకలాపం : గొల్లభామ కలాపం లేదా కలాపం పేరున ఈ కళారూపం ప్రసిద్ధి చెందింది. ఇందులో ఆట, పాట కలిసే ఉంటాయి. దశావతార వర్ణన, కౌరవంజి వేషం ప్రముఖంగా ప్రజాదరణ పొందాయి. రామాయణ, భాగవత కథల వర్ణన ఎక్కువగా ఉంటుంది. రాధకృష్ణుల

ప్రణయ వృత్తాంతం, సత్యభామ కథనం రక్తి కట్టించే కళా ప్రదర్శన. ఇది వీధినాటకంగా, 'యక్షగాన' పద్ధతిలో ప్రదర్శిస్తారు. తెలుగునాట వైభవోపేతంగా వెలుగొందిన సుప్రసిద్ధ సంప్రదాయ కళారూపమిది.

**తోలుబొమ్మలాట :** ఆధునిక సినిమాకు మూలం తోలుబొమ్మలు ప్రర్శన, చర్మంతో చేసే వివిధ బొమ్మల పాత్రలతో తెరమీద చేసే ప్రదర్శన. ఎటువంటి పౌరాణిక పాత్రనైనా అదేరీతిలో సిద్ధం చేయటం వీరి ప్రత్యేకత. ఈ కళా ప్రదర్శనలో భక్తి ప్రబోధమే ప్రధానం. దాని కనుగుణంగానే పౌరాణిక గాథలనే చెబుతారు. రావణుడు, రాముడు, సీత, ఆంజనేయుడు వంటి విభిన్న ఆకారాలతో బొమ్మలు సిద్ధం చేస్తారు. గానానికి కథకు అనుగుణంగా బొమ్మలతో ప్రదర్శన రక్తి కట్టిస్తారు. అత్యంత ప్రాచీన జానపద కళారూపం, పౌరాణిక గాథలలోని భక్తి ప్రపత్తులను తేలిగ్గా నిరక్ష్యరాస్యులైన గ్రామీణులకు అందించే కళా ప్రదర్శన.

**జముకుల కథ :** బైండ్ల, పంబాల కులాల వారు జముకుల కథలు వినిపిస్తారు. వీరిని ఆంధ్రప్రాంతంలో 'బవనీలు' అంటారు. 'అంకమ్మ' వంటి గ్రామకథలు వినిపిస్తారు. తెలంగాణ ప్రాంతంలో 'ఎల్లమ్మ' కథను అత్యంత 'భక్తి'తో గానం చేస్తారు. 'జముకు' వాయిద్యం ద్వారా పాటకు తగ్గ ధ్వని, లయలో వయిస్తారు. "జముకు –జమిడిక – పంబ' అని ఈ వాయిద్యానికి పేరుంది. ఎల్లమ్మ, గ్రామ దేవతలు వేషాలు ధరించి, పాటలకు భక్తిని జోడించి రక్త కట్టిస్తారు. 'మాత పురాణం' అంటే ఆది పరాశక్తి ప్రతిరూపమయిన గ్రామ దేవతను కొలుస్తారు.

**ఒరిస్సా జానపద కళలు :** క్రీ.శ.1936లో ఒడిశా రాష్ట్రం ఏర్పడింది. అంతకు పూర్వం ఒడిస్సా, బెంగాల్, బీహార్లు కలిసే వుండేవి. ఒడిస్సాలో దాదాపుగా 12 రకాల జానపద కళారూపాలు ప్రముఖంగా గ్రంథాలలో పేర్కొనబడ్డాయి. ఒరిస్సా జానపద కళారూపాలు ప్రముఖంగా గ్రంథాలలో పేర్కొనబడ్డాయి. ఒరిస్సా జానపద కళారూపాలు ప్రముఖంగా గ్రంథాలలో పేర్కొబడ్డాయి. ఒరిస్సా జానపద నృత్య కళారూపాల్లో "భావ్ నాట్యో" మిక్కిలి ప్రాచుర్యం పొందినది. పూర్తిగా భక్తి పూర్వకంగా భావించే వీరభద్రుని ఊరేగింపులో ఖడ్గాల విసరడం వంటివి ఈ 'పాలకువ" ఉంది. (ఖడ్గమంటే ఒక ఛందోవిశేషం), వీరి ఆటపాటలకు డోళ్ళు, టముకులు, భేరీలు, శంఖాలు, చాంగులు, మొహురీలు, కంసాలాలు (తాళాలు), కాహాళీలు, చాంగం నీదాలు, మృదంగాలు, రామతాళీలు వంటి వాయిద్యాలు ఉపయోగిస్తారు. యావత్తు భరతదేశంలోని జానపద కళారూపాలని పరిశీలిస్తే భాషలు వేరైనా రూపాల్లో ఎంతో సామ్యం కనిపిస్తుంది. ఈ రాష్ట్రంలోని జానపద కళారూపాలకు, తెలుగు రాష్ట్రంలోని కళారూపాలకు పోలికలు కనిపిస్తాయి. తోలుబొమ్మలాటలు, బుర్రకథలు ఒరియాలోనూ ఉన్నాయి. కాలంతోపాటు ఇక్కడ మార్పులు అనివార్యమయినాయి. వీరి దాసకాఠియా, (తెలుగు వారి బుర్రకథకు దగ్గరగా ఉంటుంది.) వీరు రామకథ, భారత, భాగవతాది గాథల్ని కూడా తమ రామతాళిని, దాసకాఠిని (వాయిద్యాలు) వాడతారు. కొరొమా నృత్యం మరో ప్రసిద్ధి కళారూపం, కొరోమారాణి లేదా కొరొమాసాని సంతానాన్ని ప్రసాదించే దేవత. అదృష్ట, దురదృష్టాలను కలిగించే దేవతగా కూడా చెబుతారు. ఇదొక ఆధ్యాత్మిక నృత్యం, ఒడిస్సా తీరప్రాంత వాసులు అశ్వనృత్యంతో బాశులీ అమ్మవారిని పూజించినట్లే కొరామా నృత్యంలో కూడా 'కొరోమాసాని' దేవతను భక్తితో పూజిస్తారు. ఇది సంబల్పూర్ జిల్లాలోని ప్రధానమైన జానపద నృత్యం. ఇవి లేకుండా ఘుమురా, రోణోపా, పాలా, ఘుడుకి, పాటువాజాత్ర, అశ్వనృత్యం, దోండోనాటో, భోవనృత్యం వంటి జానపద కళారూపాలన్ని భక్తి ప్రబోధాకాలుగా ఉంటాయి. వర్తమానంలో జానపద కళారూపాలు దాదాపుగా తగ్గిపోయాయి. (అంతరించి పోయాయి.) పాట ఒక్కటే మిగిలింది. కళారూపాల ప్రదర్శన అరుదైపోయింది. వందలాది కళారూపాలు మటుమాయమవటం విషాదకరం, ఇది జాతి సుస్థిరతకు, మనుగడకు తీరనిలోటు ఇటువంటి సదస్సులు వలన అందరికి, ముఖ్యంగా నేటి తరానికి జానపద కళల విస్తృత రూపాలు అర్థమవుతాయి. మళ్ళీ వెలుగు వస్తుందని, ఇటువంటి వేదికలు అందుకు దోహదం చేస్తాయని చిన్న ఆశ.

**భమిడిపాటి గౌరీ శంకర్**
తెలుగు విభాగాధిపతి గాయత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ & మేనేజ్మెంట్,
ఫోన్ : 998 056 7541

# బాలసాహిత్యం

**- ఎన్.కె. బాబు**

**బా**ల సాహిత్యం అనగానే మనకి వెంటనే స్ఫురించేవి పిల్లల పత్రికలు. బాలల కోసం సాహిత్యం మొదట్లో ప్రత్యేకంగా లేదు. రామాయణ, భారత, భాగవతాలల్లోని చిన్న కథలను పిల్లలకు అవసరమయిన రీతిలో మలచి పెద్దలు వినిపించేవారు. ఇలా చూస్తే బాల సాహిత్యం మొదటినుండి పిల్లలకోసం ప్రత్యేకంగా లేనప్పటికి అప్పటి సాహిత్యంలో ఏదో చోట కధావరంగా పిల్లలకు అవసరమయిన నీతి కథలు ఉండేవి. శ్రీ కృష్ణుని బాల్యమంతా పిల్లలకోసం కథలుగా చెప్పుకోవచ్చు. అన్నమయ్య రచించిన "చందమామ రావే" జాబిల్లి రావే, 'జో అచ్యుతానంద జోజోముకుందా' మెదలైన పాటలు ఇప్పటికీ మనం పిల్లల కోసం మనం వినిపిస్తున్న బాలల పాటలే. బాల సాహిత్యం ముఖ్యంగా ఎక్కువ శాతం మౌఖికంగానే ఇప్పటికీ సాగుతుంది. ముద్రణకి నోచని ఎన్నో కథలు, గేయాలు జానపదాలు ఇప్పటికీ పిల్లలకు తరతరాలుగా చెప్పకుంటూనే వున్నాం. పెదరాశి పెద్దమ్మ కథలు, ఈసప్ కథలు మొదలయినవి యీ కోవకి చెందినవే. బ్రిటిష్‌వారు మనదేశాన్ని పరిపాలిస్తున్న కాలంలో మనం బాల సాహిత్యాన్ని ప్రత్యేకంగా గుర్తించడం జరిగింది.

ఆ స్ఫూర్తితోనే బాల సాహిత్యం ప్రత్యేకంగా సృజింపబడింది. రవీంద్రనాథ్ ఠాగూర్, చాలావరకూ గేయాలు, కథలు, బాలసాహిత్యం కోవలో వ్రాసారు. అలాగే గురజాడ అప్పారావు గారు బాలలకోసం కొన్ని గేయాలు వ్రాసారు. ఏనుగెక్కి మనం ఏలూరు వెళదాం.. మొదలైనవి. చలం సమకాలీనుడైన చింతా దీక్షితులు 'లక్క పిడతలు" అనే పేరుతో గేయాలను పిల్లలకోసం సంపుటిగా తెచ్చారు. "లీలా సుందరి" కథ అలాగే చింతా దీక్షితులు గారి కథల్లో కనిపించే సూరి, సితి, వెంకి పాత్రలు మనకి పరిచయ పాత్రలే. వందేళ్ళకు క్రిందటే గిడుగు సీతాపతి గారు బాలలకోసం గేయాలు వ్రాసారు. బాలలకోసం ప్రత్యేకంగా తెలుగులో మొదటగా గేయాలు వ్రాసింది గిడుగు సీతాపతిగారే. ఆ తరువాత 1940 ప్రాంతంలో కొద్దికాలం 'భారతి' పత్రికకు సంపాదకులుగా వున్నారు. ఆ సమయంలోనే బాలలకోసం ప్రత్యేకంగా కొన్ని పేజీలను కేటాయించిబాలసాహిత్యాన్ని ప్రోత్సహించారు.

'చందమామ' మాస పత్రిక లో సంపాదకులుగా కొడవటిగంటి కుటుంబరావు గారు, వున్నంతకాలం పిల్లలకోసం ఉద్దేశించిన శైలిలోనే రచనలు ఉండే విధంగా చూసేవారు. రచయితల నుండి అలాంటి శైలి లేని కథలు వస్తే వాటిని రచయితే ఆశ్చర్య పోయేవిధంగా ఎడిట్ చేసి ప్రచురించే వారు. దీనిని బట్టి పిల్లలపై కొడవటిగంటి కుటుంబరావు గార్కి వున్న శ్రద్ధ అర్థం అవుతుంది. బాలలకు ఓ ఆలోచనా పరిధి వుంటుంది. బాల సాహిత్య రచయిత పిల్లల ఆలోచనా పరిధిలోకి ప్రవేశించి ఆ పరిధి విస్తరించే విధంగా రచనలు చేయడం వలన ఆ రచనలు సఫలం అవుతాయి. కానీ అలాంటి రచయితలు ప్రస్తుతం కనిపించడం లేదు.

దాసరి సుబ్రహ్మణ్యం గారు అనేక కాల్పనిక పాత్రలను సృష్టించి బాలలను ఊహాలోకంలో తేలియాడించేవారు. దాసరి సుబ్రహ్మణ్యం బాల సాహిత్యానికి చేసిన సేవలు మరువలేనివి. ఇటీవలే రచన మాస పత్రిక దాసరి సుబ్రహ్మణ్యం ప్రత్యేక స్మారక సంచికను వెలువరించింది. బాల సాహిత్య కథకులులో పాయల సత్యనారాయణ గారు గత నలభై సంవత్సరాలుగా బాలల కోసం కథలు, గేయాలు రచించారు. ఇటీవలే వారు కాలం చేసారు. మిరియాల రామకృష్ణ, డి. సుజాతాదేవి, శారదా అశోకవర్ధన్ బాలసాహిత్యంలో పలు రచనలు చేశారు. పాలంకి వెంకట రామచంద్ర మూర్తి, నాళం క్రిష్ణారావు, నార్ల చిరంజీవి, సమతారావు, బాలల కోసం ఎన్నో రచనలు చేసారు. అవన్నీ పిల్లలకు ఎంతో స్ఫూర్తిగా ఉండేవి.

ఈ ప్రాంతంలో ఎన్.వి.ఆర్.సత్యనారాయణ మూర్తి, శివ్వాం ప్రభాకర రావు గారు, బెలగం భీమేశ్వరరావు, బెహరా ఉమామహేశ్వరరావు, బి.వి. పట్నాయక్, పాలకొల్లు రామలింగస్వామి, నారంశెట్టి ఉమామహేశ్వర రావు, కిలపర్తి దాలినాయుడు మొదలయిన వారు బాలలకోసం మాత్రమే ప్రత్యేకంగా వీరు రచనలు చేస్తున్నారు. ఇంకా మన రాష్ట్రంలో వెలగా వెంకటప్పయ్య, రెడ్డి రాఘవయ్య, దాసరి వెంకటరమణ, భూపాల్, చొక్కాపు మొదలయిన వారు రచనలు చేస్తున్నారు. గురజాడ, శ్రీశ్రీ,లు తప్ప పేరున్న తెలుగు రచయితలు ఎవరూ బాలల సాహిత్యాన్ని వ్రాసినట్టు లేదు.

శ్రీశ్రీ పిల్లలను ఉద్దేశించి ఆరేడేళ్ళ పాపల్లారా అంటూ కవిత వ్రాసారు కానీ, పిల్లలు చదువుకోవడానికి వేళ్ళమీద లెక్కించతగిన గేయాలు మాత్రమే వ్రాసారు గురజాడ. కొన్ని కవితలు, గేయాలు బాలల కోసం వ్రాసారు. ఏనుగెక్కి మనం ఏ వూరెళ్లాం, ఇంకా అరటి కాయబజ్జి, మినపసున్ని సుజ్జి మొదలయిన కవితలు, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, కన్యక

గేయాలు బాల సాహిత్యం కోవలోకే వస్తాయి. కానీ యితర భాషలలో పెద్ద రచయితలు సైతం బాలల సాహిత్యం రచించారు. ముల్క్ రాజ్ ఆనంద్, రవీంద్రనాద్ ఠాగూర్, ప్రేమచంద్ మొదలయిన వారు పిల్లలకోసం ఎన్నో రచనలు చేసారు. మార్క్ ట్వైన్ రచనలు టామ్సాయర్, హకిల్ బెర్ఫిన్, రాజు-పేద, విచిత్రవ్యక్తి మొదలగు రచనలు ఇప్పటికీ పిల్లలకు ఎంతో హాయి గొలిపే నవలలు వీటిని నండూరి రావెమ్మోహనరావు గారు తెలుగులో అనువదించారు. ఇటీవల వచ్చిన హారీ పోర్టర్ నవల యావత్ ప్రపంచ బాలలను తన వైపు తిప్పుకుంది. బాలల భాషలోనే రచన సాగించిన ముళ్ళపూడి వారి బుడుగు బాల సాహిత్యంలో ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు.

ఒకప్పుడు బాలల కోసం పత్రికలు క్రమం తప్పకుండా వచ్చేవి. అలాంటి వాటిలో బాలజ్యోతి, కలువ బాల, బాల మొదలైనవి. కాని ప్రస్తుతం బాలల కోసం ప్రతినెలా పత్రికలు కూడా తగినన్ని రావడం లేదు. ఇందుకు కారణం ముఖ్యంగా పత్రికలను సరిగా ప్రోత్సహించక పోవడమే. పిల్లల కోసం ఇరవై రూపాయలు పెట్టి చాక్లెట్ కొంటారు కానీ ఓ పిల్లల పత్రిక కొనరు. అది దండగ మారి వ్యవహారంగా ఆలోచించే వారు అధికంగా వున్నారు.

బాల సాహిత్యాన్ని ప్రోత్సహించే ఆలోచనతో కేంద్ర సాహిత్య అకాడమీ వారు అన్ని భారతీయ భాషలలోనూ బాల సాహిత్య రచయితలకు అవార్డులు ఇస్తున్నారు. మొదటి అవార్డు తెలుగులో కలువ కొలను సదానంద గారిని వరించింది. 2011 సంవత్సరముకు భూపాల్, ఉగ్గుపాలుకీ లభించింది, ఇది ఓ గొప్పపరిణామం. కాగా విజయనగరం నుండి వెలువడుతున్న నాని పిల్లల మాస పత్రికలో ప్రతినెలా ప్రచురితమౌతున్న చాగంటి తులసి అనువాదంలో వచ్చిన ఒరియా కథకురాలు పుణ్యప్రభాదేవి గారు ఒరియా బాల సాహిత్యానికి అవార్డు వరించింది.

బాల సాహిత్యాన్ని రేడియో బాగానే ప్రోత్సహించింది. సాహిత్య అకాడమీ వారు నేషనల్ బుక్ ట్రస్ట్ వారు, బాలసాహిత్యాన్ని విరివిగా ప్రచురించి ప్రచారం చేస్తున్నారు. తెలుగులోకి అనువదింపబడుతున్న గిజుభాయి బాల సాహిత్యం పిల్లలను అంతగా అలరించలేకపోతుంది. న్యాపతి రాఘవరావు, న్యాపతి కామేశ్వరి వీరు రేడియో అన్నయ్య, రేడియో అక్కయ్యగా ప్రసిద్ధులు. వీరు యిరువురూ విజయనగరం వారే. అంతేకాకుండా విజయనగరం మహరాజా కళాశాల పూర్వ విద్యార్థులు కూడాను. ప్రత్యేకత ఏంటంటే, న్యాపతి కామేశ్వరి విజయనగరం మహరాజా కళాశాలలో చేరిన మొదటి విద్యార్థిని. అప్పటిలో స్త్రీలను కళాశాలలకు చదవటానికి పంపేవారు కాదు.

బాలానందం పేరుతోనూ బొమ్మరిల్లు పేరుతోను ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు పిల్లలను, పెద్దలను అలరించేవి. సినిమా మాధ్యమం ద్వారా కూడా బాలలకు విజ్ఞానం అందించాలన్న ఆలోచనతో కె.ఎస్.ప్రకాశరావు బూరెలమూకుడు చిత్రాన్ని నిర్మించారు. ఆ తరువాత చెప్పుకోతగినన్ని బాలల సినిమాలు రాలేదు. బాలల చలన చిత్ర ఉత్సవాలు జరుగుతున్నప్పుడు అధికంగా నామినేషన్ చేయబడుచున్న చిత్రాలు విదేశీ చిత్రాలు మాత్రమే. చిన్నారి చేతన అనే "3డి" చిత్రం యావత్ భారత బాలలను అలరించింది. ఆ తదుపరి అలాంటి భారతీయ చిత్రాలు రాలేదు. ఇటీవల నార్నియా, పోలార్ ఎక్స్‌ప్రెస్, లైఫ్ ఆఫ్ పై మొదలగు చిత్రాలు.. పిల్లలను బాగానే ఆకట్టుకున్నాయి. బుల్లితెర విషయానికి వచ్చినట్లయితే ప్రత్యేకంగా బాలల ప్రోగ్రాములు లేవు. కార్టూన్ నెట్వర్క్, టామ్&జెర్రీ, పోగో, మొదలయిన ఆంగ్ల కామిక్స్ పిల్లల కోసం వస్తుండగా ఇటీవల భీముడు, ఆంజనేయుడు, క్రిష్ణుడు కథలను ఏనిమేషన్లో చూపిస్తున్నారు. తెనాలి రామలింగడు కూడా ఏమీ ఆకట్టుకోలేకపోతున్నాడు. చిత్ర రంగం, లాభసాటి కాకపోవడంతో పిల్లల చిత్రాలు రావడం లేదు. అయితే బాల సాహిత్యాన్ని మళ్ళీ ప్రచురణ రంగంలో చూసినట్లయితే రష్యన్ ప్రచురణలు, అనువాదాలుతో బాగా బాల సాహిత్యాన్ని ప్రోత్సహించాయి. కొడవటిగంటి కుటుంబరావు గారు అన్నట్లు "బాల సాహిత్యం తక్కువ ధరకు అందించాలి, ప్రచురణలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. పుస్తకం ఆకర్షణీయంగా ఉండాలి."

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో బాలలకోసం వివిధ పుస్తకాలను కొనుగోలు చేస్తున్నప్పటికి, పాఠశాలల్లో అవి పిల్లలకు అందుబాటులో ఉండటం లేదు. పిల్లలు చేత బాలసాహిత్యాన్ని చదివించే ఓపికా ఉపాధ్యాయుల్లో లేదు. బాల సాహిత్యాన్ని ప్రభుత్వం చిత్త శుద్ధితో ప్రోత్సహించి, బాలసాహిత్యాన్ని బాలలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలి. అన్ని స్థాయిల్లోనూ, బాలలకు బాల సాహిత్యంతో నిరంతర పరిచయం వుండే విధంగా పోటీలు నిర్వహించాలి. దీని వలన బాలలు మనో వికాశం అభివృద్ధి చెందుతుంది. తద్వారా మంచి వ్యక్తిత్వం గల పౌరులుగా రేపటి తరం భారత పౌరులు వికసిస్తారు.

**ఎన్.కె. బాబు**
రచయిత, ఫోన్ : 9440343479

# ఔషధ పరిష్వంగం

– గద్దం దేవీప్రసాద్

ఆలింగనం, కౌగిలింత, పరిష్వంగం, పరిరంభణం. పదమేదైనా ప్రేమ, అనురాగం లేదా ఆప్యాయత వ్యక్తం చేయడానికి తన చేతులతో మరొకరిని హత్తుకోవడమనే అర్థంతో ఈ పదాలను వాడుతుంటాము. ఇది రెండు శరీరాలు దగ్గర అవడమే కాదు ఇద్దరి మనసులు, ఆత్మలు ఒక్కటయ్యే అద్భుత ఘట్టం కూడా. గర్భం నుండి ఒడిని చేరిన పసికూనను తల్లి పదేపదే హత్తుకోవడం బిడ్డకు ఎంతో భరోసాను, ప్రేమను కలిగిస్తుంది. "పుత్రగాత్ర పరిష్వంగ సుఖం" తండ్రి ప్రేమగా తన కొడుకుని హత్తుకోవడం ద్వారా ఎనలేని సుఖాన్ని పొందుతుంటాడు అనేది ఆర్యోక్తి.

పురాణాల్లో కౌగిలింత ప్రస్తావన ఆంధ్రమహాభారతం ఆదిపర్వంలో నన్నయ్య వ్రాసిన పైనపేర్కొన్న పద్యం దుష్యంతోపాఖ్యానంలో వస్తుంది. తను ఎవరో తెలియదన్న దుష్యంతునితో ముత్యాల హారాలు, చందనం, వెన్నెల వంటివి ఇవ్వలేని చల్లదనం, సుఖమూ కన్నకొడుకును హత్తుకొంటే కలుగుతుందని శకుంతల అంటూ కుమారుణ్ణి ఆలింగనం చేసుకొంటే మరచిన సంగతి జ్ఞప్తికి వస్తుందనడం కౌగిలింత విశిష్టతను తెలియచేస్తోంది. ఇదే విషయాన్ని రామాయణంలో కూడా వాల్మీకి ప్రస్తావించడం గమనార్హం. తన మాటతో అడవులకేగిన రాముణ్ణి తలచుకొంటూ "పుత్రగాత్ర పరిష్వంగ సుఖం" మళ్ళీ తనకు అనుభవం అవుతుందో లేదోనని దశరథుడు విలపిస్తుంటాడన్నాడు.

కౌగిలింతను వేదాలు, ఉపనిషత్తులు కేవలం భౌతిక విషయంగా పరిగణించలేదు. ఇద్దరు వ్యక్తులు ఇష్టంగా ఆలింగనం చేసుకున్నప్పుడు ఇద్దరి శక్తివలయాలు ఏకమై లోపలున్న నకారాత్మకత (నెగటివ్ ఎనర్జీ) పోయి సకారాత్మకత (పాజిటివ్ ఎనర్జీ) ఏర్పడి ప్రాణశక్తి మార్పిడి జరుగుతుందని పేర్కొన్నాయి.

భార్యాభర్తలు, స్నేహితులు కౌగిలించుకున్నప్పుడు వారి హృదయస్పందనలు ఒకే లయలోకి వచ్చి పరస్పర విశ్వాసం పెరుగుతుందని ఋగ్వేదంలోని కొన్ని మంత్రాల వివరణ. శ్రీరాముడు కులాలకు, అంతస్తులకు అతీతంగా గుహుణ్ణి, భరతుణ్ణి, హనుమంతుణ్ణి, విభీషణుణ్ణి కౌగలించుకోవడం అందరినీ సమానంగా ప్రేమించే భగవంతుని తత్వాన్ని కళ్ళముందుంచుతుంది. అదే భగవానుడు కృష్ణుడిగా అర్జునుణ్ణి వాత్సల్యంతో ఆలింగనం చేసుకొని ధైర్యం నింపడం గమనించవచ్చు. కపటప్రేమ కనబరుస్తూ అక్కున చేర్చుకొనే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ధృతరాష్ట్ర కౌగిలి ఉదంతం తెలియచేస్తోంది.

కామసూత్రలో ప్రస్తావన కనీసం 1800 ఏళ్ళక్రితం పాటలీపుత్రంలో ఉన్నాడని భావించబడుతున్న వాత్స్యాయణుడనే మల్లనాగుని కామసూత్రలో స్పృష్టకం, విద్ధకం, ఉద్ఘృష్టకం, పీడితకం అనే నాలుగు రకాల కౌగిలింతలను పేర్కొన్నాడు. వీటిలో విద్ధకం (గాఢంగా హత్తుకోవడం) పీడితం (గాఢమైన అనురాగంతో గట్టిగా అల్లుకుపోవడం) దంపతులకు ముఖ్యమైనవని పేర్కొన్నాడు.

**ఆధునిక విజ్ఞానశాస్త్రం ఏమి చెబుతోంది? :** ఆధునిక విజ్ఞానశాస్త్రం ప్రకారం కనీసం ఇరవై సెకనులు గట్టిగా కౌగలించుకోవడం వలన శరీరాల్లో అద్భుతమైన రసాయనికి చర్యలు జరుగుతాయని పేర్కొంటోంది.

ఆలింగన సమయంలో మానసిక ఒత్తిడిని కలిగించే "కార్టిసోల్" హార్మోను స్థాయి తగ్గి "ఆక్సిటోసిన్" అనే ప్రేమస్రవం (లవ్ హార్మోన్) విడుదలై ఒంటరితనాన్ని, దిగులును తగ్గించి అవతలి వ్యక్తిపై నమ్మకాన్ని, భద్రత భావాన్ని పెంచుతుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. అంతేకాకుండా క్రమం తప్పకుండా ఆత్మీయులను ఆలింగనం చేసుకొనే వారిలో రక్తపోటు, గుండె వేగం అదుపులో వుంటాయని తద్వారా గుండెజబ్బుల ముప్పు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. పరిష్వంగం సమయంలో తెల్లరక్తకణాలు సమర్థవంతంగా పనిచేస్తూ రోగనిరోధక శక్తి పెంచడం, సహజసిద్ధ నొప్పి నివారిణి (పెయిన్ కిల్లర్) ఎండార్ఫిన్ విడుదల కావడం జరుగుతుంది. ప్రముఖ ఫ్యామిలీ తెరపిస్ట్ వరోజనియ సతీర్ (ఈవిడను మదర్ ఆఫ్ ఫ్యామిలి థెరపీ అంటారు) అన్నట్టు మనం మనుగడ సాగించడానికి రోజూ నాలుగు,

బ్రతకడానికి ఎనిమిది, ఆరోగ్యంగా జీవించడానికి పన్నెండు కౌగిలింతలు అవసరం. కార్నెగిమెల్లన్ విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా వారి పరిశోధనలు కూడా పై విషయాలను ధ్రువీకరిస్తూ మానసిక ఆందోళను తగ్గించే సహజ ఔషధం ఆలింగనం అని పేర్కొన్నాయి.

రెండు ఆత్మల సంయోగంగా ఆలింగనాన్ని మన ఉపనిషత్తులు పేర్కొంటే కౌగిలింతను ప్రత్యేక రసాయనిక చర్యలకు దోహదపరచేదిగా ఆధునిక శాస్త్రం భావిస్తోంది.

భారతవనిలో పరిస్థితి ఇండియా ఐ.వి.ఎఫ్. వంటి సంస్థలు దేశంలోని ప్రముఖ నగరాల్లో చేసిన సర్వే ప్రకారం సమాచార సాంకేతిక రంగాల్లో పనిచేస్తున్న కనీసం నలభై శాతం ఉద్యోగ దంపతులు తాము ఒకే ఇంటిలో రూమ్మేట్లుగా ఉంటున్నామని, వృత్తి ఒత్తిళ్ళు, తినేతిళ్ళు వంటి కారణాలతో తమ మధ్య ప్రేమ పూర్వక స్పర్శ కరువవుతోందని వాపోయారు. ఒకరినొకరు కౌగిలించు కోవాలనే ఆలోచన, ముద్దు పెట్టుకోవాలనే కోరిక అడుగంటి పోవడం కూడా సంతాన సాఫల్యత తగ్గడానికి ప్రధాన కారణంగా అనేకమంది వైద్యులు పేర్కొనడం దేశానికి హెచ్చరిక వంటిదే! రోజులో కనీసం నాలుగుసార్లు కూడా కౌగిలించుకోకపోవడం వలన కూడా విడాకుల సంఖ్య పెరగడానికి కారణంగా ఫ్యామిలీ తెరపిస్ట్ (కుటుంబ మనస్తత్వనిపుణులు) మాట. తల్లిదండ్రుల్ని ఎక్కువ మంది పిల్లల్ని కనమంటూ ఉద్బోధించే నాయకులు అసలు సంతాన సాఫల్యతా రేటు ఏఏ కారణాలవలన ఇంతలా తగ్గుతోందో గుర్తించి వాటిపై దృష్టి సారించాలి.

**ముక్తాయింపు :** కౌగిలింత ప్రాముఖ్యతను తెలిపిన నేటి విజ్ఞాన శాస్త్ర మేధావులకన్నా వేల సంవత్సరాల క్రితమే ఆలింగనం గురించి "బృహదారణ్యకోపనిషత్తు"నాల్గవ అధ్యాయం, మూడవ బ్రాహ్మణం, ఇరవై ఒకటో శ్లోకం (4.3.21) "తద్యథాప్రియయా స్త్రీయా సంపరిష్వక్తో న బాహ్యం కించన వేద నాన్తరమ్.." ఎంతో రమ్యంగా వివరించింది. అత్యంత గాఢముగా కౌగిలించుకున్న భార్య పరిష్వంగంలో పురుషుడు బాహ్య అంతఃస్థితులను మరచిపోయి పరమాత్మతో ఏకమైన భావనను పొందుతాడని అర్థం. యవ్వనంలో పొందే లేక పొందగోరే కౌగిలింతలు కోరికతో ఆవేశంతో తమకంతో ఉంటాయి. అదే మలివయసులోని ఆలింగనాలు ఆర్తితో ప్రేమతో అనురాగంతో వాత్సల్యంతో ఉంటాయి. సహజసిద్ధంగా ఉచితంగా లభిస్తూ అతి సామాన్యంగా అనిపించేవే ఎంతో గొప్ప ప్రభావాన్ని చూపుతాయనడానికి కౌగిలింత అనే నిలువెత్తు స్పర్శ ఒక తిరుగులేని ఉదాహరణ.

గడ్డం దేవీప్రసాద్
బెంగళూరు.
ఫోన్ : 897 183 0473

---

***కథ 2024*** *పుస్తకంలో మీరు రాసిన "హత్య" కథను ఇప్పుడే చదివాను. చాలా బాగుంది. మన వ్యవస్థ ఏ స్థాయిలో ఉంది చూపించారు ఇందులో. కథ చదువుతున్నంతసేపూ వాడి మీద కోపం పెరుగుతూనే ఉంది. ఏదోకటి చెయ్యాలనంతగా అనిపించింది. కథ ముగింపులో నిజంగానే చంపేస్తారేమో అనుకున్నా. కరోనా రాగానే అర్థమయ్యింది ముగింపు ఎలా ఉండబోతుందో అని. మంచి కథ చదివించారు మీరు. మీరు మరిన్ని మంచి రచనలు చెయ్యాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మీ ఆరోగ్యం జాగ్రత్త.*

***- అజహర్***


***డైరీలో మరో రెండు :*** *రాపిడో పార్సెల్ తీసుకుని రాజేష్ వచ్చాడు – కవర్ తీసుకుని అతని వాలకం చూసి ఏం చదివావు అంటే – బి.టెక్ చేస్తున్నా 3వ సంవత్సరం – అన్నాడు – ఓ – మరి ఫీజు రిఎంబర్స్‌మెంటు ఆపేశారు కదా – ఇబ్బందిగా లేదా? నాకు ఎమ్‌సెట్ రాంక్‌తో సీటు వచ్చింది సార్ అన్నాడు – బాగుంది – మరి రాపిడో ఏమిటి? ఇది పార్ట్ టైం – రోజుకు 1500 వస్తుంది – నాకు ఈవి స్కూటర్ వుంది.*

– – – –

*ఆ మర్నాడు – ఊబర్ పార్సెల్ వచ్చింది. తెచ్చింది మల్లేశ్ – 35+ఉంటుంది. అదే అడిగాను – ఏమి చేస్తున్నావు– అంటే – ఎనిమిది సంవత్సరాల సాఫ్ట్‌వేర్ జాబ్ చేశాను – మానేశాను – నా కెవ్వరూ లేరు – పెళ్లి చేసుకోలేదు. స్వేచ్ఛగా వుండాలని – ఇలాంటివి చేస్తున్నాను – ఆశ్చర్యపోవడం నావంతయింది.*

# కీర్తి ప్రతిష్ఠలు

– ఆర్థర్ షోపెన్ హోవర్
– తెలుగు : ముక్తవరం పార్థసారథి


ఆర్థర్ షోపెన్ హోవర్

*"... పరిపాల యంతాం న్యాయ్యేన మార్గేణ మహీ మహేశాః.."*
*పాలకులు భూమిని (ప్రజలను) న్యాయమార్గాన పరిపాలింతురుగాక!*
*ఇదేమీ కోరరాని కోరిక కాదు – కాని తరతరాలనుంచి ప్రజలకు ఏమి ప్రాప్తమవుతుందో తెలియని విషయమూ కాదు– నానాటికి పరిపాలకుల స్వార్థం పెరిగిపోవటానికి కారణమేమిటి? వాషింగ్టన్‌లో, జెఫర్సన్ భవనం – అది నేషనల్ లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్. అందులో ఒక కుడ్య చిత్రం ఉంది. ఒకటేమిటి చాలానే ఉన్నాయి. 'అవినీతి' ప్రభుత్వం ఎలా వుంటుంది – ప్రజలకు 'శాంతి – సంపద' ఎలా వుండాలి – చిత్రాలన్నీ కథలు చెపుతాయి.*
*మానవజాతికి అవినీతి జాడ్యం ఇప్పటిది కాకపోయినా, ఇప్పటి పాలకులను మనం ఏ విధంగా సమర్థించగలం? వేదాలకు సాధికారిక వ్యాఖ్యానం తెలుగువాడైన సాయణాచార్యుడు చెప్పినట్లు విన్నాం – కీర్తిప్రతిష్ఠలు'లో షోపెన్‌హోవర్ కూడా వాల్మీకి, వ్యాస కాళిదాసులను బ్రహ్మస్వరూపులన్నాడు.*
*వీరికి ఏ పీఠం పురస్కారం అందించలేదు – ఇప్పటి ఆచార్యుల పయనం కీర్తిప్రతిష్ఠల కోసం, పురస్కార పీఠాల కోసం – రాజకీయ ప్రాపకం కోసం ప్రాకులాడటం – ఎన్ని దక్కినా ఇంకా ఏమి కావాలో తెలియని అజ్ఞానంలో కొట్టుమిట్టాడటం చూస్తుంటే అర్హత లేనివారే – ఇలా అర్రులుజాస్తుంటారనుకోవాలి – మరిన్ని వివరాలు 'కీర్తిప్రతిష్ఠలు'లో చదవండి. ఇంతకీ చెప్పవచ్చింది ఏమిటంటే భారతీయ 'సాహిత్యం' ప్రపంచానికి చెప్పింది "పరిపాలనా యంతాం.." అని కదా. మన ఇంటనే ఇది కరువైతే ఇంక వెలుపల ఏమి చూడగలం?*
**- ఎ.కె.**

'తోకచుక్కలు, గ్రహాలు, నక్షత్రాలు' అంటూ రచయితల్ని మూడు రకాలుగా విభజించవచ్చు. క్షణకాలం పాటు తళుక్కున మెరిసి, అందరి దృష్టినీ ఆకర్షించి అంతలోనే కనుమరుగైపోతాయి తోకచుక్కలు. కాని గ్రహాలు, నక్షత్రాలు చిరకాలంగా కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని నక్షత్రాలు ఎక్కువ ప్రకాశవంతంగా కనిపిస్తాయి. దీనికి కారణం అవి మనకు చేరువలో వుండటమే. సమకాలికుల దృష్టిలో మాత్రమే మహా రచయితలనిపించుకుంటారు కొందరు. కాని, తరువాతి తరాలవాళ్ళు, ఈ రచయిత వునికిని కూడా గుర్తించరు. కొన్ని నక్షత్రాలు గగన తలంలో అనంతంగా వెలుగుతూనే వున్నాయి. వాటికి మరణం లేదనిపిస్తుంది. ఇవి ఒకసారి తక్కువ, మరొకసారి ఎక్కువ ప్రకాశవంతంగా వుండవు. వేల ఏళ్ళుగా మనం కొందరు రచయితల్ని చదువుతూనే వున్నాం – ఈ మధ్యకాలంలో మరెందరు వచ్చి, నిష్క్రమించారో తెలియదు. అలనాటి రచయితలు, అనాదిగా కాంతిని ప్రసరిస్తున్న కాంతిపుంజాలు. సుదూర నక్షత్రాలు. దేశ కాల పరిస్థితులకు వాళ్ళు అతీతులు. సార్వకాలీనత, సార్వజనీనత వాళ్ళ లక్షణం. మానవజాతి సమస్తం వాళ్ళ వారసత్వమే. నక్షత్రాల కాంతి మనను చేరటానికి చాలా కాలం పడుతుంది.

అనమాన ప్రతిభగల రచయితలను, తక్షణ కీర్తిప్రతిష్ఠలు వరించవని యిప్పటికే తెలుసుకున్నాం – ఎందుకంటే సామాన్య ప్రజలకు వీళ్ళను బేరీజు వెయ్యగలిగిన సంస్కారం వుండదు. కాని, యింతకన్నా ముఖ్యకారణం మరొకటుంది. సమకాలీనుల అసూయ వీళ్ళకు గుర్తింపు రాకపోవటానికి పెద్ద అడ్డంకిగా మారుతుంది. ఒకరికి కీర్తి రావటానికి, సహ రచయితల

అసూయకన్నా పెద్ద అడ్డుగోడ మరొకటుండదు. ఎంత మందిని, ఎన్ని రకాల యిది అనామకులుగా మార్చిందో ఊహకు కూడా అందదు. ఒక వ్యక్తికి వచ్చే గుర్తింపును పురిట్లోనే గొంతు నులిమి చంపటానికి సమకాలికులు తరతరాలుగా ఉపయోగిస్తున్న రహస్యాయుధం అసూయ. తమకు రాని గుర్తింపు మరొకరికి రాకుండా చెయ్యటమే వీరి పని. వీళ్ళ దృష్టిలో ఎవరికీ స్వంత వ్యక్తిత్వము ఉండకూడదు. ఇతర్లు వాళ్ళనుండి ఏమాశిస్తున్నారో ఆ పనులే చెయ్యాలి. ఎలా వుండాలనుకుంటున్నారో అలాగే వుండాలి. ఎవరైనా తమకన్నా భిన్నంగా వుండి గుర్తింపు తెచ్చుకోవటం వీళ్ళు సహించలేరు. అయితే, ఎంత ప్రయత్నించీ, కొందరి కీర్తిప్రతిష్ఠల్ని అడ్డుకోలేరు గాని, చివరి క్షణం దాకా అన్ని రకాల ప్రయత్నాలూ చెయ్యటం తమ కర్తవ్యమనుకుంటారు వీళ్ళు. జీనియస్‌ల పట్ల సెకండ్ రేట్ రచయితల కడుపుమంట ఈనాటివి కాదు.

ప్రతిభపట్ల రెండు రకాల దృక్పథాలు అలవర్చుకోవచ్చు. ఒకటి – మనం స్వయంగా ప్రతిభ సంపాదించుకోవటానికి ప్రయత్నించటం. రెండు–మరొకరి ప్రతిభను గుర్తించటానికి నిరాకరించటం. ఈ రెండవ పద్ధతిని ఆచరించటం సులభం. సమాజంలో అందరూ చేసే పని యిదే. అసూయ అనేది మన లోపాలకు, మనలోని బలహీనతలకు చిహ్నం. అందువల్ల మన లోపాలను అంగీకరించటం కన్న, ఎదుటి మనిషికి ప్రతిభ లేదని వాదించటం సులభం. స్పానిష్ రచయిత, తత్త్వవేత్త బాల్తజార్ గ్రేసియన్ (1601–1658), అసూయకూ, ప్రతిభకూ వున్న సంబంధం గురించి ఓ పిట్టకథ చెప్పారు. ఒకసారి అడవిలోని పక్షులన్నీ కలిసి నెమలికి వ్యతిరేకంగా ఓ కుట్ర చేశాయి. దాని అందం మిగతావాటికి లేదు మరి. "దాని పొగరు చూడు దాని టెక్కు చూడు, దాని రెక్కల్ని పీకేస్తేగాని దానికి బుద్ధిరాదు. అందమంతా తనదే అనుకొని ఎంత నీల్గుతున్నది!" అంటూ తన అక్కసు వెళ్ళబోసుకుంది నల్లకాకి.

"ప్రతిభ లేకపోవటమే నిజమైన ప్రతిభ. అదే అందరికీ వుండవలసిన సుగుణం" అనే వాదన అసూయకు మారుపేరు. ఇది నిజమని నమ్మిన కుళ్ళుబోతు వెధవలు ప్రతి కాలంలోనూ వున్నారు. ప్రతిభావంతులను కించపరచటానికి వాళ్ళ దగ్గర వున్న ఏకైక ఆయుధమిదే. ఇదే వాళ్ళ బ్రహ్మాస్త్రం. ప్రతిభ లేనివాళ్ళను ఆత్మన్యూనత నుండి రక్షించగలిగిన కవచకుండలలాంటిదిది. అందువల్ల కనీసం ఈ సుగుణమైనా తమకు పుష్కలంగా వుండాలని కోరుకుంటారు. నా ప్రధాన రచన World as will and Representation లో ఈ విషయాన్ని విస్తృతంగా చర్చించాను. "ప్రతిభ లేనివాళ్ళకు వినయమే భూషణము" అని తన Miscellaneous Writings లో ఒకచోట రాస్తాడు; లిక్టెన్‌బర్గ్ – గోతె మరింత దూకుడుగా "దొంగ వెధవలే అతి వినయం ప్రదర్శిస్తారు" అంటారు. అయితే, అంతకు ముందు సెర్వాంటెస్ కూడా యిలాంటి మాటలే చెప్పాడు. ఈయన తన Journey up Parnasus లో కవులకు యిలా సలహా యిస్తాడు : "కవులు తమ గురించి ఎప్పుడూ తక్కువ అంచనా వేసుకోకూడదు. ఎందుకంటే "అతి వినయం ధూర్తలక్షణం" అని ఒక నానుడి వుంది. ఇక, ఈ విషయంలో షేక్స్‌పియర్ కూడా తక్కువ తినలేదు. తన కవిత్వానికి మరణం లేదని పదేపదే చెప్పుకున్నారు (సానెట్స్‌లో). "ప్రాచీనుల్లోగాని, ఆధునికుల్లోగాని, స్వంత రచనల గురించి యింత ఆత్మవిశ్వాసం ప్రదర్శించిన రచయిత మరొకడు లేడు." అంటాడు కోలియేర్.

మంచి రచనల్ని, గొప్ప గ్రంథాల్ని ఎద్దేవా చెయ్యటం, వాటి విలువ తగ్గించి చూడడం అసూయాపరులకత్యంత యిష్టమైన పని. కాని అలా చెయ్యటం వాళ్ళకసాధ్యం. అందువల్ల చెత్త పుస్తకాలను ఆకాశానికెత్తుతారు. వాటినే అనర్ఘరత్నాలని కీర్తిస్తారు. అలా చెయ్యటంవల్ల మంచి పుస్తకాల నుండి ప్రజల దృష్టిని మళ్ళిస్తారు. కాని, అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతినెవరాపగలరు? వాళ్ళు శతసహస్ర విధాల ప్రయత్నించినా, త్వరలోనే, మబ్బుతెరలను చీల్చుకుని జాజ్వల్యమానంగా ప్రకాశిస్తాడు సూర్యుడు. చెత్తపుస్తకాలు సంపాదించుకున్న కీర్తి మూణ్ణాళ్ళ ముచ్చటగా మిగిలిపోతుంది. ఇలాగ దుష్ప్రచారం చేసేవాళ్ళూ, శకున పక్షులూ అజ్ఞాతంలో వుండటానికిష్టపడతారు. తమ మొహాలకూ మసి అంటుతుందేమోనని.

అంతమాత్రాన, వీళ్ళు తమ కుటిల యత్నాలను మానేస్తారా? లేదు. ఒకటి కాకపోతే, మరొక తప్పుడు దారి వెతుక్కుంటారు. ప్రతిభావంతుడు రంగప్రవేశం చేసినప్పుడు, సమకాలికులందరూ పిడుగుపడినట్టుగా వులిక్కిపడతారు. నెమలి పింఛం యితర పక్షుల్లో అసూయ

రగిలించిందే, అలా ప్రతిభానూర్యుడి ముందు నిశ్చేష్టులవుతారు. నోళ్ళు పెగలవు. సామూహికంగా అందరికీ పక్షవాతం వచ్చిందా, కాళ్ళూ చేతులూ పడిపోయాయా అనిపిస్తుంది. అయితే, ఆ నిశ్శబ్దం ఒక కుట్ర. సెనెకా అన్నట్టుగా ఆ మౌనముద్రలో కాలనాగులు కాటెయ్యాటానికి అవకాశం కోసం వెదుక్కుంటాయి. 'సాంకేతికంగా' ఈ మౌనానికి మనం 'విస్మరించటం' అని పేరుపెట్టొచ్చు. మంచి పుస్తకానికి గుర్తింపు రాకుండా వుండటానికి యిది తాత్కాలికంగానైనా ఉపయోగ పడుతుంది. ఒక రచయితకున్న పాఠకులందరూ అతని ప్రత్యర్థులే అయినప్పుడు, అతనికి కీర్తి వచ్చే అవకాశమే లేదుగద! పుస్తకాన్ని గురించిన సద్విమర్శకే తావులేదు. అందరూ అందులోని లోపాల్ని ఎత్తిచూపేవాళ్ళే. లేదా దాని గురించి మాట్లాడగూడదని మూతి బిగించుకొని కూర్చున్నవాళ్ళే. ఒకవేళ, ఈ కుట్రదార్లు, మౌనం వీడి, దాన్ని పొగడాల్సి వచ్చినా, దాని వెనకా మరేదో రహస్య కారణముంటుంది. పుస్తకం "విదేశాలలో ప్రచురితమైతే తప్ప దానికి నిజమైన గుర్తింపు రాదు" అంటాడు గోతే.

*"మనం చేస్తున్న పనే మరొకరు చేసినప్పుడు, వాణ్ణి పొగడటమంటే మనల్ని మనం కించపరచుకోవటమే. మన స్వంత పనికివ్వని విలువ పరులకిస్తున్నామన్న మాట."* –గోతే. అందువల్ల సమకాలీనులు ఒక వ్యక్తి ప్రతిభను గుర్తించకపోవటం సహజమే. అలాగే, లోపాలు వెదకటం, రంధ్రాన్వేషణ చెయ్యటం మరింత సహజం. ఇలా చెయ్యటంవల్ల మనం యితర్లకన్న గొప్పవాళ్లమని ప్రకటించుకుంటున్నాం. ఇన్ని అడ్డంకుల్ని అధిగమించి, ఎవరినైనా కీర్తి వరించిందంటే దానికి మరేదో బలమైన కారణముండి వుండాలి. పరస్పరం పొగడ్తలలో ముంచెత్తుకొనే భజన బృందాల గురించి నేను మాట్లాడటంలేదు. ఒక గొప్ప పని స్వయంగా చెయ్యటంలో వచ్చినంత తృప్తి, మరొకరి కృషిని గుర్తించటంలోనూ వస్తుంది. మొదట హీసియడ్ (గ్రీక్ కవి – హోమర్ సమకాలికుడు), తరువాత మాకియవెల్లి యిలా శెలవిచ్చారు "కొందరు సత్యాన్ని స్వయంగా గ్రహించగలరు. కొందరు చెబితే తెలుసుకుంటారు. మరికొందరికి స్వయంగా తెలుసుకునే జ్ఞానమూ వుండదు, చెప్పినా గ్రహించలేరు". అందువల్ల, మొదటి రకానికి చెందలేని వ్యక్తి, కనీసం రెండో రకంగానైనా వుండాలనుకుంటాడు. ఎవరికైనా గుర్తింపు దొరికేది వీళ్ళవల్లే. అయితే ఒకసారి గుర్తింపు లభించిన తర్వాత, ఆ పుస్తకాన్ని, లేదా ఆ పనిని ఆకాశానికెత్తటానికి జనం పోటీపడతారు. అలా పొగడకపోతే, తమ గౌరవం తగ్గిపోతుందేమోనని వాళ్ళ భయం. "జ్ఞానం ఎక్కడుందో గుర్తించినవాడే జ్ఞాని" అన్న జెనోఫోన్ సూక్తిని ఆచరణలో పెడతారు. ఒక పనిని స్వయంగా చెయ్యటంవల్ల సంపాదించలేని కీర్తిని, దాన్ని శ్లాఘించటం వల్లనైనా మూటగట్టుకోవాలనుకుంటారు. సైన్యం ఓటమి ముంగిట వున్నప్పుడు చేసే పని యిదే. మొదట సైనికులందరూ ముందు వరసలో వుండాలనుకొంటారు. కాని పరాజయం తప్పదనుకున్నప్పుడు పారిపోవటానికి పోటీపడతారు. తిరోగమనం చిత్తగించినవాళ్లు, తమలో అత్యంత సమర్థవంతమైన తిరోగమనదారుని ఆదర్శంగా తీసుకొని, అతడి మీద పొగడ్తల వర్షం కురిపిస్తారు. అంటే, ఏ అభిరుచి వున్నవాళ్ళు ఆ అభిరుచికి అనుకూలంగా వున్న రచయితలనే ఆదర్శంగా తీసుకుంటారు. వాళ్ళతోనే పోటీ పడాలనుకుంటారు.

ఈ చర్చతో మనకు స్పష్టమైనదొక్కటే. కీర్తి శిఖరాల నధిరోహించటం కష్టసాధ్యమే అయినప్పటికీ, సంపాదించిన కీర్తిప్రతిష్ఠల్ని నిలుపుకోవటం మరింత కష్టం. అంతేకాదు, అప్రయత్నంగా లేదా అతి సులభంగా వరించిన కీర్తి ఎక్కువ కాలం కొనసాగదు. అందరికీ సాధ్యమైన పనే మనమూ చేసి కీర్తి సంపాదించుకుంటే యితర్లూ అలాగే చేస్తారు. మనకు వచ్చిన కీర్తి అంత త్వరగానూ పలచనైపోతుంది. ఎందుకంటే, కీర్తిమంతుల్ని అనుకరించటానికే అందరూ కోరుకుంటారు. అంతేకాదు, ఎవరినైనా త్వరగా కీర్తి వరించిందంటే అది కాస్త అనుమానించవలసిన విషయమే. దీన్ని తమలాంటివాణ్ణి చూసి జనం చేసిన కరతాళ ధ్వనిగానే భావించాలి. ఒక ఉదాహరణ ద్వారా ఈ వింత పరిస్థితిని మనం అర్థం చేసుకోవచ్చు. ఎథీనియన్ రాజకీయ ప్రముఖుడు ఫోషియన్ అనర్గళంగా ఉపన్యసిస్తున్నప్పుడు శ్రోతల కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయట. వెంటనే తన ఉపన్యాసం ఆపి, "ఏమైనా తప్పుగా మాట్లాడానా? నా మాటలు మీకు అంత మూర్ఖంగా వినిపించాయా?" అని అడిగాడట ఫోషియన్.

చిరకాలం మనగలిగిన కీర్తి క్రమంగా, నెమ్మదిగా పరిపక్వతను సంపాదించుకుంటుంది. సమకాలికులు మాత్రమేకాదు, తరువాతి తరాలవాళ్ళు కూడా శ్లాఘించగలిగిన గుర్తింపు రావటానికి చాలా సమయం పడుతుంది. ఇది సాధించగలిగినవాడు కోటికొక్కడు. సమకాలికుల అసూయను తట్టుకుని శతాబ్దాలపాటు నిలిచిపోగలిగినవాళ్ళు అరుదు. కాని, కొద్దిపాటి ప్రతిభ వున్నా, తక్షణ కీర్తిని పొందటం అంత కష్టమేమీ కాదు. ఇలాంటివాళ్ళు, తమ జీవితకాలంలోనే, ఆ కీర్తి తొలి మంచులా కరిగిపోవటం కూడా చూస్తారు. అంటే యవ్వనంలో తమకంటూ ఓ గుర్తింపు సంపాదించుకున్న వాళ్ళు వృద్ధాప్యంలో అనామకులుగా జీవితం గడుపుతారు. కాని నిజమైన ప్రతిభావంతులు, అనేక సంవత్సరాలపాటు అజ్ఞాతంలో గడిపినా, చివరికి వాళ్ళ పేరు జాజ్వల్యమానంగా వెలుగుతుంది. కొన్నిసార్లు మరణానంతరమే యిది సంభవించవచ్చుగాక. అంటే మరణశయ్యే వాళ్ళ కీర్తి సింహాసనం (రోమన్ కాథలిక్కు సంప్రదాయంలో మహనీయులను మరణానంతరమే సెయింట్స్‌గా గుర్తిస్తారు). జర్మన్ కవి, రచయిత, జర్నలిస్టు (1771–1826) సీగ్‌ఫ్రీడ్ ఆగస్ట్ మాల్‌మాన్, తన రచన Herodes లో చెప్పినట్టుగా, గొప్ప పని ఏదైనా జనసామాన్యానికి వెంటనే నచ్చదు. జనం ప్రతిష్ఠించిన దేవతా విగ్రహం ఎంతోకాలం పూజలు అందుకోదు.

ఈ ఉదాహరణ చిత్రకళకు బాగా వర్తిస్తుంది. మనకు తెలుసు. గొప్ప కళాఖండాలకు తొలిరోజుల్లో ఎటువంటి గుర్తింపు లభించలేదు. అనేక సంవత్సరాలపాటు, అనేకమంది కళాప్రియులు వాటి విలక్షణతను లోకానికి చాటిన తర్వాత మాత్రమే జనసామాన్యం కూడా వారి గొప్పతనం గుర్తించారు. అంతేగాక, ఒక రచనకు గుర్తింపు రావటం రెండు అంశాల మీద ఆధారపడి వుంటుంది. ఒకటి రచన స్వభావం. అది పండితపామర రంజకంగా వుందా లేక నారికేళ పాకంలో వుందా అన్నది రెండవది. అది ఎంతమందికి నచ్చుతుంది? కొద్దిమందికా లేక అత్యధికులకా? ప్రస్తుతం మనం, జనాన్ని విపరీతంగా ఆకర్షించేవాళ్ళను (ఎవర్ని చూడటానికి జనం పోటీ పడతారో) పరిశీలిద్దాం. ఈ వరుసలో మొదట నిల్చేది వీధిలో ఫీట్లు చేస్తూ ప్రదర్శనలిచ్చేవాళ్ళు. ఆ తర్వాత సర్కస్‌వాళ్ళు, నర్తకీమణులు, గారడీవాళ్ళు, నటీనటులు, గాయకులు, సంగీతకారులు, కవులు, ఆర్కిటెక్టులు, చిత్రకారులు, శిల్పులు, చివరగా తత్త్వవేత్తలు.

తాము రాసేదీ, చెప్పేదీ వినోదం కాదు గనక, సహజంగానే తత్త్వవేత్తలు అతి తక్కువమందిని ఆకర్షిస్తారు. వీళ్ళ పని బోధించటం. సరదా కబుర్లు చెప్పటం కాదు. వీళ్ళను చదవటానికి ముందే పాఠకులకు ఈ విషయాల్లో కొంత ప్రాథమిక జ్ఞానముండాలి. అర్థం చేసుకోవటానికి కృషిచెయ్యాలి. సహజంగానే, సమాజంలో యిలాంటివాళ్ళ సంఖ్య బహు స్వల్పం. వీళ్ళ కీర్తి అన్ని వర్గాలకూ వ్యాపించే అవకాశం లేదుగానీ, వచ్చిన గుర్తింపు చాలా కాలం వుంటుంది. అంటే సర్వజనామోదం పొందిన వ్యక్తి, కీర్తి శిఖరాన ఎక్కువకాలం కొనసాగలేడు. అతి నెమ్మదిగా, కొద్దిమందిలో మాత్రమే గుర్తింపు తెచ్చుకున్న వాడి పేరు తరతరాలపాటు నిలిచివుంటుంది. ఇంచుమించు తత్త్వవేత్తల సరసనే చేరతారు కవులు, సంగీతకారులు. ఎందుకంటే ఒకసారి అచ్చయిన పుస్తకానికి మరణంలేదు. అయినప్పటికీ, ఈ విషయంలో తత్త్వవేత్తలతో మరెవరూ పోటీపడలేరు. ఎందుకంటే మిగతా రంగాలలోకన్న తత్త్వశాస్త్రంలో వచ్చిన పుస్తకాల సంఖ్య చాలా స్వల్పం. మరో కారణం సాహిత్యంకన్నా తత్త్వశాస్త్రాన్ని యితర భాషల్లోకి అనువదించటం సులభం. కొన్నిసార్లు ఒక తత్త్వవేత్త కీర్తి అతని రచనలకన్న ఎక్కువ కాలం నిలుస్తుంది. థేల్స్, ఎంపిడాకల్స్, హెరాక్లిటస్, డెమోక్రిటస్, పార్మెనైడ్స్, ఎపిక్యూరస్ (అందరూ గ్రీకు తత్త్వవేత్తలే) వగైరాలే యిందుకు నిదర్శనం.

ఇప్పటిదాకా నేను చేసిన వ్యాఖ్యలన్నీ భౌతిక అవసరాలు తీర్చే కృషి గురించి కాదు. నిత్య జీవితంలో మనకుపయుక్తంగా వుండవలసిన, లేదా మనకు ఆనందమిచ్చే పనులకు ఈ వ్యాఖ్యానం వర్తించదు. అలాంటి పనులను మనమెప్పుడూ గౌరవిస్తాం. నిజానికి అవి లేకుండా జీవితం గడవదు. గొప్ప వంటవాడు లేదా షెఫ్ అజ్ఞాతంగా వుండటం సాధ్యమా? తరతరాలుగా అలాంటివాళ్ళ గురించి చెప్పుకోవటం మనం వినలేదా!

అయితే కృత్రిమంగా కీర్తి గడించాలనుకునే పేరాశగాళ్లు కూడా వుంటారు. వీళ్ళ సంఖ్యే ఎక్కువ. ఉదాహరణకు, ఒక పుస్తకాన్ని మిత్రుల, భజన బృందాల

సహాయంతో ఆకాశానికెత్తేస్తారు. దొంగ విమర్శలు, సమీక్షలు రాయిస్తారు. ఇలా అందరూ కూడబలుక్కుని తాత్కాలికంగా ఓ వెలుగు వెలుగుతారు. ఇలా జరిగాక కృత్రిమ పబ్లిసిటీతో జనం కూడా అదంతా నిజమని భ్రమిస్తారు. గాలి నింపిన ట్యూబు నీటిలో తేలినట్టుగా, కొన్నాళ్లు ఆ పుస్తకం అందరి దృష్టినీ ఆకర్షిస్తుంది. గాలి వున్నంతసేపూ (ఎంతసేపన్నది అందులో వున్న గాలినిబట్టి వుంటుంది) ట్యూబు తేలుతూనే వుంటుంది. కాని ఎప్పుడో ఒకప్పుడు గాలి పోకా తప్పదు. అది నీటిలో మునగకా తప్పదు. పబ్లిసిటీమీద ఆధారపడిన అన్ని పుస్తకాలకూ యిది వర్తిస్తుంది. పబ్లిసిటీ అంటే ట్యూబులో నింపిన గాలిలాంటిది. త్వరలోనే "యిది అంత కీర్తికి అర్హమైన పుస్తకం కాదం"టారు విజ్ఞులు. ఆ తర్వాత జాడ లేకుండా కనుమరుగవుతుందా గ్రంథరాజం. దానిపట్ల విముఖత కూడా పెరుగుతుంది. కాని పబ్లిసిటీమీద ఆధారపడక, ప్రతిభ అనబడే యిటుకలతో కట్టబడిన మంచి పుస్తకం రోజురోజుకూ ప్రాచుర్యం పెంచుకుంటుంది. శుక్లపక్ష చంద్రునిలా దినదిన ప్రవర్థమానమవుతుంది. ఏళ్లు గడుస్తున్నకొద్దీ దాని కీర్తి పెరుగుతుంది. గురుత్వాకర్షణ శక్తిని ధిక్కరించిన వస్తువులాగ, సాహిత్యాకాశంలో వెలుగులు విరజిమ్ముతూ విహరిస్తుంది. కాలాతీత రచన అంటే అదే. జీనియస్సులు – కవులు, తత్త్వవేత్తలు, కళాకారులు లేదా మరేదైనా రంగంలో కృషిచేసిన వారైనా గానీ వీరాధివీరులవంటివాళ్లు, అశేష శత్రుసైన్యాలను ఒంటరిగా ఎదుర్కొంటారు. అంతిమ విజయం కూడా వారిదే. ఒకరకంగా శాపగ్రస్తమైన మానవ జాతి విషాదం యిది. మూర్ఖత్వం, రోజువారీ సమస్యలే తప్ప మరి దేని గురించీ ఆలోచించలేని తనం, తక్షణానందం కోసం అర్రులు చాచటం, ప్రతి చిన్న విషయంలోనూ అసూయా ద్వేషాలతో రగిలిపోవటం, కోపతాపాలు – యివే కదా అత్యధికుల్ని, జన సామాన్యాన్ని పట్టి పీడిస్తున్న జాడ్యాలు. జీనియస్సుకు రావలసిన గుర్తింపుకూ, అతని ఎదుగుదలకూ కూడా యివే అతి పెద్ద అడ్డంకి. అతడు ఏ రంగంలో కృషి చెయ్యనీ తొలి దశలో ఈ శత్రుమూకల ముందు తలవంచక తప్పదు. నూటికో, కోటికో అందరిమీదా యుద్ధం ప్రకటించే యోధుడొక్కడుండకపోడు. కాని అతనికి గుర్తింపు నెమ్మదిగా, అతి నెమ్మదిగా, తరచూ ఒక జీవితకాలం లేటుగా వస్తుంది. వచ్చినా, మీడియోకర్ల కాకిగోలలో కొడిగట్టిన దీపంలా వెలుగుతుంది. జీనియస్సుల రచనలకు వక్రభాష్యాలు చెబుతారు లేదా పనిగట్టుకుని పలచనచేసి సమీక్షలు రాస్తారు. నీలాపనిందలు వేస్తారు. వ్యక్తి దూషణలకు పాల్పడతారు. అసలు అతడికే అర్హతలూ లేవంటారు. ఇలాంటి చవకబారు, నీచ దుష్ప్రచారానికి తాత్కాలికంగా జనం మోదం కూడా లభిస్తుంది. ఎవరైనా సద్విమర్శకు, తల్లికి (తండ్రి) చిత్తరువులు చూపి "కళ్లు లేవా? చూడలేవా?" అని అడిగిన హామ్లెట్ లాగ – ఒక రచయిత గొప్పదనాన్ని, విలక్షణతను వివరిస్తూ వ్యాసాలు రాయవచ్చునుగాక. కాని, జనానికి కళ్లుంటే గద చూడటానికి! ఒక గొప్ప కళాఖండం ముందర నిల్చున్న జనసంద్రోహాల్ని చూసినప్పుడు నాకు కోతిమూకలే గుర్తుకు వస్తాయి. వాటి చేష్టలు మనుషులను పోలివుంటాయి. అయినా అప్పుడప్పుడూ అవి తమ స్వాభావిక లక్షణాలను దాచుకోలేవు. తెలివి తక్కువతనమో, తిక్కవేషాలో అవి మనుషుల రూపంలో వున్న కోతులేనని గుర్తుచేస్తాయి.

కొన్నిసార్లు, "అతడు కాలంకన్నా ముందున్నాడు" అని కొందరికి కితాబిస్తుంటారు. అంటే, సమకాలీన మానవాళికన్నా ముందున్నాడా అతడు? అందరూ తన వెంటపడాలని జీనియస్ అనుకోకపోవటానికిదే కారణం. తాను అతి కొద్దిమందికే నచ్చుతానని అతడికి తెలుసు. జన బాహుళ్యం ఎలాగూ తనను విస్మరిస్తుంది. తరతరాలుగా యిలాగే జరుగుతోంది. అదృష్టం కలిసివస్తే తప్ప అతణ్ణి ఎవరూ సరిగా అర్థం చేసుకోరు లేదా అపార్థం చేసుకుంటారు. గుర్తింపు రావటానికి కాలం కలిసిరావటానికి జీవితకాలం సరిపోకపోవచ్చు. అలాంటప్పుడే "ఆయన కాలంకన్నా ముందున్నాడు" అనీ, తమ అజ్ఞానాన్ని సమర్థించుకుంటారు జనం. అయితే వాళ్ళ ఉద్దేశం "కాలంకన్నా" అని కాదు. 'సమకాలీనులకన్న' అని మాత్రమే. అలా తమ లోపాన్ని 'కాలంమీదికి' మానవాళి నెట్టేస్తారు. *అందువల్ల జీనియస్, తన కాలంకన్న ముందున్నాడంటే, అన్ని కాలాలకన్న ముందున్నట్టే. ఏదో ఒక కాలంలో తనను అర్థం చేసుకోగలిగినవాళ్ళు పుడితే తప్ప (సమకాలికులకే ఈ సామర్థ్యం వుంటే, అతడు అదృష్టవంతుడే!).* హైందవ పురాణాలలో చెప్పినట్టుగా,

*విష్ణువు అవతార పురుషుడైతే, బ్రహ్మ ఆయన లీలలను గానం చేస్తాడు. అంటే, వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసులు కూడా బ్రహ్మస్వరూపులే.* అంటే, ప్రతి యుగంలోనూ, సమకాలికులు గుర్తించినా, గుర్తించకపోయినా అత్యద్భుతమైన కార్యాలు జరుగుతూనే వుంటాయి. అన్ని కాలాలలోనూ వుంటారు 'ఫిలోమన్, బాసిస్‌లు (ఓవిడ్ కావ్యం, మెటమార్ఫసిస్‌లో ఫిలోమన్, బాసిస్ దంపతుల కథ వుంది. దేవతలు ఒక వూరికి వచ్చినప్పుడు, వాళ్ళ దైవత్వాన్ని గుర్తించలేని గ్రామీణులు వాళ్ళను యిళ్ళలోకి కూడా రానివ్వరు. అప్పుడు ఆ దేవతలకు ఫిలోమన్ బాసిస్ దంపతులు మాత్రమే ఆతిథ్యమిస్తాను). "ఇతర్లు తన ప్రతిభను గుర్తించేదాకా నిరీక్షిస్తారు" అనుకోడు జీనియస్. అతని ప్రతిభ సహజసిద్ధం. పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా, ప్రతికూలించినా, తన పని చేసుకుంటూనే పోతాడతడు. జీనియస్ అయినవాడు దూషణ భూషణాలకతీతం. జనం తనను శ్లాఘిస్తారా, తిరస్కరిస్తారా అని ఎప్పుడూ ఆలోచించడు. తన తదనంతరమైనా గుర్తింపు రాకపోతుందా అన్న ధ్యాస కించిత్తు కూడా వుండదు.

అత్యున్నత స్థాయికి చెందిన రచనలకు ఈ చివరి వాక్యం వర్తిస్తుంది. అసలు యిలాంటి కృషిని అర్థం చేసుకోగలిగినవాళ్ళు, ఆనందించేవాళ్ళు అతి స్వల్పం అనుకున్నప్పుడు కీర్తి గురించి ఆలోచించటం అర్థరహితం కదా. అయితే, కవులు యింత క్లిష్టపరిస్థితిని ఎదుర్కోవలసిన అవసరం లేదు. ఎందుకంటే కవిత్వాన్ని ఆనందించేవాళ్ళ సంఖ్య మరీ అంత తక్కువేం కాదు. సర్ వాల్టర్ స్కాట్‌ను చదవగలిగిన పాఠకుల సంఖ్య కొన్ని వందలకే పరిమితమైతే, అతడి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించవలసిన అవసరమే వుండేది కాదు. "అతడు కాలంకన్నా ముందున్నాడు" అని కూడా వ్యాఖ్యానించేవాళ్ళ, కాని, కొన్ని వందల మంది అభిప్రాయమే ఆ తరానికి చెందిన అధిక సంఖ్యాకుల అభిప్రాయంగా చలామణి అయితే పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. "ఇతడు అవినీతిపరుడు" అని ఒకణ్ణి కోర్టులో నిలబెడితే, అతడు "సమాజమే అవినీతిమయం" అని వాదించినట్టుగా!

*సాహిత్య చరిత్రను పరిశీలిస్తే, అంతర్దృష్టి, జ్ఞానతృష్ణ వున్నవాళ్ళ వునికినే ఎవరూ గుర్తించలేదనీ, భేషజంలో, స్వంత డబ్బా కొట్టుకొన్నవాళ్ళనే కీర్తిప్రతిష్ఠలు వరించాయనీ తెలుస్తుంది.*

ఒక రచయితను ఎంత తక్కువమంది చదివితే, అతడంత ప్రముఖుడు అంటారు. కాని, రకరకాల అడ్డదారులు తొక్కినకొద్దీ వందలమంది అనాయాసంగా, అతి తక్కువ కాలంలోనే "అగ్రశ్రేణి రచయిత"లైపోతారు. కాని, పబ్లిసిటీకి దూరంగా వుండే రచయితనెవరూ పట్టించుకోరు. లేదా అనేక సంవత్సరాల తర్వాత అతనికి ఏమాత్రమైనా కీర్తి వస్తుంది. మొదటిరకం రచయితలకు మిత్రులే పబ్లిసిటీ ఏజెంట్లుగా పనిచేస్తారు. చెత్తంతా ఒకచోట పేరుకుపోయినట్టుగా యిలాంటివాళ్ళకెప్పుడూ కొదవుండదు. ఇక, రెండోరకం రచయితకు మిత్రులుండరు సరికదా, శత్రువులు అతడిమీద రాళ్ళు విసరటానికి సిద్ధంగా వుంటారు. మేథోపరంగా తమకన్న వున్నతుణ్ణి, జీనియస్‌ను చూస్తే ఎప్పుడైనా, ఎవరికైనా ద్వేషమే రెట్టింపవుతుంది తప్ప, అతణ్ణి యిష్టపడే అవకాశమే లేదు. ముఖ్యంగా మీడియోకర్, సెకండ్‌రేట్ రచయితలకు మేధావులను చూస్తే ఎక్కడలేని అసూయ. నానా గడ్డి తిని తాము సమకూర్చుకున్న కీర్తిప్రతిష్ఠల్ని వాడెక్కడ తన్నుకుపోతాడోనని గజగజ వణికిపోతుంటారు. *యూనివర్శిటీలలోని ఫిలాసఫీ ప్రొఫెసర్లు, యిది చదివి, వాళ్ళ గురించే నేను ప్రస్తావిస్తున్నాననుకుంటే, అది సత్యదూరమేమీ కాదు.*

చిరకాలం మనగలిగిన ఒక గొప్ప పనిని తలపెట్టినప్పుడు, సమకాలికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోగూడదు. వాళ్ళ విమర్శలనూ, ప్రశంసలనూ పట్టించుకోనవసరంలేదు. అయితే ఒక అనర్ఘరత్నంలాంటి అపురూపమైన రచనకు మాత్రమే యిది వర్తిస్తుంది. అసలు, అలాంటి పని చేపట్టినవాడి జన్మ ధన్యం. ఇది నాలుగు కాలాలపాటు నిలిచే రచన గనక, సమకాలికులను సంప్రదిస్తే రచయిత ఆశయాన్ని వాళ్ళు సరిగ్గా అర్థం చేసుకొనే అవకాశం లేదు. పైగా తప్పుడు సలహాలతో పని పక్కదారి పడుతుంది. అంటే, ఈ క్రమంలో రచయిత, సమకాలీన ప్రభావానికి అతీతంగా వ్యవహరించాలి. తను, తన తరం కోసం యిది రాయటం లేదని కూడా స్పష్టంగా గ్రహించాలి. సమకాలికులను విస్మరించి, భవిష్యత్ తరాల కోసం కృషి కొనసాగించాలి.

ప్రపంచం అంతవరకు కనీ వినీ ఎరుగని ఒక కొత్త రచన జరిగిందంటే, అది తప్పనిసరిగా అసాధారణమైనదై వుంటుంది. జనం దీన్ని వీలైనంతకాలం తిరస్కరిస్తారు.

కొత్త సత్యాన్ని ఆవిష్కరించిందని తెలిసినా అసలు దీని వునికినే నిరాకరిస్తారు. కాని ప్రభవించిన ఈ ఉత్కృష్ట గ్రంథం నెమ్మదిగా, అతి నెమ్మదిగా, ఒక్కొక్కరిగా, సమర్థకులను తనవైపు తిప్పుకుంటూనే వుంటుంది. నేలమీద వద్ద ఆమ్లంలాగ చుట్టూవున్న నేలను కాల్చివేస్తుంది. అయితే పాత ఆలోచనాధోరణుల ఒత్తిడితో, నివురుగప్పిన నిప్పులా లోపలి పొరల్లో వెలుగుతూనే వుంటుంది. దగ్గరగా వెళ్ళినవాళ్ళకు వేడి కూడా తగులుతుంది. అలా ఒకనాడు మనస్సు తెరలను చీల్చుకొని, ప్రభవిస్తాడు నూతన సూర్యుడు. అన్నాళ్ళూ ముసుగు కప్పుకున్న విగ్రహం, అందరూ చూడటానికి అనువుగా ఆచ్ఛాదన తొలగించుకుంటుంది. అయితే ఈ ప్రక్రియ ఎంత నెమ్మదిగా జరుగుతుందో ఊహించటం కూడా కష్టమే. అంటే *మరణానంతరమే మహానుభావుల బోధనలను ఆలకిస్తుంది లోకం. సమాధి నుండి మాట్లాడుతుంది కొత్త గొంతుక.*

సాధారణ రచనల అదృష్టం యింతకన్న మెరుగే. సమకాలికులకోసం వుద్దేశించిందే గనక, దానికి రెడీమెడ్ పాఠకులంటారు. వాళ్ళ యిష్టాలకు, అభిరుచులకు అనుగుణంగానే వుంటుందా పుస్తకం. తక్షణం అవసరాలను తీరుస్తుందది. రచయిత కష్టానికి ఫలితం దక్కుతుంది. గుర్తింపేం ఖర్మ, కీర్తిప్రతిష్ఠలు అతణ్ణి వెదుక్కుంటూ వస్తాయి. పైగా యిలాంటి రచనల్ని చూసి ఎవరూ అసూయపడరు. అందరూ అనుకరించగలిగిన పుస్తకమే గనక, ఇతర రచయితలు, ఔత్సాహికులు అలాంటిదే మరో పుస్తకం రాయటానికి ఉత్సాహం చూపిస్తారు. కాని, కాలాతీతమైన మహాగ్రంథాలు ఈ క్షణిక సుఖాలకు నోచుకోవు. వాటి జీవితకాలం కొన్ని శతాబ్దాలు కావచ్చుగాక, కాని అవి తొలిసారి వెలుగు చూసినరోజున, తమ ఊహలకందనంత ఎత్తులో లేక దూరంలో వున్నాయి గనక ఎవరూ వాటి వునికిని కూడా గుర్తించరు. తమకోసం కాదనుకున్నప్పుడు ఎవరైనా ఆ పుస్తకాన్ని ఎందుకు ఆదరిస్తారు? సమకాలికులను అది ప్రభావితం చెయ్యదు. రాబోయే నూతన సంస్కృతికి టెక్స్ట్‌బుక్ వంటిదా పుస్తకం. శుక్రుడు అందరికీ కనిపిస్తాడు. యురేనస్‌ను చూడగలిగిన వాళ్ళెందరు? దానిగురించి తెలుసుకోవాలనే కోరిక కూడా వుండదెవరకీ. జనసామాన్యమెపుడూ తమ నత్తనడక *జీవితాలతోనే తృప్తిపడతారు. మట్టిలో మెలికలు తిరుగుతున్న వానపాము అనంతాకాశంలో వలయాలు సృష్టిస్తున్న డేగను చూడగలదా?* ఏ కాలంలోగానీ, ఏ భాషలోగానీ, లక్షల్లో ఒక పుస్తకం మాత్రమే సాహిత్యంలో శాశ్వతంగా నిలిచిపోతుంది. కాని మిగతా 99,999 పుస్తకాలను పక్కకు నెట్టడానికి యిదెన్ని పరీక్షలు ఎదుర్కొంటుందో ఎవరైనా ఊహించగలరా? లక్షల్లో ఒకడికి మాత్రమే వున్న మేధస్సు సృష్టించినదది. దాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలన్నా అంత ప్రజ్ఞ వుండాలి మరి!

జీనియస్సు అనబడే వాడు కోటికొక్కడు అంటే అతడిది ఒంటరి జీవితమని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ముందు తరాలకు చేరటానికి అతడు ఎన్ని దుర్గమారణ్యాలు దాటాలి? ఎన్ని ఎడారులగుండా పయనించాలి? ఎన్ని తుఫానులనధిగమించాలి! అవును. ఇన్ని పరీక్షలు నెగ్గగలిగినవాళ్ళెంతమంది? ఇటువంటి సాహసికి నా సలహా ఒక్కటే. ఖాళీ చేతులతో ప్రయాణం చెయ్యి. బరువులు మోస్తానంటే అడుగు ముందుకు పడదు. లగేజీ లేనప్పుడే సుఖంగా నడుస్తావు. బాల్తజార్ గ్రేషియన్ మాటల్ని గుర్తుచేసుకో "పుస్తకాన్ని విస్తరించకు. సంక్షిప్తంగా వుంటేనే ముద్దు'' (ఈ సలహా సమకాలీన జర్మన్ రచయితలకు బాగా వర్తిస్తుంది అంటాడు షోపెన్‌హావర్).

తాము ఈ లోకంలో గడిపిన స్వల్పకాలంలో అతి తక్కువ స్థలంలోనే హర్మ్యాలు నిర్మిస్తారీ అరుదైన రచయితలు. ఆ భవనం ముందు నిల్చుంటే దాని పరిమాణాన్ని ఎత్తును అంచనా గట్టలేం. అలాగే, జీనియస్‌ను దగ్గరగా చూస్తూ ఆయన గొప్పతనం గుర్తించలేం. ఓ శతాబ్దం గడవాలి. అప్పుడే ఆయనెవరో లోకం తెలుసుకుంటుంది. "అలాంటివాడు మళ్ళీ పుడితే ఎంత బావుండును" అనుకుంటుంది.

*నశ్వరమైన జీవితం గడిపిన ఒక వ్యక్తి అనశ్వరమైన సృష్టి చేసినప్పుడు, ఆ వ్యక్తి జీవితకాలం మరీ తక్కువ అనిపిస్తుంది.* తల్లి పురిట్లో మరణించవచ్చు. కాని ఆమెకు పుట్టినవాడు మృత్యుంజయుడు. అమరజీవికీ అల్పజీవికీ *ఎంత తేడా! ఒక క్షణం వినిపించే కరతాళ ధ్వనులకూ, శాశ్వత కీర్తికీ ఎంత తేడా! నీటి బుడగలాంటి జీవితంలో ఎవరెస్టు శిఖరమంత కృషి అనన్య సాధ్యంకదా!* కన్న తండ్రి *కూడా తన కన్న పేగు తరతరాలకు వెలుగు కాబోతున్నదని ఊహించలేదు. తన పుస్తకం ఎలా వుండబోతోందో*

*రచయితకు మాత్రం ఏం తెలుసు. సంపన్నుల యింట్లో రోజూ పండగే. జీనియస్సు అనామకుడిగా బతికినా, శతాబ్దాల తర్వాత కూడా అతడి జ్ఞాపకమే ఒక పండగ.*


రచయితకు వెంటనే గుర్తింపు వచ్చిందంటే, అది అతడికీ అభిమానులకూ మధ్య వున్న భౌగోళికమైన దూరం మాత్రమే. జీవితానంతరం అతడి ప్రతిభకు పట్టంగట్టారంటే కాలం అతడికీ, అభిమానులకూ మధ్య వారధిగా నిలిచిందన్నమాట. నిజానికి జీవిత కాలంలో కీర్తి వచ్చినప్పుడు కూడా, రచయితకు తన అభిమానులతో ప్రత్యక్ష సంబంధాలుండవు. మరీ సన్నిహితంగా వున్న వ్యక్తుల మధ్య ఆరాధన సాధ్యపడదు. ఎండలో పెట్టిన వెన్న కరిగిపోతుంది. జీవితకాలంలో ఓ వ్యక్తి పేరు గడించాడంటే, అతని అభిమానుల్లో అత్యధికులు, అతడికి పట్టిన అదృష్టానికి అసూయ పడతాడు. "నక్కను తొక్కి వచ్చాడు" అంటారు. అతి కొద్దిమంది మాత్రమే అతడి ప్రతిభను గుర్తిస్తారు. "మహా కవులను ఒక్కసారి చూసినా సరే, జనం వాళ్ళ రచనల్ని తక్కువ అంచనా వేస్తారు" అన్నాడు ఇటాలియన్ రచయిత పెట్రార్క్ (1304-1374).

రచయిత కీర్తి గడించాలంటే అతడికీ, అభిమానులకూ మధ్య దూరముండాల్సిందే అని అంగీకరిస్తే, ఆ దూరాన్ని మైళ్ళలో కొలుస్తామా, సంవత్సరాల్లో కొలుస్తామా అన్నది అంత ముఖ్యం కాదు. పైగా రచయిత రాసిన అన్ని పుస్తకాలకూ ఒకే రకమైన గుర్తింపు రాదు. పాఠకులకు కొన్ని నచ్చకపోవచ్చు. అయినా గొప్ప రచయితలు జీవితానంతరం కూడా ప్రజల నోళ్ళలో నానుతూనే వుంటారు. తనకు వచ్చిన ఒక ఆలోచన సార్వకాలీనమైనదని ప్రతిభావంతుడు తక్షణమే గుర్తిస్తాడు. అందువలననే, ఓ ప్రాచీన కావ్యం చదివిన వెంటనే ముగ్ధులమై "ఆ రచయిత తిరిగి వస్తే ఎంత బాగుండును" అనుకుంటాం. అతడితో మాట్లాడినట్టుగా ఊహించుకుంటాం. సమకాలీనుల మధ్య లభించని గుర్తింపు అతనికి మన ద్వారా లభించింది. 'రచయితలకు మరణం లేదు' అంటే అర్థం యిదే.

రాబోయే తరాలే ఒక పుస్తకం ప్రాధాన్యతను నిర్ణయిస్తాయి గాని, కొన్ని పుస్తకాలలో లోపాలున్నా, వాటిని ఖండించగల సామర్థ్యం లేకపోవటంవల్ల అవి గొప్ప పుస్తకాలుగానే చలామణీ అవుతున్నాయి. కనీసం రచయిత జీవితకాలంలో వాటినందరూ విస్మరిస్తారు. కాని యిది ఎంతోకాలం కొనసాగదు. అందులోని తప్పుల్ని ఎత్తిచూపేవాళ్ళు రాకపోరు. అప్పుడు వాటి ప్రాధాన్యతా తగ్గుతుంది అంటే ఒకే పుస్తకం, సమకాలికులకూ, ముందు తరాలవారికీ గొప్పది అనిపించటం అత్యంత అరుదైన విషయం. అయితే కాలమహిమ గొప్పది. కొందరు మనుషులు కొన్నిసార్లు పొరబాట్లు చేయవచ్చు. తప్పుడు నిర్ణయాలు తీసుకోవచ్చు. మనుషులను పక్కదారి పట్టించవచ్చు. తమ వున్మాదాన్ని జనబాహుళ్యంమీద రుద్దవచ్చు. కాని, కళారంగంలోగానీ, వాస్తవ జీవితంలో గాని ఎవరెన్ని తప్పులు చేసినా అన్నీ కాలగర్భంలో కలసిపోతాయి. అనుభవంతో మనుషులు తమ లోపాలు తామే సరిదిద్దుకుంటారు. వాస్తవాలు కళ్ళముందు కనిపించినప్పుడు యిక వాటి గురించి వాదనలు అనవసరం. కాలం తన సహస్ర నాలికలతో ఏది సత్యమో బోధిస్తుంది. అయితే, తప్పు తెలుసుకోవటానికి ఎంత కాలం పడుతుందనేది, అన్నిటికీ ఒకేలా వర్తించదు. దాని గురించిన ఊహాగానాలవల్లా ప్రయోజనం వుండదు. ఆచరణలో సిద్ధాంతాలు తప్పని నిరూపించబడతాయి. అంటే, కొందరు గొంతు చించుకొని ప్రచారం చేసినంతమాత్రాన అబద్ధం నిజం కాదు. *ఒకనాడు మేధావులు మాత్రమే అవగాహన చేసుకోగలిగిన విషయాలను, తరువాతి కాలంలో సగటు మనిషి కూడా సులభంగా అర్థం చేసుకోగలడు.*

ఒకప్పుడు జనాన్ని గంగవెర్రులెత్తించిన విషయాలు యిప్పుడు కనుమరుగు కావటం చూస్తే, కొంత సాంత్వన కలుగుతుంది. ప్రచారార్భాటాలు ప్రజల కళ్ళకు శాశ్వతంగా గంతలు కట్టలేవు. కొన్నిసార్లు కొన్ని విషయాలు రెండుమూడేళ్ళపాటే వెర్రితలలు వేస్తాయి. మరికొన్ని మనం జీవితమంతా భరించక తప్పదు. అయిన అవి కూడా మారతాయని గ్రహించాలి.

*కాలంతో కలిసి ప్రవహించలేకపోవటం రెండు రకాలు. ఒకటి : నీళ్ళు అంటకుండా గట్టుమీద వుండటం. రెండు : అట్టడుగున నక్కి వుండటం.*



**తెలుగు సేత :**

**ముక్తవరం పార్థసారథి, హైదరాబాదు.**
**ఫోన్ : 9177618708**
**(ఇప్పుడు అందుబాటులో లేరు)**

# ఉన్నిపోగుల ఆర్తనాదం

**– ఆచార్య కోసూరి దామోదరం నాయుడు**


పారేనదికే పరవళ్లుంటాయి, కుళ్లిన కొలనుకు ఏముంటాయి?. మనిషికి కూడా అంతే వున్నచోటే వుండిపోతే నూతన సమాజస్థితిగతుల పరిచయమే వుండదు. చలనశీలత తప్పని సరిగా వుండాలి. అలాంటి చలించే పోగుబంధాల చినిగి అతికిన బతుకుల జీవనాధారమే ఈ ఏకుదారం. జీవితం ఎప్పుడూ సవాళ్లమయమే. సవాళ్లు లేని జీవితాన్ని జీవితంగా చెప్పుకోలేం. కథలు పుస్తకాల్లో నుండీ ఉద్భవించరాదు. మనిషి జీవితాల్లో నుంచీ పుట్టుకు రావాలి. మట్టి కథల గొప్పతనాన్ని చాటిచెప్పే నవల ఏకుదారం.

నవలలోని పాత్రల్లో బీరప్ప పాత్ర చిన్నతనంలో శుభకార్యాల్లో తినిపోతాడని కావిలిపెట్టే స్థితినుండీ విశ్వవిద్యాలయంలో అధ్యాపక వృత్తి వరకూ ఎదిగిన విజయాల పరంపరే ఈ ఏకుదారం నవల. ప్రతీ రచయిత వొక నటుడులాంటివాడు. నటుడు పాత్రానుగుణంగా తగ్గట్టు వేషం వేయాల్సి వుంటుంది. వేషం వేసుకున్న నటుడు తన ముఖాన్ని అద్దంలో చూసుకున్నట్లే రచయిత కూడా ప్రతీసారీ తన రచన అనే అద్దంలో చూసుకోవాల్సి వుంటుంది. వొక్కోసారి అద్దం కూడా మనల్ని కొత్తగా చూపిస్తుంటుంది. వేషం ముగిసిన తరువాత చూసుకునే ముఖమే మనది. మామూలుగా అన్ని కథల్లోనూ కథానాయకుడు వుంటాడు. అయితే ఈ ఏకుదారం నవలలో కథానాయకుడంటూ లేరు. ఎందుకంటే నాయకుడనే వాడు ఎప్పుడూ వొంటరిగా వుండలేడు. నాయకుడికి గుంపుకావాలి గుంపు వుంటేనే నాయకుడు అంటారు. అయితే ఇక్కడ పరిస్థితి అలా కాదు. ఏకుదారం వొకేదారం దీనికి నాయకుడు వుండాల్సిన అవసరం లేదు. అంతకన్నా పైపెచ్చు చేతివృత్తిదారుడు ఎప్పుడూ కష్టించి పనిచేసే వాడే కాని గుంపులేసుకుని తిరిగేవాడు కాదు. పరిస్థితులే ఈనవలలో కథానాయకుడు, ప్రతినాయకుడు కూడా. ఎప్పుడో ముప్పయిఏళ్లకు పూర్వం తన కళ్లముందు జరిగిపోయిన జీవితాల్లోకి రచయిత ఇప్పుడు పరకాయ ప్రవేశం చేశారు. వాళ్లందరి జీవితాల్లోకి రచయిత వొక్కరే ప్రవేశించి రాయగలగడం అనేది సామాన్యమైన విషయం కాదు. ఈ పని రచయిత చేసేటప్పుడు నాకు తెలిసి ఆధ్యాత్మిక భావనలోకి వెళ్లిపోయింటాడు అనిపిస్తుంది. అంత ధ్యాస పెట్టకపోయుంటే ఈ నవల ఇంత సహజంగా వచ్చేది కాదేమో?.

తరగతికి వెళ్లే అధ్యాపకుడికి ప్రతిదీ క్లాసే కానీ ఆ క్లాస్‌లో కూడా మాస్ వుంటారు. అలాంటి మాస్‌లలో క్లాస్ ఈఏకుదారం. జీవితాన్నీ జయం, అపజయం దృష్టితో చూడటం అలవాటు చేసుకున్నారు జనం. అసలు గెలుపును విశ్లేషించాలంటే చాలా కష్టం. వొక్కొక్కరికి వొక్కోటి గెలుపుగా అనిపిస్తుంది. మనిషి జీవితంలో అన్నీ చెదిరిపోతాయి, జ్ఞాపకాలు మాత్రమే మిగిలిపోతాయి. అందుకే ఏకుదారం నవలకు శీర్షికగా కింద బ్రాకెట్లో చేతివృత్తుల సంతకం అని పెట్టారేమో? రచయిత అనిపిస్తుంది. మన నుండీ ఎప్పుడో దూరమైన గొంగడి కారుల చేతివృత్తుల సంతకమే ఈ ఏకుదారం. చేతివృత్తులను అదే వృత్తిదారులు ఎలా మోసం చేసివాటిని పొట్టన పెట్టుకుంటారనే విషయాలను కూడా చాలా ధైర్యంగా రాశారు. ఈ నవల తెలుగు సాహిత్యానికి కొత్త వస్తువును పరిచయం చేసిన నవలగా చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుంది. అసలు గొంగళి నేసేవృత్తి వుందనే విషయం నేటి సమాజానికి చాలామందికి తెలీదు. నేత అంటే కేవలం పట్టుచీరల వరకు మాత్రమే అనే దగ్గరే సమాజం చాలా వరకూ ఆగిపోయింది. అలాంటి నేపథ్యం వున్న వృత్తిని ఏకుదారం నవల పేరుతో డా. బి. నాగశేషు వెలుగులోకి తీసుకురావడంతో నవలా సాహిత్యం దాదాపు వృత్తులన్నింటినీ తనలో ఇముడ్చుకున్నదనే చెప్పవచ్చునేమో. సాహిత్యంలో ఖాళీలను పూరించడమే రచయిత చేయాల్సిన పని. ఆ పనిని నాగశేషు సంపూర్ణంగా పూర్తి చేశాడని నేను నమ్ముతున్నాను.

ఈ నవల కథాంశం మొత్తం అనంతపురం జిల్లా హిందూపురం పరిసరప్రాంతాల్లోని మేసినపల్లి గ్రామంలో నడుస్తుంది. ఊరు అదే అయినా ఆ జీవితాలు అనంతపురం జిల్లాలో చాలా వున్నాయనే తెలుస్తోంది. కేవలం గొర్రెలకాపరులు, గొంగళినేతగాళ్ల వృత్తికే పరిమితం కాకుండా వూరంటే సమస్త వృత్తుల సమ్మేళనం అని చాటి చెప్పిన నవల. ఈ వృత్తి గురించి రచయిత వొక మాటంటాడు. వృత్తికీ హృదయానికీ జరిగిన సంఘర్షణే ఈ నవల అంటారు. ఆవృత్తిలో వున్న కడగండ్లు, మోసాలు, నలిగిపోయే జీవితాలన్నీ రచయిత రాసిన

విధానం పాఠకుడు చదువుతుంటే కళ్లు చెమర్చకుండా వుండలేదు. అంతేకాకుండా  పల్లెలోని మొరటుతనంతో చేసిన తప్పుల్లో వున్న హాస్యంకూడా పాఠకున్ని ఆనందంతో ముంచెత్తుతుంది. నవల ప్రారంభమైనాక కొద్దిసేపు నవల ఎటుతీసుకుపోతుందో తెలీకుండా సాగుతుంది. ఎందుకంటే మనం ఇంతవరకూ చదివిన నవలలకు భిన్నమైన శైలిలో రాశారు కాబట్టి. రచయిత మైసూరులో వుండడంవల్లనేమో కాస్త నవలమీద కన్నడ నవలల ప్రభావం కనిపిస్తుంది. కథలో లీనమైపోతే ఇక కాస్తగుండె బిగువు వుంటేనే లేకపోతే మెలిపెట్టేస్తుంది.




నవల చదివేశాక మనల్ని మెలిపెట్టే పాత్రలు చాలానే వున్నాయి. అందులో విశేషంగా చెప్పుకునే పాత్రల్లో ముత్యాలమ్మ, సంజన్న, మూగాయప్ప, సీమప్ప, బీరప్ప, సోమణ్ణ, పక్కీరమ్మ పాత్రలు మనల్ని వదిలిపెట్టి పోలేకున్నంతగా పట్టుకుంటాయి. మనచుట్టూరా వుండే జీవితాల్లో జరిగినట్లే గుండెల్ని పిండేస్తాయి కూడా. ఒక రకంగా ఈ నవలలో నాయకుడిగా నిడివి వున్న పాత్రపేరు బీరప్ప. ఇతడు జీవితాన్ని సగందాకా చెడు తిరుగుళ్లకు అంకితం చేసి దాదాపు జీవితం చేయిజారిపోయిందని అనుకుంటున్న తరుణంలో, జీవితాన్ని నూతనంగా నిర్మించుకుంటాడు. అన్ని అల్లరి పనులు చేసినాక కూడా మళ్లీ చదువుమీద ఇష్టం కలిగి మళ్లీ చదువుకుంటా అనే ఆలోచన వచ్చింది చూడండి ఆ పాత్ర  నేటి యువతకు చాలా ప్రేరణ కలిగిస్తుంది. అంతే కాకుండా ఆకలికి తట్టుకోలేక ఏ సిద్ధాంతం కోసమూ కాకుండా కేవలం అన్నం కోసమే అడవిలో అన్నలవెంట దళసభ్యుడిగా వెళ్లడం అనేది మామూలు విషయం కాదు. ఆ ఆకలిజీవుల బడుగుల బతుకుల్లో అనుకోకుండా ఎదురయ్యే పోలీసు అతిథులు బతుకులను బలితీసుకున్న సంగతులను వర్ణించలేం. అప్పులు చేసి వూరు వదిలి వెళ్లిన సీమప్ప పెళ్లాన్ని సాయంపేరుతో మాయమాటలతో కాటువేసే మోసాల కాలసర్పాల గురించి అయితే ఈ నవల్లో వున్నది వున్నట్లు ఏ మాత్రం మసాలాలు జోడించకుండా చాలా సహజంగా రాశారు. అన్నంకోసం దేవులాడిన రోజులను తలచుకుంటే మళ్లీ ఆకలేస్తుంది అనే మాట బీరప్పను వుద్దేశించి రాశారు రచయిత. ఆ మాటలు వింటుంటే ఇలాంటి జీవితాలు వున్నాయయా? అనేంత ఆశ్చర్యం కలగకమానదు. అయితే మనకు తెలియనంత మాత్రాన అలాంటి జీవితాలు లేవని కాదు కదా. ఇక బీరప్ప జాతర గురించి, పూజారిని ఎన్నుకునే సంప్రదాయం అంతా చాలా కొత్తగా అనిపిస్తుంది. బీరప్ప, అర్చనల ప్రేమ సంగతులైతే నిజంగా ఆ రచయితే బీరప్పలో ఆవహించి అర్చనతో అలా వున్నాడా అనిపించేలా వున్నాయి వారిద్దరి మధ్య సంభాషణలు. కష్టాలన్నీ ఎదుర్కొని పడీలేచి చివరికి విశ్వవిద్యాలయంలో బీరప్ప స్థిరపడడంతో కథ ముగుస్తుంది. తప్పకుండా ఈ నవల తెలుగు సాహిత్యంలో నూతన కథాంశంతో వచ్చిన నవల అందులో సందేహమే లేదు. ఇలాంటి నూతన కథా వస్తువుతో కూడిన రచనలను తప్పకుండా తెలుగు పాఠకులు ప్రోత్సహించాలి.

*ప్రతులకు 9985509053 నెంబర్‌కు సంప్రదించగలరు.*

**ఆచార్య కోసూరి దామోదరం నాయుడు**
తెలుగు అధ్యయన శాఖ,
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, ఫోన్ : 9441645601

## మిసిమితో చెలిమి



**మిసిమి**తో చెలిమి అనూహ్యంగా 2012 జూలై మాసంలో మొదలైంది. నేను మోకాలు ఆపరేషన్ నుంచి కోలుకుంటున్న క్రమంలో **కళాజ్యోతి రామ్ నాథ్** గారు కొన్ని కాపీలు బైండ్ చేసి పంపడం జరిగింది. ఆ విధంగా మొదలైన **మిసిమి**తో చెలిమి సాహిత్య బంధంగా మారి ఆనందంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో ఒక కొత్త అలవాటు ఏర్పడింది. ప్రతి నెల ఒక వ్యక్తికి **మిసిమి** ని పరిచయం చేయడం పరిపాటిగా మారింది. అలా ప్రముఖ వైద్యుడు **డా. వి. శాంతారామ్** గారికి (ప్రముఖ క్రికెటర్ **వి.వి.ఎస్. లక్ష్మణ్** తండ్రిగారు), నా స్నేహితుడు **తిరువీధుల ప్రవీణ్ కుమార్** గారికి **మిసిమి** సిరులను పరిచయం చేస్తున్నాను.

***- తిమ్మరాజు శ్రీనివాస్, విశ్రాంత అధికారి, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్  (I S B)***

# ఢిల్లీలోని హైదరాబాద్ హవుస్

– వేలూరి కృష్ణమూర్తి

ఢిల్లీలోని 'హైదరాబాద్ హవుస్' బ్రిటీషువారి కాలంలో నిర్మింపబడిన ఒక భవ్య భవనం. దీనిని నిర్మించినదెవరు? దీని చరిత్ర ఏమిటో తెలుసుకొందాం. మొగలుల పాలన అనంతరం మన దేశాన్ని పరిపాలించిన బ్రిటిష్ వారు దేశ రాజధానిని కలకత్తా నుండి ఢిల్లీకి మార్చినపుడు దేశ రాజధానిలో తన ఖ్యాతికి సరితూగే ఒక భవ్యమైన అతిథి గృహం వుండాలని ఆలోచించిన హైదరాబాద్ నిజాం మీర్ ఉస్మాన్ ఆలీ ఖాన్ బ్రిటిష్ వారి నుండి భూమిని పొంది నిర్మించిన భవ్య భవనమే అత్యంత ప్రఖ్యాతి చెందిన 'హైదరాబాద్ హవుస్'.

బ్రిటిష్ ప్రభుత్వం మనదేశాన్ని పరిపాలిస్తున్న కాలంలో అనాటి కొన్ని రాజ సంస్థానాలు–హైదరాబాద్, బరోడా, పాటియాల, జైపుర మరియు బికనీర్, దేశ రాజధాని ఢిల్లీలో వారి వారి ప్రత్యేక రాజ్య భవనాలు నిర్మించుకోవడానికి భూమి కేటాయించమని అప్పటి వైస్రాయిని కోరారు. కాని, బ్రిటిష్ ప్రభుత్వం వారి కోరికను అంగీకరించలేదు. వారు పట్టుబట్టడంతో చివరకు, కేవలం ఐదు రాజ సంస్థానాలకు మాత్రం–హైదరాబాద్, బరోడా, పాటియాల, జైపూర్ మరియు బికనీర్ రాజ సంస్థానాలకు –రాజ మార్గం (Kng's Way) చివరన వైస్రాయ్ హవుస్ (ఇప్పటి రాష్ట్రపతి భవనం) నుండి మూడు కిలోమీటర్ల దూరంలో కింగ్ జార్జ్ ప్రతిమకు చుట్టూ వున్న భూమిని ఈ ఐదు రాజ సంస్థానాలకు పంచి యిచ్చారు.

ప్రపంచంలోనే అత్యంత శ్రీమంతుడైన హైదరాబాద్ చివరి నిజాం మీర్ ఉస్మాన్ ఆలీ ఖాన్, బ్రిటీషువారు అపుడు కొద్దిగా మాత్రం యిచ్చే భూమికి తను అంగీకరించలేదు. వైస్రాయ్ హవుస్‌కు (ఇప్పటి రాష్ట్రపతి భవనం) దగ్గరలోనే ప్రిన్సెస్ పార్క్‌లో తన ప్రణాలికకు తగినంత భూమి యివ్వాలని కోరాడు. ఇలా పంచియిచ్చిన భూమిపై నిర్మించే భవనాలు తాము అనుమతించే విన్యాసాలతోనే వుండాలని ఒక చిన్న షరతు కూడా వుంచినది బ్రిటిష్ ప్రభుత్వం. మీర్ ఉస్మాన్ ఆలీ ఖాన్ తాను నిర్మించదలచిన 'హైదరాబాద్ హవుస్' కూడా 'వైస్రాయ్ హవుస్' మాదరిలానే వుండాలని హైదరాబాద్ నిజాం కోరినప్పటికీ బ్రిటిష్ ప్రభుత్వం దానికి అంగీకరించలేదు. ఈ ఐదు రాజసంస్థానాల పైకి హైదరాబాద్ నిజాం, మరియు బరోడా సంస్థానం రాజు *గాయక్ వాడ్* ఆ కాలపు ప్రసిద్ధ వాస్తు శిల్పి ఎడ్విన్ లుట్యన్స్‌ను ఢిల్లిలో తమ రాజ్య అతిథి భవనాలను నిర్మించడానికి నియోగించారు.

**హైదరాబాద్ హవుస్ నిర్మాణం :** బ్రిటిష్ వారి కాలంలో ఈ భవ్య భవనాన్ని 2 లక్షల బ్రిటిష్ పౌన్ల ఖర్చుతో నిర్మించారు. ఆ మొత్తం యిప్పటి లెక్క ప్రకారం 1.4 మిల్లియన్ పౌన్లు లేక రూ.170 కోట్లు అవుతుందని అంచనా. మన దేశ రాజధాని ఢిల్లీలో ఈ 'హైదరాబాద్ హవుస్'ను నిర్మించినది దక్షిణ భారతంలో అత్యంత శ్రీమంతుడైన హైదరాబాదు సంస్థానం 'అసిఫ్ జాహి' వంశానికి చెందిన చివరి నిజాం మీర్ ఉస్మాన్ ఆలీ ఖాన్. అతడిని 'బహాదూర్–ఎ– జంగ్' అని పిలిచేవారు. మీర్ ఉస్మాన్ ఆలీ ఖాన్ అప్పటి కాలానికి ప్రపంచంలోనే అత్యంత శ్రీమంతుడుగా వుండేవాడు. అపారమైన రత్నాలు–వజ్రాల సంపదను పొందివున్న మీర్ ఉస్మాన్ ఆలీ ఖాన్ హైదరాబాదు చుట్టుప్రక్కలంతా అతని రాజ భవనాలు వ్యాపించి వుండేవి. అతడి సామ్రాజ్యం గొప్ప సంపదతో తులతూగుతుండేది.

'హైదరాబాద్ హవున్'ను విశిష్టమైన ఒక సీతాకోకచిలుక ఆకారంలో నిర్మించారు. ఆ భవనం ముందరి భాగంలో వున్న ద్వారాలు షటుత్భుజ ఆకృతిలో వుండి ఆ భవనానికి ఎదుట ముఖ్య వీధి వుంటుంది. సీతాకోక చిలుక రెక్కలు ఇరుప్రక్కల వున్న ముఖ్య వీధుల వరకు వ్యాపించి వుంటాయి. ఈ భవనం ఢిల్లీలో వున్న అన్ని రాజభవనాలకంటే అత్యంత భవ్యంగావున్న రాజభవనమని ప్రఖ్యాతి చెందినది. 'హైదరాబాద్ హవుస్' కోసం లుట్యన్స్ 1903లో ఇంగ్లండ్‌లోని లీసెస్టర్ షైరెలోవున్న 'ప్యాపిలాన్ హాల్'ను మాదరిగా వుంచి



హైదరాబాద్ హవుస్ - ఢిల్లీ

విన్యాసం చేసిన సీతాకోకచిలుక ఆకారపు ప్రణాలికను ఈ భవన నిర్మాణంలో ఉపయోగించుకొన్నారు. తాను నిర్మించబోయే భవనం వైస్రాయ్ హవుస్ (ఇప్పటి రాష్ట్రపతి భవనం) భవ్యతలా వుండాలన్న నిజాం మీర్ ఉస్మాన్ ఆలీ ఖాన్ కోరిక నెరవేరనప్పటికీ వైస్రాయ్ హవుస్ కంటె 'హైదరాబాద్ హవుస్' భవనం ఏరీతిలోను తక్కువ కాకుండునట్టు ఖచితపరచుకొని 'హైదరాబాద్ హవుస్'ను నిర్మింపజేశారు.

'హైదరాబాదు హవుస్'లో 36 ప్రత్యేక గదులు వున్నాయి. వాటిలో ఒక రాణివాస గృహం కూడ చోటు చేసుకొన్నది. విశాలమైన హాళ్ళు, కమాన్లు, భవ్యతతో కూడిన మెట్లు, కారంజీలు అన్నీ యూరోపియన్ వాస్తు శైలిలో నిర్మించబడినా, కొన్ని మొఘులుల విశిష్ఠ లక్షణాలను కూడ పొంది వున్నాయి. ప్రఖ్యాతి చెందిన వైస్రాయ్ హవుసును నిర్మించిన, అలాగే ఢిల్లీలో భవ్యమైన సార్వజనిక భవనాల నిర్మాణానికి పేరు గాంచిన ఎడ్వర్డ్ లుట్యన్స్ తమ భవన నిర్మాణ అనుభవాలను క్రోడీకరించి ఈ 'హైదరాబాద్ హవుస్' భవనాన్ని నిర్మించారు. ఇది జైపుర్ హవుస్, పాటియాల హవుస్‌లకన్నా ఎంతో భవ్యంగా కనపడుతుంది. 'హైదరాబాద్ హవుస్', ఇండియా గేట్ వద్ద 8.2 ఎకరాల ప్రదేశంవరకు వ్యాపించి వున్న ఈ భవనం యొక్క వృత్తాకారపు ప్రవేశ మంటపం, మొదటి మహడీలోని హాలులో రోంబిక్ చలువరాతిని ఉపయోగించి అందమైన విన్యాసాలతో నేలను అలంకరించారు. ప్రవేశ మంటపమున్న గుమ్మటం, దాని క్రింద 55-డిగ్రీ కోణాలతో రెక్కలు విస్తరించుకొని శంఖాకృతితో వున్న స్తంభాలు ఈ భవనం యొక్క ప్రముఖ వాస్తు శిల్ప విశిష్ఠతను చాటుతాయి. ఈ రాజభవనంలో రాణులకు జనానాను కూడ నిర్మించారు. ఇది వృత్తాకారపు పడసాలుతో 12-15 గదులుండి రాణులతో వారి సఖిలు, అలాగే పరిచారికలు వుండడానికి తగిన ఏర్పాట్లతో కూడివున్నది. 1921-1931 మధ్య కాలంలో ఎడ్వర్డ్ లుట్యన్స్ ఢిల్లీలో నిర్మించిన అత్యంత గొప్ప, మరియు బృహత్ రాజభవనం 'హైదరాబాద్ హవుస్'. ప్రస్తుతం వైస్రాయ్ హవుస్' (రాష్ట్రపతి భవనం) మాత్రం 'హైదరాబాద్ హవున్' కంటె భవ్యంగా వుంటుంది. అత్యంత హై సెక్యూరిటీ వున్న 'హైదరాబాద్ హవుస్'ను దేశ స్వతంత్ర్యానంతర కాలంలో భారత ప్రభుత్వం తన అధీనం లోనికి తీసుకొన్నది. ప్రస్తుతం 'హైదరాబాద్ హవుస్' భారతప్రధానివారి రాష్ట్ర అతిథి గృహం (State Guest House)గా ఉపయోగించ బడుతోంది. విదేశీప్రముఖులు, అధ్యక్షులు, భారత ప్రభుత్వ అతిథులుగా వచ్చినపుడు వారితో సమావేశాలు జరుపడానికి, భారత ప్రభుత్వం అధికార విందులకు ఈ భవనం ప్రత్యేక వేదిక. ప్రస్తుతం ఈ భవనం VVIP అని పిలువబడే భారత ప్రభుత్వ అంతర్జాతీయ అతిథులకు మాత్రమే ప్రత్యేకించబడిన అతిథి గృహం. మైఖేల్ గోర్బచేవ్, బరాక్ ఒబామా, బిల్ క్లింటన్, బెంజమిన్ నేతన్యాహు, డోనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్, శిజిన్ పింగ్ లాంటి ఎందరో భారత ప్రభుత్వ అతిథులు ఇక్కడ బసచేశారు.


**వేలూరి కృష్ణమూర్తి**
మైసూరు, ఫోన్ : 944 897 7877

## చివరకు మిగిలింది



*మీ జూన్ డైరీలో లీలానాయుడు గురించి రాసిన వాక్యాలు మళ్ళీ మళ్ళీ చదివాను. ఎంత సౌందర్యవతి అయినా, ఎంత ప్రతిభావంతులయినా వారి జీవితంలో కష్టాల కోటా వారికి సిద్ధంగానే ఉంటుంది. ఈ విషయాన్ని మీరెంతో హృద్యంగా చెప్పగలిగారు. జీవితం ప్రతీ ఒక్కరిని పరీక్షకు గురి చేస్తుంది. నాకో పాట గుర్తుకొస్తోంది. "జిందగీ ఇమ్తినయాన్ లేతీ హై' దీంతోపాటు ఇప్పుడు నా పరిస్థితిని కూడా బొమ్మలో పంపిస్తున్నాను.*

**- మీ అభిలాషి, మీ అభిమాని, గుడిపూడి సుబ్బారావు**



ఆచార్య జక్కంపూడి మునిరత్నం

# ప్రజ్ఞారత్నం ఆచార్య జక్కంపూడి మునిరత్నం

– డా. డి. యువశ్రీ

గురువులు విద్యాకల్పతరువులు. కాంతికి, క్రాంతికి దొరువులు. ఆది నుంచి అవిచ్ఛిన్నంగా సాగే విద్యాసంస్కృతుల వారధులు. ప్రగతి నీరధులు, వారిని స్మరించడం ఎంతో స్ఫూర్తిదాయకం. నూతనోత్తేజ కారకం. అటువంటి గురువుల సరసన నిలపదగిన మేటి మనీషి మా గురువుగారు ఆచార్య జక్కంపూడి వారు. వారి జీవన ప్రస్థానము, సాహితీ ప్రస్థానము నేటి యువ తెలుగు జాతికి, భావితరాల వారికి కూడా ఉత్తేజాన్ని, ఉద్వేగాన్ని కలిగిస్తాయి. స్ఫూర్తినిచ్చి కీర్తికి దోహదం చేస్తాయి.

ఆచార్య జక్కంపూడి మునిరత్నం గారు ప్రకృతి దృష్టికి నోచుకోకపోయినా ప్రజ్ఞాదృష్టితో ప్రభాసించే అదృష్టం పొందారు. ఆత్మీయుల చూపుని తన చూపుగా చేసుకుని అధ్యయనం సాగించి అత్యున్నత స్థితికి చేరుకొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తెలుగు అధ్యయనశాఖలో ఆచార్య స్థానాన్ని అలంకరించి బోధన, పరిశోధన చక్కగా నిర్వహించారు. విద్యార్థులకు జ్ఞానదాతగానే గాక మార్గదర్శిగా వ్యవహరించారు. పద్యాలు రాశారు. వచన కవితలు వెలయించారు. మంచి కవిగా పేరు తెచ్చుకొన్నారు. పిల్లల కథలు రాశారు. నేటి సంఘాన్ని దృష్టిలో పెట్టుకుని పలు కథలు రాశారు. తెలుగు సాహిత్య జగత్తులో కథకుడుగా స్థానం సంపాదించారు. దేశభక్తి గేయాలు, మాతృభాషా ప్రశంసాపూర్వక గేయాలు, దైవభక్తి గేయాలు, ప్రబోధ గేయాలు, ఇలాంటి ఎన్నో గేయాలు రాసి గేయకర్తగా స్థిరపడ్డారు. తాము రాసిన పద్యాలను, గేయాలను మునిరత్నంగారు స్వయంగా పాడి శ్రోతలను మెప్పించడం ఆయన ప్రత్యేకత. మునిరత్నం గారు పలు వ్యాసాలు రాశారు. విమర్శకుడిగా మంచిపేరు తెచ్చుకొన్నారు. తెలుగులోనే గాక తమిళంలో కూడా వీరికి ప్రవేశం ఉంది. తమిళ సాహిత్యాన్ని కూడా అధ్యయనం చేశారు. వచన కవితల సంపుటాన్ని వెలయించారు. గేయాలు రాశారు. ఛందోబద్ధంగా పద్యాలు కూడా రాశారు.

**జననం :** మునిరత్నం గారు తమిళనాడు తిరువళ్ళూరు జిల్లా తిరుత్తణి తాలూకా కావేరి రాజపురం గ్రామంలో జన్మించారు. తిరుత్తణి తాలూకా 1960 దాకా చిత్తూరు జిల్లాలోనే అంటే ఆంధ్రప్రదేశ్‌లోనే వుండేది. 1960లో పటాస్కర్ అవార్డు ప్రకారం ఇది తమిళనాడుకు వెళ్ళింది.

మునిరత్నం గారు 1948 జనవరి 14వ తేది జన్మించారు. జక్కంపూడి నరసమ్మ, జక్కంపూడి మునస్వామి నాయుడు దంపతులు వీరి తల్లిదండ్రులు.

**విద్యాభ్యాసం :** మునిరత్నం గారు 8వ తరగతి వరకు స్వగ్రామంలోనే విద్యనభ్యసించారు. 1963-64 సంవత్సరాల్లో చిత్తూరు సంస్కృత భాషా ప్రచారిణీ సభవారి పరిచయ, అభిజ్ఞ, విచక్షణ పరీక్షలు పాసయ్యారు. 1973లో ప్రైవేట్‌గా ఎస్.వి.మెట్రిక్యులేషన్, 1975లో ఇంటర్మీడియట్ ప్రైవేట్‌గా రాసి పాసయ్యారు. ఎస్.వి.ఆర్ట్స్ కళాశాలలో చేరి 1978 సం॥లో ప్రథమశ్రేణిలో బి.ఏ. పట్టభద్రులయ్యారు. ఎస్.వి. యూనివర్శిటీలో చేరి 1980 సం॥లో ఎం.ఏ. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఆచార్య జాస్తి సూర్యనారాయణ గారి పర్యవేక్షణలో "అన్నమయ్య, ఆళ్వార్లు–తులనాత్మక పరిశీలన" అనే అంశం మీద పరిశోధన చేసి 1986 వ సం॥లో పిహెచ్.డి డిగ్రీ పొందారు.

**ఉద్యోగం :** 1987–1989 సంవత్సరాల మధ్యకాలంలో రీసెర్చ్ అసోసియేట్‌గా ఆచార్య కె. సర్వోత్తమరావుగారి పర్యవేక్షణలో పనిచేశారు. 1989 నవంబర్ 9వ తేదీన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో ఉపన్యాసకులుగా చేరారు. సంయుక్తాచార్యులుగా, ఆచార్యులుగా పదోన్నతి పొంది 2008వ సంత్సరం జనవరి 31న ఉద్యోగ విరమణ చేశారు. వీరి పర్యవేక్షణలో 8 ఎం.ఫిల్ లు, 12 పిహెచ్.డిలు వచ్చాయి. వీరు రెండు మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టులు చేశారు. అవి "తెలుగు – తమిళ నవలల మీద జాతీయోద్యమ ప్రభావం", "తెలుగు – తమిళ నవలల మీద గ్రామీణ జీవిత ప్రభావం". ఉద్యోగ విరమణ తర్వాత ప్రాచీన తమిళ ప్రాజెక్ట్‌లో 3 సంవత్సరాలు పని చేశారు.

**వివాహం :** మునిరత్నం గారికి 1988 ఫిబ్రవరి 10వ తేదీన బి. కల్పన గారితో వివాహం జరిగింది. వీరు పిహెచ్.డి చేసి ప్రస్తుతం శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేస్తున్నారు. వీరికి దేదీప్య అనే కుమార్తె వుంది. ఈమె బి.ఇ., ఎం.ఇ., బి.ఎస్‌సి సైకాలజీ, ఎం.ఎస్‌సి సైకాలజీ పూర్తి చేశారు. అల్లుడు డా. రాజేష్ ఎన్.జి.రంగా అగ్రికల్చర్ కాలేజ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

**కార్యకలాపాలు :** మునిరత్నం గారు తిరుమల తిరుపతి దేవస్థానంలోనూ, తదితర ప్రదేశాలలోనూ ఎన్నో ధార్మిక ప్రసంగాలు చేశారు. ప్రసంగాలలో పాటలు, పద్యాలు చేర్చి శ్రోతలను ఆకట్టుకోవడం వీరి ప్రత్యేకత. రేడియోలోనూ, దూరదర్శన్ సప్తగిరి ఛానల్‌లోనూ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సూక్తిముక్తావళులేగాక రేడియో ప్రసంగాలు కూడా వీరు చేశారు. పలు అష్టావధానాల్లో పృచ్ఛకులుగా పాల్గొన్నారు. శ్రావ్యంగా పద్యం చెప్పడం వల్ల వీరికి ఎక్కువగా పురాణ పఠనమే ఈ కార్యక్రమాల్లో ఇచ్చేవారు. ఇతర విషయాల్లో కూడా వీరు పృచ్ఛకులుగా వ్యవహరించారు. 'భువనవిజయం' అనబడే సాహిత్య రూపకంలో ధూర్జటి పాత్రను పోషించడం వీరికి వాడుక. ప్రేక్షకులకు వేడుక. పలు విశ్వవిద్యాలయాలను సందర్శించి అక్కడకూడా వీరు ప్రసంగించి సభాసదులను ఆకట్టుకున్నారు. వీరు దాదాపు 24 జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పత్ర సమర్పణ చేశారు.

**పురస్కారాలు :** జక్కంపూడి వారికి అనేక పురస్కారాలు లభించాయి. 1965లో స్వగ్రామంలో జరిగిన పుస్తకావిష్కరణ సభలో "నవయువకవి" అనే బిరుదు ప్రదానం చేశారు. 1986లో తిరుపతి జూనియర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వారిచే "ఔట్ స్టాండింగ్ యంగ్ పర్సన్" అవార్డు ప్రదానం చేయబడింది. ఆ సంవత్సరమే నెల్లూరు కళాక్షేత్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఇండియన్ జాయ్‌సీస్ వారిచే "ఔట్ స్టాండింగ్ యంగ్ పర్సన్" రాష్ట్ర అవార్డు ఆచార్య సి. నారాయణ రెడ్డిగారి చేతుల మీదుగా ప్రదానం చేయబడింది. 2004లో మదనపల్లి, భరతముని ఆర్ట్స్ అకాడమీ వారిచే 'కళారత్న' బిరుదు ప్రముఖ సినీనటి అంజలీదేవి గారి చేతుల మీదుగా స్వీకరించడం జరిగింది.

2009లో చిత్తూరు జిల్లా రచయితల సంఘం వారిచే "కుప్పం రెడ్డెమ్మ" అవార్డు ఇవ్వబడింది. 2014లో పుంగనూరు తెలుగు భాషాపరిరక్షణ సమితి వారిచే "వాఙ్మయ ప్రగతి రత్నం" బిరుదు ఇవ్వబడింది. 2014లో "ఆశావాది సాహితీ కుటుంబ పురస్కారం" వీరికి లభించింది. 2017లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంతోపాధ్యాయ సంఘంవారి "జీవన సాఫల్య పురస్కారం" వీరు స్వీకరించారు.

**సాహితీ ప్రస్థానం :** మునిరత్నం గారికి చదువంటే చాలా ఇష్టం. తండ్రిగారు వేసిన బీజాన్ని వటవృక్షంగా మార్చుకునే క్రమంలో తీవ్ర ప్రయత్నమే చేశారు. బాల్యం నుంచీ కూడా ఎవరు కనిపిస్తే వారిచేత చదివించుకోవడం ఆయనకు పరిపాటి. ఆ విధంగా మిత్రులు, బంధువులు, ఇంట్లోవాళ్ళు, ఆయన విద్యార్థులు కూడా చదివి వినిపిస్తారు. ఆయన శ్రద్ధగా వింటారు. విని విశ్లేషిస్తారు. మంచి విషయాలను మళ్ళీమళ్ళీ మన్నన చేసుకొంటారు. మనసులో నిలుపుకునేందుకు ప్రయత్నిస్తారు. ఈ విధంగా ప్రాచీన సాహిత్యాన్నే గాక ఆధునిక సాహిత్యాన్ని కూడా ఒంట బట్టించుకునే ప్రయత్నం చేశారు. దాదాపు కృతకృత్యులయ్యారనే చెప్పవలసి వుంటుంది. ఈ నేపథ్యంలో రాయడం కూడా ప్రారంభించారు.

మునిరత్నం గారు పదమూడవ సంవత్సరంలోనే పద్యాలు రాయడం విశేషం. వీరి పద్యాలు మొట్టమొదటి సారిగా 1963 సంవత్సరం డిసెంబర్ 'వేదాంతభేరి' లో 'గీతామాతా' అనే శీర్షిక కింద ప్రకటింపబడ్డాయి. యదార్ధ

భారతి, కథాంజలి మొదలైన పత్రికల్లో కూడా ఆయన పద్యాలు ప్రకటింపబడ్డాయి. వీరి తొలి కథ 1970 సంవత్సరంలో దీక్షా ప్రచురణల వారి 'కొత్తచీర' కథల సంపుటిలో ప్రచురించబడింది. కథపేరు 'చెదిరిన కల'. మునిరత్నం గారి మొదటి గేయం 1971 సంవత్సరంలో తమిళంలో వెలువడింది. తెలుగు గేయం 1973 సంవత్సరంలో వెలువడింది. "నడయాడే దైవాలకు' అని ఈ గేయం మొదలవుతుంది. 1974 అక్టోబర్ 12వ తేదీ ఆరుద్ర అధ్యక్షతన సత్యవేడులో జరిగిన కవి సమ్మేళనంలో మునిరత్నం గారు తమ మొదటి వచన కవిత చదివారు. ఈ విధంగా మునిరత్నం గారి సాహితీ ప్రస్థానం క్రమంగా ముందుకు సాగింది.

**విమర్శ :** మునిరత్నం గారు సృజన రంగంలోనే గాక విమర్శనా రంగంలో కూడా రచనలు చేశారు. వివిధ సదస్సుల్లో పాల్గొని పలు పరిశోధన పత్రాలు సమర్పించారు. పత్రికలకు కూడా వ్యాసాలు రాశారు.

పిహెచ్.డి పట్టాకోసం "అన్నమయ్య, ఆళ్వార్లు – తులనాత్మక పరిశీలన" అనే శీర్షికతో సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు. ఇది తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో ముద్రణకు నోచుకుంది. దీనిలో ఆరు అధ్యాయాలున్నాయి. 'మొదటి అధ్యాయం' అన్నమయ్య, ఆళ్వార్ల జీవిత విశేషాలను పరిచయం చేస్తూ వాటిని తులనాత్మకంగా విశ్లేషిస్తుంది. ఆళ్వార్ల, అన్నమయ్య కాలాల్లో నెలకొన్న సాంఘిక, రాజకీయ, మత పరిస్థితులను 'రెండవ అధ్యాయం' తులనాత్మకంగా చర్చిస్తుంది. ఆళ్వార్ల రచనల్లోనూ, అన్నమయ్య కీర్తనల్లోనూ కనిపించే సామాన్య సామ్యాలను 'మూడవ అధ్యాయం' తులనాత్మకంగా తెలియజేస్తుంది. ఆళ్వార్ల, అన్నమయ్య రచనల్లో చోటు చేసుకున్న విష్ణుతత్వాన్ని 'నాల్గవ అధ్యాయం' తులనాత్మకంగా విశ్లేషిస్తుంది. మధురభక్తిని ఆవిష్కరించే ఆళ్వార్ల, అన్నమయ్య రచనలను 'ఐదవ అధ్యాయం' తులనాత్మకంగా అధ్యయనం చేస్తుంది. ఆళ్వార్ల, అన్నమయ్య రచనల్లో చోటుచేసుకున్న వివిధ భక్తి రకాలను 'ఆరవ అధ్యాయం' తులనాత్మకంగా ఆవిష్కరిస్తుంది. ఈ సిద్ధాంత వ్యాసం అన్నమయ్యను పదమూడవ ఆళ్వారుగా సిద్ధాంతీకరిస్తుంది.

ఒంగోలు ఎర్రన పీఠం వారు ప్రకటించిన పోటీ కోసం తయారుచేసిన రచన ''సోమన-ఎర్రనల హరివంశములు" డా॥ ఎమ్. గోవిందస్వామి నాయుడు గారి సహకారంతో ఒక వారం రోజుల్లోనే ఈ రచన పూర్తి చేశారు. ఈ పుస్తకం 1989 జనవరిలో వెలుగుచూసింది. దీనిలో నాలుగు విభాగాలున్నాయి. అవి నాచన, సోమన, ఎర్రనల-హరివంశరచన, ఇతివృత్తము-వర్ణనలు, కవితా రీతులు, వ్యక్తిత్వము. 1989 సెప్టెంబర్ నెలలో "నాటకవ్యాసాలు" అనే పుస్తకం వెలువడింది. దీనిలో నాలుగు సుదీర్ఘ వ్యాసాలున్నాయి. మొదటి వ్యాసం నాగభైరవ వారి 'కవన విజయ కమనీయత'ను ఆవిష్కరిస్తుంది. 'పోతన మీద వచ్చిన రెండు నాటకాల'ను రెండవ వ్యాసం_తులనాత్మకంగా పరిచయం చేస్తుంది. తిమ్మరుసు మీద వచ్చిన రెండు నాటకాలను తులనాత్మకంగా విశ్లేషిస్తూ మూడవ వ్యాసం ముచ్చటిస్తుంది. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ నాటకాల ఆవిర్భావ వికాసాలను నాల్గవ వ్యాసం తెలియజేస్తుంది. నాటకాలపట్ల ఒక అవగాహన ఏర్పరచుకునేందుకు ఈ రచన ఉపకరిస్తుంది.

2005 ఏప్రిల్‌లో "భావనా తరంగిణి" అనే వ్యాస సంపుటి వెలువడింది. దీనిలో భారతానికి సంబంధించి, ప్రబంధాలకు సంబంధించి, క్షేత్రమహిమకు సంబంధించి, ఆళ్వార్లకు సంబంధించి వివిధ అంశాలను తెలియజేస్తూ 16 వ్యాసాలు చోటుచేసుకున్నాయి. ఈ సంపుటిలోని "ఎర్రన గారి సావిత్రి" అనే వ్యాసం కర్ణాటక ప్రభుత్వం వారి పి.యు.సి. ప్రథమ సంవత్సరం తెలుగు పాఠ్య ప్రణాళికలో ఒక పాఠంగా చోటుచేసుకొంది.

2006 ఆగస్టులో ''తాళ్ళపాక కవుల సాహితీ కిరణాలు" అనే పేరుతో ఒక వ్యాస సంపుటి వెలువడింది. దీనిలో 12 వ్యాసాలున్నాయి. అధిక భాగం అన్నమయ్యకు సంబంధించినవే. తిమ్మక్క, పెదతిరుమలయ్య, చిన తిరుమలయ్య, చిన్నన్నలకు సంబంధించి కూడా వ్యాసాలు చోటుచేసుకున్నాయి. వీటన్నింటి దృష్ట్యా "తాళ్ళపాక వారి సాహితీ కిరణాలు" అని ఈ సంపుటికి పేరుపెట్టడం అర్థవంతంగానే వుంది.

"తెలుగు, తమిళ, నవలల మీద జాతీయోద్యమ ప్రభావం" అనే శీర్షికతో యు.జి.సి వారి మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టు కోసం మునిరత్నం గారు పరిశోధన చేశారు. ఈ పుస్తకం అముద్రితం. దీనిలో నాలుగు అధ్యాయాలున్నాయి. మొదటి అధ్యాయం జాతీయోద్యమ చరిత్రను తెలియజేస్తుంది. రెండవ అధ్యాయం తెలుగు

నవలల మీద జాతీయోద్యమ ప్రభావం ఏమేరకు వుందో బేరీజు వేస్తుంది. మూడవ అధ్యాయం తమిళ నవలలను జాతీయోద్యమ సంఘటనలు ప్రభావితం చేసిన తీరును తెలియజేస్తుంది. నాల్గవ అధ్యాయం తెలుగు, తమిళ నవలల్లో చోటుచేసుకొన్న జాతీయోద్యమ విశేషాలను తులనాత్మకంగా అధ్యయనం చేస్తుంది. జాతీయోద్యమ కారుల త్యాగం వెలుగులో పయనించి దేశపునర్నిర్మాణం చేసుకోవలసిన ఆవశ్యకతను ఈ పుస్తకం తెలియజేస్తుంది.

**అనువాదం :** మునిరత్నం గారికి తెలుగు భాషమీదేగాక తమిళభాష మీద కూడా పట్టువుంది. కాబట్టి తమిళ సాహిత్యంలోని మంచి మంచి రచనలను తెలుగులోకి తీసుకురావాలని ఆరాటపడ్డారు. తనకు నచ్చిన, తాను మెచ్చిన వాటిని తెలుగు చేయడానికి పూనుకున్నారు. వీరి మొదటి తెలుగు అనువాదం 'కథే'. సు.సముద్రం_రచించిన "కొడికాఇచ్చుమరం" అనే తమిళ కథను "జెండాలు కాసిన మాను" అనే పేరుతో ఆంధ్రీకరించారు. సు.సముద్రం గారి మరికొన్ని కథలను కూడా ఈయన ఆంధ్రీకరించారు. ఇవేవీ ముద్రణకు నోచుకోలేదు. సు.సముద్రం గారి నవల "వేరిల్ పొళుత్తపల" సాహిత్య అకాడమీ బహుమతి పొందింది. ఈ నవలను మునిరత్నం గారు 1994లోనే "వేరుపనస" అనే పేరుతో ఆంధ్రీకరించారు. అయితే దురదృష్టవశాత్తు ఇది ఇంకా ప్రచురణకు నోచుకోలేదు. ఈ నవలలో తొమ్మిది అధ్యాయాలున్నాయి. నిజాయితీ పరులైన సామాన్యులు ఇంటా, బయటా, కార్యాలయాలలో ఎదుర్కొనే సమస్యలను ఈ నవల చక్కగా చిత్రిస్తుంది. వీటిని ఏవిధంగా పరిష్కరించుకోవాలో కూడా తెలియ జేస్తుంది. మునిరత్నం గారు అఖిలన్ రచించిన "ఎంగిపోగిరో" అనే నవలను కూడా ఆంధ్రీకరించేందుకు ప్రయత్నించారు. అయితే అది ఇంకా పూర్తి కాలేదు. డా॥ ము. వరదరాజన్ రచించిన "మణ్కుడిశై" నవలను కూడా ఆంధ్రీకరించడానికి పూనుకొని ఒక అధ్యాయం మాత్రమే పూర్తి చేశారు.

మునిరత్నం గారు ఉద్యోగ విరమణ చేసిన తర్వాత శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తమిళశాఖలో అనువాదకులుగా మూడు సంవత్సరాలు పనిచేశారు. ఆచార్య డి. దేవసంగీతం గారు సంచాలకులుగా ఒక అనువాదం ప్రాజెక్టు మంజూరయ్యింది. ప్రాచీన తమిళ కేంద్ర సంస్థ వారు దీనిని మంజూరు చేశారు. తమిళ సంఘసాహిత్యానికి చెందిన పత్తుప్పాట్టు, ఎట్టుత్తొగై అనే 18 పుస్తకాలను ఆచార్య కె. సర్వోత్తమరావుగారి తోనూ, ఆచార్య ఎస్. జయప్రకాష్ గారితోనూ కలిసి మునిరత్నం గారు ఆంధ్రీకరించారు. వీటన్నింటినీ పద్యరూపంలోనే అనువదించడం విశేషం. ఈ అనువాదానికి అభివాదంగా 2025 డిసెంబర్ 11వ తేదీన తమిళనాడు లోక్‌భవన్‌లో మహాకవి సుబ్రహ్మణ్య భారతి జయంతిని పురస్కరించుకొని ప్రాచీన తమిళ కేంద్ర సంస్థ వారు ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి గారి చేతుల మీదుగా ఆచార్య జక్కంపూడి మునిరత్నం గారికి సన్మానం ఇప్పించారు.

శ్రీకాళహస్తి, శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు, శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారి ఆదేశం మేరకు మహాకవి ధూర్జటి ప్రణీత ''శ్రీకాళహస్తి మాహాత్మ్యాన్ని" మునిరత్నం గారు సులభ వచనంలోకి అనువదించారు. ఇది మొదట ''వేదాంతభేరి'' మాసపత్రికలో ధారావాహికంగా వెలువడింది. తర్వాత ఆశ్రమం వారే దీన్ని ముద్రించి వెలువరించారు. ఈ పుస్తకంలోనూ నాలుగు ఆశ్వాసాలే వున్నాయి. వర్ణనలను పరిహరించి కథాఘట్టాలను మాత్రమే మునిరత్నంగారు అనువదించారు. ప్రతిఘట్టానికి విశ్లేషణ సమకూర్చారు. శుకబ్రహ్మాశ్రమం స్వాముల వారి సూచన మేరకు పోతన గారి భాగవతానికి వచనానువాదం చేశారు. ఇది "వేదాంతభేరి" మాసపత్రికలో ధారావాహికంగా వెలువడుతూ ఉంది.

**శతకాలు :** మునిరత్నంగారు 16 శతకాలు రాశారు. వాటిలో 11 ముద్రణకు నోచుకున్నాయి. అవి *చంద్రమౌళి శతకం, నటరాజ శతకం, షిర్డిసాయి శతకం, సుబ్రహ్మణ్య శతకం, శ్రీ వేంకటేశ్వర శతకం, శ్రీకృష్ణ శతకం, సఖ శతకం, దేదీప్య శతకం, తెలుగుబాల శతకం, మలయాళ మౌనీంద్ర శతకం, శ్రీ విద్యాప్రకాశ మౌనీంద్ర శతకం. గణనాథ శతకం, వెంకయ్య శతకం, రామకృష్ణ శతకం, వివేక సద్గురు శతకం, మారుతీ శతకం* అముద్రితాలు. ఈ శతకాలన్నీ వివిధ ఛందస్సుల్లో రాయబడ్డాయి. వీటిలో దైవస్తుతి, నీతి, లోకరీతి చోటుచేసుకున్నాయి. ఈ శతకాల మీద శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి పట్టా కోసం పరిశోధన జరిగింది.

**పద్యకృతులు :** "హృదయశ్రీ." వివిధ ఖండికలతో కూడిన కృతి ఇది. దీనిలో వివిధ అంశాల ప్రస్తావన వుంది. "స్ఫూర్తి

శ్రీ.'' స్ఫూర్తిని కలిగించిన పలువురి గురించి పలు ఖండికలతో వెలసిన కృతి ఇది. దీనిలోని పోతన ఖండిక "పోతన ప్రశంస" అనే పేరుతో పి.యు.సి. ద్వితీయ సంవత్సరానికి పాఠంగా పెట్టబడింది. శ్రీ వటారణ్యేశ్వరీయం. దీనిలో శ్రీ వటారణ్యేశ్వర స్వామి దండకం, ఉదాహరణ, విహార ప్రబంధం, శ్రీ వటారణ్యేశ్వర తోటకం, స్తుతి మొదలైన అంశాలున్నాయి.

**చాటువులు :** మునిరత్నం గారు వివిధ ప్రదేశాల్లో వివిధ అంశాలకు స్పందించి ఆశువుగా చెప్పిన పద్యాలు దీనిలో చోటుచేసుకొన్నాయి. వివిధ ప్రదేశాల గురించి, ఆ ప్రదేశాల్లోని విశేషాల గురించి, వివిధ సంఘటనల గురించి ఈ పద్యాలు తెలియజేస్తాయి.

**వచన కవితలు :** మునిరత్నం గారు దాదాపు 200లకు పైగా వచన కవితలు రాశారు. వివిధ సందర్భాల్లో వాటిని వెలయించారు. అవి రెండు సంపుటాలుగా రూపు దిద్దుకొన్నాయి. "గొంతుల జ్వాల" అనే సంపుటిలో 100 కవితలున్నాయి. "గొంతుల జ్వాల" అనే కవిత పేరే సంపుటానికి కూడా పెట్టబడింది. ఈ సంపుటాన్ని తన కవితా ప్రస్థానానికి దోహదం చేసిన డా॥ మన్నవ భాస్కర నాయుడు గారికి అంకితమిచ్చారు. "తలపుల పందిరి" కవితల సంపుటిలో 75 కవితలున్నాయి. వివిధ అంశాల మీద ఈ కవితలు రూపుదిద్దుకొన్నాయి. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్.వి.జె. లక్ష్మణ్ గారికి ఈ పుస్తకం అంకితం ఇవ్వబడింది. ఈ రెండు కవితా సంపుటాల మీద శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిశోధన జరిగింది. ఈ పరిశోధనకు పిహెచ్.డి. పట్టా కూడా లభించింది. మునిరత్నం గారు వివిధ సందర్భాల్లో తమిళంలో కూడా పలుకవితలు వెలయించారు. అవి "పేనామరం" అనే పేరుతో ఒక కవితా సంపుటిగా రూపుదిద్దుకొన్నాయి. ఈ సంపుటి మీద మధురై కామరాజ్ విశ్వవిద్యాలయంలో పరిశోధన జరిగి ఎమ్.ఫిల్ డిగ్రీ ప్రదానం చేయబడింది. మునిరత్నంగారు దాదాపు 300 మినీ కవితలు, 150 హైకూలు రాశారు. ఇవి అముద్రితం.

**గేయకవిత్వం** : మునిరత్నం గారు చిన్నప్పటి నుంచి పాటలు వినటం వల్ల వాటి ప్రభావం ఆయన మీద బాగానే వుందని చెప్పాలి. ఆ ప్రభావంతోనే ఆయన అనేక గేయాలు రచించారు. మొదట తమిళంలోనే గేయాలు రచించారు. అవి "ఉళవర్‌పత్తు" అనే పేరుతో చిన్న పుస్తకంగా రూపుదిద్దుకొన్నాయి. శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో చదువుకొనే రోజుల్లో వివిధ సందర్భాల్లో అనేక గేయాలు రచించారు. వాటిని పాడి ఆత్మీయులకు వినిపించే వారు. ఈ పాటలన్నీ 'విపంచిక' అనే పేరుతో ఒక సంపుటంగా రూపుదిద్దుకొన్నాయి. 1996 ప్రాంతంలో షిర్డిసాయిబాబా మీద దాదాపు 10కి పైగా గేయాలు రచించారు. మునిరత్నం గారికి ఇష్టదైవమైన శ్రీ వటారణ్యేశ్వర స్వామి మీద దాదాపు 200 లకు పైగా గేయాలు రచించారు. గొలగమూడి వెంకయ్యస్వామి మీద 30 గేయాలున్నాయి. పిల్లల గేయాలు కూడా కొన్ని ఈయన గళం నుండి వెలువడ్డాయి. శివుడి మీద 'శివగేయావళి'ని రాశారు. ఇవన్నీ కూడా ముద్రణకు నోచుకోలేదు.

**కథలు** : మునిరత్నంగారు పిల్లలనుద్దేశించి చాలా కథలు రచించారు. వాటిలో 17 కథలను 'గుణపాఠం' అనే పేరుతో సంపుటీకరించి విశాలాంధ్రవారు ప్రచురించారు. 2024లో 'కొత్తజీవితం' అనే పేరుతో ఒక కథల సంపుటిని వెలువరించారు. వాటిలో కొన్ని వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి. ఇంకా 31 సాంఘిక కథలు కూడా రచించారు. ఇవి అముద్రితం. ఆచార్య జక్కంపూడి మునిరత్నం గారు తన జీవిత చరిత్రను కూడా రాశారు. ఇది కూడా అముద్రితం.

**ముగింపు :** మునిరత్నం గారు రచయితగా, విమర్శకులుగా, బోధకులుగా, పరిశోధకులుగా పలు పాత్రలు నిర్వహించినప్పటికీ వీటన్నిటికీ మూలమైన వీరి వ్యక్తిత్వం అన్నింటిలోనూ ప్రతిబింబిస్తూ వుంది. బంధుమిత్రులకేగాక, విద్యార్థులకు సైతం ఎంతో ఆత్మీయులుగా మసులుకునేవారు. అందరూ వృద్ధిలోకి రావాలని ఆరాటపడేవారు. చదువు, దైవచింతన వీరి ఉచ్ఛ్వాస, నిశ్వాసాలుగా జీవించారు. ఎందరికో మార్గదర్శకంగా ఉండే మా గురువుగారు 2026 మార్చి 14వ తేదీన శివైక్యం చెందారు. వీరి జీవితము, రచనలు తెలుసుకొని పలువురు స్ఫూర్తి పొందగలరని నా ప్రగాఢ విశ్వాసం.

**డా.డి. యువశ్రీ**
సహాయ ఆచార్యులు, తెలుగు అధ్యయన శాఖ
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయము
తిరుపతి - 517 502, ఫోన్ : 9885940011

# కుముదవల్లి గ్రంథాలయం

**– చెరుకువాడ వెంకటరామయ్య**

పశ్చిమగోదావరి జిల్లా ఆనాటి భీమవరం తాలూకా, వర్తమానంలో పాలకోడేరు మండలంలో ఉన్న చిన్న గ్రామం కుముదవల్లిలో 1897 సం॥లో శ్రీ వీరేశలింగ కవిసమాజ గ్రంథాలయం ఏర్పడింది. ఈ ప్రాంత ప్రజానీకానికి విద్యా విజ్ఞాన సుగంధాలు అందించింది. ఈనాటికీ గ్రంథాలయం సాగుతూండటం ఒక గొప్ప విషయంగా భావించాలి. అసలు కందుకూరి *వీరేశలింగ కవి సమాజ గ్రంథాలయంగా* పేరు నిర్ణయించడంలోనే మహత్తర ఔన్నత్యం దర్శనమిస్తున్నది. కవి–పండితుడు, నవలా రచయిత, పత్రికా సంపాదకుడు, అనువాదకుడు, బడి పంతులుగా జీవనం సాగిస్తూ ఆనాటి సమాజంలో పేరుకుపోయిన ఛాందసవాదులపై తిరుగుబాటు చేయడమేగాక, వితంతు వివాహాలు చేయడం వంటి కార్యక్రమాలతో దేశాన్ని ఉర్రూతలూగించిన విప్లవ యోధుడు వీరేశలింగంగారు. ఆనాటి సంఘంలో ఎన్నో ప్రతిఘటనలు ఎదురైనా, తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి సాహసవంతమైన జీవనం, ప్రజాహృదయ దేరాలలో చిరంజీవియై వెదులుతూనే ఉన్నారు. వీరేశలింగం గారు బ్రహ్మసమాజికులు, ఏకేశ్వరోపాసకులు. 1897 నాడే శ్రీ వీరేశలింగం కవి సమాజ గ్రంథాలయం ఏర్పాటు చేసారంటే ఆ గ్రామం వారు ఎంతటి సంస్కారవంతులో అర్థం చేసుకోవాలి.

మహనీయులు శ్రీ వీరేశలింగంగారి ఆశయాలను సమర్థిస్తూ, దివ్య జ్ఞాన సమాజ సానుభూతిపరులు, కథావశేషులు శ్రీ భూపతిరాజు తిరుపతిరాజుగారు గ్రంథాలయ స్థాపనకు పూనుకున్నారు. ఏ సుముసుందర సుముహూర్తంలో బలమైన పునాదులు వేసారోకానీ, నేటికీ అవిశ్రాంతంగా గ్రంథాలయం సాగుతుండటం మహత్తర సంకల్పమే. కుముదవల్లి ఎంత చక్కని పేరు అన్నారు సి.నా.రె. స్వాతంత్ర్యోద్యమాలన్నిటా కుముదవల్లి గ్రామస్తులు పాల్గొన్నారు. యింత చిన్న గ్రామం నుండి 40 మంది వరకు స్వరాజ్య పోరాటంలో పాల్గొని కారాగార క్లేశాలు అనుభవించిన త్యాగమూర్తులు నిండిన గ్రామం ఇది. గాంధీమార్గాన్ని అనుసరిస్తూ సత్యం– అహింస–ధర్మాలను ఆచరించినవారే. ఇదంతా తిరుపతిరాజుగారి సేవ సౌభాగ్యమేనని చెప్పాలి. శ్రీ వీరేశలింగ కవిసమాజ గ్రంథాలయం 1897లో చిన్న కుటీరంలో ప్రారంభిస్తే తరువాత పెంకుటింట్లోకి వచ్చి ఆ తదనంతరం విశాలమైన భవనంలోకి మారి విజ్ఞానదీపాలతో కూడిన జీవకాంతులతో కళకళలాడుతున్నది. శత జయంతులు, సహస్ర జయంతులు కూడా జరిపించుకునే సంఘటితశక్తి ఈ గ్రంథాలయమునకు ఉన్నది. శ్రీ వీరేశలింగంగారు రాజమహేంద్రవరంలోనే కాదు, కుముదవల్లి గ్రామంలోనూ శాశ్వతులై ఉన్నారు. సర్వాంధ్రదేశంలోనూ ఉన్నారు.

1897లో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తే–నా పేరున స్థాపించిన గ్రంథాలయం ఎలా నడుస్తున్నదో చూద్దామని మహనీయుడు వీరేశలింగంగారు తన సతీమణి రాజ్యలక్ష్మమ్మ గారితో సహా కుముదవల్లి గ్రామం వచ్చారు. గ్రంథాలయ నిర్వహణను, ప్రజల్లో ఉన్న కర్తవ్యాన్ని తిరుపతిరాజు గారిని చూసి మురిసిపోయారు. ముగ్ధులై పోయారు. ఆనందభాష్పాలతో కరిగిపోయారు.

గ్రంథాలయానికి ఆంధ్రపత్రిక, భారతి, కృష్ణా పత్రికలు వంటి పత్రికలు వచ్చేవి. ఇప్పుడు అన్ని దినపత్రికలు వస్తున్నవి. ప్రాచీన కావ్యాలు, నవలలు, నాటికలు, జీవిత చరిత్రలతో పాటు సుమారు 16 వేల పుస్తకాలు ఉన్నవి. నేడు ఆధునిక సదుపాయాలతో పుస్తకాలు భద్రంగా నిత్యనూతనంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రంథాలయం చదువరులతో, నిశ్శబ్ద వాతావరణంతో నిండి ఉంటుంది.

స్వరాజ్య ఉద్యమంలో గ్రంథాలయం ఉద్యమం అంతర్భాగంగా సాగుతూ వచ్చింది. దేశప్రజలు విద్యావంతులు కావాలి. ప్రపంచ పరిస్థితులు అవగాహన చేసుకోవాలి. వ్యక్తిత్వ వికాసాన్ని పంచుకోవాలనే

సంకల్పంతో మహోద్యమం సాగించారు. అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, తిరుపతిరాజు, వావిలాల గోపాలకృష్ణయ్య, పాలకోడేటి సత్యనారాయణ శర్మ, కాళ్ళకూరి నరసింహం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు వంటి వారు గ్రామాలలో పర్యటించి, గ్రంథాలయాలు స్థాపిస్తూ వచ్చారు. గ్రంథాలయోద్యమంతో పాటు ఖద్దరు ఉద్యమం కూడా సాగింది. ఈ ఉద్యమాలన్నీ స్వాతంత్ర్యోద్యమ సాధనలో కలిసిపోయాయి.


అలనాటి వేటపాలెం గ్రంథాలయం, విజయవాడలోని రామమోహన గ్రంథాలయం, రాజమహేంద్రవరంలోని గౌతమి గ్రంథాలయం, గుంటూరులోని శ్రీ లంక సూర్యనారాయణగారి స్వంత గ్రంథాలయంతో పాటు శ్రీ వీరేశలింగం కవిసమాజ గ్రంథాలయమున్నూ వాటి సరసన నిలిచే వుంటుంది. కుముదవల్లి గ్రంథాలయం స్ఫూర్తితో కుముదవల్లి గ్రామంలో వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న క్షత్రియ కుటుంబాలవారు విద్యాసముపార్జనలో పడ్డారు. డాక్టర్లు, లాయర్లు, లెక్చరర్లు, ఇంజనీర్లు కాకుండా నవభారత నిర్మాణంలో పారిశ్రామికవేత్తలుగా ప్రకాశవంతమయ్యారు. పద్మవిభూషణ్ డా॥ బి.వి.రాజుగారు, కృష్ణంరాజుగారు, లార్స్‌విన్స్ గ్రూప్ చైర్మన్ ఈ గ్రామం వారే కావడం ఈ గ్రామస్తులు చేసుకున్న అదృష్టం.

పద్మవిభూషణ్ డా॥ బి.వి. రాజుగారు భీమవరంలో ఇంజనీరింగు, పాలిటెక్నిక్, డెంటల్ కళాశాలలు స్థాపించి, పారిశ్రామికవేత్త, విద్యావేత్తగా కీర్తిని సాధించుకున్నారు. కళాశాలలు అందమైన నిర్మాణాలతో, విద్యాప్రాంగణ సుందరంగా నిర్మించారు. ఆనాటి ఆంధ్రప్రముఖులు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, అడవి బాపిరాజు, ఉన్నవ లక్ష్మీనారాయణ, చెరుకువాడ నరసింహం, పెద్దాడ రామస్వామి, గవర్నర్ కుముద్‌బెన్‌జోషి, సి.నారాయణరెడ్డి, జంధ్యాల పాపయ్యశాస్త్రి, దుగ్గిరాల బలరామకృష్ణయ్య వంటి మహనీయులు ఈ గ్రంథాలయాన్ని సందర్శించి ముగ్ధులయ్యారు. ప్రముఖ చలనచిత్ర సంగీత విద్వాంసులు ఘంటసాల వెంటేశ్వరావుగారు ఈ గ్రామంలో ఉన్నారు. ఈనాటికీ ఘంటసాల వారి కుటుంబాలు ఉన్నాయి.

కుముదవల్లి గ్రామంలో రాజకీయాలు ఉన్నా గ్రంథాలయ విషయంలో అందరిదీ మాట ఒక్కటే. మనస్సూ ఒక్కటే. రాజకీయాలను మాత్రం సరస్వతీ దేవాలయానికి అంటుకోకుండా కాపాడుకుంటున్నారు. గ్రంథాలయ నిర్వహణకు ఒక ఉద్యోగిని ఉన్నారు. అవసరమైన సందర్భాల్లో కార్యనిర్వహక సభ్యులే గ్రంథాలయ నిర్వహణలో భాగం పంచుకుంటారు. వాడవాడలా గ్రంథాలయాలు ఉండాలి. విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాల అవసరం ఎంతో ఉన్నది. సాంకేతికంగా అభ్యున్నతి సాధించినా, పుస్తకం చదవడంలో ఉన్న అనుభూతి అదే దివ్యానుభూతిని కల్గిస్తున్నది. మనిషిలో మానవత్వపు తరంగాలు కల్గిస్తుంది. శ్రీ వీరేశలింగం కవిసమాజ గ్రంథాలయం అధ్యక్షులు శ్రీ భూపతిరాజు శ్రీనివాసరాజుగారు, కార్యదర్శి శ్రీ భూపతిరాజు నరేంద్రవర్మ కార్యవర్గ సభ్యులందరినీ అభినందిస్తున్నాను.

**చెరుకువాడ వెంకటరామయ్య**
విస్సాకోడేరు, ఫోన్ : 9542118184

## కమ్మతెమ్మెర



**న**మస్కారం. జూన్ నెల సంచిక, జులై నెలకు కొంచెం ముందుగా నిన్ననే వచ్చింది. ఎప్పటికీ గుర్తు ఉండిపోయే జ్ఞాపకాలలో, లీలా నాయుడు, ఒకటి. ఆశా పాటలలో, నేను తరుచుగా వినే పాట, **"యే రస్తా హై ప్యార్"**,లో రఫీతో కలిసి పాడిన "యహ్ ఖామోషియా" సునీల్ దత్, లీలా మీద తీసింది. తెలుగులో "మనుషులు మమతలు"లో సుశీల పాడితే, సావిత్రి నటించింది. మంచి వ్యాసం అందించినందుకు ధన్యవాదాలు .

***- మనోహర్‌పంత్***

# విద్య - క్రమశిక్షణ - సరళత

**- యన్. విజయ రాఘవ రెడ్డి**

**మ**నిషిని మలిచే మూడు మహాశక్తులు

ఈ ప్రపంచంలో ప్రతి తల్లిదండ్రి తన బిడ్డ చదువుకోవాలని కోరుకుంటాడు.ప్రతి గురువు తన విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశిస్తాడు.ప్రతి విద్యార్థి జీవితంలో ఏదో ఒకరోజు విజయవంతం కావాలని కలలు కంటాడు. కానీ ఒక ప్రశ్న మాత్రం ఎప్పుడూ మన ముందుంటుంది.

చదువు అంటే ఏమిటి? మంచి మార్కులా? ఒక గొప్ప డిగ్రీనా? ఉద్యోగమా? లేక అంతకంటే గొప్పదేదైనా ఉందా? నిజానికి విద్య అనేది పరీక్షా పత్రాల మీద రాసే సమాధానాల కంటే చాలా పెద్దది.అది మనిషి మెదడులో జ్ఞానాన్ని నింపే ప్రక్రియ మాత్రమే కాదు. అతని ఆలోచనలను, వ్యక్తిత్వాన్ని, విలువలను, జీవిత దృక్పథాన్ని మలిచే నిరంతర యాత్ర. నిజమైన విద్య మనకు ఏమి ఆలోచించాలో కాదు, ఎలా ఆలోచించాలో నేర్పుతుంది.

సరైనదేమిటి? తప్పేమిటి? ఏది తక్షణ ప్రయోజనం? ఏది శాశ్వత మేలు? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతికే శక్తిని ఇస్తుంది. జ్ఞానం లేని మనిషి చీకటిలో నడిచేవాడైతే, వివేకం లేని మనిషి వెలుగులోనూ దారి తప్పిపోయేవాడు. అందుకే విద్య యొక్క అసలు లక్ష్యం సమాచారాన్ని అందించడం కాదు... వివేకాన్ని వెలిగించడం. కానీ విద్య ఒక్కటే సరిపోదు. ఎంత మంచి పుస్తకం చేతిలో ఉన్నా దాన్ని తెరవకపోతే ప్రయోజనం ఉండదు.ఎంత గొప్ప కల ఉన్నా దాని కోసం శ్రమించకపోతే అది కలగానే మిగిలిపోతుంది. అక్కడే క్రమశిక్షణ ప్రవేశిస్తుంది. చాలామంది విజయానికి రహస్యం ప్రతిభ అనుకుంటారు. కొంతమంది అదృష్టం అనుకుంటారు. మరికొందరు అవకాశాలు అంటారు. కానీ చరిత్ర చెబుతున్న ఒక గొప్ప సత్యం ఉంది. ప్రతిభ తలుపు తెరుస్తుంది.క్రమశిక్షణ ఆ తలుపు దాటి ముందుకు తీసుకెళ్తుంది.ఉత్సాహం కొన్నిసార్లు ఉంటుంది. కొన్నిసార్లు ఉండదు.ప్రేరణ ఈ రోజు వస్తుంది.రేపు మాయమవుతుంది.కానీ క్రమశిక్షణ మాత్రం ప్రతిరోజూ మనతోనే ఉంటుంది.

ఉదయం నిద్ర మత్తు నుంచీ లేపేది అదే.వాయిదా వేద్దామనుకున్న మనసును ఒప్పించేది అదే.ఎవరూ చూడనప్పుడు కూడా సరైన పని చేయమని చెప్పేది అదే.

క్రమశిక్షణ అనేది బంధనం కాదు.అది స్వేచ్ఛకు దారి తీసే మార్గం.ఎందుకంటే అలవాట్లను జయించిన వ్యక్తి జీవితాన్ని జయించగలడు. అయితే జీవిత ప్రయాణంలో మరో సవాలు ఎదురవుతుంది. అదే కష్టాలు. ప్రతి మనిషి జీవితంలో సమస్యలు ఉంటాయి. కానీ అందరూ వాటిని ఒకే విధంగా చూడరు. కొంతమంది చిన్న సమస్యను కొండంతగా ఊహిస్తారు. మరికొందరు కొండంత సమస్యను కూడా ఒక్కో అడుగుగా విభజించి పరిష్కరిస్తారు. ఇదే జీవన జ్ఞానం. మన జీవితాలను కృంగదీసేది సమస్యలు కావు. ఆ సమస్యల చుట్టూ మనం నిర్మించుకునే భయాల కోటలు. మనల్ని బలహీనులను చేసేది అవరోధాలు కావు. వాటిని గురించి మనసులో పెంచుకునే ఆందోళనలు. మనల్ని అలసటకు గురిచేసేది వర్తమానం కాదు. భవిష్యత్తుపై ఉన్న అనిశ్చితి, గతంపై ఉన్న పశ్చాత్తాపం.

"రేపు ఏమవుతుందో?" అనే ప్రశ్నతో మనసు వేల మైళ్లు ముందుకు పరుగెడుతుంది.''అప్పుడు అలా జరగకపోయి ఉంటే!" అనే ఆలోచనతో జ్ఞాపకాలు మనల్ని వెనక్కి లాగుతాయి. ఈ రెండు దిశల మధ్య నలిగిపోయేది మన వర్తమానం. కానీ జీవితం ఎప్పుడూ గతంలో జరగదు... భవిష్యత్తులోనూ జరగదు... అది జరిగేది ఒక్క చోటే. వర్తమానంలో...ఈ క్షణంలో.

అందుకే జీవన కళ అంటే భవిష్యత్తును గురించి భయపడటం కాదు.వర్తమానాన్ని సార్థకం చేసుకోవడం.ఈ రోజును జీవించడం.ఈ రోజు పని ఈ రోజే పూర్తి చేయడం. ఇదే ప్రశాంతమైన జీవితానికి సరళమైన సూత్రం. అంతిమంగా చూస్తే విద్య మనకు జ్ఞానాన్ని అందిస్తుంది.క్రమశిక్షణ ఆ జ్ఞానానికి కార్యరూపం ఇస్తుంది. సరళమైన ఆలోచన ఆ ప్రయాణాన్ని ఆనందమయంగా మారుస్తుంది. ఈ మూడు కలిసినప్పుడే సంపూర్ణ వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. అందుకే ప్రతి విద్యార్థి, ప్రతి తల్లిదండ్రి, ప్రతి గురువు గుర్తుంచుకోవలసిన మహాసత్యం ఒక్కటే :- విద్య యొక్క పరమ లక్ష్యం ఉద్యోగిని తయారు చేయడం కాదు, బాధ్యతగల పౌరుడిని తీర్చిదిద్దడం. క్రమశిక్షణ యొక్క లక్ష్యం నియంత్రణ కాదు, వ్యక్తిత్వ నిర్మాణం. జీవిత జ్ఞానం యొక్క లక్ష్యం కష్టాలను తొలగించడం కాదు, వాటిని చిరునవ్వుతో ఎదుర్కొనే ధైర్యాన్ని ప్రసాదించడం. ఇవే ఒక సాధారణ మనిషిని అసాధారణ వ్యక్తిగా మలిచే మూడు మహాశక్తులు.

విద్య...క్రమశిక్షణ...సరళత... విద్య మనిషికి దిశను ఇస్తుంది. క్రమశిక్షణ ఆ దిశలో నడిపిస్తుంది. సరళమైన ఆలోచన, కష్టాలను జయించే జ్ఞానాన్ని ఇస్తుంది.

**యన్. విజయ రాఘవ రెడ్డి**
ఆకాశవాణి విశ్రాంత కార్యక్రమ నిర్వహణాధికారి, ఫోన్ : 9441239803

## సనాతన సంస్కృతికి అక్షర శిఖరం డా॥ పాపినేని శివశంకర్ గారి

# వేదవ్యాసం

మనం నివసిస్తున్న వేగవంతమైన, యాంత్రిక ప్రపంచంలో అంతర్గత ప్రశాంతతను కోల్పోతున్న తరుణంలో, మన మూలాలను వెతుక్కుంటూ వెళ్లేలా చేసే ఒక అద్భుతమైన దిక్సూచి "వేదవ్యాసం" గ్రంథం. కేవలం ఇతిహాసాలను కథలుగా చదవడం వేరు, వాటి వెనుక ఉన్న పరమార్థాన్ని సనాతన ధర్మ శాస్త్రాల వెలుగులో దర్శించడం వేరు. కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత డా॥ పాపినేని శివశంకర్ గారు ఈ గ్రంథం ద్వారా ఆ రెండవ మార్గాన్ని పఠితలకు అత్యంత సులభంగా, లోతుగా పరిచయం చేశారు.

భారతీయ సనాతన వాఙ్మయానికి మూలపురుషుడు, పరమాత్మ స్వరూపుడైన వేదవ్యాస మహర్షి జీవన తత్త్వాన్ని, ఆయన అందించిన జ్ఞాన సంపదను సమకాలీన సమాజానికి అర్థమయ్యే రీతిలో పునర్నిర్మించిన మహోన్నత గ్రంథం ఈ "వేదవ్యాసం". డా॥ పాపినేని శివశంకర్ గారు తన అద్భుతమైన విశ్లేషణతో, పరిశోధనాత్మక శైలితో వ్యాస మహర్షి అక్షర సామ్రాజ్యాన్ని పఠితల కళ్లముందు సాక్షాత్కరింపజేశారు. సనాతన ధర్మ సంస్కృతికి మూలబిందువు గురు–శిష్య పరంపర. గ్రంథం ఈ పరమార్థంతోనే అత్యంత గంభీరంగా ప్రారంభమవుతుంది.

అజ్ఞానాంధకారాన్ని నిరోధించే శక్తే గురువు అనే సత్యాన్ని శ్లోకాల ద్వారా తార్కికంగా నిరూపిస్తూ, సనత్కుమారుని అమూల్య బోధలను ఇక్కడ చర్చించారు. 'ఆయోద ధౌమ్యుని కథ' ద్వారా ఆరుణి, ఉపమన్యుల నిరుపమాన గురుభక్తిని, వారి త్యాగ నిరతిని హృదయానికి హత్తుకునేలా వర్ణించారు.

సాక్షాత్ శ్రీమహావిష్ణువు యొక్క అవతార రూపమే వ్యాస మహర్షి అనే పరమార్థాన్ని సప్రమాణంగా విశ్లేషించారు. భాగవత ప్రోక్తమైన భగవంతుని అవతార విశేషాలను క్రమబద్ధీకరించి, వ్యాసావతార మహత్త్వాన్ని (వ్యాసావతారం), చారిత్రక అవసరాన్ని తాత్త్విక శిఖరాలపై నిలిపారు. 'మహాకవులకు మెచ్చిళ్ళు' విభాగంలో వ్యాసమహర్షి సర్వశ్రేష్ఠతను ఇటు సాహిత్యపరంగా, అటు తాత్త్వికంగా ఆవిష్కరించారు.

**వేద వేద్యం : శబ్ద బ్రహ్మ వైభవ నైవేద్యం :–** మానవ ప్రజ్ఞకు వెలుగైన వేదాల విభజనను, వాటి అంతర్గత వైజ్ఞానిక సౌందర్యాన్ని గ్రంథంలో అత్యంత వృత్తిపరంగా ఆవిష్కరించారు. ఋగ్వేద వృత్తాంతాన్ని అందిస్తూ (ఋగ్వేదము), విశ్వ చైతన్యాన్ని శోధించే 'నాసదీయ సూక్తము', సమష్టి మానవ ఐక్యతను ప్రబోధించే 'సంజ్ఞాన సూక్తము', విశ్వపురుషుని వైభవాన్ని చాటే 'పురుష సూక్తము' , గాయత్రీ మంత్రముల నిగూఢార్థాలను సరళీకరించారు. యజుర్వేద, సామవేద, అధర్వ వేదాల ప్రత్యేకతలను లోతుగా చర్చిస్తూ, మన ప్రాచీన ఋషుల మహోన్నత విశ్వజనీన భావనలను నేటి తరానికి ఆదర్శంగా చూపారు.


**ఉపనిషత్ చింతన : ఆత్మ సాక్షాత్కార శిఖరాలు :–** ఈ గ్రంథంలో అత్యంత మేధోపరమైన, గుండెను తాకే విభాగం ఉపనిషత్తుల గురించిన విశ్లేషణ. పంచ శాంతిమంత్రాల మంగళ ధ్వని తో ప్రారంభించి, దశోపనిషత్తుల సారాన్ని లలితమైన కథల ద్వారా పఠితకు అమృతంగా అందించారు. ఈశావాస్య, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యక ఉపనిషత్తులలోని క్లిష్టమైన విషయాలను రచయిత అత్యంత ప్రతిభావంతంగా మలిచారు. ముఖ్యంగా నచికేతుని అమరత్వం గురించిన ప్రశ్నలు (నచికేతుని కథ), భృగువు యొక్క తపోమార్గం (భృగువు కథ), సత్యకామ జాబాలి సత్యనిష్ఠ (సత్యకామ జాబాలి కథ), శ్వేతకేతువుకు తండ్రి చేసిన ఉద్బోధల (శ్వేతకేతువు కథ) వంటి ఉపనిషత్ వ్యాఖ్యానాలను ఎంతో హృద్యంగా ఆవిష్కరించారు. ఉపనిషత్తుల పరమ సత్యాలైన 'మహా వాక్యాల'ను విశ్లేషించి, నిన్ను నువ్వు తెలుసుకోవడమే సకల దుఃఖ నివారణకు మార్గమని నిరూపించారు.

**పురాణ సంహిత&భాగవత సుధ: ధర్మ రక్షణకు కథా వంతెన :–** అష్టాదశ పురాణాల సమగ్ర అవలోకనం ఇక్కడ దర్శనమిస్తుంది. బ్రహ్మ పురాణం నుండి బ్రహ్మాండ పురాణం వరకు 18 పురాణాలలోని ముఖ్యాంశాలను,

సమాజ హిత సూత్రాలను క్రోడీకరించిన తీరు రచయిత పరిశోధనా పటిమకు నిదర్శనం. పురాణాలలో అంతర్లీనంగా సాగే 'మధుమతి కథ', 'ఊర్వశి – దుర్మదుల కథ' లేదా 'మగ చీమ – ఆడ చీమ కథ' వంటి ఆసక్తికరమైన రూపకాల ద్వారా నీతిని బోధించారు. 'భాగవత సుధ' అధ్యాయంలో ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షం వంటి ఘట్టాల ద్వారా భక్తి తత్త్వంలోని ఆర్తిని, శరణాగతి యొక్క అనంత శక్తినీ పరమ పవిత్రంగా ఆవిష్కరించారు.

**పంచమ వేద వైభవం&భారతంలో మహర్షి : నీతి శాస్త్ర సారం :–** మహాభారతంలోని సంక్లిష్ట మానవ నైజాలను, ధర్మ సూక్ష్మాలను వ్యాస మహర్షి ఎలా దర్శించారో ఇక్కడ చర్చింపబడింది. ఏకశ్లోక భారతం, కచ దేవయాని వృత్తాంతం, ఉద్దాలకుడు – శ్వేతకేతువు సంవాదం, యుద్ధం – ఫలితం, ఉత్తమోత్తమ ధర్మం, లుబ్ధ కపోతోపాఖ్యానం, విదుర నీతి, దాయాదుల కలహం, మానవ వివేకానికి అగ్నిపరీక్ష లాంటి 'యక్ష ప్రశ్నలు' వంటి విశేషాలను సమకాలీన సామాజిక దృక్పథంతో విశ్లేషించారు. 'భారతంలో మహర్షి' శీర్షిక కింద పుత్ర ధర్మం, మార్గదర్శి, త్రికాల వేది, మానవ దుఃఖహారి వంటి మహోన్నత భావనలను ఆవిష్కరించారు.

**అద్వైతామృత వర్షిణి – బ్రహ్మసూత్ర మర్మం: తత్వశాస్త్ర శిఖరాగ్రం :–** పుస్తకం ముగింపు దశకు చేరుకునేసరికి చదువరిని లౌకిక పరిధుల నుండి అలౌకిక తాత్త్విక తీరాలకు తీసుకువెళుతుంది. 'అద్వైతామృత వర్షిణి' కింద భగవంతుడు – భక్తి, మానవుడు – కర్మల మధ్య లంకెను, స్థిత ప్రజ్ఞ లక్షణాలను, సమ దర్శనం, గుణత్రయ విభాగం, అకార త్రయం ద్వారా సృష్టి రహస్యాన్ని అత్యంత ప్రౌఢంగా వివరించారు. చివరగా, క్లిష్టమైన 'బ్రహ్మసూత్ర మర్మం'లోని 'చతుః సూత్రి'ని విశ్లేషించి వ్యాస భగవానుని అక్షర తపస్సుకు పరిపూర్ణమైన తార్కిక, పారమార్థిక ముగింపునిచ్చారు. క్లిష్టమైన ఉపనిషత్ సూత్రాలను, వేద మంత్రాల అంతరార్థాన్ని ఎక్కడా ప్రవాహం దెబ్బతినకుండా, అచ్చతెలుగు పదాల మాధుర్యంతో సామాన్యుడి గుండెల్లోకి జాలువారేలా చేయడంలో పాపినేని శివశంకర్ గారి కవితాత్మక విమర్శనా శైలి అద్భుతంగా పనిచేసింది. గ్రంథ సమాపనంలో రచయిత ఆవిష్కరించిన 'నిస్సంగత్వం' అనే సూత్రం, ఆధునిక మానసిక ఒత్తిళ్లకు శాశ్వత ఆధ్యాత్మిక పరిష్కారాన్ని చూపిస్తూ, జగత్ కల్యాణాన్ని కాంక్షించే "సర్వే భవంతు సుఖినః" అనే విశ్వ శాంతి మంత్రంతో ముగియడం హృదయాన్ని కదిలిస్తుంది.




''వేదవ్యాసం'' కేవలం చదివి దాచుకునే పుస్తకం కాదు. నిత్యం జీవితంలో అడుగు తప్పినప్పుడల్లా వెలుగు కోసం తెరిచి చూసుకోవాల్సిన ఒక సజీవ మార్గదర్శి. అక్షర రూపంలో సనాతన సంస్కృతికి ఇంతటి మహోన్నత కైంకర్యాన్ని అందించిన డా॥ పాపినేని శివశంకర్ గారి సాహిత్య శ్రమ తెలుగు వాఙ్మయ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. ఆధ్యాత్మిక అనుభూతిని, సాహిత్య వైభవాన్ని ఒకేసారి ఆస్వాదించాలనుకునే ప్రతి ఒక్కరూ తప్పక పఠించాల్సిన అమృత కావ్యం ఈ గ్రంథం!

"వేదవ్యాసం" గ్రంథం మొత్తం 218 పేజీలతో ఎంతో సుందరమైన ముద్రణతో రూపుదిద్దుకుంది. ఈ పుస్తకం వెల భారతదేశంలో రూ. 200 కాగా, విదేశీ పఠితల కోసం దీని ధర వి 20 డాలర్లుగా నిర్ణయించబడింది. అమరావతి మండలం, గుంటూరు జిల్లాలోని వైకుంఠపురం (పిన్ కోడ్: 522 020) కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ 'భవఘ్ని మర్మయోగ విద్యాలయం' వారు ఈ విశిష్ట గ్రంథాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రచురించారు. 2019 గురుపూర్ణిమ నాడు మొదటి ముద్రణ పొంది, పఠితల విశేష ఆదరణతో వరుసగా ద్వితీయ (2020), తృతీయ (2023) ముద్రణలను జరుపుకున్న ఈ అపురూప గ్రంథరాజం... భవఘ్ని మర్మయోగ విద్యాలయం వారి కేంద్రాలలో మరియు ప్రముఖ పుస్తక విక్రయశాలలలో లభ్యమవుతోంది.


**- విజయ్**

## పోలీస్ సాక్షిగా... ఉద్యోగ విజయాలు

ఒక సాధారణ లెక్చరర్ స్థాయి నుండి పోలీస్ శాఖలో ఉన్నత స్థాయి అధికారిగా ఎదిగిన రావులపాటి సీతారామారావు గారి జీవితానుభవాల సమాహారమే ఈ పుస్తకం. కేవలం తన వృత్తిపరమైన విజయాలనే కాకుండా, సమాజంలో పోలీస్ వ్యవస్థ తీరుతెన్నులను, వారు ఎదుర్కొనే సవాళ్లను, వారు చూసే విభిన్న సంఘటనలను సామాన్యుడికి అర్థమయ్యే రీతిలో ఇందులో వివరించారు. ఈ రచన మొదట 'నవ్య వారపత్రిక' లో ధారావాహికగా ప్రచురితమై విశేష ఆదరణ పొందింది. రచయిత ఈ పుస్తకాన్ని పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు మూలస్తంభాలైన కానిస్టేబుళ్లకు, హెడ్ కానిస్టేబుళ్లకు అంకితం ఇవ్వడం ఆయనకున్న సంస్కారానికి, మానవత్వానికి నిదర్శనం. నిజమైన విజయాలు సాధించినా ఎప్పుడో కానీ వారి ఖాతాల్లో క్రెడిట్ పడదనే నిజాన్ని ఆయన ఇక్కడ సున్నితంగా ప్రస్తావించారు.

ఇందులో మొత్తం 46 అధ్యాయాలు ఉన్నాయి. ప్రతి అధ్యాయం ఒక ఆసక్తికరమైన అనుభవాన్ని, సామాజిక సత్యాన్ని తెలియజేస్తుంది. రచయిత కేవలం చారిత్రక సంఘటనలనే కాకుండా, రాజకీయ నాయకులతో తనకున్న అనుభవాలను, లౌక్యంతో కూడిన పరిపాలనా దక్షతను ఎంతో రసవత్తరంగా ఆవిష్కరించారు.

పుస్తకం ప్రారంభంలో రచయిత తన కెరీర్ తొలి రోజులను ఎంతో నిజాయితీతో ఆవిష్కరించారు. 1968లో హైదరాబాద్ తార్నాకాలోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి గారి నివాసంలో జడ్చర్ల ప్రైవేట్ కాలేజీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లెక్చరర్ ఉద్యోగం కోసం జరిగిన ఇంటర్వ్యూ విశేషాలు ఆకట్టుకుంటాయి. అయితే, గద్వాల గవర్నమెంట్ కాలేజీలో తాత్కాలిక ఉద్యోగం ఊడిపోయినప్పుడు ఒక సామాన్య మధ్యతరగతి యువకుడిగా ఆయన అనుభవించిన ఆందోళన, "హెల్ విత్ దిస్ జాబ్! వెల్‌కమ్ ఎనదర్ జాబ్!!" అంటూ ఆయనకు కలిగిన ధైర్యం, ఆ తర్వాత డీఎస్పీగా ఎంపికై పోలీస్ శాఖలో అడుగుపెట్టేలా చేసిన ప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుంది. తాను లెక్చరర్‌గా ఉన్నప్పుడు తాత్కాలిక ఉద్యోగులు పడే బాధలను స్వయంగా అనుభవించడం వల్లే, ఆ తర్వాత కాలంలో అలాంటి వారి పట్ల అమితమైన సానుభూతిని ప్రదర్శించగలిగానని రచయిత చెప్పుకోవడం ఆయన సంస్కారానికి అద్దం పడుతుంది. రచయిత కేవలం విధి నిర్వహణకే పరిమితం కాకుండా అద్భుతమైన సాహిత్య హృదయం కలిగిన వ్యక్తి. ఆయన రచించిన 'బ్రతుకు బొంగరం' నవలకు బహుమతి వచ్చిన సందర్భాన్ని ఇందులో ప్రత్యేకంగా ప్రస్తావించారు.




కళాశాల వార్షికోత్సవ సభలో కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు రచయితకు స్వయంగా శాలువా కప్పి సత్కరించడం, "నీకేనా బహుమతి?" అని అడుగుతూనే, నవల టైటిల్ విని ఆప్యాయంగా భుజం తట్టడం వంటి మధుర క్షణాలను రచయిత ఎంతో భక్తిభావంతో గుర్తుచేసుకున్నారు. పోలీస్ యూనిఫామ్ వెనుక ఉన్న ఒక సంవేదనాత్మక రచయితను ఈ అధ్యాయం మనకు పరిచయం చేస్తుంది.

రచయిత ఖమ్మం జిల్లాలో పని చేసిన కాలం నాటి రాజకీయ సమీకరణాలను ఎంతో చాకచక్యంగా వివరించారు. ముఖ్యంగా నాటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి గారికి, హోం మంత్రి జలగం వెంగళరావు గారికి మధ్య ఉన్న తీవ్రమైన రాజకీయ వైరాన్ని, దాని మధ్యలో ఒక పోలీస్ అధికారిగా తాను ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులను కళ్లకు కట్టారు. పోలీస్ అధికారికి కేవలం లాఠీ పవర్ మాత్రమే కాదు, 'రాజకీయ పరిణతి' కూడా ఎంత అవసరమో రచయిత నిరూపించారు. అలాగే నక్సలిజం వెనుక ఉన్న సామాజిక కోణం గురించి శ్రీకాకుళం గిరిజన పితూరీ, నక్సల్బరీ ఉద్యమాల నేపథ్యంలో సాగిన కథనం కేవలం ఒక క్రైమ్ రిపోర్ట్ లా కాకుండా, సామాజిక స్పృహతో

సాగింది. "కాయకష్టం చేసే నలుగురు కూలీలు ప్రాణాలు కోల్పోవడమే లా-అండ్-ఆర్డర్ సమస్యకు పరిష్కారమా?" అంటూ రచయిత వేసిన ప్రశ్న, ఆయనలోని మానవతావాదిని మనకు పరిచయం చేస్తుంది. కాల్పుల అనంతరం ఘటనా స్థలానికి వెళ్లినప్పుడు అక్కడ లభించిన విప్లవ సాహిత్యం, ఉత్తరాలు, డైరీలను చదివి, ఆ యువతలోని త్యాగనిరతిని, ఆవేశాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయడం ఒక పోలీస్ అధికారిలో అరుదుగా కనిపించే గొప్ప గుణం.

**పుట్టపర్తి సాయిబాబా అనుభవం - ఆధ్యాత్మిక స్పర్శ :** పెనుకొండ సబ్ డివిజన్ పరిధిలో పని చేస్తున్నప్పుడు పుట్టపర్తి సత్యసాయిబాబా గారితో జరిగిన ముఖాముఖి అనుభవాలు ఈ పుస్తకానికి మరొక ప్రత్యేక ఆకర్షణ. బాబా గదిలోకి పిలిచి ఎంతో ఆప్యాయంగా పలకరించడం, రచయిత భార్య రాక గురించి ముందుగానే ప్రస్తావించడం వంటి సంఘటనలు చదువరులలో విస్మయాన్ని, ఉత్సుకతను కలిగిస్తాయి. భౌతిక ప్రపంచంలోని పోలీస్ డ్యూటీకి, ఆధ్యాత్మిక ప్రపంచంలోని ప్రశాంతతకు మధ్య ఉన్న సమతుల్యతను రచయిత ఇక్కడ ఎంతో చక్కగా సమర్థించారు.

పుస్తకంలోని అధ్యాయాల శీర్షికలే పాఠకుడిలో చదవాలనే కుతూహలాన్ని కలిగిస్తాయి. "నేరపరిశోధన నవలల్లో రాసినట్లుగా సినిమాల్లో చూపించినట్లుగా ఉండదు!" అంటూ పోలీస్ ఇన్వెస్టిగేషన్ వెనుక ఉండే అసలు శ్రమను విశ్లేషించారు. "పోలీసులకు మానవతా దృక్పథం ఉండడం కొంచెం కష్టమే!", "అవినీతి నిరోధకశాఖకు అన్నీ అవరోధాలే!!" వంటి శీర్షికలు డిపార్ట్‌మెంట్ లోపల ఉండే కఠిన వాస్తవాలను, ఒత్తిళ్లను అంగీకరించిన రచయిత నిర్భీతిని తెలుపుతాయి. "అటు ఇందిరాగాంధీ! ఇటు ఎన్టీఆర్ మధ్యలో పోలీసులు", "ఆనాటి సీఎం చంద్రబాబునాయుడికి అరమరికలు లేవు" వంటి అధ్యాయాలు సమకాలీన రాజకీయ నేతలతో ఒక ఉన్నతాధికారిగా ఆయనకు ఉన్న సంబంధాలను, అనుభవాలను వివరిస్తాయి.

ఈ పుస్తకంలోని ఆయా అధ్యాయాలను, రచయిత పంచుకున్న నిర్దిష్ట అనుభవాలను పరిశీలిస్తే, ఇది కేవలం ఒక పోలీస్ అధికారి సర్వీస్ రికార్డు మాత్రమే కాదు, ఐదు దశాబ్దాల తెలుగు సమాజ గమనానికి ఒక ప్రత్యక్ష సాక్ష్యం అని స్పష్టమవుతుంది. ప్రతి అధ్యాయాన్ని నవల తరహాలో సంభాషణలతో నడిపించడం వల్ల పాఠకుడు ఎక్కడా బోర్ ఫీల్ అవ్వడు. నాటి రాజకీయ నాయకుల మేనరిజమ్స్, మాట్లాడే తీరును యథాతథంగా పట్టుకున్నారు. పెద్ద పెద్ద నాయకుల పేర్లను ప్రస్తావిస్తూ, నాటి వ్యవస్థలో ఉన్న లొసుగులను, అంతర్గత పూచికత్తులను ఎక్కడా దాచకుండా రాయడం రావులపాటి గారి కలం పదునుకు నిదర్శనం. రావులపాటి వారి రచనా శైలిలో ఒక విలక్షణమైన 'ఫ్లో' (ధార) ఉంది. ఒక కథకుడు కథ చెప్తున్నట్లుగా, ప్రతి అధ్యాయాన్ని ఒక ఆసక్తికరమైన డైలాగ్‌తోనో లేదా ఒక ఉత్కంఠభరితమైన సన్నివేశంతోనో ప్రారంభించడం ఈ పుస్తకం యొక్క ప్రధాన బలం. ఎక్కడా ఆత్మస్తుతికి తావులేకుండా, తన ప్రయాణంలో తనకు సహాయం చేసిన రాజకీయ నాయకులను, తోటి ఉద్యోగులను,వ్యవస్థను గౌరవిస్తూనే ఈ పుస్తకాన్ని మలిచారు."పోలీస్ సాక్షిగా... ఉద్యోగ విజయాలు" కేవలం ఒక పోలీస్ అధికారి ఆత్మకథ మాత్రమే కాదు. ఇది గత ఐదు దశాబ్దాల సామాజిక, రాజకీయ, నైతిక విలువల పరిణామాన్ని చూపించే ఒక అద్దం.

ఒక లెక్చరర్‌గా కెరీర్ ప్రారంభించి, డిపార్ట్‌మెంట్‌లో ఎదిగి, రాజకీయ ఒడిదుడుకులను తట్టుకుంటూనే తనలోని సాహితీ హృదయాన్ని, మానవత్వాన్ని కాపాడుకున్న ఒక ఆదర్శ అధికారి జీవన ప్రయాణానికి ఈ గ్రంథం మకుటాయమానంగా నిలిచింది. అలాగే ఇది కేవలం ఒక అధికారి సాధించిన విజయాల పట్టిక కాదు. ఒక సామాన్య లెక్చరర్, సాహిత్య ప్రియుడు, పోలీస్ బాస్ అనే మూడు విభిన్న కోణాల సమాహారం. సమాజ శాస్త్రాన్ని, పోలీస్ వ్యవస్థలోని అంతర్గత సత్యాలను తెలుసుకోవాలనుకునే ప్రతి ఒక్కరూ దాచుకోవాల్సిన, చదవాల్సిన ప్రామాణిక పుస్తకం ఇది. సుదీర్ఘ పోలీస్ ప్రస్థానాన్ని ఆవిష్కరించిన ఈ పుస్తకం మొత్తం పేజీలు 262. పుస్తకం చివరి పుటలలో రచయిత తన సుదీర్ఘ వృత్తి జీవితంలో వివిధ అరుదైన, చారిత్రాత్మక సందర్భాలలో ప్రముఖులతో దిగిన కొన్ని అత్యంత సుందరమైన చిత్రాలను ముద్రించడం పాఠకులకు ఒక చక్కని దృశ్యమాన అనుభూతిని ఇస్తుంది. ఇంతటి విలువైన సమాచారంతో కూడిన ఈ పుస్తకం యొక్క మూల్యం కేవలం రూ. 125/- మాత్రమే. ఈ పుస్తకం హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రచురణకర్తలు 'ఎమెస్కో బుక్స్' ద్వారా ప్రచురితమై, విజయవాడలోని 'సాహితి ప్రచురణలు' పంపిణీదారులుగా మార్కెట్లో అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో పాఠకులకు అందుబాటులో ఉంది.

**- ఆర్వియన్**

## ఉన్మత్త తాండవం

"నిశ్శబ్దపు కేక... ఉన్మత్త తాండవం" మనం రోజూ చదివే పుస్తకాలు వేరు, మనలోని 'నేను'ను ప్రశ్నించి, మనల్ని నిశ్శబ్దం వైపు నడిపించే పుస్తకాలు వేరు. విస్సు గారి 'ఉన్మత్త తాండవం' రెండవ కోవకు చెందిన ఒక అరుదైన సాహిత్య సృష్టి. పుస్తకం కవర్ పేజీపై ఉన్న ఆ తాండవ నృత్య చిత్రం చూసినప్పుడే మనకు అర్థమవుతుంది- ఇది ఒక భావోద్వేగాల, ఆధ్యాత్మిక సత్యాల సంక్షోభం, సమాధానం అని.

సాధారణంగా తాండవం అంటే ప్రళయం లేదా ఆవేశం. కానీ ఇక్కడ అది 'ఉన్మత్త తాండవం'. లౌకికమైన హద్దులను చెరిపేసి, దైవత్వపు పిచ్చిలో ఆత్మ పాడే పాట ఇది. రచయిత ఒక సాయంత్రం వేళ తనలో అకస్మాత్తుగా ఉదయించిన ఒక అంతర్గత ఆజ్ఞకు లోబడి, అశ్రుధారల మధ్య ఈ రచనను ప్రసాదించారు. అందుకే ఇందులో ప్రతి వాక్యం కృత్రిమంగా రాసింది కాకుండా, హృదయాంతరాళాల నుండి ఉబికి వచ్చినట్టు అనిపిస్తుంది. పుస్తకంలో భగవాన్ శ్రీ రమణ మహర్షి, అరుణాచలం ప్రస్తావనలు, వారి చిత్రపటం ఈ గ్రంథానికి ఒక ఆధ్యాత్మిక శోభను ఇచ్చాయి. "చక్రం చేతబట్టని ఆచార్యుడవో, దండంలేని పరమాచార్యుడవో, అవధులులేని జ్ఞానమునకు అవధూతవో..." అంటూ గురు దేవుడిని స్తుతించిన విధానం కేవలం భక్తి కాదు, అది అద్వైత సిద్ధికి పట్టిన అద్దం. శూన్యంలో నుండి పూర్ణత్వాన్ని వెతుక్కునే ఒక సాధకుడి ఆర్తి ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది.




సాధారణంగా మరణం అంటే భయం, కానీ విస్సు గారు మరణాన్ని చూసిన కోణం అత్యంత వినూత్నమైనది. లౌకికమైన అహంకారం నశించడమే అసలైన మరణమని, ఆ మరణం నుండే అమృతత్వం సిద్ధిస్తుందని రచయిత చెప్పిన తీరు పాఠకుడిని లోతైన చింతనలోకి నెడుతుంది. ఇది కవిత్వమా, తత్వమా అంటే... ఇది 'కవిత్వపు ముసుగు వేసుకున్న పరమ తత్వం' అని చెప్పక తప్పదు. రచయిత లౌకిక బంధాలను, సమాజం నిర్మించిన కృత్రిమ చట్రాలను తీవ్రంగా ప్రశ్నించారు. మనల్ని మనం రక్షించుకోవడానికి వేసుకునే ముసుగులను, బంధాల పేరిట అనుభవించే బానిసత్వాన్ని అక్షరబద్ధం చేశారు. "బంధాల పంజరం నుండి విడుదల..." అంటూ సాగే లైన్లు, మనుషులు ప్రేమ పేరిట ఎలా ఒకరినొకరు కట్టేసుకుంటున్నారో, ఆ కట్టుబాట్లను తెంచుకుని ఆత్మ స్వేచ్ఛను ఎలా పొందాలో దిశా నిర్దేశం చేస్తాయి. ఇది కేవలం వైరాగ్యం కాదు, అంతకంటే మిన్నయిన 'వివేకం'.

ఈ పుస్తకంలో అత్యంత శక్తివంతమైన అంశం "శూన్యం, నిశ్శబ్దం". రచయిత శూన్యాన్ని ఒక ఖాళీ ప్రదేశంగా చూడలేదు, అదొక పరిపూర్ణ స్థితిగా భావించారు. లోపల రేగే అలజడులన్నీ అణగిపోయినప్పుడు, శబ్దాలన్నీ నిశ్శబ్దంలో కలిసిపోయినప్పుడు మాత్రమే అసలైన 'దైవత్వం' మేల్కొంటుందని చాలా గాఢంగా చెప్పారు. ఒక సాధకుడి ప్రయాణం ఎప్పుడూ సులువుగా సాగదు. లోపల పాత సంస్కారాలకు, కొత్తగా మేల్కొంటున్న జ్ఞానానికి మధ్య పెద్ద యుద్ధమే జరుగుతుంది. ఆ సంఘర్షణే ఈ 'ఉన్మత్త తాండవం'.

రచయిత తన అనుభూతులను దాచుకోకుండా, గుండెను విప్పి చూపిస్తూ రాసిన వాక్యాలు చదువుతుంటే, అది విస్సు గారి కథ మాత్రమే కాదు... సత్యాన్ని అన్వేషించే ప్రతి ఒక్కరి అంతరంగ కథ అనిపిస్తుంది. ఆ వేదన, ఆ రోదన చివరకు ఒక పరమ శాంతి వైపు, ఒక వెలుగు వైపు పాఠకుడిని నడిపిస్తాయి. అచేతనత్వం, భావాతీతం,

బంధ విముక్తి, ఆత్మ సాక్షాత్కారం వంటి పదాలు వాక్యాలకు దైవికమైన బలాన్ని ఇచ్చాయి. పుస్తకంలోని రేఖాచిత్రాలు కేవలం బొమ్మలు కావు, అవి ఆయా పేజీల్లోని శూన్యాన్ని, నిశ్శబ్దాన్ని కళ్ళకు కట్టే దృశ్య సంకేతాలు

పుస్తకంలో వాడిన భాష చాలా గాఢమైనది. రోధన, రోత, శూన్యం, అమృతభాండం, కాలాతీతం, నిశ్శబ్దం వంటి పదాల ప్రయోగం పాఠకుడి మనసుపై తీవ్రమైన ముద్ర వేస్తుంది. ఇందులో ఎక్కడా కృతకమైన అలంకారాలు లేవు, అంతా 'స్వీయభాషతో నన్ను నేను అలంకరించుకున్నాను' అని రచయిత అన్నట్లు, అక్షరాలు నగ్న సత్యాల్లా నిలబడ్డాయి. కవర్ పేజీ డిజైన్, లోపలి చిత్రాలు (కాంత్ రీసా గారి సహకారం) పుస్తకానికి మరింత కళాత్మకతను చేకూర్చాయి. 'ఉన్మత్త తాండవం' అనేది హాయిగా కాలక్షేపం కోసం చదివే పుస్తకం కాదు. అంచనాలు వేయకుండా, నిశ్శబ్దంగా ఒక మూలన కూర్చుని ఆస్వాదించాల్సిన ఒక ఆత్మిక సృజన. జీవితంలో అలసట చెందిన ప్రతి ఆత్మకు ఇది ఒక 'అమృత తుంపర'.

'ఉన్మత్త తాండవం' చదివినప్పుడు, పాఠకుడు కేవలం ఒక పుస్తకాన్ని చదివి పక్కన పెట్టే స్థితిలో ఉండడు. తన లోపలికి తాను తొంగి చూసుకునేలా, తన జీవిత గమ్యాన్ని పునఃసమీక్షించుకునేలా ఈ అక్షరాలు ప్రేరేపిస్తాయి.

రచయిత విస్సు గారు అన్నట్టు–ఇది పూర్తిగా ఏకపక్షంగా ఉంటుంది, రోత పుట్టిస్తూనే రోదనను రూపుమాపుతుంది. మనసులోని అలజడులను ఆపి, ఒక దివ్యమైన నిశ్శబ్దంలోకి అడుగుపెట్టాలనుకునే ప్రతి ఒక్కరూ తప్పక చదవాల్సిన ఒక ఆధునిక అవధూత గీతం ఈ పుస్తకం. ఇది లౌకిక జగత్తు నుండి అలౌకికానందంలోకి, శబ్దం నుండి నిశ్శబ్దంలోకి, అహం నుండి ఆత్మలోకి విస్సు గారు మనకు చేయించిన ఒక అద్భుతమైన అంతరంగ ప్రయాణం. తాత్విక గాఢతను ప్రేమించే ప్రతి ఒక్కరి హృదయంలో ఈ పుస్తకం చిరస్థాయిగా నిలిచిపోతుంది.

ఈ అపురూపమైన తాత్విక గ్రంథం 'ఉన్మత్త తాండవం' మొత్తం 142 పేజీలతో, కంటికి ఇంపుగా ఉండే అత్యుత్తమ ముద్రణా ప్రమాణాలతో పాఠకుల ముందుకు వచ్చింది. అమూల్యమైన తాత్విక గాఢతతో కూడిన ఈ విశిష్ట రచన వెల రూ. 900/-.


ఈ పుస్తకం కావాలనుకునే వారు అధికారిక వెబ్‌సైట్ www.vissuji.org ని సందర్శించవచ్చు లేదా srivissuji@gmail.com ఈమెయిల్ ద్వారా సంప్రదించవచ్చు..

***- ఎన్వీఆర్***


---

✧ **సౌరవృత్త తారావళి పద్యకృతి - డా. అప్పాజోస్యుల సత్యనారాయణ :** ఈ పద్య కృతికి కర్త వారు. వారే ప్రచురించారు. దానిమీద విహారీ గారు, అనుమాండ్ల భూమయ్య గారు, ఏల్చూరి మురళీధర్ రావు గారుతమ అభిప్రాయాలను తెలియజేస్తూ ప్రశంశించారు. ఇవన్నీ కూడా సూర్య భగవానుని స్తుతి పద్యాలు.

**నవచైతన్యపు వెల్లువల్ పొదలు పుణ్యక్షేత్ర తీర్థంబులై / దివ లోకంబులు దృష్టిగోచరము దేదీప్య ప్రభావిష్టమై/ కవితావృష్టి చెలంగా నీకు అభిషేకప్రాయమై దేవి! నే / కవినైనాడ భవత్కటాక్ష కలనన్ కాదంబనీశ్యామలా.**



*పేజీలు : 57, వెల : 200/-, ప్రతులకు : అజో-విభో-కందాళం ఫౌండేషన్, ఫోన్ : 040-40179673*



✧ **గోరుముద్దలు - బాలల కథలు - సంపాదకుడు, సాహితీ ప్రియుడు ఎన్.కె. బాబు :** దీనిలో ఉన్న ముప్పైమూడు కథలు బాలబాలికలకు జీవితంలో కావలసిన నైతిక ప్రవర్తనని, మంచిచెడులను, ఏమి చేస్తే ఏమి జరుగుతందో, ఏ కాలానికి ఎట్లా ఉండాలో విడమరచి చెప్పేవే ఈ గోరుముద్దలు. తప్పనిసరిగా తల్లిదండ్రులు తమ పిల్లలకు వినిపించి, తినిపించవలసినవే.


*పేజీలు : 76, వెల : 100/-, ప్రతులకు : ఎన్.కె. పబ్లికేషన్స్, ఫోన్ : 9440343479*

# చదవండి...


– మిసిమి





- **నిప్పుపూలు - దాశరథి కథల సంపుటి - దాశరథి కృష్ణమాచార్య :** నిప్పులోంచి అప్పుడప్పుడు కాక పుడుతుంది / నీళ్ళలోంచి విద్యుత్తను సెగ పుడుతుంది / ఈ దానవ లోకంలో ఎన్నటికైనా / మానవులని పిలువదగిన తెగ పుడుతుంది. ఇది దాశరథి ఆశాదృక్పథం. ఆ దృష్టితోనే ఈ కథలుంటాయి.
  *పేజీలు : 110, వెల : 90/–, ప్రతులకు : తెలంగాణ సాహిత్య అకాడమి, ఫోన్ : 040–29703142*





- **మానేరు తీరం - ద్విభాషా కవిత్వం - వారాల ఆనంద్ :** ఈ పుస్తకంలోని కవితలు ఒక కాలానికి చెందినవి కావు. ఒక సంఘటనకి ప్రతిస్పందనగా మాత్రమే రాసినవి. మనిషి బ్రతుకులో నిత్యం ఎదురయ్యే పోరాటాల నుంచి పైకి వచ్చిన స్వరాలు. వీటిలో ఆశ ఉంది. అది పోరాటంలోంచి పుట్టినది. ఈ అనుభూతులను మీరు స్పర్శించాలంటే ఒకసారి చదవండి.
  *పేజీలు : 118, వెల : 150/–, ప్రతులకు : వరల ఇందిర రాణి, ఫోన్ : 9440501281, నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్, ఫోన్ : 9247471362*




- **శ్రీ నారాయణ గురు - బుద్ధుడు శంకరుల పరిపూర్ణ కలయిక - అశోకన్ వెంగశ్శేరి కృష్ణన్ :** రెండు భిన్న ధృవాలను కలిపిన వ్యక్తి శ్రీ నారాయణన్ గురు. ఏ మతమైనా మనిషి బాగుకోసమని, కులం తలచకూడదని, ఒకే మతం, ఒకే దేవుడని, దేవుడంటే జ్ఞానమేనని బోధించినవాడు శ్రీ నారాయణగురు.
  *పేజీలు : 355, వెల : 375/–, ప్రతులకు : భూమి బుక్ ట్రస్ట్, ఫోన్ : 9849908929*




- **మా భగోట - ఇది కుటుంబ చరిత్ర - డా. కపిలవాయి లింగమూర్తి - సంపాదకుడు - కపిలవాయి అశోక్‌బాబు :** ఇది నా జీవిత చరిత్ర అని చెప్పుకున్న ఒక సామాన్య కవి డా. కపిలవాయి లింగమూర్తి. ఆయన జీవిత కాలంలో జరిగిన పెద్ద తవాయీలు నాలుగు. మొదటిది గత్తర, రెండవది ప్లేగు, మూడవది రేషన్ కంట్రోల్, నాలుగవది రజాకార్ల ఉద్యమం. ఈ నాలుగు పెద్ద ప్రమాదాలు ప్రజానీకాన్ని అతలాకుతలం చేసినవి. అప్పుడు మేము ఎట్లా బ్రతికామో తలచుకుంటే భయమూ, ఆశ్చర్యమూ రెండూ కలుగుతాయి. ఈ అనుభవాల పుట్టే ఈ భగోట.
  *పేజీలు : 686, వెల : 90/–, ప్రతులకు : కపిలవాయి అశోక్‌బాబు, ఫోన్ : 8790727772, 9440206387*




- **సాహిత్యంతో సహజీవనం - ఆత్మకథ - డా. గాలి గుణశేఖర్ :** డా. గాలి గుణశేఖర్ తెలుగు అధ్యాపకులు, ప్రిన్సిపాల్ కూడా. తెలుగు, తమిళం, ఆంగ్లం, సంస్కృతం ప్రాభవంతో సాహిత్యాన్ని సంపన్నం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. విద్యార్థిగా, పరిశోధకునిగా, అధ్యాపకునిగా, సాహిత్యకారునిగా, స్నేహశీలిగా సంపూర్ణ జీవితాన్ని అనుభవించిన ప్రతిభాశాలి డా. గుణశేఖర్. వారి జ్ఞాపకాల సమాహారమే ఈ సాహిత్యంతో సహజీవనం.
  *పేజీలు : 238, వెల : 350/–, ప్రతులకు : గాలి గుణశేఖర్, ఫోన్ : 9618612495, ఏనుగు అంకమనాయుడు, ఫోన్ : 8917676459*

# మిసిమి
మాసపత్రిక

**చందా వివరాలు:**

₹720/- (సంవత్సర చందా),
₹1440/- (రెండు సంవత్సరాలకు),
₹2,160/- (మూడు సంవత్సరాలకు),

**Scan QR to Pay**

Misimi A Unit of Kalajyothi


**మీరు చందాదారులుగా చేరండి      బహుమతిగా పంపండి**


*ప్రియమైన పాఠకులకు ఒక సూచన : తపాలా ఖర్చులు పెరిగిన మూలంగా పత్రిక వెల **జనవరి 2026 నుంచి రూ. 60/-** చేయవలసి వస్తున్నది. మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. పాఠకులు సహకరించగలరని ఆశిస్తున్నాం.*


***ప్రతినెలా ముప్ఫయి తారీఖున పత్రిక పోస్టు ద్వారా పంపబడుతుంది. ఏ కారణం చేతనైనా పత్రిక చేరకపోతే మళ్లీ పంపటానికి పోస్టల్ డిపార్ట్‌మెంట్ వెసులుబాటు కల్గించడంలేదు. కేవలం స్పీడు పోస్ట్ ద్వారానే పంపాలి. దయచేసి చందాదారులు గమనించగలరు.***


## మిసిమి ప్రచురణలు


నోబెల్ వ్యాసాలు



మిసిమి పార్థసారథి వ్యాసాలు



చిత్రకళా నీరాజనం


దూరతీరాలలో...



బహుముఖ బనారస్


ఐరోపా శిల్ప - చిత్ర కళావైభవం


సప్తపర్ణి



వ్యాస మంజూష


ప్రవాస సాహిత్యం


చార్లీ చాప్లిన్



రజ్జు సర్ప భ్రాంతి


బైరన్



యాత్రా కథనాలు


షెల్లీ జీవిత కథ


కొత్త కెరటాలు


నృత్యభారతి


పారిజాతం


సిద్ధార్థ

**ప్రతులకు: మిసిమి కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.**


Printed & Published by **BAPANNA ALAPATI**

Printed at **Kala Jyothi Process Pvt. Ltd.**, Plot No. CFC-1&2, Survey No. 18, E-City, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, **Telangana - 501 359.**